Barcode - 2020050004523
Title - shaarada, san'putam 1, san'chika 1, 15 may, 1925
Subject - Language. Linguistics. Literature
Author -
Language - Telugu
Pages - 138
Publication Year - 1925
Creator - Fast DLI Downloader
https://github.com/cancerian0684/dli-downloader
Barcode EAN.UCC-13
2020050004523




Acc. No. 2816

GIFTED By
[illegible]RISHNA PATRIKA
POST BOX NO. 2.
[illegible] ROAD, TENALI-1. (A.

తెలుగు విశ్వవిద్యాలయము
గ్రంథాలయం
వరుస సంఖ్య 2014
తే. 18-11-84

CHECKED-93



సంపాదకులు.

వడింపల్లి వెంకట లక్ష్మీ నరసింహారావు.
ఎం. ఏ. ఎల్. ఎల్. బి. బారిష్టరు.

శీలం జగన్నాథరావు.
ఎం. ఏ. బారిష్టరు.

3 వ వత్సరము. | వైశాఖము, క్రోధన. మచిలీపట్టణము, 15 మే ౧౯౨౫ | సంపుటము ౧ సంఖ్య ౧

# కుందమాల.

—:o:—

(తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారు.)

—— ——.·. ————

ఆ॥వె॥ అమరపతిశిరస్సు [illegible]ంపు మందార
మాలికలను మధువు గ్రోలుచుండు
విఘ్నపతి పదారవింద పరాగమ్ము
లంతరాయ జలధి నార్పుగాక.

(నాంద్యంతంబున సూత్రధారుఁడు ప్రవేశించును.)

ఉ॥ లోని తపోగ్ని పూర్ణముగ
లోఁగక పైకెగఁ బ్రాకు మంటలో
ద్యోనదిలో నలల్ ఫణుల
యొప్పున నిల్చెడు పుట్టలో జలం
బూను మృణాళ మట్లు తన
నొప్పెడు చంద్రుని నిత్యసంధ్యయో
నా నరుణాంశు కాపిలము
లాహరు కెంజడ లేలు మిమ్ములన్.

ఆరారాళపుర వాస్తవ్యుండును బూజ్యుండును నగు దిఙ్నాగునిచే రచితమైన కుందమాలయను నాటకము వీరు ప్రయోగింపవలయు నని యీ సభవారు నాకనుజ్ఞ నొసంగినారు. తత్సంబంధములగు ప్రయోగముల బాగుగ నెఱింగి దాని నడుప సమర్థురాలగు పూజ్యురాలి నిలిచి రంగభూమి కరిగెదను.

(నేపథ్యమున)

సూత్ర — నేను నటిని బిలుచుచుండగా నెవ్వరిది చెవులా నాకు సహాయ మొసంగునో యన బలుకొకటి వినవచ్చు చున్నది.

(విలోకించి) ఎంతకష్ట మెంతకష్టము! ఈస్థితి మిక్కిలి జాలిగొల్పు చున్నయది.

చం॥ చిరముగ లంకలోపల ని
వసించిన దన్న జనాపవాద దు
స్స్వరముగఁ దొట్రుపాటు గను
రన్ రఘురామ విభుండు గర్భ దు
ర్భరకు సుమాతనూజకు వి
వాసము సంఘటిలంగఁ జేసెన
త్తరుణి నరణ్య సీమలకు
దానె తలించెనా లక్ష్మణుండహహా॥

(అని వెడలుచున్నాడు.)

(ఇది స్థాపన.)

(అంత రథారూఢులగు సీతయును సారథియును లక్ష్మణుండును బ్రవేశింతురు.)

లక్ష్మ॥ అమ్మా! యిటుదిగుము. యిటుదిగుము. ఈయది భాగీరథీతీరమునందు గల కాననము. ఇందలి తరులతాప్రతానము దగ్గఱుంబై రథమునకు జొర నశక్యముగ నున్నది. రథము దిగవలయును.

సీత॥ వత్సా! లక్ష్మణా! గుఱ్ఱము లతివేగమున బఱతెంచుటచే దేహము కంపించి నిలుచుటకే యశక్యముగ నున్నది. ఇంక దిగుమాట చెప్పెడిదేమి?

లక్ష్మ॥ సుమంత్రా! గుఱ్ఱముల వేగము నాపు ప్రయత్నము సేయుము.

సుమం॥ గాంధర్వ ప్రియములగు నియశ్వములు నే నెంత ప్రయత్నము సేసినను నిలువకున్నవి. చూడు

తే॥గీ॥ అంచలరవంబు మృదులమై యలరుచుండి
చెవుల పండువుగా వీని వెనకుచుంట
బారుచున్న విహగముల్ త్వరితగతిని
లెక్కసేయక నాదుకళ్లెముల బిగిని.

లక్ష్మ॥ సుమంత్రా! సమవిషమ ప్రదేశములను బరిగణింపక యశ్వములు మిక్కిలి తీవ్రముగ బరుగెత్తుచుండుటచే గంగాప్రపాతమున రథము బడిపోవునట్లున్నది. ఎట్లో వాని నాపఁ బ్రయత్నింపవలయును.

సుమం॥ (పగ్గములబట్టి యత్నమభినయించుచున్నాడు)

లక్ష్మ॥ దేవీ రథ మాగినది దిగుము.

సీత॥ (దిగి నడచుచున్నది)

లక్ష్మ॥ ఎక్కువ దూరము నిర్గమించుటచే గుఱ్ఱములలసినవి. వానికి విశ్రాంతి యొసంగుదము.

సుమం॥ దేవా ఆజ్ఞ యొనర్తు (అని రథము నెక్క యరుగుచున్నాడు)

లక్ష్మ॥ (పరిక్రమించి తనలో) పూజ్యులగు ప్రభువువారు "వత్సా! లక్ష్మణా! దేవి, సీత రావణుని యింట నుండుటచే బౌరు లేమేమో వితర్కించుకొనుచు నామె చారిత్రమును గూర్చి యేమేమో యొకవిధముగు ప్రలాపములను బ్రవర్తిల్ల చేయుచున్నారు. శరత్కాల చంద్రునివలె నిర్మలమగు నిక్ష్వాకు కులమునకు సీతామాత్రమున గళంకము నాపాదింప జాలకున్నాను. గర్భవతియగు సీత భాగీరథీ సందర్శనము సేయింపుమని కోరినది. అయ్యది గర్భిణీదోహదమయము కదా! కావున నీవామె గంగాగమన వ్యాజమున రథమునెక్కించి సుమంత్రుం దోడ్కొనిపోయి యామె నేదో విధమున వనమున విడచిరమ్ము" అని యాజ్ఞాపించినారు. నేను నిర్విశంకముగ స్వజనమని చూడక పెంపుడు లేడిని గొనిపోవునట్లు దేవిని వెంటబెట్టుకొని వధ్యభూమియగు నీ వనమునకు వచ్చినాను.

Acc No. ........ Hyderabad-2

సీత:— వత్సా! లక్ష్మణా! గర్భభారముచే నలసి నా యీచరణము లడుగిడ లేకున్నవి. ముందుండి భగవతిభాగీరథియెంతదూరమునున్నదో యెఱిగింపుము,

లక్ష్మ:— భగవతి భాగీరథి విశేషదూరమున లేదు. ఆసన్నముగ నేయున్నది. విషాదమువలదు. వనమువచ్చితిమి. చూడుము,

తే॥గీ॥ పద్మవనమునమధుసౌరభముగ్రహించి
సతతమధురమ్ముహంసనిస్వనముగాంచి
శీతలతరంగకణముల జిమ్మిమిమ్ము
నాదరింపంగవీచు గంగానిలమ్ము॥

సీత:—(స్పర్శసుఖము నభినయించుచు) జననికరస్పర్శమువలె సుఖమును గూర్చుచల్లదనమున గంగాతరంగమారుతముతోనస్పర్శమున బరిశ్రమనేగాక పాపమునుంగూడ పారద్రోలుచున్నది. అందుననే దోహద కుతూహలమున నాకు గంగావగాహనమున కుత్సాహము జనించినది. ఈ నిమ్నప్రపాతమున నాకు విశేషాయాసము గలుగకుండ దిగుమార్గము జూపుము.

లక్ష్మ:— (నిర్దేశించుచు) ఇచ్చట మనుష్యసంచారము మిక్కిలి తక్కువగ నుండుటచే దటప్రదేశములు దుర్గమములు గానున్నవి. కావున నడుగు మెల్లగ వేయవలెను.

తే॥ గీ॥ జానువునదక్షిణకరమ్ము నూనివామ
కరము నీవారలతికను గ్రాలజేసి
యడుగులోనసుగిడుచు నాయనుగుజాడ
లరసినడుపుము మెలమెల్లనార్యతనయ॥

సీత:— వత్సా! బడలిక మితిమీరినది. ఈచెట్టునీడను ముహూర్తమాత్రమువిశ్రమించియ లసటదీర్చుకొందుము.

లక్ష్మ:— దేవిగారిచిత్తము

సీత:— (కూర్చుండి విశ్రాంతి నభినయించుచున్నది)

లక్ష్మ:— సుకృతుల కెప్పుడును బరిచర్య కూర్పకయే సమకూడునుగదా.

చం॥ చలువల జిమ్ముదెమ్మెర[…]
చామరముల్ విసరుం దరంగముల్........
కలనినదమ్ములన్ మధుర
గానముసేయును రాజహం[…]
చెలివలె గాగిటన్ జొనిపి
చిత్తము రంజిలజేయు చాయయున్
అడవులలోన గూడ సఖు
రాండ్రు లభింతురు పూజ్యరాండ్రకున్॥

సీత:— నీవు జెప్పెడిదినిజమే. పాన్పుమీద బండుకొనినప్పటి సౌఖ్యమునే నాహృదయ మిప్పుడును బొందుచున్నది.

లక్ష్మ:— (తనలో) దేవి యిప్పుడు సుఖోపవిష్టయై విశ్రాంతిఁ బొందుచున్నది. ఈస్థితినే గదా దేవికొలవు గడపఁదలసిన యవసరముపస్థితమైనది.

(శీఘ్రముగా పాదములపైఁబడి ప్రకాశముగా)

అనవరతప్రవాస దుఃఖభాజనుడు లక్ష్మణకూష్మాండుడు లక్ష్మణుడిదే విజ్ఞాపనం బొనరించుచున్నవాడు. హృదయమును గుదుర పఱచికొనుడు.

సీత:— (తొట్రుపాటుతో) ఆర్యపుత్రులకుకుశలమా!

లక్ష్మ:— (వనమును నిర్దేశించుచు) ఈవిధముగ నుండగా నార్యపుత్రునకేమి కుశలము?

సీత:— అంబ కైక మరల వనవాసము విధింపలేదు గదా.

లక్ష్మ:— వనవాసము విధించినది. అంబగాదు.

సీత:— మఱెవ్వరు?

లక్ష్మ:— ఆర్యుడే!

సీత:— ఎట్లు?

లక్ష్మ:— (కన్నీటి నరికట్టుచు)

గీ॥ ఆర్యునాదేశమిది యని యాపకుండఁ
జెప్పవలెనని మదినిచ్ఛఁజేయుచుంటి
మాటవెలువడి రాకుండ నోటినుండి
యక్కటకట వాగ్బంధనమయ్యెనిపుడు.

సీత:— నాకే వనవాసము విధియింపఁబడియెనా!

లక్ష్మ:— కేవలము మీకే గాదు నాకుఁ గూడను.

సీత:— అదియెట్లు?

లక్ష్మ:—

తే॥గీ॥ కలిగిన సుఖోప భోగముల్ విలువలేని
నఖిలయోగ్యమ్ములు సువ్రాత్తు లలవరచిన
విప్రవాసమ్ము సీతోడ వేఁయ; నార్య
భవనవాసము వనవాసమవు గదమ్మ.

సీత:— వత్సా! నాకు వనవాసమెట్లో అయ్యాది యార్య పుత్రునివకగుట యెట్లో విస్పష్టముగ జెప్పుము.

లక్ష్మ:— ఈమందభాగ్యుఁ డింకేమని జెప్ప గలఁడు

తే॥గీ॥ విడువుమనెనమ్మ వనములోన భుమునిన్ను
సతివి చారిత్రగుణశాలి యగుదువమ్మ
నిన్నిటువిడిచి పోనెట్టు నేర్తునమ్మ!
యెఱుగవలెనిన్ను విడువగాలాడదమ్మ॥

సీత:— హా తండ్రీ! ఆర్యా! కోసలాధిపా! యిప్పుడు మీరులేక పోయితిరిగదా. (అని మూర్ఛనొందు చున్నది)

లక్ష్మ:— (లోట్రువఁబడుచు) ఎంతకష్ట మెంతకష్టము. పిడుగువలె దారుణముగనున్న యీవార్తా శ్రవణమున నిశ్చేష్టయముగా దేవియుపరతిఁజెందినది. (తెప్పగాఁ బరికించి చూచి) భాగ్యము. శ్వాస యాడు చున్నది. ఈమెకు ప్రాణములు తెప్పరిల్లఁజేయుట కేమియుపాయము. (అని విచారము నటించు చున్నాడు.)

ఆశ్చర్య మాశ్చర్యము.

తే॥గీ॥ జాహ్నవిని జలకణములు సంగ్రహించి
మంద పవనమ్ము దేవి సమాదరించె
భాగ్యలేశంబు నాయది పండె; దేవి
మూర్ఛ దేరె నెట్టకేలో తావమును
దొఱంగె.]

సీత:— వత్సా! లక్ష్మణా! యేమైతివి?

లక్ష్మ:— మంద భాగ్యుడను. ఇచ్చటనే యున్నాను. ఆజ్ఞాపింపుము.

సీత:— ఏమిఁనింద మోపి విడువమనినది?

లక్ష్మ:— ఎట్టిదని చెప్పను.

సీత:— కట్టా! ఎంతయధన్యురాలను. ఏనిందయును గూడలేకుండ విడువ బడితినా? ఏమున్నదో ఏమనిరో చెప్పుము.

లక్ష్మ:— ఉన్నది.

సీత:— చెప్పు చెప్పు.

లక్ష్మ:—

క॥ అనుగుణ వనిగుణవతి వని
యనుభోక్త్రి కష్టసుఖములందనివార్య
మ్మనదుల్యవని యెఱుంగుదు
నిను నఘమునగాదు లోకనిందను
వినుతున్.]

ఇదియార్యుని సందేశము.

సీత:— లోకనింద భయమేమి? నామీద బడిన నింద యేమి?

లక్ష్మ:— పూజ్యురాలిపై నపవాదమేమని చెప్పుదును.

గీ॥ ఋషుల యెదుటలోకపతుల యెదుట
నా యె
దుట నదియుదేల తనకట్టెనట నెదేవి!
చొచ్చితివియగ్ని బరిశుద్ధిజూప— నైన,

సీత:— (లజ్జనభినయించుచు) ఏమో చెప్పు

లక్ష్మ:— లోకులు నిరంకుశులుగా రెకాకిమూక.

సీత:— అగ్నిశుద్ధి యనుటవలన రావణభవన వృత్తాంతము జ్ఞప్తికి వచ్చుచున్నది. సీతనేరుకూడ ని విధముగ సంభావింప బడుచున్నదని మనస్సు సంకటపడుచున్నది. చాలు నియాడుపుట్టుక. జన్మజన్మములకునువలదు. ఈవిధముగ పరిత్యక్తనైతిని భర్తచేఁబరిత్యక్తమైన నాదేహమును బరిత్యజించుట యుక్తమా? "దయాశూన్యుడైన యాయనదే యీసంతానము చూడుడు" అనిచెప్పుటకు బక్కలో బల్లెమువలె నుండు నపవాదోపహతమగు నాజీవితమును బరిరక్షించుట యోగ్యమా?

లక్ష్మ:— అనుగ్రహింప బడినాను. (లేచి ప్రణమిల్లుచున్నాడు) ఈరెండవ మార్గమే యార్యనిచే సందిష్టమైనది.

సీత:— ఏమికాగలదు.

లక్ష్మ:—

ఉ॥ చిత్తమునందు నెప్పుడు వ
సించుచునుందువునీవ; మాకుసా
త్పాత్రిల వేల్పవీవ,కల
గాంచిన గాంతుమునిన్నె; పానుపుం
బొత్తునకాస యున్నె? మఱి
బుట్టునె వేఱుకళత్రవాంఛ కిం
చిత్తును ధర్మపత్నిగను
జేతును నీప్రతిమన్ గ్రతుస్థలిన్॥

సీత:— ఆర్యపుత్రుని యీ విధమగు సందేశమును వినుటచే నా పరిత్యాగదుఃఖము నిరవశేషముగ నుపశమిల్లినది. స్త్రీజనమునకు బతియన్యాసక్తుడైన జీవితము దుఃఖభాజనమగును పతిక న్యాసక్తయైన సతియందట్లుగాదు.

లక్ష్మ:— నాకు ప్రతిసందేశ మేమని చెప్పెదవు?

సీత:— ఎవరికి?

లక్ష్మ:— అన్యనకు.

సీత:— ఈ గతి పట్టిననింకను బ్రతిసందేశమా! అత్తలకు నమస్కరించి "శ్వాపదసమాకీర్ణమైన యరణ్యమున శరణ్యములేకుండ నసించుచుండు నన్ను సర్వవిధముల బూజ్యురాండ్రు హృదయపూర్వకముగ నాశీర్వదించి యనుగ్రహింతురు గాక" యని నా వచనముగా బలుకుము.

లక్ష్మ:— ఈ యనుజ్ఞను బ్రతిగ్రహించినాను. అన్యనకు కించిత్తును సందేశమే లేదా?

సీత:— సందేశ మానిష్ఠురమైనది. ఈ నీవచనమా ప్రతిహాతము. ఇందేదియును సీతను ధన్యత్వాపాదకముగాదు ఐనను నా వచనముగా నిట్టుబలుకుము. ఈ మంద భాగ్యురాలిని గూర్చిన విచారమున వర్ణాశ్రమ పరిపాలనమున కపచార మొనరించి యాత్మను బాధపెట్టుకొన వలదు. స్వధర్మమునందును, స్వశరీరమునందును సావధానులరై మెలంగవలయు. వత్సా! లక్ష్మణా! మహారాజును నే నెట్టునిష్ఠురము లాడ నేర్తును.

లక్ష్మ;— ఇట్టిదేవికి నిష్ఠుర మెట్లువచ్చును?

సీత;— ఆయన కిట్లనికూడ జెప్పుము. నిరపరాధియగు నీమె నింతతొందరగా హృదయపరిచ్యుతను గావించుటయే తూదనిపని. దేశవిచ్యుతిమాట చెప్పెడిదేమి?

లక్ష్మ:— పూజ్యురాలు చెప్పదగినమాట చెప్పినది.

తే.గీ॥ చిత్తమున కేడ జేసిన జేయుగాక
యేలకో మొత్త వలెనిన్ను నింటినుండి
యింటినుండియె యని వచియింపనేల
జనపదంబుల నుండియె సాగనంప॥

సీత;— నా వచనముగ నిట్లుగూడ విన్నవింపుము. ఈ నిర్గుణరాలు జిరపరిచితయనియో, యనాథయనియో, సీతయనియో, స్మరణపథమైన నిలువనను గ్రహింపుడు. అని తపోవనవాసిని యీమె సర్వదా శిరస్సున నంజలిఘటియించి విజ్ఞాపన మొనర్చుకొనుచున్నది. ఇదికూడ నా వచనముగా నాయనకు విన్నవింపుడు.

లక్ష్మ:—

తే.గీ॥ ఇట్టి సందేశము విన గ నెట్టులోర్వ
వైపరాని వికారమ్ము సంఘటిల్లి
నెమరసి యున్నట్టిప్రంతులో నుప్పువెట్టి
నట్టి దురవస్థయార్యున కావహిల్లు॥

సీత:— అతిమహితమైన నిజమండలమున దుఃఖసహాయులు స్త్రీలు నీకెట్టు లుపచరింపగలరు? ఇప్పుడొక్కటియోచింపవలసియున్నది. నన్ను విడిచి నీవొక్కడవే యేగుచున్నావు. నీ యన్న శరీర మెట్లుగాపాడెదవో సుమా.

లక్ష్మ:— మహానుభావురాలవగు నీవు దగినపలుకుఁ బలికితావు.

సీత:— వత్సా! లక్ష్మణా! పూజ్యులగు రాఘవకుల రాజధాని యయోధ్య యిక నీవు నెత్తిఁబెట్టుకొని పూజింపఁదగినది. నా మాట మఱువకుము. ప్రతిమాగతుఁడైన మహారాజున కెట్లు శుశ్రూషఁ జేయుదువో సుమా। అత్తలయాజ్ఞల నెట్లు నిర్వహింతువో। ఎప్పుడును నాకు ప్రియమే యొనర్చు సఖురాండ్ర నూరడింపుము. మందభాగిని నగు నన్ను సర్వకాలములయందును జ్ఞప్తియందుంచుకొనుము.

లక్ష్మ:— (సోద్వేగముతో)

ఆ॥వె॥ అడవిజేతులార నార్యను విడువంగ
నామె యేడ్పులిట్లు లాలకింపఁ
బవనసుతుడు గలనఁ బగపట్టి బ్రతికించె
జచ్చినట్టివాని జావనీక ॥ *

(అటు నిటుఁ జూచి)

గీ॥ హరిణకునువీడి యేడ్చును నాడు లేడి
యంచలును దైన్యమున ననుశోకించుచుండె
నెలతనీక్షించి నెమళులాటలనువీడె
మేలు తిర్యక్కులే మానవాళికన్న ॥

సీత:— వత్సా! లక్ష్మణా! సూర్యుఁ డస్తంగతుఁడు గానున్నాడు. మానుషసంపాతము దూరమగుచున్నది. పక్షులు గూండ్లకరుగుచున్నవి. శ్వాపదసంచార మారంభమైనది. ఇంక నీ వాలసించుట తగదు సౌమ్య.

లక్ష్మ:— (అంజలిఘటించి) ఇదియే యన్నిటికిని లక్ష్మణుని కడపటి ప్రణామాంజలి. ఇంకొకటి సావధానురాలవై యనుగ్రహింప వలయు.

సీత:— ఏమి? నేనెప్పుడు నవహితురాలనే సుమా!

లక్ష్మ; దేవీ! ఈ విజ్ఞాపనము గ్రహింపవలయు.

గీ॥ తలచియార్యుని బంధుమిత్రులను శోక
వేగమున నాత్మహత్య గావింతువేమొ?
కలుగు నిక్ష్వాకుసంతతి గర్భమందు
నెట్టులైనను దాని రక్షింపవలయు ॥

సీత:- సౌమిత్రివచనము ప్రతిహతముగదా!

లక్ష్మ;— ఇంకొక విజ్ఞాపనము!

సీత:— ఇంక నేమున్నది?

గీ॥ తెచ్చినాడను భ్రాత యా దేశమునను
విజనమైనట్టి యీ ఘోర విపినమునకు
విడిచి చనుచున్నవాడ దేవీ! క్షమింపు
దుర్భరంబైన నాదు నీదోసమొకటె!

సీత;- (తొట్రుపాటుతో) నీ వన్నగారి వచనానువర్తివి. ఇది సంతోషమున గ్రహించువార వ్వరు దోషారోపణఁ జేయఁగలరు?

ల:— (ప్రదక్షిణ చేసి నమస్కరించి పోవుచున్నాడు)

సీ:— (ఏడ్చుచున్నది.)

ల:— (దిక్కులవంకఁ జూచి) ఓహో! లోకపాలకులారా! పూజ్యులు మీర లాలకింపుడు.

గీ॥ కువలయేశుని దశరథు కోడలీమె

సీ:— ఈయక్షరము లతిశ్లాఘ్యంబుగా వినంబడుచున్నవి.

ల:— గీ॥ మధునిసూదను రాముని మహిషి

సీత:— దైవముకే తలంచెను.

ల:- భర్త
యిలు వెడలద్రోచె .........

సీ:— (చెవులు మూసుకొనుచున్నది)
విజనమౌనీ వనముల.

---

పాఠాంతరము.

* చ॥ విడువఁగఁ జేతులార నడ • విన్ బతిదేవనముల్ నెలంత నీ ।
వడువున నాలకింప బగ • బట్టి వటుల్ బ్రదికించె నాంజనే ।
యుడు మునువన్ సుఖంబుగ • రణోర్విని జచ్చినవాని జావనీ ।
కెడ దను బూర్వవైరమది • యే నొక డుండగనోపు నావయి న్॥

నుండునే కాకినిగఁ గాచియుండరారె.

సీ:— (గర్భమును జూపుచున్నది.)

ల:— భగవతి యీమెను గూర్చి యింకొక్కటి విజ్ఞాపనఁ జేయుచున్నాను.

చం॥ అలసిన వేళ నీసతిని
నబ్జసుగంధము లానుచున్న నీ
యలలను వీచి తెమ్మెరల
నమ్మరో! జాహ్నవి! యాదరింపుమీ
చెలి సవనమ్ముకై దరినిఁ
జేరెడి వేళలనిన్ను జల్లగా
మెలగ వలెన్ క్షణమ్ము పళ
మింపగజేయుచునంబువేగముల్.

ఉ॥ విన్నప మాచరింతు నట
వీస్థలవాసులకే నమస్సు లె
న్నెన్నియొ చేసి మానవులకు
నేడడ బాసిన స్త్రీయటంచు న
భ్యున్నతి గన్న వంశమున
నుద్భవ మందెనటంచు, దిక్కు లే
కున్నది పూజ్యరా లనుచు
నో! ఋషులార! యనుగ్రహింపుడీ!

గీ॥ వినుడు వనదేవతలు! నాదు విన్నపంబు
క్షణమనుగ్రహముంచి యంజలి ఘటింతు
నిదుర నున్న బ్రిమాపింబు నెగడియున్న
విషమగతి గన్నదయను దేవిని గనుండు.

ఆ॥ వె॥ క్రూరమృగములార మీరుండఁ గాదిందు
పక్షి కీటక సిలువ నిరవుగాదు
విడువరాదు క్షణము విప్రవాసమ్మునఁ
దరుణి సఖులు మీరె వారుణులార!

గీ. రక్షకులు లోకపాలురు; భ్రాతృజనము
శైలములు; తల్లి జాహ్నవి; సఖులు నదులు
కాచి కాపాడ రారె యీ కాంత నెటులో
శరణమిక మీరె; లక్ష్మణుఁడరుగునిపుడు॥

(అని ప్రణమిల్లుచున్నాడు)

సీ:— అయ్యో! అయ్యో! లక్ష్మణుడు నిజముగ నన్నే కాకినిగ వదలిపోవుచున్నాడు. ఛీ! ఛీ! సూర్యుడు గూడ నస్తంగతుడై నాడు. లక్ష్మణుని కంఠస్వరమైన వినవచ్చుటలేదు. లేళ్లు తమ తమ నెలవులకు చేరినవి. పక్షులు కులాయమ్ములం బ్రవేశించుచున్నవి. శ్వాపద సంచారమారంభమైనది. దృష్టి యంధకారావృతమైనది. మహారణ్యము. నిర్మానుష్యముగ నున్నది. ఏమి చేయుదును? మందభాగ్యురాలను. ఏవిధముగ నీవనములవెంట నొంటరిగ సంచరింపగలదానను. ఏమిపాపము చేసితినో సర్వథా నాకిట్టి వియోగమే తటస్థించుచున్నది. లక్ష్మణునిచే నియుక్తలైన వనదేవతలారా! రాఘవకులక్రమాగతులగు మహాప్రభావ సంపన్నులు వసిష్ఠ వాల్మీకి ప్రభృతులైన మహాఋషులు వారైన నన్ను రక్షింపరారేమి?

(అని మూర్ఛిల్లుచున్నది.)

(వాల్మీకి ప్రవేశించి తొట్రుపాటుతో)

గీ. జాహ్నవిని సాంధ్య కృత్యముల్ సలుపఁబోయి
శరణు శరణని యడవి నొంటరిగ నేడ్చు
యబల గర్భాతుర విలాప మాలకించి
తెలుప ఋషిపుత్రు లిట కరుదెంచినాడ.

(వెదకుట నభినయించుచున్నాడు.)

సీ:— (తెప్పరిల్లి) నన్ను వెదకు వీరెవ్వరో (అలోకించి) మరియెవ్వరును గారు. లక్ష్మణుని విజ్ఞాపనమును విని భగవతి భాగీరథి నన్నారడింప దయచే ననుగ్రహింపుచున్నది.

వాల్మీకి:— అంధకార మెచ్చుగ నుండుటచే దృష్టి సంచారమునకు గూడ నడ్డుగలుగు చున్నది. కేక వేసెదను. ఓహో ఎవరక్కడ.

సీ:— వత్సా! లక్ష్మణా! మరల వచ్చితివా?

వా:— నేను లక్ష్మణుడనుగాను.

సీ:— (దాఁకట నభినయించి) కష్టము సంభవించినదే ఈతడెవ్వడో పురుషుడు. ఇప్పుడీ యుపద్రవము నెట్లువారించుకొనగలను. (విచారించి) ఇట్లు—స్త్రీని, యేకాకినిని;

వా:— నే నిచ్చట నున్నాను. బిడ్డా నీకు బరపురుషుడను శంకవలదు. సాయంకాలమున సవనకర్మకై భాగీరథిని సేవించి తిరిగివచ్చిన మునికుమారులు నీ వృత్తాంతము నెఱింగి చెప్పగా నీయభ్యుదము కొఱకే యిటకు వచ్చినాడను. పూజ్యురాలి నొకటి యడుగవచ్చునా ?

గీ॥ ధర్మ మార్గమ్ముకొఱకు యుద్ధములనెఱపి
రామచంద్రుండు లోకోద్ధరణముఁ జేయ
నేడనుండి విపత్తు నీకెసగనమ్మ !
చెప్పగదవమ్మ బిడ్డరో చెప్పుచెప్పు॥

సీత:— పూర్ణచంద్రుని నుండియే యీయశనిపాతము తటస్థమైనది.

వా:— ఏమి? రామునివలననే యీ విపత్తు!

సీత:— అవును.

వా:— వర్ణాశ్రమ వ్యవస్థాభూతుడైన మహారాజు వలననే ఇట్టి విధానము సంఘటిల్లనయెడల నీకు మంగళమే యగును. ఇదె వచ్చుచున్నాను.

(అని పరిక్రమించు చున్నాడు)

సీత:— మనవిచేసుకొను చున్నాను.

వా:— చెప్పుము.

సీ:త— రఘువరుడు వివాసము సంఘటించినాడే యని నాపై దయదలపవలదు. రఘు, సగర, దిలీప దశరథ ప్రభృతుల సంతతి గర్భగతమై యున్నదని యిపుడనుగ్రహింపుడు.

వా:— (వెనుకకుదిరిగి) ఇక్ష్వాకు వంశము నేకే కొనుచున్నదే. అడిగి చూచెదను. బిడ్డా! దశరథుని కోడలవా యేమి ?

సీత:— భగవానుడనుకొని నల్లే!

వా:— విదేహాధిపతి జనకుని దుహితవా ?

సీత:— అవును.

వా:— సీతవా ?

సీత:— నేను సీతనుగాను. మందభాగ్యురాలను.

వా:— హా! హతోస్మి! నేను మందభాగ్యుడను. అమ్మా హర్మ్యతలమునుండి యధఃపతనము పూజ్యురాలి కెట్లు గలిగినది.

సీత:— (లజ్జను నటించుచున్నది.)

వా:— అమ్మా ! లజ్జించెదవేల? సరే ! యోగదృష్టివలన తెలిసికొనెదను. (అని ధ్యానమునటించుచున్నాడు.) బిడ్డా! కేవలము జనాపవాదభీరుడై రాముడు పరిత్యజించినాడు. మనసా యొనర్చిన కార్యముకాదు. నిరపరాధినిని నిన్ను మేము పరిత్యజించువారముకాము. ఆశ్రమపదమునకుఁ బోవుదము రమ్మ.

సీత:— అయ్యా మీ రెవ్వరు ?

వా:—

గీ॥ జనకనృపుని చిరంతన సఖుడ నేను
బాలమిత్రుడ దశరథావనివిభునకు
నన్యుడనుగాను వాల్మీకి నమ్మ నేను
అగుదు తండ్రిని; శ్వశురుండనగుదు నీకు॥

సీత:— భగవానుడా! నీకు వందనము.

వా:— వీర ప్రసవవుగమ్ము. భర్తృపునర్దర్శన మందుదువుగాక.

సీత:— నీవు లోకమునకు వాల్మీకివి. నాకో తండ్రివి యగుదువు. ఆశ్రమ వనమునకు పోదము. భగవతీ, భాగీరథీ, నాకు సుఖప్రసవము కలుగువఱకును నీకను దినమును జగన్నగస్రుక్చ్చ్ యొక కుందమాల నుపహార మొనర్చెదను.

వా:— ఈమార్గ మత్యంతము దుఃఖ సంచారమైనది. నీకు దుఃఖకరమగునది నేనెట్లెట్లు మార్గమును జూపుదునో నట్లనే నడువుము.

ఉ॥ ఇచ్చట దర్భముంట్లు చను
మీూ ! మెలమెల్ల పదంబు మోపికొ

మ్మచ్చటముందువంగి చను
మాటస గో యిల వామభాగమం
దచ్చట దక్షిణాన శల
యానుకొనర్ సమదేశమిద్ది పో
వచ్చురఘురాలునర్ గొలను
పాదములర్ గదుగంగనానదే॥

సీత:- (చెప్పినట్లు నడచుచున్నది.)

వా:- (నిర్దేశించి)

గీ॥ ఎల్లవారల కిక్ష్వాకు వల్లభులకు
వల్ల పుంసవనాది క్రియాకలాప
మంత మాచేతిమీదనే యయ్యెనమ్మ
ఆత్మ సంతానమును గూర్చి యడలకమ్మ!

గీ॥ లేదె యనుకొకు కౌసల్య పాదసేవ!
వృద్ధసంసేవ యిటఁగూడ వెలయునీకు!
ముని కుమారిక లిచ్చట మనెడువార
లక్క చెల్లెండ్లు సఖు రాండ్రు నగుదురమ్మ!
(నిష్క్రమించు చున్నారు)

# "రాకపోకలు."

మింటికన్నులలోని మృదుల ప్రకాశ
మా హరించిన ఈ రసహ్యా యామమున,
ఈమృత్యు ముఖమున, ఏజీవకళను
పొంచి నీయమంగుల పొల్పునెఱుగు!

అరసి నీవెట్టి మాయా ప్రేమికుఁడవో
విడిగి నీడ గభీర భావములు
వాకిట వెలుఁగు దీపము నార్పివైచి
త్రోవజేసితి, నింక రావచ్చునోయి!

నిలచి ఈవాకిట నిట్టూర్పుకున్న
మఱచి ఈవేణువు మధురింపకున్న
అవనీధరించేని, ఆకాశమేని
సడిలేని నీజాడ శ్వాసింపగలదె!

అంధకారమున నియ్యనుమానమేల?
అర్ధరాత్రమున నియ్యాలస్యమేల?
రమ్ము రమ్మోయి, నీ రాకపోకలను
హృదయనిగూఢ విలీనమౌనుత్త?

[ ఈశ్వర ]

# భగవద్గీతావళి.

## ఏకాదశాధ్యాయము.

( శ్రీ రాజా. యం. భుజంగరాయ ప్రణీతము. )

వ. అర్జునుండిట్లనియె.

అచ్యుతా నన్ను బోధింప నధ్యాత్మనామ
పరరహస్యంబు నీవు నాకెఱుఁగఁబల్కి
నందున మదీయ సమ్మోహ మంతరించె
భూతముల ప్రళయోదయంబులు నవంత
మైననీదు మహత్త్వంబు నతితరముగ
నాలకించితి దేవ! నీవనిన దెల్ల
సత్యమంతటి నీమహేశ స్వరూప
మును గనంగొన నభిలాష బొడముచుండె
నదిగనుంగొన నాకు శక్యమని నీవు
తలచితివయేని నిత్య సత్త్వమయినట్టి
నీదు రూపంబుఁ జూపు మౌనిజనవంద్య.

వ. శ్రీకృష్ణుండిట్లనియె.

పార్థ! చూడుము నామరూపములు నూర్ల
వేలఁదివేలకొలంది బెక్కు విధములును
బెక్కురూపులు వర్ణముల్ పెక్కుగలిగి
దివ్యగతినలరారుచుఁ దేజరిల్లు.
ద్వాదశాదిత్యు లేకాదశాదిరుద్రు
లష్టవసువులు మఱియు సప్తానిలములు
నిర్వురశ్వినులును మున్నెఁ డేనిగనని
పెక్కులాశ్చర్యములు చూడు మొక్కచోటఁగని.
ఈచరాచరములతోడ నెల్లజగము
మఱియుఁ జూడఁదలంచు సమస్తవిషయ
ములును నామేన నొకచోట నెలసెఁ జూడు
మిట్టి నను నీవు నీ నైజదృష్టిచేతఁ
జూడఁజాలవు దివ్య చక్షువు నొసంగు
వాఁడనాయీశశక్తిఁ గన్పఱతుఁ గనుము.

వ. సంజయుండిట్లనియె.

ఇట్లు వచియించి పరమయోగేశ్వరుఁడగు
జలజనాభుండు దివ్యనిజస్వరూప
మును గనంబడఁజేసె ఫల్గునునికొఱకుఁ
బెక్కు మొగములు నేత్రముల్ పెక్కుగల్గి
కాంచనద్భుతమై యనేకంబులైన
దివ్య భూషణము లనేక దివ్యఖడ్గ
దివ్య మాల్యాంబరములు బూర్తిగ ధరించి
దివ్యగంధంబుఁ దాల్చి దేదీప్యమాన
మైనమాశ్చర్యమై విశ్వతోముఖంబు
నై యనంతంబునైన నిజాత్మఁ జూపెఁ
జదలనే సూర్యులొక్క మాఱుదయ మొందు
వేళనెంతటి తేజ మావిర్భవించు
నతని తేజంబునకుఁ దుల్యమదియొనున్న
పలువిధంబుల భిన్నభావము వహించి
భూరివిశ్వంబు దేవదేవుని శరీర
మందునొకచోట విలసిల్లునట్టిదాని
గాంచి విజయుండు విస్మయాక్రాంత హృదయుఁ

దగుచు మెయిగరుపార సాష్టాంగనతులు
సలిపియిట్లని పలికెఁ జేతులు మొగిడ్చి.

౨. అర్జునుండిట్లనియె.

దేవ నీ దేహమున సర్వదేవతలను
భూతవర్గంబులను సరోజాత నిలయు
నలచతుర్ముఖు నెల్ల మహామునుల దివ్య
నాగవిధులను గాంచుచున్నాఁడ నిపుడు
బహుభుజోదరశీర్షానన సమితిఁ
బరగునిన్ను ననంత రూపధరుఁ గాఁగ
నంతటను జూచుచున్నాఁడనయ్య నేను
విశ్వనాయక! నిరవద్య! విశ్వరూప!
ఆదిమధ్యాంత దశలు నీకరయఁజాల
గదయుఁ జక్రంబుబట్టి మహాగదలఁ దాల్చి
విపులతేజోండవై వెల్లివిరియు సుప్ర
కాశమహిమలు జూడశక్యములుగాక
ప్రజ్వలచ్చండ మార్తాండ వహ్నులట్లు
రోచమానుండవగు నిన్ను జూచుచుంటి.
పరమసంవేద్యమగు పరబ్రహ్మమీవు;
అఖిలవిశ్వంబునకు నాశ్రయంబవీవు;
శాశ్వతుఁడవగు ధర్మరక్షకుడవీవుఁ
బ్రాక్తనుఁడవును మఱియు నవ్యయుడవీవు;
ఆదిమధ్యాంతహీనుననంతవీర్యు
నమృతతిగ్మాంశు నేత్రు ననంత బాహు
నుజ్జ్వలహుతాశవదను మహోగ్రతేజ
మున జగంబెల్లఁ బ్రజ్వలింపనొనరించు
నిను గనుంగొనుచుంటి క్షోణీనభోంత
రమున దిక్కులనెల్ల సాంద్రతరభంగి
నీవొకండవ వ్యాపించి నెగడియుంటి
వట్టి యుగ్రాద్భుతమగు నీయాకృతిఁ గని
తలఁకుచుండెను ముజ్జగంబులు మహాత్మ!
దేవసంఘంబు నిన్ను జొత్తెంచు నదిగో!
అదలి కొందఱు ప్రాంజలులై నుతింత్రు
మునులు సిద్ధులు స్వస్తివాచనికులగుచు
సుస్తవంబుల నిన్ను బ్రస్తుతియొనర్త్రు

ద్వాదశాదిత్యు లేకాదశాదిరుద్రు
లష్టవసువులు నిర్వురౌ నశ్వినులును
పితరులు మరుద్గణంబును విశ్వదేవ
తలును గంధర్వ సిద్ధసాధ్యులును యక్ష
రాక్షసులు నిన్ను గాంతు రబ్బురంబుతోడ.
బహువదన నేత్రయుక్తంబు బహుభుజోరు
పాదము బహూదరంబును బహుళదంష్ట్ర
మైన నీయుగ్రరూపంబు నమరఁగాంచి
జగములు వడంకె నేనును జడియుచుంటిఁ
బెక్కురంగుల మిన్నంటి వెల్గుమండి
తెరచునోళ్లను వెడఁదలౌ దీప్తనేత్ర
ములును గలనిన్ను గన్గొనఁగలఁగె మనసు
ధైర్యమాగదు శాంతి చిత్తమున నిలదు
వికట దంష్ట్రికరాళముల్ విలయకాల
వహ్ని సన్నిభములగు నీవదనములను
గాంచి దిగ్భ్రాంతి నంటి సుఖంబులేదు;
గావునన్ను సురేశ! జగన్నివాస!
ఆ ధృతరాష్ట్రసుతులు, సమస్తభూమి
ధవులు, గంగాసుతుండు, రాధాసుతుండు,
ద్రోణుడును, మనసర్వయోధులునుగూడ
నుగ్రదంష్ట్రికరాళమై యొప్పు నీదు
వదనములఁ జొచ్చుచుండ్రి సత్వరముగాఁగఁ
దవిలి దంతాంతరములఁ గొందఱు విభిన్న
శీర్షులై కానఁబడుచుండ్రి చిత్రమొప్ప.
బహునదీజలవేగము ల్వారిరాశి
కభిముఖంబుగఁ బ్రవహించు నట్టులీనృ
పాలవీరులు మిగుల జాజ్వల్యమాన
ములగు నీదు మొగంబుల నలఘువేగ
మొప్ప జొచ్చుచునుండి రత్యుగ్ర దీప్తి.
వెలుఁగు నగ్నిని వేగశలభసమితి
యాత్మనాశంబుకై చొచ్చునట్లు నీ మొ
గంబులను గూడ నధిక వేగంబుతోడ
నాత్మనాశంబుకై చొత్తురయ్య వీరు
ప్రజ్వలించుచునుండు వక్త్రముల చేత
నఖిలజగములఁ గబళించి యాస్వదించు

చుంటివీలోకమెల్ల నీయుగ్రతేజ
మావరించుచు సంతాప మడరఁజేసె
నిట్టిభీకరమూర్తి నీవెవరవోయి
యుంగఁబల్కుము దేవేశ! మ్రొక్కువాఁడ
దయఁ గనుంగొను మాద్యుండ వయినవిన్న
నెఱియనెంచెద నీప్రవృత్తిని నెఱుంగ.

వ. అంత శ్రీకృష్ణుండిట్లనియె.

కనకజగముల సమయించు కాలమేను
భువన సంహారమునకిప్డు బూనియుంటి
వైరిసేనలలోఁగల వీరులెల్ల
నుండఁజాలరు నీవు లేకున్ననైన
గాన లేలెమ్ము రిపులఁజక్కాడి కీర్తి
నందుము సమృద్ధమైన రాజ్యంబుగొనుము
మున్నె వీరలు నాచేతఁ బొలిసిరిపుడు
తనయ నీవు నిమిత్త మాత్రంబ వగుము.
ద్రోణుడును, భీష్ముడు, జయద్రథుండుఁ, గర్ణుఁ
డాదినే ద్రుంచినట్టి యోధాగ్రణులనె
చంపు సమరంబొనర్పు సంశయముఁగనకు
కలనరిపువీరుల జయింపగలవునమ్ము;
అనుచు శ్రీహరిపల్క బృథాత్మజుండు
వినివణంకుచు గేలుదోయిని మొగిడ్చి
మ్రొక్కి సాధ్వసగద్గదంబున దలిర్ప
నమ్రుడై పల్కెనిట్లు జనార్దనునకు.

వ. అర్జునుం డిట్లనియె.

శ్రీవరా! నిన్ను బొగడి యశేషజగము
హృష్టహర్షానురాగముల్ బొందెననఁగ
సురరిపులు భీతిదిక్కులఁ బఱచిరనఁగ
సిద్ధగణము ప్రణామముల్ జేసెననఁగ
నర్హమగుజుమ్ము దేవ! మహాత్మ! జలజ
భవునకునుగూడ నాదిహేతువగునీకు
నేల మ్రొక్కరనంత! దేవేశ! భువన
గర్భ! సదసత్పరుండ వక్షరుడవీవు;
మొదలిదేవుడవు; పురాణ పూరుషుఁడవు;
భువనములకెల్ల నాధారభూతుడవును,

అఖిలవేత్తవునీవు వేద్యమయినట్టి
పరమధామంబవీవు విశ్వంబునెల్ల
నరయవ్యాపించియుంటి వనంతరూప!
వాయువు, యముండు, వహ్నియు, వరుణుఁడబ్జ
డబ్జగర్భుండు వారికినాదివీవ
వేయివందనములు నీకు విశ్వవంద్య!
మగుడమగుడ నమస్కరింతుఁగద నీకు,
నెదుట మ్రొక్కెద వెనుక మ్రొక్కెదను నీకు
సర్వదిక్కుల మ్రొక్కెద సర్వరూప!
అమితవీర్యమనంత విక్రమముఁగల్గి
సర్వగుడవౌటచే సర్వశబ్దమబ్బె
నిట్టి నినునేను సఖునిగ నెంచినీదు
మహిమ నెఱుఁగక కూర్మినో! మాంద్యమునో
ఓయికృష్ణ! యోయాదవ! యో వయస్య!
యనుచు నేఁబల్కినదియు, నాహారశయన
విహరణాసనవేళల వేడ్కమదిని
నలరఁబ్రత్యక్షమందొ? పరోక్షమందొ?
కోడిగమునను నిను దూలలాడినదియు,
నేరమెన్నక నన్ను మన్నింపుమయ్య!
ఈ చరాచరజగమున కీవుతండ్రి;
వుత్తమగురుండవీవు పూజ్యుండవీవు;
నీకుఁ దుల్యుండెలేడన నిన్ను మించు
ఘనుఁడుగల్గునె? మూడు లోకంబులందు
అనుపమానప్రభావ! సాష్టాంగనతులు
సల్పి నతిపాత్రులోక శిక్షకునినిన్ను
వాకిమీఱఁ బ్రసన్నుని జేసికొందు
తండ్రి తనయునిబోలె, మిత్రంబుహితునిఁ
బోలె, గాంతుడు ప్రియురాలిఁబోలె, నీవు
నన్ను సైరింపఁదగుదువో నళిననాభ!
నెనుక నెన్నఁడుఁగనని యీ విశ్వరూప
మును గనుంగొని హర్షించితిని మదీయ
మనము భయవిహ్వలంబయ్యెననఘ! తొంటి
రూపమును నాకు దయతోడ; జూపుమయ్య!
అఖిల నిర్జరనాథ! బ్రహ్మాండగర్భ!
వితతబాహుసహస్ర! యో విశ్వరూప

గదను గెంగేలఁబూని చక్రంబుదాల్చి
ముకుటముధరించి నలుభుజంబులఁ జెలంగు
తొంటి నీరూపమును జూడ నుంటి నేను.
దాని ధరియింపుమయ్య! యుదారమహిమ.

వ. శ్రీకృష్ణుం డిట్లనియె
అర్జునా! సుప్రసన్నుండనై నేను
అధిక తేజోమయంబు ననంతమాద్య
మును బరుం డెవ్వఁడును మున్ను గనని యట్టి
విశ్వరూపంబు నేను జూపితిని నీకు.
దానతపములనైన, వేదములనైన,
సత్క్రియలనైన, క్రతుల యజ్ఞములనైన
నధ్యయనములనైన నియ్యవని నన్ను
నీవుగాక మఱొక్కరుం డెవ్వఁడైన
రూఢి దర్శింపఁగలఁడె కురుప్రవీర!
ఘోరమగునిట్టి నాదు నాకారమిపుడు
గని భయంబును మోహంబుఁ గాంచబోకు
తొలఁగి భీతిని ప్రీత చిత్తుండవగుచు
మత్స్వరూపంబు లెస్సగ మరలఁ గనుము.

వ. సంజయుం డిట్లనియె.
అనుచు వసుదేవనందనుం డర్జునునకుఁ
బలికి నిజరూపమును గానబఱచె మరల
సౌమ్య రమ్యాకృతి వహించి చకితహృదయుఁ
డైన యాతని నోదార్చె నా ఘనుండు.

వ. అర్జునుం డిట్లనియె.
ఓ జనార్దన! శాంతమై యొప్పునట్టి
నీదు మానుషరూపంబు నెమ్మిఁ గాంచి
స్వస్థచిత్తుండనై యుంటి ప్రకృతిఁ గంటి
నిప్పుడిప్పుడె చైతన్య మేగుదెంచె.

వ. శ్రీకృష్ణుం డిట్లనియె.
చూడశక్యంబుగాని యీ చొప్పులోన
నీవు జూచిన నారూప మెల్లవేళ
దేవతలుఁ గూడ గన్గొన దివురుచుంద్రు
తపము చేనైన మఱియు వేదములనైనఁ,
త్యాగములనైన, యాగ సంతతులనైన
నీవు గాంచినభంగి న న్నెవ్వరైనఁ
గనఁగఁ గన్గొన నింత శక్యంబుగాదు.
పరమెఱుంగని కేవల భక్తిచేత
నిట్టిరూపంబుగల్గిన యేను తత్త్వ
కలన దెలియంగ గనఁగ మోక్షమునఁ జొరఁగ
శక్యుఁడవగుదు భరతవంశప్రదీప!
నా నిమిత్తంబు కర్మ లొనర్చువాఁడు,
అనయముగ నన్ను మదిలోనఁ దలచువాఁడు,
బంధుమిత్రాది రతి నెడ బాయువాఁడు,
ప్రేమ మీఱంగ నన్ను సేవించువాఁడు
ప్రాణితతియందు వైరంబుఁ బాయువాఁడు,
అంతమున నన్ను జెందుఁ బార్థా! కిరీటి!

## ద్వాదశోఽధ్యాయము.

వ. అర్జునుం డిట్లనియె.
ఉక్తరీతి నియోగ సంయుక్తులగుచు
విబుధు లెవ్వరు నన్ను సేవించుచుంద్రు
రవ్యక్షరతత్త్వంబు నెఱుఁగుచుండ్రు
వారిలోపల యోగవిద్వర్యు లెవరు?

వ. శ్రీకృష్ణుం డిట్లనియె.
భావ మెవ్వరు నాయందు బదిలపఱచి
నిస్తులాస్తిక్యబుద్ధితో నిత్యయుక్తు
లగుచు నను గొల్చుచుందు రయ్యనఘులవని
మహితయోగులటంచు నా మతము సుమ్ము.
ఇంద్రియంబుల నరికట్టి యెల్లయెడల
దుల్యమతులై యచింత్యంబు, ధ్రువ, మచలము,
సర్వగతమును, బ్రకృతినిష్ఠంబు, మఱియు
నక్షరావ్యక్త, మనిరూప్య మైనబ్రహ్మ
మఖిలభూత హితాత్ములై యంతరంగ
ములను ధ్యానించువారు నన్ బొందఁగలరు
గాని యవ్యక్తసక్తాత్ములైనవారి
కధిక కష్టంబు ప్రాణుల కక్షరాత్మ
గతి బహుక్లేశమునఁ గాని గలుగఁబోదు
సర్వకర్మల నాయందు సన్న్యసించి
నన్నె గతిగా దలంచి యనన్యయోగ

నియతి మీఁదఁగనన్ను ధ్యానించిసేవ
సల్పువారల, మృత్యు సంసారవార్ధి
నుంచి యతిశీఘ్రముగ నుద్ధరించువాఁడ
గానె పార్థ! నాయంద మానసంబు
నిల్పు నాయందబుద్ధిని నెలవుకొల్పు
మింక నిస్సంశయముగ నన్నే వయిఁగలవు
మనసు నాయందు దృఢముగ నునుపనీకుఁ
బాటవము చాలకున్న నభ్యాసయోగ
కలనచేనైనను జేరఁదలఁపుమయ్య?
అట్టి యభ్యాసమున లేశమైన నీకు
బటిమ లేకున్న మత్కర్మ పరుడవగుము
నా నిమిత్తంబు కర్మలాచరించియైన
మోక్షసిద్ధిని క్రమమునఁ బొందగలవు.
అందులకు నసమర్థుండవైతి వేని
నియతమతివౌచు మద్యోగ నిరతిఁబూని
యఖిలకర్మఫలత్యాగ మాచరింపు
జ్ఞానమభ్యాసమునకన్న ఘనము సుమ్ము
ధ్యాన మా జ్ఞానమునకన్న నధికతరము
ధ్యానమునకుఁ గ్రియాఫలత్యాగ మధిక
మట్టిత్యాగమువలన నొప్పారుశాంతి.
అఖిలభూత సఖుండు దయారతుండు
హితుడహంకార మమకారహీనమతియు
సమసుఖ క్లేశుడును తితిక్షా పరుండు
నిత్యతుష్టుండు యోగి సునిశ్చయుండు
యతమనస్కుఁడు మత్సమర్పిత మతియును
నెవ్వఁడాభక్తవరుడు నాహితుడు సుమ్ము.
ఎవనివల్ల జగంబుభీతిపడకుండు
జగమువల్ల నెవండు బాజడియకుండుఁ
ప్రీతియు, నసూయ, భయము, నుద్వేగ మెవఁడు
విడుచు నాతండు నాకునిష్టుఁడగువాఁడు.
దక్షుఁ, డనపేక్షుఁడును, విగతవ్యథుండుఁ,
బక్షపాతవిహీనుండుఁ శుచుండు,
దళిత సంకల్పచయుడు మద్భక్తుఁడెవ్వఁ
డతడు నాకు గడుంబ్రియుఁడయ్య పార్థ!
సంతసము లేక యొందు ద్వేషంబు లేక
యొందుదమి లేక, దుఃఖమొక్కింత లేక,
శుభము నశుభంబువిడి భక్తిశోభితుఁడగు
నెవ్వఁడాతండు గడు నాకు నిష్టతముడు.
వైరిమిత్రులయెడఁ దుల్యభావగతుఁడు,
అరయ మానావమానంబులందు సముడు,
మొనయు శీతోష్ణ సుఖదుఃఖములసముండు,
త్యక్తసంగుండు దుల్యనిందాస్తవుండు,
మౌనియును నల్పసంతుష్ట మానసుండు,
నిలయరహితుండు, స్థిరబుద్ధివిలసితుండు,
భక్తిరతుడెవ్వ డతడు నాపరమహితుడు,
ఎవరు శ్రద్ధాళువులును మదేకరతులు,
భక్తులును నౌచు నాచేతనుక్తమైన
విపులధర్మామృతంబు సేవించుచుందు
రట్టివారలు నాకు నత్యంతహితులు.

# నాట్యరంగములు.

———:o:———

## ప్రాచీనచరిత్ర.

( చెరువు వెంకట సుబ్రహ్మణ్యముగారు. )

————

నృత్య, గీత, సంభాషణములు, నాటకమునకు త్రివిధాంగములు. పైయంగములు మనభావముల నెట్లాకర్షించునో యట్లే మనకవి సంతసమునుగూర్చును. సుఖప్రదమును జ్ఞానదాయకమునగు సంభాషణావశ్యకత లోకవిదితము. నాటక ఖేలనము నందది ముఖ్యావసరము. నృత్యమును త్రోసివేయుటకువీలులేదు. నృత్యసంకీర్తనము లనేకుల హృదయములను పరవశత్వ మొనర్చును. చైతన్యుని భక్తిపరవశత్వమగు నృత్యమనేక భక్తులతన్మయత్వ మొనర్చినట్లు వైష్ణవగ్రంథముల యందు వ్రాయబడినది. వారిలో ప్రోతానందు డగ్రగణ్యుడు.

కఠోరతపంబొనర్చు విశ్వామిత్రుడొకనాడు మేనకనృత్యముచేతనే వివశుడయ్యెను. నృత్యమట్టి ప్రధానాంగ మగుటచేతనే నృత్ ధాతువనుండి నట, నాటక నాట్యశబ్దములు కల్పింపబడెను. నృత్ అనగానృత్యము అవివృత్యమిళితములైన దృశ్యములు. ప్రజా హృదయముల నాకర్షించుట చేతనే కల్పింపబడినవి. నాట్యకళపై ప్రామాణికులగు, పిచ్చల్, శేఖర్, డొన్మాడ్సన్ మున్నగు మహాశయులు గూడ నాట్యగీతము పారవశ్యమున పాడుతందనాల పాటలనుండియే పుట్టినదని చెప్పుచున్నారు.

నాట్యశాస్త్రమున కీర్తనలప్రధానము గూడ మెండుగాగలదు. సామగానము దేవతలగూడ నాకర్షించెను. లవకుశుల రామాయణగానము తపోవనమందలి పర్వత వృక్షములయందు ప్రతిధ్వనించెను.

శ్రీకృష్ణుని మధురమురళీ రవముచే, యమునాతరంగిణి తనప్రవాహమునుమార్చుకొనెను. తల్లులుకీర్తనలచే శమదుఃఖములను మరచుదురు.

* కీర్తనలే దేశభక్తుల హృదయకుహరములందున్న స్వాతంత్ర్యాగ్నిని ప్రజ్వలింప జేసి రణరంగమున మృత్యువునెదుర్కొన జేసినది. నిజముగా కీర్తనలు దృశ్యమునకట్టి ముఖ్యాంగములుగ పరిగణింపబడుటచేతనే భరతశబ్దమునకీయర్థము చెప్పబడుచున్నది. నాట్యకళా పితామహుడు భరతమునియే!

భరతమనగా 'భ=ర=త' యనుమూడు శబ్దములిందుగలవు. 'భ, అనగా భావము.

‘ర’, అనగా రాగము. ‘త’, అనగా తాళమనియు నర్థము.

ఈనాటికిగూడ గుజరాతునందు సంగీతవిద్వాంసుని భరతశబ్దముచే సంబోధించుచున్నారు. పైమూడు శబ్దములు హైందవ నాట్య కళాప్రావీణ్యత కెట్లు గొంపోయినది దెలసికొనుట కానందముగ నుండును.

రంగస్థలి నాట్యకళయనాదినుండియు భారతవర్షమునకుగలవు. భారత మన్యదేశములనుండివానినెరువుదెచ్చుకొన నవసరము లేదు.

కొంతమందికిది కల్పితకథగా నుండవచ్చును. కానియదియేసత్యము. గ్రీసు దేశమువలె హిందూదేశముగూడ స్వతంత్రకళను గలిగియుండినట్లు నేనిచట రూఢీ బరచెదను. నేనువ్రాయునదిసత్యమని జూపుటకు నాటక కళా ధురీణులగు పాశ్చాత్యుల గ్రంథముల నుండి నిటకొన్ని నుదహరించెదను. డాక్టరు షీంకర్ హైందవ నాట్యకళ గ్రీకు దానివలె సర్వస్వతంత్రమైనదని దెల్పెను. మెక్డనాల్టు గూడ భారతవర్షపు నాట్యకళపాశ్చాత్యప్రభావములేకయే వృద్ధియయ్యెనని వ్రాక్రుచ్చెను.

కలకత్తాలోని సంస్కృత కళాశాలకు జెందిన హెచ్-హెచ్-విల్సన్ దొరగారుతన ‘హైందవనాట్యరంగమను’ గ్రంథమునందు భారతీయుల నాటకములుకొన్ని లోపభూయిష్టములుగానున్నను యవిపాశ్చాత్యప్రభాకలుషితములుగాక స్వతంత్రములై విలసిల్లు చున్నవని వ్రాసి యుండెను. యన్సైక్లోపీడియా బ్రిటానికా యందు వార్డుగారు భారత నాటకాభి వృద్ధి కాలమున గ్రీసునాట్య ప్రభావ మారుతము హైందవ నాటకములపై ప్రసరించెనని జెప్పుటకుతగిన ప్రమాణ్యములు లేవని దెల్పుచున్నాడు.

ఇకనాసిద్ధాంతములను మూడువిధముల విభజించెదను.

౧. హైందవులు పవిత్రములని భావించు సాంప్రదాయ సిద్ధములై నట్టియు క్రమానుగతములై నట్టియు, పురాణగాధలును, దైవసంబంధములై తరతరములనుండి ప్రశక్తితో గలచరిత్రయును తదితర హైందవ విషయమువలె అదినిజమేయని జెప్పుటకాధారమై యుండుట.

౨. వివిధ శతాబ్దములందలి వివిధకాలముల గ్రంథములనుండి సేకరించిన ప్రమాణములు.

3. పురాతనవస్తుశాస్త్రములు.

ఈమూటిలో రెండవది ముఖ్యము. దానిచరిత్ర వేదకాలమునాటి నుండియు ప్రారంభించుచున్నది. మూడవది గూడ మనలను క్రీస్తునకు పూర్వము 3వశతాబ్దము వరకుదీసికొని పోవును.

౧ వ నిదర్శనము.

నాట్య శాస్త్రము దేవలోకమున నుత్పత్తి యయ్యెననియు మహాదేవు డేదాని సృష్టికర్తయనియు, జెప్పబడుచున్నది. గృహశిల్పమునందు శివుడు నటరాజుగా చిత్రింపబడెను.

సంగీతవిద్యయందు నందికేశ్వరుడు ప్రథమనటకుడుగను, ఆది నటకుడుగను వర్ణింపబడెను బ్రహ్మదేవుడు శివుని యొద్దకళను నేర్చుకొని అయిదవ వేదమనబడు గాంధర్వ వేదము

లేక వేదగాంధర్వమును తయారు జేసెను. దీనినే నాట్యవేదమని కూడ బిలుతురు. దీనికిగానమే ముఖ్యాంగము. దీనిని బూర్తి జేయుట కాయన ఋగ్వేదమునుండి వాచన విధానములను సామవేదము నుండి గానమును, యజుర్వేదాథర్వణ వేదములనుండి అనుకరణ భావములను గైకొనెను. దేవతల వినోదార్థ మీవేదము సృష్టింప బడెను. దేవత లసురులతో యుద్ధముజేసి యలసి యున్న సమయమున వారికుత్సాహ మిచ్చుటకది యుద్దేశింపబడి వ్రాయబడినది. భరత ముని యాకళయందు తర్ఫీదు జేయబడెను. దేవతాజ్ఞయను పిమ్మట బ్రహ్మదేవుడు శిష్యుడైన భరతునితో నిట్లనెను. ఓభరతా! 'దేవేంద్రుని విజయధ్వజ స్థాపనా దినము త్వరలో రాగలందులకు నాసమయమునకీ నాటకచక్రము వెలిబుచ్చుము" కావున దేవసభయందు నింద్రుని విజయ ధ్వజము లేవనెత్తిన సమయమునకు భరతుడు "అమృత మంథన యను నాటకము నొకటి తయారు జేసెను" దేవతాపరిస్తుష్టుడైన దేవేంద్రాది సమ్ముఖమున నాపత్రికరణము ప్రదర్శింప బడెను. నాట్యరంగము భగవదంశ సంభూతుడగు విశ్వకర్మచే నిర్మింపబడెను. ఉత్సవము లందును, పార్వతీవివాహ సందర్భములందును నాటకము ప్రదర్శింపబడెను. గిరిరాజగు హేమవంతుని మందిరమున భరతునిచే వ్రాయబడిన త్రిపుర దాహమను నాటిక ప్రదర్శింప బడెను మానవలోకమున నాటకము లీతీరున ఉత్పన్నమైనవి. పెండ్లి కుమారుడు గానున్న మహాదేవుడా దృశ్యమునుజూచెను. తనచే సృష్టింపబడిన యాకళ యింత వరకెట్లభివృద్ధిగాంచెనో కన్నులార జూచి పరీక్షించుకొనుట కాయనకు మంచి సమయము చిక్కెను.

నాట్యమందు లేక పోవుటచే నాటక స్వారస్యము సంపూర్ణత నొందలేదని యచటనే యాయన ప్రథమమున దెలిసికొనినది. అంటనే తనశిష్యుడగు తాండుని దానియందు ప్రేమపూర్వక నృత్యముల సందర్భమున సారముగ చేర్పుమని యాజ్ఞాపించెను. ఆ వైఖరులన్నియు పిండిబంధములని బిలువబడుచున్నవి

ఈతీరున నృత్యములు దృశ్యములందు క్రమముగ చేర్పబడినవి. వసంతర్తువందు క్షేత్రములలో నింద్రధ్వజము నెత్తి ప్రజలు వినోదముల జేసికొను యాచారముండెడిది.

ఆంధ్రదేశమునకూడ వసంతాగమమున జనులు మేళోలను నుత్సవమును జరుపుచుండురు.

హిందూదేశమునకు శకుంతలాతనయుడగు భరతుడు రాజ్యమేలి తన పేరట భరతవర్షము నామకరణటకు బూర్వమిది జంబూద్వీపమని వ్యవహరింప బడుచుండెడిది.

జంబూద్వీపమున నాట్యకళను నింద్రునిజయించిన నహుషుడను రాజు ప్రవేశపెట్టెను. భరతముని కిష్టము లేకున్నను దిగ్విజయమొందిన నహుష రాజ్యమున కాయన వెళ్లుటకు బలవంతపెట్టబడెను. అప్పుడాయన తన శిష్యులగు కోహాల శాండిల్యధూర్తిల ప్రభృతులతో నాతనితో జేరి సకల సామంతరాజ పరివృతుడైన అనుపమ చక్రవర్తి మందిరమున తనకళను ప్రదర్శించెను.

అనటకులలో కొంద రచటిస్త్రీల యందు బద్ధానురాగులై సంసారజీవనముల విడపి సంతాన వంతులైనట్లు చెప్పబడుచున్నది. ఈసంతానము ప్రత్యేకముగా నలుకవంశము పరిగణింపబడెను. నృత్యసంకీర్తనములే వారి వృత్తి. భగవదుత్సవాదులందు నాట్యములు సల్పుటకు వారాహ్వానింప బడెడివారలు. ఈవంశమునకు జెందినవారలు నేటికిజగన్నాథము, కామరూప మున్నగు పవిత్రస్థలములందు గనబడుచున్నారు.

పైయాచారమును బట్టి భరతముని నాటకములకును నాట్యశాస్త్రములకును కృతికర్తయని విశదమగుచున్నది. తరువాత కాలపు కవులీ విషయమున గ్రంథములందు పేర్కొనుటచే భరతమునియే నాటకకళా పితామహుడని సాక్షియగుచున్నది.

క్రీస్తుతరువాత తొమ్మిదియవ శతాబ్దమున అభినవగుప్తాచార్యుడు నాట్యశాస్త్రమునకు వ్యాఖ్యనువ్రాసెను. దానిపేరు భరతనాట్యవేదవివృతి. గుప్తాచార్యుడు దానియందు భరతమునియే నాట్యశాస్త్ర ఋతయని వ్రాసియుండెను. ఈగ్రంథము రంగస్థలి నాట్యకళలపై కొంత విషయ సంపద నొసగుచున్నది. కాళిదాసుని విక్రమోర్వశీయమునందును భవభూతియొక్క ఉత్తరరామ చరిత్రమందును, భరతుని నామము చెప్పబడెను. కాళిదాసాతనిని నాటకకర్తయనియు సర్వాతియనియు వర్ణించెను. భవభూతి భరతమునిని తౌర్యత్రిక సూత్రధారునిగ చిత్రించెను. మరియొకకవి భరతముని వాల్మీకి మహాఋషికి సమకాలీకుడని వ్రాసియుండెను.

ప్రధమనాటక ప్రదర్శనమైన వెనుక నటకులందరు భరతపుత్రులుగా వర్ణింపబడిరి.

# కోకిలాకాకము.

(చిర్రావూరి కామేశ్వరరావుగారు.)

## ప్రథమవీచిక.

ఒకపెద్దమేడలో నొకమహారాజు,
భోగభాగ్యంబుల నోలలాడుచును,
ప్రజలపాలిటి కన్నతండ్రియై వెలసి,
రామరాజ్యము వోలె ధరణిపాలించె.

గుణరూపవృత్తంబుల నుపమానములు,
కడుమనోహరములై హృదయంబుదనుప,
నారాజుకూతురు లావణ్యతిలక,
తల్లిదండ్రులప్రేమ సౌభాగ్యఫలము,
సకలవిద్యలయందు శారదాదేవి,
యలరారె తనపేరు జగమెల్లనిండ.

ఒకనాఁడు కాఱుచీఁకటిరాత్రియందు
పట్టమహాదేవి పైబాసిపోయె,
ఆమహారాజు దుఃఖాయత్తుఁడగుచు,
అన్నపానంబుల కతిదూరమగుచు,
మంత్రులనాప్తుల సరివారివినక,
నానాటికిని చాలకృశియింపఁదొడఁగె!

ఒకనాటి నడిరేయి వసుమతీవిభుఁడు,
గాలిమేడకుబోయి, యేకాకియగుచు,
తనమనోహరిఁగూర్చి తలవంచి తలఁచి,
హా! యని కనుమోడ్చి, నిట్టూర్పు బుచ్చి,

"నాప్రేమలత రెంపు తునుకలై పోయె!
నామనంబున నంధకారంబు గ్రమ్మె!
నాజీవితాశయు మఱుగంటె నకట!
నాకు వేఱొకయాశగలదె యీభువిని?"

అనిబాష్పపూరంబునించి కన్గొనల,
పెదవులు బెదరంగ చాలశోకించె!

ముద్దునడకలొల్క గాటంపువలపు,
నిలువెల్ల గప్పిన చీరక్రొంజెలువు
కనువిందు గొలుపంగ, నరుదెంచి యొకతె,
రాజేంద్రుపదములఁ బడియేడ్చెఁ గుగుల!

ఆమెయెవ్వతొ? యిందువచ్చె నేమిటికొ,
యీయేడ్పునకు హేతువేమియో యనుచు?
ధరణీతలేంద్రుండు తెలియంగలేక,
విస్మయాకలితుఁడై యామెతోననియె;

"ఇదియేమి? నీకెవ్వరేమి చేసితిరి?
దుర్మార్గు లెవరైన భంగపెట్టితిరొ?
నీమనోహరుని నిన్నడమి జేసితిరొ?
నీదుఃఖకారణం బెఱిగింపు మబల!"

అనగానె యాలతాలలితాంగి, మోము
పైకెత్తి, మెల్లగా వెడలించు ముసుగు,
కన్నీరు చెఱఁగున నద్ది యిట్లనియె?
కంపించు స్వరమున మాధుర్యమొలుక,

"ఓమహీతలనాథ! నేదీనురాల!
విధివ్రాలు నాయందుఁ బ్రతికూలమయ్యె
నామనఃపతి, నన్నుఁ బ్రేమించువాఁడు,
హా! జీవితేశ్వరా!— హా! ప్రాణనాథ!
నినుబాసి నిమిషంబు నేనుండఁగలనె?
నన్నిందు విడనాడి యెందేగినావు?

పెల్లుబ్బు శోకంబు నాపంగలేక,
యావిషాదిని వేడి కన్నీరు విడచె!
జననాథు డడగంటఁ గనికారమొలుక,
సుకుమార హృదయంబు తరళింపఁ బలికె
"లలనామణీ! ఇంతవలవంత యేల?
నీనాథుఁడేమయ్యె? ధైర్యంబుఁబూని,
యోజింపు మాద్యంతముగ నీవిధంబు,
నాకు దోఁచిన మేలు నీకొనర్చెదను!"

అనిపల్క నొకింత తాళి యాయువతి
పలికె నాతనితోడ జాలువంపు ఫణితి!—
"ప్రజలపాలింటి జీవరత్నమా! వినుము,
కరుణాసముద్రుఁడై ప్రజఁ జూచువాఁడు,
కలనైన రోషభీషణ లేనివాఁడు,
నాప్రేమ దేవుఁడు, నామనోహరుఁడు,
జగతిలోపల నేఁడు గానంగ రాఁడు!—
కటకటా! నాకర్మగతి యిట్టులుండె

అనిపల్కి యాక్రోశ మొనరించి, మఱల
తననాథుగుణ వర్ణనము సేయఁ దొడఁగె,
ఆరాజచంద్రుండు దనసతీమణిని,
కన్నీటి వెల్లువ నిలువెల్ల దడుప,
కౌఁగియాడికొని యిది, కనికారమొదవ,—
"అయ్యింతి నాయింటి మణిదీపకళిక!
నావంటి నిర్భాగ్యునకు నెట్టులబ్బు?
కటకటా! నాకర్మగతి యిట్టులుండె!"

ఆ సమానుభూతిపైకొనఁ గొంతసేపు
వారలిరువురు మోనములు వాల్చిరపుడు,
తొలికోడి కూసెను. తెలివాఱెఁ బూర్వ!
ఆయుషఃకాలంబు కనుపట్టెంబు!

నరనాథుఁడాయింతి మనుగతి జూచి,
యసమాన సౌందర్యమున ముగ్ధుఁడయ్యె,
కొన్నాళ్ల తరువాత యానెత్తిరాజు
ఆమెను శాస్త్రోక్తముగ బెండ్లియాడె!

పడతికి దగువస్త్రభూషణంబులను
దాల్చి యానరనాథు క్రొత్తపెండ్లాము,
నౌకర్లు చాకర్లు మొక్కు చేతులతో
పనులెల్ల దీర్పంగ, నధికారమూని,
గద్దెపైఁ దననాథునొక బొమ్మచేసి,
ప్రళయాంతకంబనఁ బ్రజనేలదొడఁగె!

ఆదినంబులయందు రాపత్ని కడకు,
తొల్లింటి దాంపత్య ఫలరూపమైన,
ముద్దుకూతురు భైరవి యనెడు యువతి,
యరుదెంచి తనవయోవిభవంబు మెఱయ,
రాజేంద్రు నఱచేత నిమిడించుకొనియె'

తల్లియుఁ గూఁతురు చాకచక్యమున
లావణ్యతిలకపై లేని నేరములు
మోపి నమ్మించి రా యంధనృపుని!
కాని, లావణ్యతిలక మానసమున,
పరమేశు ధ్యాయించి, కడుధైర్యమూని,
ఏనాఁటికైన జీవనయాత్రయందు,
సంతోష మొదవదా, యనియాశనుండె!

ఒకనాడు రాపత్ని ధరణీశుతోడ,
నేకాంతమునఁ జాలసేపు మాట్లాడి,
చూపుల మోహనమంత్రంబు జదివి,
పదపడి పల్కెడి కలరవంబెసఁగ.
"ఓనాథ! మనకూతు లసమానరూప
విభవంబుగలవారు, జవరాండ్రు సుమ్ము!
పెద్దది భైరవి, తగువానికిచ్చి,
పెండ్లిసేయఁగ కాలమాసన్నమయ్యె!"

అనవుడు రాజేంద్రుఁడామెతో ననియె,
ఒక్కింత యోచించి, తలయూఁచి, వంచి,
"ఓమనోహారిణీ! నిజము చెప్పితివి?
నేఁగూడ యట్టులే తలపోయుచుంటి!

తెప్పలంపెద పరిణయ ఘోషణంబు?
దిక్కులగలరాజులెల్ల మోదింప;
తరువాత శుభస్వయంవర మంటపమున
నవని భైరవిగారు నతనికిచ్చెదము!"
అనిపల్కి- యామరునాటి వేకువనె
యెల్లదిక్కులఁబంచె బ్రాహ్మణోత్తములఁ.
వారును శుభసమాచారంబు గొనుచు,
సకలరాజస్థాన సందర్శనంబు
జేసి, కానుకలంది, యాశీర్వదించి,
తమరాజధానికి నరుదెంచినారు!

"లావణ్యతిలక యెవ్వని మెచ్చుకొనునో,
ఎవని పున్నముపూవులు పూచెనో కో!"
అనిరాజపుత్రులాందోళనంబొంది,
ఒకనిమించి యొకండు వేంచేసినారు!
కానియొక్కనికైన భైరవీయువతి,
శుభస్వయంవర మండపాంతరమందు
పూలహారముతో వరాన్వేషణంబు,
సేయనున్న యుదంత మొక్కింతయైన,
కలనైనఁ దెలియదు!- రాజపత్నియాజ్ఞ,

శుభముహూర్తమునందు శృంగారవతులు
శుద్ధాంత కాంతా సమూహంబుగొలువ,
వెలలేని రత్నాల సరిగంచు చీర,
ముత్యాలపూవుల ముఱిపెంపు రవిక,
పసిఁడిక్రొంజిగి మెఱుఁగువారలనగలు
ధరియించి యరుదెంచు భైరవింగాంచి,
భయకంపితాంగులై రాకుమారకులు,

"జగదేక సుందరి లావణ్యతిలక,
అనిలోక మీమెనాకొని యుండెనకట!
కన్నులు లేనట్లు!— మోసపోయితిమి?''
అని మెల్లగా లేచి ముసలి రాజునకు
వందనం బొనరించి తమదారిఁ జనిరి!

కాని కుంతలరాజ పుత్త్రుండు నిలిచి
రాజేంద్రుఁ జూడగాంచి, వినయంబుతోడ
కడు మనోహరవచో విభవంబు మెఱయ,
వచియించెను కటాక్షముల స్నేహమొలకలు
"ఓ రాజ కులదీపకా! ఈమె కేను
తగినవాఁడనుగాను, లావణ్యతిలక
గుణశీలగలదేమొ చూచిపోయెదను,
ఈపాటిదనుఁజూప వేడుచున్నాను!"
అనవుడు రాజపత్ని కపటంబుతోడ
కుంతలేశుగాంచి, చిఱునవ్వునవ్వి,
"ఓరాజ కులభూషణ! వేయునేల?
మా భైరవీసుందరికి నీవెతగుదు!
లావణ్యతిలకను జూడంగనీకు
కోర్కెగల్గుటజూడ నాశ్చర్యమాయె!
ఐనకాదననేల నీయభీష్టంబు
పోయిచూచెదుగాక నావెంటరమ్ము!''
అనిపల్కి నామెతోఁబోయి లోపలికి
కనిమెనాతఁడు మూలఁ గూర్చున్నదాని,
మలినవస్త్రముదాల్చి వెలుగొందుదాని,
భూషణంబులులేక సొగసైనదాని
ముక్తకేశినియయ్యు ముగ్ధయైనదాని
నైసర్గ సౌందర్యమునఁ బొల్చుదాని
లావణ్యతిలకను, గుణరత్ననిధిని!
కుంతలేశుఁడు కొంతసేపాగి, కనుల
జిమ్మ హర్షాశ్రువులు జాలువాఱంగ,
"ఓ సుందరీమణీ! దురవస్థగలిగె!
ఈవిన్నదనమేల? నీ దోసమేల?
ఈ స్వయంవరమునకేల రావు?"
అనుచు సమ్మోహమొత్తిల వినయంబుగ ముందు
నిలబడి కరపద్మములు మోడ్చి, కరగు
సుకుమారి విమలాంగి, లావణ్యతిలక,
మాధుర్య శుభకంఠమున నిట్లుబలికె

"ఓ దయాపరతండ్రి! నీ వాక్యపాళి,
మృతమనంబునకు సుధాసేచనంబు!
కాలచక్రంబునఁ బరివర్తనంబు
నాశ్చర్యమయ్యును సామాన్యమగును!"

అనిపల్కి యా మాధురీమూర్తి యతని
ననురాగశృంఖలాబద్ధుగా జేసె!

రాపత్ని యావింత వృత్తాంతమెల్ల,
దిలకించి పటురోషము సడంచుకొనుచు,

"ఓ కుంతలాధిపా! చాలసేపాయె!
భోజనానంతరమున నేగుదెంచి,
యీ ముగ్ధలాడితో మాటాడవచ్చు!
వన్నెకెక్కిన గాచకాలమందుబుట్టి,
ఈమెతో మాటాడ మనసెట్టులొప్పు?
నిలుచున్నపాటున సగ్గయ్యెనాకు!

అనిమోము చిట్లించుకొని రాజపత్ని
యతనితో పాకశాలకు నేగుదెంచె!

కాఱుమబ్బులుదాటి క్రుంగుసూర్యుండు,
పసిడివెల్లువలోన జగమెల్లముంచె!

ఆరాత్రికుంతలాధిపుఁ డేకతమున
నేమేమియో యోజన లుపాయలగుచు,
నెమ్మనోగతమునఁ బడివెల్లివాఱువ,
చింతానిమగ్నుడై కన్నిదురించి,

"కనులార నాయింతి నెట్లుగాంచెదను?
మనసారమాటాడు భాగ్యమబ్బునొకో!
నామనోభీష్టంబు దెలుపనసమయ
మగునొకో? నన్నామె ప్రేమించునొక్కొ?"

అనినమ్మ సచివాగ్రణిం జేరబిలిచి
సుస్నేహభావంబు జెలువొందఁబలికె

"ఓ మిత్రరత్నమా! లావణ్యతిలక,
లలితాంగి మన్మనోసామ్రాజ్యలక్ష్మి;
యింతి చెలువంపు విరిబంతి, లేని
సిరులేల, సొగసేల, ప్రాణంబులేల?"

అని కన్నుగవనిండ బాష్పంబులొలయ,
రాజపుత్రుఁడు చాలదుఃఖించి, మరల

"సచివాగ్రణీ! చాల మేలుచేసితివి!
నేటి యీ కష్టంబు కడతేర్చువేని,
నీమేలు నామది నంకితంబగును!
నీవేగి యీరాత్రి రాపుత్రిగాంచి,
నృపకుమారుడు వియోగాగ్ని గ్రాగుచును,
నీ నామమాత్రలో ధ్యానించునవము!
నీ కటాక్షమొకింత యొసగమయ్యెనేని,
మరణమేగతియని మదినమ్మెననుము!
వీలైన నొకసారి ప్రమదావనమునఁ,
గలిసిమాటాడఁగ గోరినా ననుము!
ఓ నర్మసచివాగ్రణీ! వేగపోయి,
ఆ మనోహరతోడ మాటాడిరమ్ము!"

అనపుడు సచివుండు కొంత యోజించి,

"విషమ మీకార్యసంఘటన మెట్లగును?
మిత్రకార్యముగాన జాగ్రత్త వలయు!"
అని యావలికిబోయి, లావణ్యతిలక
వసియించుమందిరో పరిభాగమందు
చక్కనగరమాని కూర్చున్నదాని,
పండువెన్నెల ముంచుకొను సోయగంబు,
పిల్లగాలులమందగమనంబుసొగసు,
మనసారగనుగొంచు వినుతించుదాని,
పరిచారకనుగాంచి, కరమొత్తిబిలిచి,
స్నేహపూర్వకముగా బసిఁడినాణెముల
నంచియొక్కటి యామె చేతిలోబెట్టి
మృదుమందమధుర వాగ్విభవంబు వెలయ,

"కలవాణి, కలికి కోకిలవాణి, వినవె!
జలధివలయిత వసుమతీతలవిభుండు,
కుంతలాధిపుడు మీ రాపుత్రిగోరి,
వలవంతకృశియించి, పటువియోగమును

భరియింపనేరక, నా మాటవినక,
ఆశలువిడనాడి, యేకాకి యగుచు,
కంఠాన బ్రాణంబు దాల్చియున్నాడు।
నీవేగి రాపుత్త్రితోడ మాటాడి
యొకసారి కరుణించి, యీరాత్రియందు
ప్రమదావనంబున కరుదెంచునటులు
సరవాయముగ సిద్ధమొనరింపుమతివ।"
అనిపల్క యాదాసి కపటంబు జేసి,
"ఓమిత్రుడా! యట్టులే చేయుదాన।
మధ్యరాత్రమునందు కుంతలాధిపుని,
నొంటరిగాని దు గాపుండుమనుము।
అతనికై పరితాపమున రాజపుత్త్రి,
నిమిషంబునకుమారి సగమయ్యెనుము;
సమయంబు ప్రతికూల మగుటనేమాత్రిక
వేఱుకన్నులుదాల్చి వర్తింపుమనుము"
అనిపల్కి యచ్చోట వాసివేవేగ
నాగమ్మలాడిలోపలి కేగినపుడు,
సచివుండు దరహాస వదనంబుతోడ
నరుదెంచియెమరేగు చామరాసుతుని
బిగియార కౌగిట సంధించిపలికె:

"ఓసఖా! మనయత్నము ఫలించెనేడు,
నడిరేయినీవేగి లావణ్యతిలక
వసియించుమందిర ప్రాంతంబునందు
బహుళపుష్పితలతా గృహమందుపొంచి,
యామనోహరి వచ్చునందాక తాళి,
యామెకు నీ మనోగత మెల్లదెలిపి.
జనసమ్మతంబుగా జయమొందిరమ్ము!"
అనవుడు రాపుత్త్రిం డతిసంతసమున
మెడలోని రత్నాలహారంబుదీసి,
సచివుని కంఠాన నిడికౌగలించి,
"నీకు ప్రత్యుపకారమేమి సేయుదును?
నాయిలు నిలబెట్టి నన్నుబ్రతికించి
కడుపుణ్యమూర్తివైతివి, వందనంబు!"
అనికృతజ్ఞతజూపి, మధ్యరాత్త్రిమున
కడుమనోహరలీల పొదరింటికేగి
క్రేళ్లుదాటఁగ కోర్కెలాత్మఁ గోవలను,
అనిమిషత్త్వముబూని యతఁడు పొంచుండె"
కొంతసేపటికి ముద్దులమూటవోలె
నొకకన్య యచ్చోటునకు నేగుదెంచి,
"ఓప్రాణనాయకా! జాలంబువలదు,
అమృతంబు విషమాను నాలస్యమైన
రక్షక భటులెల్ల నిద్రమైమరచి,
ఎచటనెట్లున్న వారట్టులున్నారు."
అనిపల్కి యతనితో నచ్చోటవాసి
చెట్లసందుల జేబులో నున్నపోను
బాలభానుడు రత్నముల బంతివోలె
నుదయపర్వత శిరోతలమునకు బొడచె.

రాజపుత్త్రునివెంట గొనిరాజపుత్త్రి
యొకచండికాని కేతనమున కేగి,
ద్వారంబునెదుట నాతని వీడుకొల్పి
ముసుగుదించిన మోముతోలోని కేగి,

"ఓభైరవీమాత! జోహారునీకు
నీదయాలేశంబువలనఁ గల్గితిని
నీపేరుదాల్చి నేనలరారుదాన,
రాపుత్త్రి వరియింప మదిగోరుదాన
నన్నెట్లు దరిజేర్తువో, ఠాకురాణి
నీపదంబులెనాకు గతినమ్మినాను"

అనిప్రార్థనము సేయనా యమ్మవారు
ఆక్షణంబునఁ బ్రసన్నాత్మయై పలికె
"ఓసుందరీ నీకు భయమేమివలదు.
నిశ్చయంబుగ మనోభీష్టమీడేర్తు."
అని రాజపుత్త్రిని దరికి రాబిలచి,
మృదుమంద కలవాక్యముల నిట్టులనియె

"ఆగర్భ శ్రీమంత భూకాంతమౌళి
సౌందర్య జితరతి ప్రణయాధినాథ
నీమనోహారి భైరవీకాంతతోడ,
అకల్పమనురాగముననుండు మధిప"
అనగానె పిడుగులు పడినట్లుదోప,
రాజపుత్త్రికి కర్ణములు మూసికొనుచు,
"ఎంతమోసముగల్గె మిత్త్రద్రోహంబు
పొల్చనైతిని వెఱ్ఱివాడనై పోతి
కటకటా లావణ్యతిలక నింకెట్లు
గనుగొందు నయ్యయో నాకేమిదారి"
అనుచు కన్నుగవ కెంపువారంగ నేడ్చె
"సచివాగ్రణీ ఇంతమోసంబుదలచి
ఎంతస్నేహము ప్రదర్శించినావు!
నిజముగానిన్ను నమ్మితి, మోసపోతి
కటకటా! నాపూర్వ పాపమెట్టిదియొ!"
అని నిరంతర బాష్పములుగార నేడ్చె!
అపుడు చండికయాతని సేదదేర్చి
విపులచాతుర్యంబు వెలయ నిట్లనియె
"ఓ కుంతలాధిపా! ఈ వింత విధము
నీ చెలికాని దోషముగాదు వినుము!
ఆ దాసినీ మిత్త్రునితో నట్లు బలికి
గున గున భైరవీ కుసుమాంగి కడకు
బోయి వాక్చాతుర్యములరారఁ బలికె।
"ఓ యమ్మ! నీపున్నెముల పంట పండె।
నా పుత్త్రుఁడు నేడు లావణ్యతిలక
తో మాటలాడంగ క్రీడావనంబు
సంకేత మొనరించి, నా సహాయంబు
నర్థించి యున్నాఁడు, నీ యిష్టమింక!"
"అనవుడు రత్నాల హారంబు దీసి,
బహుమానము గనామె కొసఁగిరా తనయ
తన తల్లి బలముగా సవతి చెల్లెలను
కారా గృహంబున బాధింపఁ బంపె!
తరువాత భూషణాంబరధారి యగుచు,
తన తల్లి యుపదేశమును బొంది యామె
నీ తోడ లావణ్య వలె మాటలాడి
తమాలవృక్ష వితానంబు నీడ
నీయంగుళీ ముద్రివడయంగ గలిగె!
నిజము దాగదు, రాజపుత్త్రుఁడా వినుము
యీ కాల కడగోల సుశ్లోకశీల,
చక్రవర్తి కుమారి, సౌందర్యసీమ,
నా ప్రసాదంబున జననంబు నొందె
నీ వామెను వరించి, యిష్ట భోగముల
నోలలాడుము, మాట జవదాటవలదు!"
అనువుడు కుంతలాధిపుఁ డాత్మలోన
నొచ్చుకొని, "యకటా! పొరపాటు పడితి!
సచివుఁడు గూడ నా వలె మోసపోయె,
గలుగునే నాకింక గత్యంతరంబు?"
అని చండికనుగాంచి, మోడ్చిహస్తమ్ము
వినుతించి, పిదప, వచియించెనిట్లు,
"ఓ కాళికా! నన్ను క్షమియింపు మమ్మ!
వేయి జన్మాలకు లావణ్యతిలక,
నా సతీమణి యంచుఁ దలపోయు వాఁడ
నన్నెట్లు జూతువో, భారంబు నీది?"
అనవుడు రోషంబు గదుర నాకాళీ
తొగరు నాలుక జూపి, కండ్లెఱ్ఱ జేసి,
పండ్లు పటపట గొఱికి ఛీ యటంచు
పిడుగులు పడురీతి బెడిదంపు ఫణితి,
నవియె భైరవిచాల సంతోషమొంద
రాజ పుత్త్రుని గుండెలవియంగ నిట్లు।
"ఓ రాజపుత్త్రాధమా! నీచ హృదయ!
నీ కన్నుగవ నెత్తికెక్కుటం జేసి,
నీకు పోగాలంబు వచ్చుటం జేసి,
లోకాలు శాసింపగల నన్ను దిర్చి
పలుసాహసంబున బ్రతుక నెంచితివి!

శా ప ద
తెలుగు విశ్వవిద్యాలయ
గ్రంథాలయము
నమోదు సంఖ్య J.014
తేది 18-10-1986
International Telugu Institute Library
Acc No

శ్రీరాజా నల్లపరాజు మీర్జా అచ్యుతరామరాజు బహద్దరు గారు.



వీరు పారసీ, హిందీ, సంస్కృతాంధ్రములయందు చక్కని
కవిత్వము చెప్పగలిగిన చతుర్విధ భాషాకోవిదులు.

నా మాట వినకున్న నీక్షణంబునను
పెక్కు ముక్కల్ల పాల్జేసెదను సుమ్ము!"
అనపుడురా పుత్త్రుఁడాత్మ దుఃఖించి,
,,ఓయమ్మ! నీవేమిచేయనున్నావో,
చేసి నన్నంపుమా! నీకు మ్రొక్కెదను;
సర్వకాలావస్థలను నా మనంబు,
లావణ్యతిలక నే ప్రేమించి మించు"
అనిపల్క చండికా దేవి కోపమును
బట్టఁజాలక మిట్టిపడి యిట్టులనియె
,,ఓదుర్మదాంధుడా! కడునొచ్చినాను
నేడాదిగా కోకిలాకారమూని,
దేశదేశంబులు దిరుగాడుమింక
వత్సరంబులు నాల్గు నిండునందాక,
పక్షిరూపముబూని సుఖింతునీవు"
అని భైరవీ కన్యకను జేరఁజేర్చి
భయము లేదని ధైర్యమెరిగించెనపుడు.
రాజపుత్త్రుడు వెంటనే రూపుమాఱి
పట్టుకుచ్చుతురాయి శిరమందు వెలయ
ప్రణయ ప్రసారములగు కెంపు కనులు
ముద్దుల నిద్దంపు పగడాలముక్కు
నీలమేఘచ్ఛాయ నిరసించుమేను
వడసి చక్కఁదనాల రెక్కలల్లార్చి,
కోకిలాకారంబు దాల్చి చోద్యముగ
కలనాద మొనరించి యెగసె దవ్వులకు."

# చిన్నకథలు – ఆంధ్ర వాఙ్మయమున వాని స్థానము

:o:

(దిగవల్లి వేంకట శివరావుగారు. బి. ఏ. బి. యల్.)

"అవారిత సత్కవి కల్పనావిభూషా వహపూర్వవృత్తములు, పావలఁ దీరిచినాటి రత్నములు"

ప్రపంచకమున భాషలుపుట్టిన తోడనే, మానవులు మాటాడఁ దొడఁగినంతనే, చిన్నకథలవతరించినవి. ఒకఁడొక విషయమును మరియొకనితో చెప్పునప్పు డప్రయత్నముగ నొకచిన్న కథను చెప్పుచునే యుండును. శిశువుమాటలు వచ్చినంతనే కథలను వినగోరుచున్నది. బాలురును, బాలికలు నొండొరులతో కథలు చెప్పుకొనుచున్నారు. "అనఁగనఁగ నొకరా"జని చెప్పుకథలు వేనవేలు కలవు. వీనియందెల్ల నేడు వాఙ్మయము నందొక శ్రేష్ఠమగు కృతిగ—అంగముగ—పరిగణింపఁ బడుచున్న చిన్నకథల అంకురము లిమిడి యున్న వనుటకు సందియము లేదు.

ఆంగ్లేయభాషయం దత్యద్భుత కథలును క్రైస్తవగాథలును, అర్థరు, రాబిన్ హుడ్డులనుగూర్చిన శృంగార విషయిక కథలును, నాటకకథలు, నుండెను. ఇవిమన పురాణగాథలను, ఉపాఖ్యానములను, కథావళులను బోలియున్నవి. పందొమ్మిదవ శతాబ్దమున శాస్త్రజ్ఞానము వృద్ధియై, యంత్రముల సాహాయ్యమున కర్మాగారములు సాగుటయు, వాణిజ్యమున ప్రజలకు పెద్దగ్రంథములఁ జదువుటకు తీరికలేక పోవుటవలన వివిధవిషయములను క్లుప్తముగ బోధింప వలసిన యవసరము గ్రంథకర్తలకుఁ గలిగెను. వాఙ్మయమున వివిధములగు కృతులమూలమున పొందు జ్ఞానానందములను నాగరిక పాఠకులీ చిన్నకథల మూలమున నొందఁగోరిరి. పెద్దయాఖ్యాయిక లందు గల కథాచమత్కృతి, పాత్రపోషణము, రసపోషణమును, చిన్నకథలందుండ వలెనని వీరికోరిక. ఇవి యెల్లచేరిచి, రసోపేతమును భావోద్రేకమును, ఐక్యతయును, విషయ సౌలభ్యమును గలచిన్నకథలు వ్రాయునేర్పరులును బయలుదేరిరి. ఇంగ్లాండులో స్టీవెన్సన్ బారీ, కిప్లింగు మున్నగువారు నాంగేయ భాషలో చక్కని కథలు వ్రాసిరి. రష్యాలో టాల్‌స్టాయి టర్జనీవు మున్నగువారును వ్రాసిరి. ఇతరదేశములలోను చిన్నకథ లనేకులు వ్రాసిరి. కాని ఆదర్శ ప్రాయములగు, ఉత్తమములగు, చిన్నకథలను వ్రాసినది ఫ్రెంచివారు. ఇందు మొపసంత్ కథ లత్యుత్తమములు. డొడె, మెరీమీయను వారల కథలు గూడ నుత్తమములె.

పాశ్చాత్య నాగరికత మనదేశము నందడుగిడగనే దానిని శీఘ్రముగఁ గైకొనినది వంగీయులు. వీరుపాశ్చాత్య వాఙ్మయము నందలి విశేషములను గ్రహించి వాని ననుకరించిరి. వాఙ్మయమ నభివృద్ధి పరచుకొనిరి. చిన్నకథ యొక్క ప్రాముఖ్యమును గ్రహించిరి. వారినవలల ననుకరించి నవ్లెకథల ననుకరించిరి. స్వకపోల కల్పితములగు కథలను గూడ వ్రాసిరి. వంగదేశపు కథకులలో బంకిం చంద్ర చటర్జీ సుప్రసిద్ధుఁడు. ఆయన నవలలును కథలును మన గ్రంథకర్తలు తెనుఁగు చేసియేయున్నారు. రాధారాణి, యుగళాంగు లీయము మున్నగు చిన్నకథలు చాల మెప్పునందినవి. సీతాదేవియు శాంతాదేవియు గూడ వంగభాషలో చక్కని కథలు వ్రాసినారు. శరత్కుమారఘోషాలను నాతఁడు మంచి చిన్న

కథలు వ్రాసినది. ఆయినను చిన్నకథ యొక్క లక్షణము గ్రహించి, ఆదర్శప్రాయములగు చిన్నకథలను వ్రాసినది మహాకవి రవీంద్రనాథఠాకూరు. ఆయనకథ లాంగ్లములోనికిని, మన భాషలోనికిని, పరివర్తింపబడినవి. "కాబూలీవాలా సాహెబు" అను చిన్నకథను చదివి యానందింపని వారుందురా?

ఆంధ్రభాషలో నిన్న మొన్నటి వఱకును చిన్నకథలులేవు. కథాసరిత్సాగరము, కాశీమజిలీలు, మదన కామరాజు మొదలగు కథామంజరులు ఇతర కథలున్నను, పాశ్చాత్య వాఙ్మయములోని నవలల మాదిరి కథలు కాని చిన్నకథల వంటి కథలుకాని లేవు. కొన్ని సంవత్సరములకు ముందు మనభాషయందు ఆఖ్యాయికలు వ్రాయబడెను. ఆంగ్లేయము నుండి వంగభాష నుండి కొన్ని ఆఖ్యాయికలును చిన్నకథలును తెనిగింపబడెను. తరువాత కొన్ని స్వకపోలకల్పితములగు నాఖ్యాయికలను కథలను కొందఱువ్రాసిరి. అయిన నిప్పుడు మనభాషలో కనఁబడు చిన్నకథలు చాలవఱకు చిన్ననవల లనియే చెప్పవచ్చును. ఏలయన మన గ్రంథకర్తలు చిన్నకథల ముఖ్యలక్షణములను బాగుగ గ్రహించి ఆదర్శప్రాయములగు చిన్నకథలను వ్రాయలేదు. కొందరు మాత్రము కొంతవఱకు చిన్నకథ యొక్క లక్షణమును ప్రాముఖ్యమును గమనించి వాఙ్మయమున కిది చాలముఖ్యమగు అంగమని గ్రహించినారు. ఆంధ్రదేశమున సుప్రసిద్ధ భాషాభిమానులలో నొకరగు శ్రీ చెలికాని లచ్చారావు జమీందారుగారు పిఠాపురమునుండి రామవిలాస గ్రంథమాల కనుబంధములుగ కొన్ని చిన్న కథలను ప్రకటించి యుండిరి— అందు రోహిణి యనునది యొకటి. రత్నమాల యనునది యొకటి. రెంటిని వంగూరి సుబ్బారావు గారే వ్రాసిరి. రెండవదానికి శ్రీ లచ్చారావుగారు చక్కని ఉపోద్ఘాతమును వ్రాసి అందు వాఙ్మయమున చిన్నకథ యొక్క ప్రాముఖ్యమును వెల్లడించి యున్నారు. వీరి పోషణమున సాహిత్య సమితివారు ప్రొద్దుపొడుపు బువ్వబంతి వాల్గుసంపుటములను ప్రకటించినారు. అందు వంగూరు సుబ్బారావుగారును, పానుగంటి లక్ష్మీనరసింహారావు గారును, ఓలేటి పార్వతీశము గారు మున్నగువారు చక్కని చిన్నకథలను వ్రాసి యుండిరి. తెనాలిలోని సాహితీ కార్యాలయమువారు తమ పత్రికలో చిన్నకథలను ప్రకటించియుండిరి. ఇందు చింతా శంకర దీక్షితులు గారి కథలు ముఖ్యములు.

ఈ చిన్నకథలెల్ల రసవంతములే. మనోజ్ఞములే. వీనియందు రాజకీయ సాంఘికమత విషయికములగు సంగతు లనేకములు ప్రదర్శింపఁబడినవి. కథాచమత్కృతియు పాత్రపోషణమును బాగుగనున్నవి. అయిన నివి పాశ్చాత్య వాఙ్మయములోని చిన్నకథల కెనగావు. రవీంద్రనాథుని, ఆదర్శప్రాయములగు చిన్నకథలకును సరిపోవు. ఏలయన, వాఙ్మయమున చిన్నకథలను కృతుల కుండవలసిన ముఖ్య లక్షణము లిందుఁ గానరావు. కథరమ్యముగ నుండవచ్చును. కథయందు విశేషము లెన్నో యుండవచ్చును. కథ చిన్నదై యుండవచ్చును. కాని యది చిన్నకథల యందొక వాఙ్మయ భాగమునకుఁ జెందకపోవచ్చును. మనభాషలో నింతవఱకు వ్రాయబడిన స్వకపోల కల్పితములగు చిన్నకథలు ప్రథమ ప్రయత్నములు — ముచ్చటకు వ్రాయఁబడినవని తలంపవచ్చును. అయిన నీ కథలను ప్రోత్సహించినచో శీఘ్రముగనే మనభాషలోను మహోపసంతో టాలున్నాయి, రవీంద్రనాథుల కథలను పోలిన ఉత్తమ కథలు బయలుదేరును. శీఘ్రముగనే మనభాషలోను చిన్నకథ ఉత్తమ స్థానము నలంకరించును.

చిన్నకథ యనుమాట చిన్నదగు కథయని అర్థమిచ్చుచున్నను, చిన్నవగుకథలెల్ల చిన్నకథలు కావు. కథాకల్పనమును, రక్తియులేని కథలుకద లా! కొన్ని ముఖ్య లక్షణములుకలిగి రెండువేలు మొదలు పదివేల మాటలుగల కథయే చిన్నకథ. సాధారణముగ రమణీయమగుకథలో మూడునాలుగు వేలమాటలకన్న నెక్కువయుండదవు. చిన్నకథల కుండవలసిన ముఖ్య

లక్షణములలో నేది లోపించినను, అది యంగవైకల్యములమానినివలెనే వికృతమగును.

వాఙ్మయమునందలి ఇతరకృతులవలెనే చిన్నకథలు, జనులహృదయములనాకర్షింపవలెను అట్లాకర్షించినచో నది రక్తికట్టినదని భావము. ఇది కథకు ప్రధానలక్షణము. మరునాడే చంపఁదలచిన సుల్తానుకథ వినవలెననే కుతూహలము కలిగించి, వేయిరాత్రులు వినునట్లు రసవంతములగు కథలను (అరేబియన్ నైట్సు)లో షహరజాదీ చెప్పినది; చైనాదేశములలో కథలను చెప్పి జీవించుకథకులు, మంచిపట్టున కథ నాపుదురు. వారికి విరాళముల నిచ్చినగాని తదనంతర వృత్తాంతము చెప్పరు. అట్టితరి నేదోయిచ్చికథ వినకయే పోవఁగల జితేంద్రియు లెవ్వరుందురు? అందువలన తమ చిన్నకథ బాగుండవలెనన్నచో, తాము కథకు గ్రహించిన విషయము రక్తికట్టునాయని కథకుఁడు, గ్రంథకర్తయు ముందుగ నాలోచింపవలయును.

చిన్నకథకొకప్రధానవిషయము- భావము-సందర్భము నుండవలెను. ఇవి చదువరి కొక్క భావోద్రేకమును కలిగింపవలెను. ఇట్టి భావైక్యత కలుగవలెనన్నచో, నొకప్రధానవిషయమునో భావమునో గ్రహించి దానిచుట్టును కథాసందర్భము నల్లుట ముఖ్యము. ఈకాలపు పాఠకులకు కథరసవంతముగ నుండవలెను. స్వాభావికముగ నుండవలెను. కన్నులకుఁ గట్టినట్టు లుండవలెను. మఱియు క్లుప్తముగ కూడనుండవలెను. ఇట్టిగుణముల నొక్కచోఁబిగియఁదీసి కథనుమనోజ్ఞముగ చేయునదియే కథయొక్క ప్రధానవిషయము-భావము- సందర్భము.

కిప్లింగు అను గ్రంథకర్త ఆంగ్లేయమున మహమ్మదు దీనను కథను వ్రాసినాడు. ఇది యొక హైందవయువకుని మరణమును గూర్చినకథ. ఈరిత్తజీవనము చుట్టును కిప్లింగు రసవంతమగు కథాసందర్భము నల్లినాఁడు. సేవకుని బాలునికింగూడ ఆశయములు కోరికలు నుండునని మనకు తోఁపఁ జేసినాడు. ఇతఁడు గాజుముక్కలతో- విలువలేని వస్తువులతో హర్మ్యములను నిర్మించుకొనఁ బ్రయత్నించును. ఇతనినిచూచి మనము జాలి పడుదుము. ఇదియే కిప్లింగు యొక్క శక్తి. ఇదియే ఈ చిన్నికథ యొక్క విశేషము.

రవీంద్రనాథ ఠాకూరు కాబూలుసాహేబను కథ వ్రాసినాడు. ఇందొక పండ్లఱమ్ముకొను పఠాను కలకత్తాలో నొక గ్రంథకర్తయొక్క నాలుగేండ్ల బాలికయందు పుత్రికా వాత్సల్యముఁ జూపును. ఆమెకితఁడు పండ్లను బెట్టుచుండును. ఆమెకితడన్న భయము పోయినది. ఒకనాడితఁడొకనితో పండ్లక్రయము సరిలేదని కలహింప, కారాగారమునకుఁ బంపఁబడెను. కొన్నివత్సరములకు కారాగారము నుండి విడుదల పొందెను. ఇతడు తన చిన్న స్నేహితురాలింటికి వచ్చెను. ఇప్పుడామె పెండ్లికూతురు. నేడామెను చూచుటకు వీలుండదని గ్రంథకర్తపలికెను. కాని ఆపఠాను దీనముగ వెడలిపోవుట చూచి జాలిపడి బాలికను చూపించినాడు. ఆమెను చూడగనే పఠానునకు తనబాలికయు యింతపెద్దదయినదను తలంపు కలిగెను. అతడు తనయొద్దనుండి మాసి చినిగిన కాగితపు తునకపైన చిన్ని చేతియొక్క యైదు వ్రేళ్లగలముద్రను పైకిదీసి చూచినాడు. ఒక్కవేడి నిట్టూర్పునూర్చినాడు. గ్రంథకర్త హృదయము కరిగినది. తానొకగొప్పవాడు పఠానొక పేటుమానిసియను తలంపు పోయినది. పితృవాత్సల్యమందరకొక్కటేయని గ్రహించినాడు. తనబాలికపెండ్లికేయు వ్యయమునకొంచెము తగ్గించుకొన వలసివచ్చినను లక్ష్యపెట్టక స్వదేశముపోయి బాలిక చెంతఁజేరుమని కొంతధనమిచ్చి కృతకృత్యుడైనాడు. ఈకథయందలి ప్రధాన భావోద్రేకమగు పితృవాత్సల్యమును రవీంద్రుడెంతో చక్కగ ప్రదర్శించినాడు. ఇట్లె ప్రధానభావమునొక్క-దానిని దీసికొని దానిచుట్టును కథనల్లుటయుక్తము. అప్పుడేకథ చాలబాగుగ రక్తికట్టును. తండ్రిచనిపోయిన పిదపసంసార సాగరమీదుబాలుని శ్రీమకాని లోకమునందు మిగుల సుఖ

మును పొందఁగోరుబాలిక ఆశయముకాని, దేశసేవ చేయఁదలంచు యువకుని త్యాగము కాని దుర్వ్యసనములఁ దగుల్కొని దుఃఖము ననుభవించువాని యవస్థ కాని యేదైన నొక్క ప్రధాన భావము నొకటేదానిని నడుపవలెను. వార్తాపత్రికలలో సమాచారములు చదువ నభిలాష కలవారికి వింతలు, యుద్ధములు, పితూరీలు మున్నగు విషయములు రుచించును కేవలవిషయములను రుచింపవు. వీరికి మానవ జీవితము నందలి పోరాటములు చాలరసవంతముగ తోచును. ఈసంగతి నిగ్రహించిరియే కాబోలు ఘనులగు గ్రంథకర్తలు తమకృతులందు జనులపోరాటములు, అభిప్రాయభేదములు, బహిరంగముగను రహస్యముగను, జరుగు సంఘర్షణములు ప్రధానవిషయములుగ గ్రహించి వర్ణించినారు. రవీంద్రుడు మేమునికుపట్టముగట్టిన మనుకథలో నవేందుశేఖరునికి దొరల నాశ్రయించి బిరుదము లందవలెనను ఆశయము నందుకు వ్యతిరేకముగ వ్యక్తిజాతి స్వాతంత్ర్యమును గోరుజాతీయమహాసభాకక్షకుఁ జెందిన అరుని అత్తవారింటి ఆశయము, నొండొంటితో కలహించి తుదకునవేందుశేఖరుని వనమానవుని బుద్ధి మరల్చుటయుఁ గాననగును.

జ్ఞానచక్షువనుకథలో కుముదినిభర్తయందు కలిగినమార్పు. అతను వైద్యము చేతగాని భార్య కన్నులను పోగొట్టుట తరువాత నామె నెంతో ప్రేమతో చూచుట తదనంతరమతనికి ధనకాంక్ష కలుగుట ఆలుపిమ్మట నతఁడామెను తిన్నగ చూడలేకపోవుట తుదకామెను వదలి హేమాంగిని పెండ్లాడఁజూచుట అంతనాతని హృదయమునగలిగిన ఘోరసంగ్రామము ఆ వివాహము తప్పిపోవుటయు నతనికి మనశ్శాంతి కలుగుటయు కుముదినివిజయముతో కథ సమాప్తినందును. ఇట్లె రవీంద్రుని కథలందెల్ల నీలక్షణము కనబడుచున్నది.

కథయొక్క రచనాచమత్కృతియే కథాకల్పనము. సాధారణముగ జరిగినసంగతులు జరిగినట్లుగ చెప్పినచో నది రసవంతముగనుండదు. భావోద్రేకము కలిగించుటకు సంగతుల నొక్కమార్గమున పోనీయవలెను. ఈ మార్గముననుబడి ప్రధానభావమును పోషించు సంగతులను మాత్రమె గ్రహించి తక్కిన వానినివిడిచి కథను మనోజ్ఞముగ చేయుట గ్రంథకర్తవిధి. తనచిన్నకథలందు రవీంద్రుడీ లక్షణమును బాగుగ గమనించుచున్నాడు. ఆయన కథలను బాగుగ చదివినచో నిది విదితమగును. కథాకల్పనమున కొన్ని ముఖ్యవిషయములను గ్రంథకర్త గమనింపవలెను. చిన్నకథయొక్క పరిమాణము చిన్నదిగనుక, కల్పనము పెద్దదిగను గూఢముగనుండకూడదు. కథాసందర్భమెల్ల నూరుమాటలలో చెప్పదగినట్లుండవలెను. కథాసందర్భము కథలోనిసంగతులు అస్వాభావికముగ నుండకూడదు. అది యస్వాభావికమని కాని, అది జరుగుట యసంభవమని కాని తోచినచో పాఠకుఁడావల బారవైచును. అందుచేత నది కొంతవరకు స్వాభావికముగ ప్రకృతిసిద్ధముగ నుండవలెను.

కథయు నూతనముగనుండవలెను. వినినకథ వినుటకెవ్వరు నిష్టపడరు. చర్వితచర్వణము తలనొప్పికి కారణమగును. పాతసంగతులనే క్రొత్తమాటలలో వ్రాయుట, పూర్వగాథలనే కొంచెము మార్చి వ్రాయుట, గొప్పకథలలోని భాగములను విడదీసి వ్రాయుట, అంతర్నాటకములను చెప్పుటయు క్రమము కాదు. ఏలన కేటివాశకుల నివిరంజింపజాలవు. అనుక్షణము నూతనవిషయముల గూర్చు వారికివి వినుటయే కష్టముగనుండును. ప్రజాజీవనమును బాగుగ పరిశీలించి, లోకచారిత్రమును జూచి, ప్రకృతిని గమనించి, క్రొత్తభావము, క్రొత్తసందర్భము ఎప్పుడు స్ఫురించునాయని వేచియుండి, అది స్ఫురించినప్పుడే తన రచనాచమత్కృతిని జూపి, కవి కృతకృత్యుడు కావలెను. అప్పుడే అతనికృతి కథ మెప్పొందును.

కల్పనమునకు, భావోద్రేకమునకు, పాత్రమునకు, పరిపూర్ణావస్థ కలిగించు సుగతి సందర్భము కథకు ఆవశ్యకములు. మహోన్నతావస్థ (Clinax)

కథయందెక్కడనో ఒక్కచోట కలుగవలెను. జ్ఞానచక్షువువంటి కుముదినిభర్త యామెకన్నులను తనచేతులారపోగొట్టి పశ్చాత్తాపమునొంది తరువాత ఆమెయందు దయచూపి, మెల్లగ ధనకాంక్షకలుగ నామెను నిరసించి హేమాంగిని పెండ్లాడుటకుగూడ నంగీకరించి ఆ పెండ్లి విఫలమయినప్పుడు మనసు మరల్చుకొని పశ్చాత్తాపముజెంది, మరల కుముదినిని చేరును. పెండ్లియే కథలోని భావోద్రేకముయొక్క మహోన్నతదశ.

కథలోని ప్రధానభావమునకు మహోన్నతావస్థ కలిగినతరువాత కథాకల్పనమున 'విడుపు, లేక ఉపసంహారము' (Denouement) ఉండును. మహోన్నతావస్థయు సంహారము నొకే సందర్భముగ కలిగినను కలుగవచ్చును. లేక వేఱుగను కలుగవచ్చును. ఇది కథాసందర్భమును బట్టియుండును.

చిన్నకథయందు సాధారణముగ నొక్కటే ప్రధానపాత్రముండును. తక్కినపాత్రములెల్ల దీనికి లోబడి యణగి యుండును. అది యీపాత్రకు పరిపూర్ణావస్థ కలిగించుటకే తోడ్పడును. నాయికానాయకులుండు శృంగారకథలందు సయితము మన కొక్క పాత్రమందె ఎక్కుడు మక్కువ యుండును. గ్రంథకర్తయుద్దేశ మాపాత్రమునే ప్రధానపాత్రముగ చేయుటయని మనము గ్రహింపవచ్చును. దానిచుట్టు కాథాసందర్భ మల్లుకొనును. భావోద్రేక మలవాకొనును. రసపుష్టి యుండును.

పాత్రపోషణము ననేక విధములుగ చేయవచ్చును. పాత్రముయొక్క ఆకృతిలోనిముఖ్యచిహ్నములను పేర్కొనివర్ణించి చెప్పుట ఒకవిధము. రవీంద్రుని 'విజయ' యను కథలో రాజస్థానమున కవియగు పుండరీకుని గరుడముక్కు, విశాలఫాలము గంభీర విగ్రహముతు మనల నాకర్షించును అతడుతనపెద్దతల నొకప్రక్కకు వంచి పెద్దకంఠ స్వరమున మాటలాడుట మనకు కన్నులకుంగట్టినట్టులుండును. ఇట్లుఁగాక ఆకృతిని పూర్తిగ వర్ణించి చెప్పవచ్చును.

లేక పాత్రముయొక్క స్వభావమును గుణములచేత వర్ణించి చెప్పవచ్చును. ఇదియుఁగాక వివిధమార్గములు కలిపియు పాత్రను పోషింపవచ్చును. అయినను సాధారణముగ నొక పాత్రయొక్క ప్రవర్తనమును, సంభాషణమును ప్రదర్శించుటవలననే పాత్రపోషణము బాగుగ చేయఁబడుచున్నది. కొందఱు కృతికర్తలు కథాకల్పన కన్నను పాత్రపోషణము ముఖ్యమనితలంతురు. పాత్రముయొక్కపోషణమునకుఁ గావలసిన సందర్భములను కథయందు కల్పింతురు. అయినను చిన్నకథయందు పాత్రపోషణమునకుఁ గావలసిన ముఖ్యలక్షణ మేమన;— ఒకపాత్రము న్నట్లు మారునట్లు, ప్రవర్తించునట్లు చిత్రించుటయే. జీవనము సర్వసాధారణమే యైనచో నది రసవంతము కానేరదు. పాత్రముయొక్క శక్తి సాధారణ జీవనమున ప్రదర్శింపఁబడదు. ఏదైనొక సందర్భము— అవసరము వచ్చినప్పుడు జీవితమున ఒక అంతరాయము— ఆపదకలిగినప్పుడు, పాత్రముయొక్క శక్తి విజృంభించును. గుణములు తటాలున ప్రజ్వలించును. పాత్రము వివిధ విధముల ప్రవర్తించును. కృతికర్త తనకల్పనమున పాత్రములు స్వాభావికముగ నున్నవాయని పరికింపవలెను. ప్రకృతి విరుద్ధములగు పాత్రము లుత్కృష్టములు కానేరవు. ఒక సందర్భమున ఒకస్థితియందు దానేయుండినచో నెట్లు ప్రవర్తించెడివాడో, యోచించుకొని లోకమునందు జీవనమునకు సరిగ, ప్రకృతిని అనుసరించి, తనపాత్రమును నడపించుట కృతికర్తవిధి. ప్రకృతిస్వభావమునె పాఠకులు కోరెదరు. నిజముగ జరిగిన పని తోపించి కొంచెము సుఖము, కొంచెము దుఃఖము సూచించి, సంతోషవిషాదములు మిశ్రితములు చేసి, తమ తమ భావములను, సుఖదుఃఖములను ఆశలను ఆశయములను జ్ఞాపకమునకుఁ దెచ్చి ఒక్కవేడి నిట్టూర్పు, మరుక్షణముననే ఒక్కమందహాసమును చేయునట్లు చేయఁగలిగిన కథాసందర్భములు రచియించిన కృతికర్తనే, నేటి పాఠకు లభినందింతురు.

అట్టికృతికర్త కృతకృత్యుఁడగును.

ఒక చిత్రపటమునకుఁ జుట్టుప్రక్కల నున్న చిత్రికల్పనము, ఒక నాటకరంగమున నమర్పబడిన చిత్రవస్తుజాలము నొక సంగీతమున మనము విను రాగ సాహిత్యములును భావప్రదర్శనమున కెంతముఖ్యములో, కథకు రచనలు వర్ణనము లంత ముఖ్యములు. ఒక రత్నమునకు చుట్టును చెక్కిన బంగరు పగిలిపని యెంతయావశ్యకమో కథకునదియునంతయావశ్యకము. ఒక కథను వ్రాయుటకుముందుగనే, అందలి ప్రధానవిషయమును భావమును, పాత్రమును దానిచుట్టు నల్లవలసిన కథాసందర్భమును, కల్పనమును; గ్రంథకర్త నిర్ణయించుకొనును. తరువాతవీని నుపయోగించు సందర్భమున, రచనకు వర్ణనమునకుఁ దిగును. కథలోని ప్రదేశము, కాలము, ఋతువు కథాసందర్భము, కథయొక్క పరిస్థితులు, పాత్రములు ప్రవర్తించు సంగతి సందర్భములు వర్ణించి కథారచనమును చేయును. కథయందలి రచన చిత్రలేఖనమువంటిది. కథారచనమున-వర్ణనమున చిన్నకథ కత్యంతావశ్యకమగు ప్రధాన భావోద్రేకము యొక్క పరిపక్వమునకు ఐక్యతకు ముఖ్యమగు విషయములనే గ్రంథకర్త గ్రహింపవలెను. ఆచార వ్యవహారములు, దుస్తులు, భాష, ప్రకృతి సౌందర్యము, వర్ణించుటవలన కథాసందర్భము కన్నులకు గట్టినట్లుండును. అందువలన వర్ణనము కథాసందర్భమునకు తగినట్లు లుండవలెను. అప్పుడే దానియందమును మనము గ్రహింపఁగలము. రచనయందలివర్ణన మనేక విధములుగ నుండును. కథయొక్క స్వభావమును సూచించు వర్ణనములుకొన్ని; కథలోని విషాదభావమునకువిరామము కలిగించు శాంతి రసోపేతములుకొన్ని, పాత్రములను గూర్చినవికొన్ని, పాత్రపోషణము కొఱకు సమకూర్పబడిన సందర్భములఁ గూర్చినవికొన్ని; ఇతరములుకొన్ని.

కథారంభముకూడ బాగుగనే యుండవలెను. "అనఁగనఁగా నొకప్పుడొక రా"జని మొదలు పెట్టి సంగతులనుపూసగ్రుచ్చినట్లు చెప్పుపద్ధతి ప్రాతపద్ధతి. పాశ్చాత్యదేశపు వాఙ్మయమునందీపద్ధతిచాలకాలము వరకునుండెను. "అలెగ్జాండర్ పో"యను గ్రంథకర్త తనకథలలో నూతనపద్ధతిని మొదలుపెట్టెను: ఆతని కథలలో కథారంభము యొక్క సందర్భము కథామధ్యముననో ఎక్కడనో యుండును. అయిననితని కథలకు మొదటదీర్ఘములగు నుపోద్ఘాతములను వ్రాసియున్నాడు. ఇదియాతనిపద్ధతి. ఈక్రొత్త పద్ధతివలన గ్రంథకర్త పాఠకు నొక్కమారుగ కథామధ్యమున భావోద్రేకమున సమస్యలలో- పడవేయును; కాని యీరసమును రక్తినితుదదనుక పోషించుటచాలకష్టము. ఇదియుత్కృష్ట కృతికర్తలకే చెల్లును. ఐనను కథారంభము బాగుండుటే కథకు కొంతరామణీయకమును కలిగించును. కథారంభము రసవంతముకానిచో నేటి చదువరులాకథను [illegible] చదువరు. రసవంతము కాని యొక్క వాక్యమునుగూడ నవ పాఠక మహాశయులు మన్నింపరు. సంగీతమువలెనే, కథలును తక్షణమే రక్తికట్టవలె నందురు.

నాటకమున ప్రథమాంకమున కథాసందర్భమును పాత్రములను పరిచయము కలిగించినట్లే కథారంభమునఁగూడ రంగస్థలమును చూపి ప్రధానభావమును సూచించి ప్రధానపాత్రమును పరిచయము కలిగించి కథచెప్పవలెను. వీనియొక్కత చిన్నకథకుచాల ముఖ్యమగుటవలన కథయందు వీనినిబాగుగ పాఠకులకు స్ఫురింపఁ జేయవలెను. కథారంభమున సాధారణముగ రాఁబోవు నాపదలను సూచించు వర్ణనము లుండును. లేనిచో కథలోని ముఖ్యపాత్రముయొక్క గాని తదితర పాత్రములయొక్క గాని వర్ణనముండును. ఇదియుగానిచో కథలోనిపాత్రములు తటాలువనుత నెదుటకువచ్చి సంభాషింపఁ దొడగును. ఒక్కొక్కప్పుడివియెల్ల కలసి యుండును. మరియు నొకప్పుడొకలోకోక్తికాని ప్రకృతిసంబంధమగు శాస్త్రసంబంధమగు సత్యముకాని చెప్పబడి దానికి దృష్టాంతరము తీయబడును. ఎట్లయినను కథయొక్క ఎత్తుగడ పరిచయము కలిగించు భాగము, క్లుప్తముగనే యుండును.

చిన్నికథలను రచియించు గ్రంథకర్తలు, ఈ కృతి లక్షణములను గమనించి రచయించినచో నవి చాల రసవంతములగను మనోజ్ఞముగనుండి చదువరుల హృదయముల నాకర్షించి రక్తికట్టించును. భట్టుమూర్తి చెప్పిన "ఆహారితసత్కవికల్పనావిభూషావహము"లగు చిన్నకథలు నిజముగ "సానలుదీరిన జాతిరత్నము" లేయగును. అప్పుడు చిన్న కథలును మన వాఙ్మయమున శ్రేష్ఠములగు కృతులగుటయే కాక కావ్యములవలె రసవంతములును, వ్యాసములవలె జ్ఞాన బోధకములును నాటకములవలె ప్రత్యక్ష ప్రదర్శనములునై వీనియన్నిటి విశేషములను కలిగియు, వీనికన్న సులభగ్రాహ్యములును మనోరంజకములు నగుటచే వాఙ్మయము నందుత్తమ స్థానమునలంకరించుననుటకు సందియములేదు.

# విద్యాలాభము.

వాడ్రేవు శ్రీరంగనాయకమ్మగారు. *

---:o:---

తెలివినొసంగు, భక్తినిడుఁ, దేకువనిచ్చు, ధనంబుఁగూర్చు, ను
జ్జ్వలతరతేజముంగలుగఁ జల్పును, గీర్తినిబెంచు, దుఃఖముం
దొలఁచు లగించు దద్దపరితోషము, దోషముఁబాపు, సౌఖ్యముం
గలుగఁగఁజేయు, నిశ్చలతఁ గల్పనసేయు, నుదారబుద్ధి న
గ్గలముగనించు దానగుణగౌరవముంబచరించు, గౌరవం
బులలినొసంగు, దాష్ట్యమును బూర్తిగమాపును మాంద్యముంగడుం
గలఁచును పాపముంజెరచుఁ గార్యముమాన్పును, శాంతినిచ్చు, మం
గళకరశోభనించు, నధికంబగునీర్ష్యనడంచు, వైభవం
బెలమినొసంగు, జ్ఞానమిడు, హీనదశందొలఁగించు నేరుపుం
జెలువుగనిచ్చు శీలమురచించును గ్రోధముడించుఁ బెంచు మై
త్రిలతను, నీతినిల్పు నరుడే! తుదివిద్యను మోక్షరాజ్యముం
గలఁగఁగనేరియుంట; యటుగావున లోకమునందుఁ బూరుషుల్
లలనలు సత్కళావిభవలక్షణ సంయుతులౌచు మౌఢ్యముం
బలువిడిఁద్రోచి సర్వజనబంధువులై విలసిల్లుఁడంచు నే
నెలమిని గోరుచానను; మదీయసహోదర సోదరీగణం
బులకును, నాకు శారదపరిపూర్ణ దయామతితోడ సత్కళా
ఫలమునొసంగుఁ గావుత! ధ్రువంబుగ; నానతులొంది పొందుగన్.

---

* శ్రీ రాజా మంత్రిప్రెగడ భుజంగరాయ బహద్దరు జమీందారుగారి కుమార్తె.

# జగన్నిర్మాణము.

[ న్యాపతి శేషగిరిరావుగారు బి.ఏ. (ఆనర్సు) ]

I

వివేకరహితమని ఎన్నబడుపిపీలికంబు కూడ దనపథమున కడ్డువడిన యేయల్పవస్తువునైన ననుపరీక్షించి దాని యాద్యంతంబులారసి కాని ముందడుగిడదు. అట్టిచో ననంతమేధాసంపన్నుడగు మానవుడు తన కనుదినంబును గోచరంబులగుచు, దన యపార సాధనాసామర్థ్యమును దృఢీకరించుచుండు వివిధ సృష్టి వైచిత్ర్యంబులగురించి తెలిసికొనగోరడనుట సాహసము. ఈ చరాచర వస్తుసంతతికంతయు సృష్టిస్థితిలయ కారణభూతమేదియో తెలియగోరని వాడెవడు! మహాంధరము లేరీతిదమ యౌన్నత్యమును నిశ్చలముగా నుంపగలుగుచున్నవో, వారిధు లేన్యాయానుసారము విసుగును విరామమును లేక దమతమ హద్దులను మీరకుండ నల్లలనాడుచున్నవో సూర్యచంద్రాదిగ్రహంబు లే నిరుపమాన శక్త్యాజ్ఞాబద్ధములై నియమితమార్గముల సంచరించుచున్నవో, అప్రతిమాన తేజఃపుంజములై వినీలానంతపథమున వెలుగొందు యుడుగణంబులెల్ల నాధారమేదియో నెరుంగ గుతూహలపడనివాడెవడు! ఇత్యాదులగు బహువిధదృశ్యముల వ్యుత్పత్తి యే రూపము నొందెనో గ్రహింప నెవ్వ డభిలషింపడు?

మానవుడీ గోళమం దడుగిడినదాది అనగా నించుమించొక కోటి సంవత్సరముల నుండియు —ఈ చిత్రలక్ష్యముల రహస్యమును సాధింప యత్నించుచునేయుండెను. కాని ఒకటియూ, రెండా; అందును సులభసాధ్యములా? కావు. కాని మానవుడుమాత్రము తన సాధనాప్రయత్నముల నాపలేదు. ఆపజాలడు. అది ప్రకృతి విరుద్ధము.

ఇట్లు ప్రప్రథముననే మానవుని హృదయమును నాక్రమించియు నేటివరకు ననంతముగా నాతని యమూల్యభావనాశక్తి సారముం గ్రోలి గ్రోలి నడుమనడుమ నించుక ప్రత్యుపకారమొనర్చునట్లునటించి, చివరకు కృతఘ్నురాలగు భృంగిపగిది త్యజించినట్టి ప్రకృతి విలాసములలో నొక్కటి—అనుపమానమైనది —ఈ జగన్నిర్మాణక్రమ సమస్య. కాని ముగ్ధయగు పుష్పము కూడ తన్నిట్లు మోసగించి, దొంగిలిగొనినట్టి భృంగిని సైతము స్వకార్య నిర్వాహకురాలినిగా నొనర్చుకొని సఫలమనోరథ యగుచున్నది. అట్లే మానవుడును— సర్వజ్ఞసమానుడగు మానవుడును —తన్ను మెరపించి, మరపించి, మోసగించి పారిన ప్రకృతి కాంతా విలాసములనే స్వార్థపరములుగా నొనర్చి విఫలీకృతుడగుచున్నాడు. ప్రపంచ నిర్మాణక్రమ సమస్యాసాధనమం దాతని ప్రయత్నము లెంతవరకు ఫలించెనో చూతము!

చరిత్రకాలము (Historical period) నకుపూర్వము మనుజుడీ సమస్యనేవిధముగా సమర్థించుకొనెనో —సమర్థించుకొనగలిగెనో లేదో— దురూహ్యము. కారణాంతములచే నప్పటిమానవుడు కేవలము మూఢుడు కానోపు. అట్టివాడీ ప్రపంచము గనంతటదానే ప్రస్తుతస్థితికి రాగలదా లేదా యను ప్రశ్నకూడ స్ఫురింపించియుండదు. తన్నావరించి యుండు ప్రకృతి సర్వస్వమును అవాఙ్మానసగోచరుడును, అనంతశక్తియుతుడును నగు నొక్కరుని లీలగా నాచిత్తమ్మై నొందియుండును.

అప్పటెట్లున్నను, చరిత్రకాలారంభమందునమాత్రము మానవునకీ జగత్సృష్టియు నొక్కని కల్పితమను నమ్మకముండెను. తదుపరి దినక్రమమున మతాభివృద్ధియు, దస్మాలమున మతాధికారుల నిరంకుశాధికారాభివృద్ధియు కాగానీ నమ్మకమే మధ్యకాలము (Middle age) నాటికి దృఢమై ఒక శాస్త్రీయ సిద్ధాంతమై (Scientific theory) తదితర సిద్ధాంతములకించుకేని తావొసంగక సర్వజనాదరణీయమయ్యెను. ఆకాలమందు గ్రహపాటున నెవ్వడేని యీసిద్ధాంతమునకు వ్యతిరేకముగా ప్రవర్తింప సాహసించిన, నాతడొక దైవద్రోహిగా నెన్నబడి, తుదకు ప్రాణములపైతము గోల్పోయెడివాడు. అట్టిచో నాధారణమానవు డెవ్వడు జీవములపై నాసవీడి సత్యాన్వేషణపరుండు కానుంకించును. ఎవ్వడేని సాహసించి, కంటకుల బారిబడక మూఢతరమగు సిద్ధాంతము నెద్దేనొకదాని గనిపెట్టగలిగిన యెడల దాని వెలువరచుట కతడు వెరచెడివాడు. అందుచేత మన నానాటి ధీమంతుల ప్రయత్న ఫలములు దొరకుట కఱవాయెను.

ఈకాలమునందాదరణీయమైన దొక్క బైబులు సిద్ధాంతమే. ప్రాతనిబంధనలోని ప్రథమ గ్రంథాదియందు దాహరింపబడిన (Genisis chaps 102) తెర గెల్లరకు విదితమే. ఈశ్వరుడీ చరాచర వస్తు సంయుతమగు బ్రహ్మాండము నెల్ల నారుదినములలో సృష్టించెను. అరుదినములనగా నారుపగిళ్లును నారురాత్రులునని కాదు. ఈదిన మిరువదినాలుగు గంటల ప్రమాణముగల దినము కాదు. ఈ సందర్భమున 'దిన' (day) మనుశబ్దము జగన్నిర్మాణ గ్రంథమందొక యధ్యాయమును సూచించుటకుపయోగింపబడి యుండబోలును. లేనిచో నసంఖ్యాకములగు నిన్ని వస్తుసమూహములు హఠాత్తుగ నారు దివసములలో జననమొంది గడియారమందలి చక్రముల వలె నన్యోన్యభావమున మెలగుచు గమకు దామే ప్రవర్తింపగలవా? ప్రస్తుత శాస్త్రజ్ఞానానుసారమట్టిస్థితి యసంభవము. ఈబైబిలు సిద్ధాంతి సృష్టినెల్ల మానవాగమన పర్యంతము నారు భాగములుగ విభజించి యందొక్కొక్కదాని నొక్క "దిన" మని నుడివెను.

ఈబైబిలు సిద్ధాంతానుసారము బ్రహ్మాండమునందెల్ల భూలోక స్వర్గలోకములు రెండును ముఖ్యములు. అవియే నిత్యములు. సృష్టియందవి తప్ప తక్కిన వన్నియు వీనియొక్కయో వీనియందలి జీవులయొక్కయో యుపయోగార్థము నిర్మింపబడినవి. కాని యీరెండు లోకములును ప్రారంభకాలమం

దాకారరహితములై అంధకారబంధురములై శూన్య స్వరూపములుగ (void) నుండెను. సృష్టియొక్క ప్రథమ దివసంబున పరాత్పరుడీ శూన్య స్వరూప లోకముల దేజోవంతము లొనర్చెను. ద్వితీయదినంబున నాతడీ రెండు లోకములను నొక్క ఆకాశముచే ప్రత్యేకము లొనర్చెను. తృతీయంబున నీ భూలోకమందలి జలాశయములెల్ల నేకముం దింపబడ వివిధ వృక్షజాతులతో బొడినేల బయల్పడెను. చతుర్థదివసంబున సూర్యచంద్రాదులును, నితర నక్షత్రములును, సృష్టములయ్యెను. పంచమ దివసంబున నీశ్వరుడు సముద్రములందుండి వివిధజలచరములను బక్షిసంతతుల నుద్భవింప జేసెను. ఇక నారవదినమందీ స్రష్టభూమిని సంచరించు పలువిధ మృగజాతులను తుదకు మానవుని సృజించెను. ఈ మానవాగమనానంతరము పరమాత్ముడు తన నిర్మాణకార్యము గట్టిపెట్టి విన్నకున్నాడనియీ సిద్ధాంతియుద్దేశ్యము. అందువలననే ఏడవ దినమందు దేవుడు ఆరుదినములనుండియు బ్రహ్మాండకల్పనాకృషియందప్రమత్తుడై మెలగి డస్సిన శ్రమ దీర్చుకొనెను. ఈ సప్తమదినమే సబ్బాతుదినము. ( Sabbath day )

చూడగా నీ బైబులుసిద్ధాంతముచాల మట్టుకు హిందూ పౌరాణికసిద్ధాంతమును బోలియున్నది. పోతనగారి భాగవతమందలి ద్వితీయ స్కంధమున బ్రహ్మ నారదున కీరీతి బ్రపంచప్రకార మెరిగించినట్లున్నది.

"........భూతాదిమైన తామసాహంకారంబువలన నభంబుగలిగె. నభంబు సూక్ష్మరూపంబు. దానికి భూతవిశ్యంబునకు బోధకంబైన శబ్దంబుగుణంబగు. నభంబువలన వాయువుగలిగె. వాయువునకు బరాన్వయంబున శబ్దంబు స్పర్శంబునను రెండు గుణంబులు గలిగియుండు...... వాయువువలనరూపస్పర్శ శబ్దంబులనియెడు గుణంబులు మూటితోడ దేజంబుగలిగె. తేజంబువలన రసరూపస్పర్శ శబ్దంబు లనియెడు నాలుగు గుణంబులతోడ జలంబుగలిగె జలంబువలన గంధరసరూప స్పర్శశబ్దంబు లయిదింటితోడం బృథివిగలిగె." ఇట్లు రూపాంతరం బొందుటం జేసి యొక దానినుండి మరియొకటిగాబుట్టిన యీ పంచభూతములనుండి చేతనాచేతనంబులంగల బ్రహ్మాండంబు కల్పితంబయ్యె. "అట్టి యండంబు వర్షాయుత సహస్రాంతంబు దనుక జలంబునందుండి గాలకర్మ స్వభావంబులం దగులువడక సమస్తంబును జీవయుక్తంబుగ జేయ నీశ్వరుండచేతనంబును సచేతనంబుగ నొనర్చె. అంత గాలకర్మ స్వభావప్రేరకుండయిన పరమేశ్వరుండు జీవరూపంబున మహావరణ జలమధ్యస్థితంబయిన బ్రహ్మాండంబు లోనజొచ్చి సవిస్తరంబుగావించి యట్టి యండంబుభేదించి నిర్గమించె నెట్లంటేని"

కం॥ "భువనాత్మకు డాయీశుడు
భువనాకృతి తోడనుండు బ్రహ్మాండంబున్
వివరముతో బదునాలుగు
వివరంబులు గానొనర్చె విశదంబులుగన్॥"

ఈ చతుర్దశ ఖండంబులును భూలోక భువర్లోక సువర్లోకాది చతుర్దశ లోకంబులాయె.

ఈ పౌరాణికసిద్ధాంతము పామరజనరంజకమగునేగాని శాస్త్రసమ్మతము కానేరదు. హిందూశాస్త్రములందీజగన్నిర్మాణ

సిద్ధాంతములు పెక్కులుకలవు. కాని వానిలో నే దియొక్క దానితో నైన నీపౌరాణిక సిద్ధాంత మేకీభవింపదు. ఇది సర్వసిద్ధాంతములను గవితా మధురిమతో గలిపి మథించి సర్వజన హృద్యముగ సిద్ధ మొనర్పబడిన లేహ్యపు టుండ.

హైందవ శాస్త్రీయసిద్ధాంతము లన్నిటిలో (1) వేదాంతసిద్ధాంతము (2) తార్కికసిద్ధాంతము ముఖ్యములు.

వేదాంత సిద్ధాంతము:— ఇది మరల రెండు తెరగులు. (1) ద్వైతము. (2) అద్వైతము. ఇందు ద్వైత మీబ్రహ్మాండ మెల్ల ననాద్యంతములగు పురుష ప్రకృతుల (Energy and matter) వైకారికంబుల నుండి పరిణామ మొందిన దని సిద్ధాంతీకరించును. కాని యద్వైతము ప్రకృతియొక్క యనాద్యంత స్వభావముల గణింపక, సర్వమును ప్రకృతిసహా పురుష వైకారికముగా నెంచును. అద్వైత సిద్ధాంతప్రకారము సర్వమునకు మూలము 'పురుష' ఒక్కటియే! కాని ద్వైత సిద్ధాంతానుసారము మూలములు రెండు "పురుషయు, ప్రకృతియు" ఈద్వైతమత మీరెంటిని నిత్యములుగనే భావించును. ఇదియే ద్వైతాద్వైత సిద్ధాంతములకు గలభేదము. ఈ మూలమునందు తప్ప, యీ వేదాంత సిద్ధాంత మందలి రెండుభాగములకును తదుపరి ప్రపంచనిర్మాణక్రమమందే తారతమ్యము నగుపడదు.

ప్రకృతిస్వభావ మనాదియో, పురుష వైకారికమో, ఏదైన కానిండు. ఈప్రకృతిపై పురుషకుగలట్టి కొండొక యతీతశక్తిచే ఈ ప్రకృతియొక్కయు, పురుషయొక్కయు, నొకానొక యనిర్వాచ్య సంధానముచేత, శబ్దగుణప్రధానమైన నాకం బుత్పన్నంబయ్యె. తదంతరితంబునుండి యీ స్థావరజంగ మప్రపంచ మెల్లను పరిణామమొందెను. కాని యీ సిద్ధాంతమం దీశ్వరుని బ్రహ్మాండవిభాగ లీలమాత్ర మిమిడి యుండలేదు. అది బహుశః పురాణకవి కల్పనావిశేషము.

తార్కికసిద్ధాంతము:— ఇక తార్కిక సిద్ధాంత మెట్టిదో విచారింతము. దీనికి మూలపురుషుడు కణాద నామాంతరుడగు నొక్క తార్కికాగ్రగణ్యుడు. ఈయన తక్కటి సిద్ధాంతముల నెల్ల తర్కవిరుద్ధములుగా నెరిగి యాక్షేపములు లేని సిద్ధాంత మొద్దే నొకదాని నిర్మింపనెంచి, పెక్కుకాలము తదేకధ్యానపరుండై, యెట్టకేలకు నూతనపక్కిదగు నీసిద్ధాంతమును వెలువరచెను. ఇందలి విశేషమేమన నింతవరకు నుదాహరింప బడిన సిద్ధాంతములన్నియు బ్రహ్మాండ కల్పనానుస్యూనము సాధించి తద్వారా నీ పృథ్వీ నిర్మాణక్రమము నెరింగినవి. కాని యీకణాదసిద్ధాంత మీసమస్త సాధనము నీభూగోళోద్భవ సమస్యతో నుపక్రమించెను. ఇట్టి సాధనాక్రమమందు గణాదు డాధునిక పాశ్చాత్య శాస్త్రజ్ఞుల నెంతయు బోలియున్నాడు!

కణాదానుసారముగా నీధరణీగోళ మసంఖ్యాకములగు పరమాణువుల కలయికచే నుత్పన్నమయ్యె. ఈ యతిసూక్ష్మములగు నణువు లొకదానితో నొకటిచేరి, మిళితమై క్రమక్రమముగా సిద్ధమాయెను. ఈ విధముగనే గగనతలంబున మనకు దృగ్గోచరంబగు

గ్రహతారకాది గోళములన్నియు నుద్భవించినవి.

ఈ సిద్ధాంతము పరికింపగా ముఖ్యాంశములందును, సాధనాక్రమమందును, నవీనపాశ్చాత్య సిద్ధాంతములందు వన్నెకెక్కిన సూక్ష్మగ్రహసిద్ధాంతమును (Planetesimal theory) బోలి యున్నది. వివిధాద్భుత పరికర సహాయ సమేతులయ్యు: పాశ్చాత్యులు నేటికిగాని తీర్మానింపజాలని సిద్ధాంతమును పెక్కువందల సంవత్సరముల క్రిందనే, నిరాయుధులై, నిస్సహాయులై సిద్ధాంతీకరించిన కణాదుని బుద్ధిశక్తి యెంతయు శ్లాఘనీయము కదా!

(సశేషము.)

# ప్రేమగీతము.

—:o:—

( వరహారిశెట్టి వేంకటరత్నముగారు. )

మురళికరమున బూని
చిఱునగవు ప్రసరింప
హాయిలొప్ప నాసామి
గోవిందుఁ డేలరాడే! కటకటా!
గోపాలుఁ డేలరాడే!

లీలఁ బూని దరింప
మేలి బిగి కౌగిటను
కేళిఁ దేల్చిన సామి
శ్రీకృష్ణుఁ డేలరాడే! నేడ సఖీ!
చిన్నారి యేలరాడే!

ఒచ్చెమే లేనట్టి
మచ్చపుం బ్రేమచే
వచ్చునా రమణుండు
పరమాత్ముఁ డేలరాడే! అక్కటా!
పరమేశుఁ డేలరాడే!

నిగ్గు వెన్నెలలతో
నెఱసొంపులలతో
నను మీవాడినోయి
నానాథుఁ డేలరాడే! అయ్యయో!
నాదైన మేలరాడే!

నామోహపుంరాశి
నాదుముద్దులమూట
నాబహిఃప్రాణంబు
గోవిందుఁ డేలరాడే! అయ్యయో!
గోపాలుఁ డేలరాడే!

# వసంతము.

( వాకము కృష్ణరావుగారు. )

౧

మోదుగు చిగిర్చె, గేదఁగి పూసులెత్తె
మొల్ల వికసిల్లె, మల్లియ లుల్లసిల్లె
బొట్టుగులు పూసె, కలుగొట్టు
మొగ్గతొడిగె
మావియును క్రొవ్వి కమ్మనితావి నెసఁగె
గోగు గోరంట గురువెంద కోరగించె
వంజులంబును వావిలి వకుళ మలరె
సన్నజాజులు సంపెఁగల్ చెన్ను మీఱె
పొన్నగున్నలఁ గ్రొన్ననల్ వన్నె కులికె
ఇప్పమ్రాఁకులఁ బుష్పాళుల్ కుప్పతిల్లె
కదళికావళిఁ గళికలు కందళించె
నిమ్మమ్రాఁకల లేఁతపూరెమ్మ లలరె
పూగముల నవ్యకుసుమపరాగ మొనసె
నవలఁ బెనఁగొనెఁ జిన్నగుంపెనలగుంపు
దాకపొదరులఁ బూఁదేనెవాక లుబ్బె
అభినవం బైన యవ్వసంతాగమంబు
సంతతానందదముగ నెసంగుచుండె.

౨

మన్మథుని సుందరాస్థానమండప మన
పొంకమ్రాఁకులమ్రాఁకలు పొలుపు గులుక,
అలరువిలుకాని రాజ్యసింహాసన మన
గుజ్జుమామిడి కొదమలు కొమరు మీఱుల
అంగసంభవు వరనాట్యరంగ మనఁగ
కన్నెసుర పొన్నగున్నలు వన్నెమీఱ,
ఇందిరాసుతు శృంగారమందిర మన
బండిగురువింద పందిరుల్ దండి చూప,
దర్పకుని హంసతూలికాతల్ప మనఁగ
ఫుల్లనవమల్లికావల్లు లుల్లసిల్ల,
చెఱకువిలుకాని కేళికాసరము లనఁగ
అలరుఁదేనియకొలఁకులు విలసిలంగ,
కమ్మవిలుకాని క్రీడావనమ్ము లనఁగ
కప్పురపసంటి పుష్పాదికుప్ప లొప్ప,
శంబరారాతి పటుశస్త్రశాల లనఁగ
మంజుల సుమలతాకుంజపుంజ మలర,
చిత్తజుని వందిమాగధశ్రేణి యనఁగ
శారికాకీర పికములు బారు దీఱ,
సూనచాపుని వరభటస్తోమ మనఁగ
గండుతుమ్మెద పిండులు మెండుకొనఁగ
అభినవం బైన యవ్వసంతాగమమున
సర్వమంగళమయ మయ్యె సర్వజగతి.

3

తనివి దీఱఁగ సుమమరందములఁ గ్రోలి
సెలఁగి ఝుమ్మని గానంబు సేయునళులు,
కుతికబాటిగఁ జివురులగుబురు మేసి
క్రొవ్వి కూఁకలు వెట్టెడి కోకిలములు,
దోరబండినపండుల నారగించి
కులికి కిలకిల గూయు రాచిలుకగములు,

తేనెసోనలు చిటిపొటివానలనుచు
కేరి పురివిచ్చి యాడుమయూరతతులు
కలిగి సకలజనానందకారి యగుచు
భాసురం బయ్యె మధుమాస వాసరంబు.

౪

కాముకశ్రేణి చింతలు కడచనంగ
తరులఁ గారాకు లంతంత ధరణి డుల్లె,
యువజనంబుల కోరిక లివురులొత్త
చివురు జొంపంబు తరువుల నిరవుకొనియె;
విటుల నెమ్మనఁ బులకలు పొటమరింప
విటపములఁ గుట్మలంబులు పటపటించె,
పల్లవావళియుల్లంబు లుల్లసిల్ల
విరులగుత్తులు తరువుల విరియఁబాఱె,
జారగణముల మోదాశ్రుధార లడర
వృక్షపంక్తుల మకరందవృష్టి గురిసె,
సతులు పతులు వసంతంబు జల్లుకొనఁగ
భూరుహంబులఁ బూవెజంబులు దొరంగె,
దంపతుల మనోరథంబులు సఫలమొంద
పాదపంబుల ఫలములు పండఁబాఱె,
అనుపుకత్తెలు కిలకిల మనుచు నవ్వ
వివిధపక్షుల కిలకిలారవము చెలఁగె.

౫

క్రొంజివురు జొంపముల కెంపుసంజజిగికి
కోరకంబులు తారకాకారములుగ,
వలిపపూఁదేనె సోనల వానజడికి
రాలుపూవులు వడగండ్లచాలు గాఁగ,
వెల్లిగొను తేనెవాకల వెల్లువలకు
పుప్పొడులకుప్ప పులినంపు తిప్ప గాఁగ,
మంజుల నికుంజ కుంజర పుంజములకు
గండుతుమ్మెదపిండు శృంఖలలు గాఁగ
భాసురం బయ్యె మధుమాస వాసరంబు.

౬

గుజ్జుపొదరిండ్లు మొగుళులగుములు గాఁగ
భ్రమరఝంకృతి గర్జిత రవము గాఁగ
పలుచుచిలుకలు శక్రచాపంబు గాఁగ
లలితచాంపేయములు తటిల్లతలు గాఁగ
తేనెసోనలు జడిగొన్న వాన గాఁగ
జాజిపువ్వులు ఫేనపుంజములు గాఁగ
వర్షఋతు వన యామని వఱలుచుండె.

౭

లావు దొరఁగిన మరునకుఁ జేవ దెచ్చి
ఇగురుగ్రాకులగములకుఁ జిగురు తొడిగి
మూగలౌ కోకిలాళికి వాకు గూర్చి
బిగువు సడలిన జనులకు జిగి యలర్చి
ముజ్జగంబుల విజ్జెయొజ్జ యంచు
మంతుకెక్కిన మేటివసంతుఁ డెలమి
నెల్లవారల రోగంబు లెల్ల మాన్చి
తనదు చెలికానిపటుమాంద్యమును గుదుర్ప
జాలఁ డయ్యె నన, వసంతకాలమందు
మలయపవనుండు మెలమెల్లమలయుచుండె.

౮

శుభవసంతమహోత్సవ విభవవేళ
చారుసుకుమారమారకుమారకునకు
చెంగలువ విరిములుకులు, చివురువిల్లు
కలువఱేఁడును వనలక్ష్మి కానుక లొసఁగ,
ముట్టినంతన వసివాళ్లు వట్టునట్టి
వేటవస్తువు లివి గుణహీన మంచు,
మొనసి విడువక తనయంత మొఱయువాన్పై
మెచ్చుగులుకఁగ దా సీయఁ దెచ్చెననఁగ,
కొదమతుమ్మెదకదుపులు కదిసి రాఁగ
మలయపవనుండు మెలమెల్లమలయుచుండె.

# సంస్మరణము

( పెనుమర్తి వేంకటరత్నముగారు )

శాతకృపాణ దీక్షితులు సంగరరంగమునందుఁ బర్వ సం
జాతిభయోద్ధతిన్ రిపులు శౌర్యము నేక కలంతనొంద, భూ
మీతలమందు శౌర్యరసమేనదియై ప్రవహించెనాఁగ వి
ఖ్యాతిగడించినాఁడ వనఘా! రణతిక్కన! విప్రమండనా!

అనిలజవమున నేఁగెడు హయము నెక్కి
కరిసమూత్కర మందుఁ గేసరివిధాన
శాత్రవానీకమస్తకక్షతజపూర
మదరుఁ గొల్పఁగఁ జేసితయ్యా! సెబాసు!

తెనుఁగుంగైతల మవ్వము
గనుఁగొనినవరసము లూరఁగా భారతమున్
బొనరించిన తిక్కన్నకు
యనుఁగుందమ్ముఁడవటె! యహో శౌర్యనిధీ!

ఏలినవానికై రిపులనెత్తెంబై బోరిఁగొంచు, ధారుణీ
పాలురిదేమి? విప్రులఁట! బాపురే! దుర్జయ విక్రమంబునన్,
దూలఁగఁ జేయుచుండ, హయతుండిల శాత్రవసంచయమ్ములన్,
మేలనియబ్బురంపడఁగ, బృథ్వీసురావళి పిచ్చలింపగన్।

ధరణిఁ దెనుంగుఁగాపుత మనారతమున్ భవదీయ నామమా
ధురి, కవులెల్ల నీచరితఁ దోషణముప్ప రచించి నీయశో
తరుణిజగత్తుపై సతముఁదాత్తత లాస్యములంబొనర్పఁ జే
తురు; పృథివీసురావళినుతుల్పొనరించును! ఖడ్గతిక్కనా!

# జమీరు చక్రవర్తి – ప్రపంచ రహస్యము.

—— :0: ——

(వుప్పల లక్ష్మణరావుగారు. బి. యస్. సి. ఎం. ఏ)

పూర్వము పరిష్యా దేశంలో జమీరు పాదుషా అని ఒకగొప్ప చక్రవర్తి రాజ్యం చేస్తూవుండేవాడు. అతడు తన పట్టాభిషేకం అయినప్పుడు తనరాజ్యంలో వున్న మహాపండితు లందరిని తన దగ్గరకురమ్మని ఉత్తరవు చేశాడు. వాళ్లందరువచ్చి అతనికి జోహారు చేసి నిలబడియుండగా వాళ్లతో "ఇహం పరంసాధించి మోక్షంపొందడానికి జ్ఞానమే మార్గమని మనపూర్వులు చెప్పేరు. జ్ఞానమంటే మనుష్యజాతియొక్క తప్పొప్పులు. మనకు తెలిసి మనం ముందుకు జాగ్రత్తపడ గలం. అందుచేతనాకు మనుష్య చరిత్ర తెలుసుకోవలెనని కుతూహలంగా వుంది. నాకోసంమీరందరూ కలసి దేశంలో యెక్కడెక్కడ భాండాగారా లున్నాయో యెక్కడెక్కడ తాటాకులపుస్తకా లున్నాయో అవన్నీ వెతికి ప్రపంచక చరిత్ర సరిపూర్ణంగా రాసి తీసుకరావలసింది" అని ఆజ్ఞాపించాడు. చిత్తమని పండితులంతా వెళ్ళిపోయారు.

వెళ్ళిపోయి, వెంటనే ప్రపంచ చరిత్ర రాయడానికి మొదలుపెట్టేరు. అలాగు రాత్రి పగలు తిళ్లు యెరక్క తిప్పలెరక్క ఇరవై సంవత్సరాలు కష్టపడి పూర్తిచేసి ఆ మహా గ్రంథాన్ని పట్టుకొని చక్రవర్తి దగ్గరకు వచ్చారు. ఏలాగు వచ్చారంటే — పన్నెండు ఒంటెలు, ఒక్కొక్క ఒంటెమీద ఐదు వందల గ్రంథాలు — ఆమహా గ్రంథాన్ని పట్టించికొని మహారాజు దగ్గరకు వచ్చారు.

అప్పుడు మంత్రి చక్రవర్తితో "మహా ప్రభూ ! పండితులందరూ నీయాజ్ఞ పాలించి ప్రపంచ చరిత్ర నీకోసం రాసిపట్టుకువచ్చారు. ఈ గ్రంథం ఆరు వేలసంపుటములు పట్టింది. ప్రపంచంలో ఎన్ని దేశము లున్నాయో ఆయా దేశముల చరిత్రలు భూగోళ రాజనీతి శాస్త్రములు ఆచార వ్యవహారాంశములతో నిండియున్నది. ఈ గ్రంథంయొక్క ఉపోద్ఘాతమే ఒక ఒంటె మొయ్య గలిగినంతటి బరువున్నది. సమాప్తి పర్వమును మరొక ఒంటె మొయ్యలేక మోయుచున్నది." అన్నాడు.

అందుకు చక్రవర్తి పండితులతో "మీరు పడినటువంటి శ్రమకు నేను చాలా సంతోషిస్తున్నాను. కానినాకు రాజ్యపరిపాలన తొందర్లవల్ల ఒకఘడియేనా తీరుబాటు లేకుండా వున్నది. అదిగాక నాకిప్పుడు ముసలికాలంకూడ దగ్గిరకువస్తున్నది. ఎంత

కష్టపడి చదువుదామన్నా యీమహాగ్రంధాన్ని చదవడానికి నాకు వేళెక్కడిది? అందుచేత నాకున్న తీరుబడి వేళల్లో చదవడానికి వీలయ్యేటట్టు మానవచరిత్రను సంగ్రహంగా వ్రాయవలసింది” అని ఆజ్ఞాపించాడు.

సరే అని పండితులందరూ రాజాజ్ఞ ప్రకారం మరొక ఇరవై సంవత్సరాలు తల్లక్రిందులై ఈ మారు మనుష్య చరిత్రను పదిహేనువందల గ్రంధాల్లో రాసి చక్రవర్తి దగ్గరకు తీసుకొచ్చారు. చక్రవర్తి ఆ పండితులను ఆ గ్రంధాలను చూచి “నాకిప్పటికి నడుము వంగిపోయి చేతికి కఱ్ఱవచ్చి ముసలివాడిని అయిపోయినాను. నేనెక్కడ? యీ గ్రంధాలన్నిటినీ చదవడమెక్కడ? మీరు యెలాగైనా కష్టపడి మనుష్యచరిత్రను యింకా క్లుప్తంగా రాసి తీసుకురావలసింది” అన్నాడు.

చక్రవర్తి కోరినట్టు పండితులు మరి పది సంవత్సరాలు శాయశక్తులా కష్టపడి గ్రంధమంతా ఐదు వందల సంపుటముల్లో రాసి ఒక యేనుగమీద యెక్కించుకొని రాజదర్శనానికి వచ్చారు. రాజు వారిని చూచి “నేను కాటికి కాళ్లుచాచుకొని నేడో రేపో చావడానికి సిద్ధంగా వున్నాను. మీరు రాసిన పుస్తకాలన్నీ యేలాగు చదవగలను? కాని నాకు యేలాగైనా మనుష్యచరిత్ర చదివి మరీ చచ్చిపోవాలని వున్నది. అందుచేత మీరు అతిత్వరపడి ఇంకా ఇంకా ఇ—ం—కా సంగ్రహంగా రాసి తీసుకురావలిసింది” అన్నాడు.

చిత్తమని పండితులంతా మరొక ఐదు సంవత్సరాలు అహర్నిశాలు కష్టపడి ఆ గ్రంధమంతా అతిసంగ్రహంగా ఒక్క సంపుటంలో రాసి దాన్ని ఒక గాడిదమీద యెక్కించి కోట దేవిడీదగ్గరకు తెచ్చారు. వచ్చేసరికి వాళ్లకోసం కనిపెట్టుకున్న మంత్రి “త్వరగా రండి రాజుగారిని కిందపడేశారు” అని వాళ్లని తీసుకొని రాజుదగ్గరకు వెళ్లాడు. పాపం చక్రవర్తి యీ ఘడియయో ఆ ఘడియయో అనేస్థితిలో వున్నాడు. పండితులను అమోసుకొచ్చిన గ్రంధాన్ని చూచి “అయ్యో మనుష్య చరిత్రయొక్క రహస్యం తెలుసుకోకుండా చచ్చిపోతున్నానే” అని హీనస్వరముతో అన్నాడు.

అప్పుడు ప్రధాన పండితుడు— అతడు పాపం ఏభైఐదేళ్లు యీ గ్రంధంమీద తిప్పలు మానుకొని తంటాలు పడి నేడో రేపో కళ్లుమూసుకోడానికి సిద్ధంగా వున్నాడు. అతడన్నాడు “మహారాజా! మనుష్యజీవితం యొక్క మహారహస్యం మూడు ముక్కలు. నేను మీకు ఉపదేసిస్తాను. అదేమిటంటే పుట్టుక బ్రతుకు, చావు.”

ఈ విధంగా చక్రవర్తికి చచ్చేకాలానికి ప్రపంచ రహస్యం బోధపడింది.

# పెద్దవారికంటె చిన్నబిడ్డలే జ్ఞానము కలవారు.

(శ్రీ డగం. కమలగారు.)

శీతకాలము ముగియవచ్చెను. స్లెడ్జి బండ్లవాడుక కూడ తగ్గినది. మంచుచాల వరకు కరగి చిన్నచిన్న కాలువలువలె పారుచుండెను. ఈకాలువ లన్నియు నొకపల్లపు ప్రదేశమున నిండి గుంటగ నేర్పడినవి.

ఈ గుంటకు సమీపమున నున్న యిండ్లనుండి యిద్దరు బాలిక లట జనుదెంచి యాడుకొను చుండిరి. వారిలో నొక బాలిక, చాలచిన్నది. మరియొక బాలిక కొంచెము పెద్దది. వారితల్లులు వారికి క్రొత్త వస్త్రముల నొసగిరి.

చిన్నబాలిక నీలి రంగు జుబ్బాను రెండవ బాలిక పసుపుపచ్చని జుబ్బాను ధరించెను. ఇద్దరును యెర్రని రుమాళ్ళను తలకు కట్టుకొనిరి. వారప్పుడే దేవాలయము నుండివచ్చి యీగుంట యొద్దకలసియొకరి కొకరు తమతమ బట్టలను జూపుకొని మిక్కిలిస్నేహముతో నాడుకొనసాగిరి. సుందరమైన వస్త్రములను ధరించి కాలిజోళ్ళను తీయకయే నీటిలో నాడుకొనుటకు వెళ్ళుచున్న చిన్నబాలికను చూచి రెండవ బాలిక యిట్లనెను.

"మలాషా! నీవందు దిగకుము. మీయమ్మ కోపపడును. నేను నాకాలిజోళ్ళను తీసివేసి వెళ్ళెదను. నీవుగూడతీసి వేయుము."

వారట్లేతీసివేసి జుబ్బాలు తడువకుండుగ పట్టుకొని నీటిలోనికిదిగుచుండ మలాషా చీలమండలవరకును నీరువచ్చెను.

అంతటనామె యిట్లనెను:- "అకుల్యా! ఇది లోతుగానున్నది. నాకుభయము వేయుచున్నది."

"భయపడకుము రమ్ము. అది యింతకంటె లోతుగ నుండదు."

వారిద్దరు నొకరి నొకరు సమీపించినప్పుడు అకుల్యా యిట్లనుడివెను. "మలాషా! నీటిని చిందించకుము. జాగ్రత్తగ నడువుము."

అనుచు వారాడుకొనుచుండ చిన్నబాలిక నీళ్ళను చిందించెను. అవి అకుల్యా క్రొత్తబట్టల మీదనే కాకముక్కుమీదను ముఖముమీదను గూడ పడెను. వెంటనే అకుల్యా కోపముతో మలాషాను కొట్టబోయెను. మలాషా భయముచే నీటివెలుపలకువచ్చి యింటికి పారిపోవలయునని చూచుచుండెను. అప్పు డకుల్యా తల్లి యావైపున వెళ్ళుట తటస్థించెను. ఆమె తనకుమారికను చూచి యిట్లుపలికెను.

"కొంటె దానా! నీ విచ్చట నేమి చేయుచున్నావు?" మలాషా చేయవలయు నని చేసినదని యాబాలిక పలికెను.

ఇదివినగనే యా మెతల్లి మలాషాను పట్టుకొని మెడమీద నొక దెబ్బకొట్టెను. వీధియంతయు విన బడునట్లుగ మలాషా బిగ్గరగ కేకలువేయ నారంభించెను. ఆ మెతల్లిబయటకు వచ్చెను.

"నీవెందులకు నాబిడ్డను కొట్టితివి?" అని పలికి అకుల్యా తల్లిని దూషింపసాగెను. వారినిందా వాక్యములా వీధినిమారుమ్రోగెను.

---

* టాల్‌స్టాయ్ కథ కనువాదము.

ఆ వీధిజనులందరును నచ్చటగుమిగూడిరి. పురుషులుకూడ నచ్చటకు వచ్చిరి. అది పెద్దపోట్లాటగ మారెను.

అప్పు డకుల్యా యొక్క ముదుసలి యవ్వవచ్చి "ఏమిచేయుచున్నారు? ఇట్లుచేయుట మీకు తగునా? పండుగదినమున మీరుసంతోషముతో గానం దించుటకు బదులు నిట్లనవసర కలహములను కల్పించుకొని తగవులాడుటతగునా" అని శాంతింపజేయ యత్నించెను.

ఆ ముసలి స్త్రీ మాటలు వినక పోవుటయేగాక వారామెను త్రోసివేసిరి

ఇట్లు వీరు పోరాడుచుండ అకుల్యాతనజుబ్బావంటిన బురదను తుడిచి గుంటదగ్గరకు వెళ్లెను. ఆమె యొకచిన్నరాతిని తీసికొనిగుంటయొడ్డునున్న మట్టిని దొలగించి నీరువీధిలోనికి ప్రవహించునట్లొకచిన్నకాలువను జేయమొదలిడెను. అంత మలాషాకూడ నొక చిన్నకర్రముక్కను తీసికొనివెళ్ళి కాలువను త్రవ్వుటకై యామెకు తోడ్పడెను. పురుషులుకూడ జగడమునకై యుపక్రమించుచుండ వారలను శాంతపరచుటకు పయత్నించుచున్న యావృద్ధస్త్రీ సమీపమునుండి యాపిల్లకాలువలోని నీరు వీధిలోనికి ప్రవహించుచుండెను. చిన్నకాలువ కిరుప్రక్కలనుండి యాబాలికలు పరుగిడసాగిరి.

"మలాషా! దానిని పట్టుకొనుము" అని అకుల్యా కేకలు వేయసాగెను. మలాషా సంతోషాతిశయముచే మాటలాడలేకపోయెను.

ఆప్రవాహమందు కొట్టుకొని పోవుచున్న కర్రముక్కను చూచి యానందభరితులై వారాకాలువ వెంట పరుగులిడుచు నాజన సమూహమును సమీపించిరి.

ఆబాలికలచూచి వృద్ధస్త్రీపోట్లాడువారి వంక చూచియిట్లనియె "మీకిప్పటికైనను సిగ్గువచ్చినదా? ఈచిన్నపిల్లలకారణమున మీరు పోరాడుచుండ తుదకు వారిద్దరు దానిని మరచిపోయి యెప్పటివలె సంతోషముతో నాడుకొనుచున్నారు. ఈ బాలికలు మీకంటె యెక్కువ జ్ఞానముగలవారు."

అచ్చటివారందరును వీరిని జూచి సిగ్గుపడి వారిలోవారు నవ్వుకొనుచు తమ తమ స్థానములకు మరలిపోయిరి.


చిన్న పిల్లలవలె నిష్కపట స్వభావము కలిగి మార్పు జెందువరకు మానవుడు స్వర్గసౌఖ్యము ననుభవింప జాలడు.

# విజ్ఞాన విషయములు.


(ఆర్. రంగనాధశాస్త్రిగారు.)

## ౧. వేగముగల మోటారుబండ్లు.

ప్రపంచమున నున్న బండ్లన్నిటిలో మూడు మోటారుబండ్లు మాత్రము అత్యంత



మిశరుదేశపు యువరాజు మోటారు బండి



జర్మన్ వైజ్ఞానికుని మోటారుబండి.

వేగమున పోగలిగినవి. ౧ మాల్కమ్ వైజ్ఞానికుని బండి. ఇది గంటకు ౧౬౭ మైళ్లు నడచును. ౨ జర్మను వైజ్ఞానికుని బండి. ఇది గంటకు ౧౧౬ మైళ్ళు పరువిడును. ౩ మిశరు యువరాజుది. ఇది గంటకు ౧౧౮ మైళ్ళు నడచును. యువరాజుబండికి యంత్రములు మొదలగునవి వెనుక నుండును.



నార్మన్ వైజ్ఞానికుని మోటారుబండి



స్వప్నసంచారము. Adrenalin.gland అను రసముద్రావి యొకడు పడిపోవుచున్నటుల స్వప్నమును గాంచెను. 18 అంతస్తుల మేడమీది

## ౨. స్వప్నసంచారము.

ప్రతీచ్యపండితులుస్వప్నమును శుద్ధకల్లయని సిద్ధాంతీకరించి యున్నారు. స్వప్న విషయము భోజనపదార్థము మీద నాధారపడియున్నదని వారి నమ్మకము. భోజనము వేడిచేయునదియైనయెడల శరీర మందును మెదడునందును వేడియెక్కును. అప్పుడు విచిత్రమగు స్వప్నములు గలుగుచుండును. భోజనము మంచి దయినచో శరీర మస్తిష్కములు శీతలముగ నుండును. అప్పుడు బాగుగ నిద్దుర బట్టును. పాశ్చాత్యవైజ్ఞానికులు పలువిధౌషధ ప్రయోగము వలన మానవులకు స్వప్నములు వచ్చునటుల చేయుదురు. 'Adrenalin, Pituitary' అను రసమును ద్రావించిచాల మందికిభయము, కలహము, పతనము మొదలగుదానిని గలగింపుచున్నారు.

## 3. సూర్యకిరణములు.

మానవ జీవితమున సూర్యకిరణము లెంత ప్రయోజనంబను

మాటని ర్వివాదాంశమేదా? కాని యీ విషయమెల్లరకు దెలియదు. అమెరికాను సిద్ధగు వైజ్ఞానికులు సూర్యకిరణములవలన శరీరమందలి యెముకలకుబలమును



సూర్యకిరణములయందు బాలుని ప్రతిదినము కొంతసేపుంచుచున్నారు. అందువలననే యారోగ్యము గలుగుచున్నది.



తలయందుంచుకొను నౌక విధమగు దుప్పౌన.



నిద్ర మేల్కొలుపుట కేర్పడినయల్లారము.

గలిగి శక్తియుతులగుదురని నుడువుచున్నారు. "పుట్టినప్పటి నుండియు బలహీనముగ నుండు శిశువులను ప్రతిదినము కొంతకాలము ఎండయందుంచిన యెడల శరీరమునకు దార్ఢ్యము గలుగును" అని నుడువుచున్నారు.


౪. నీళ్లయందు నడచు సైకిలు.

నీటిమీద నొకవిధముగ సైకిలెక్కి



వైజ్ఞానికుడు తాను నిర్మించిన సైకిలునెక్కి నీటియందు విహరించుచున్నాడు.

స్వేచ్ఛగా తిరుగుటకు స్వాతంత్ర్యము నొసగొ నిరి. ఇప్పుడు నాకాయుక్తనుగు ద్విచక్రి



స్మిత్తను దేశభక్తుడు అలాస్కా దేశమందు మంచుగడ్డల నతిక్రమింపుచున్నాడు.

ముల బండి నేర్పాటు చేసినారు. ఆబం డిని బొమ్మయందు గాంచవగును.

౫. దువ్వెన.

మార్కోను దేశమందొక స్త్రీయొక విధమగు దువ్వెనను సిద్ధముచేసెను. దానిని



స్మిత్తను దేశభక్తుడు, అలాస్కా దేశమునకు ప్రయాణమైనప్పటి వేషము.

నెత్తిమీద నుంచుకొనినయెడల ఏస్త్రీ యెవనిని ప్రేమించుచున్నదను విషయము స్పష్టముగ గోచరించును. ఈదువ్వెనమీద చరిత్రాత్మికమగు ప్రసిద్ధ దంపతుల చిత్రరు


వుండును. ఇది దగ్గర యుండిన కుమారి, వివాహమాడు మని కోరు యువకుల బాధనుండి దప్పించు కొనవచ్చును.

౬. నిద్రను మేల్కొలుపుట.

అమెరికా దేశంవాడు ఫోన గ్రాపుకు అల్లారమును దగిలించెను. అల్లారము వలన నుదయముననే ఫోనగ్రాపు సంగీతమును బాడును. అందువలన సహజముగ మెళు కువ వచ్చుచున్నది. ఉదయమున నే మెళుకువ రాని వారికిది యెంతి యు ఉపయోగ కరము. అల్లా రము వలననే యందలి రికార్డులు



అలాస్కా దేశమందలి తుషారమండితమగు నొక దృశ్యము.



వాగ్యంత్ర మిట్లుండును.




వాగ్యంత్రమును వైజ్ఞానికుడు రోగికి దగిలించుచున్నాడు.

వాని యంతట యవియే తిరుగును.


౭. దేశభక్తుడు.

డాక్టరు స్మిత్తను నాయన దేశభక్తుల యందగ్రగణ్యుడు. స్వదేశమును ధనస మృద్ధిగ జేయుటయే యాతనిజీవితవ్రతము అతడు తుషారమండితమగు Alaska దేశ మంగు రత్నములు లేక బంగారు గనులను గనిబెట్టవలయునను దలంపున మూడ్రండు




స్మిత్తను దేశభక్తుడు కనిపెట్టినపదుల పటము.

వత్సరములు మితిలేని శ్రమలకోర్చి యచట తిరిగెను. కాని యా యనకు నదులు గాని రత్నగర్భలగు నదులు గాని కనపడలేదు. ఒకనది మాత్రము కనుగొనెను. దానివలన



కొడక్ క్యామరాపూర్వ మిట్లుండెడిది.

భవిష్యత్తున మార్కొని దేశవర్తకము వృద్ధి యగును. మిక్కిలి ధన లాభము గలుగును.

౮. వాగ్యంత్రము.

గొంతుకందేదయిన జబ్బుగుటకు పిండగాని స్ఫోటకములుగాని వ్యాధులు గలిగి




ప్రాచీనచిత్తరువు. 1840 సంవత్సరమున కొడక్ క్యామరాద్వారమున దీసినచిత్తరువు.


నప్పుడు వైద్యులు శస్త్రచికిత్స జేయుచుండిరి. ఇందువలన రోగము నయము గావచ్చును గాని వాగ్శక్తి సంపూర్ణముగ లోపించును. కొంతమంది వైజ్ఞానికులు గలసి యొక యంత్రమును నిర్మాణమొనర్చిరి. దానిని గొంతునందుంచుకొనిన యెడల రోగులు బాగుగ మాట్లాడవచ్చును.

౯. ఫోటగ్రాఫు.


౧౦౦ నందల వత్సరములకు పూర్వమొక



౨౦౦ వత్సరములకు బూర్వము పొటగ్రాఫును కనిపెట్టిన గుమాస్తాదీసిన పొటగ్రాఫు.



1884 సం॥ తయారయిన కొడక్ క్యామెరా




నిస్తంతి పొటగ్రాఫు యంత్రము





నిస్తంతి పొటగ్రాఫు యంత్రము ఇదిని ద్వారమున బొమ్మ పంపించబడును, గైకొనబడును.

యాఫీసు నందలి గుమాస్తాయొకడు తీరిక గృహమున మనిషిని గూర్చుండబెట్టి యా
సమయము లయందు విజ్ఞానచర్చ యొనర్పు యింటికి యుండు చిన్నికంత ద్వారమున



నిస్తంతి ఫొటగ్రాఫుయంత్రము. దీనిద్వారమున బొమ్మను గ్రహింపవచ్చును.




దీనిద్వారమున ఫొటగ్రాఫులు నిస్తంత్రి పరివర్తకబలముగ చేరగలమించును.

చు ఫొటగ్రాఫును గనిపెట్టిరి. ప్రథమమున Senistised అను కాగితముమీద
నిట్లు ఫొటగ్రాఫు దీయుచుండిరి. అంధకార తీవ్రముగ వెలుతురును బ్రసరింపచేయుచుం

డిరి. అప్పు డంధకార గృహమందలి మానవుని బొమ్మ యాకాగితముమీద పడుచుండెను. ఫొటో దీయించుకొనువారు 20,25 మినిట్లు స్థిరముగ కూర్చుండి యుండవలసి వచ్చుచుండెను. నేటియభివృద్ధి యెల్లరెరింగినదే కదా?

## ౧౧. నిస్తంతి ఫొటగ్రాఫు.



నిస్తంతి ద్వారమున బంపించిన ప్రెసిడెంటు కొల్లిడ్జియొక్క ఫొటగ్రాఫు.

ఇంతవరకు నిస్తంతి ద్వారమున వార్తలను బంపుచుండిరి. ఫొటగ్రాఫులు కూడ దీయవచ్చునను విషయము వైజ్ఞానికుల కల్పనకు దట్టలేదు. మార్కొను నిస్తంతి కార్యాలయమందుండు రాజర్సు అనువైజ్ఞానికుడు నిస్తంతి మూలమున ఫొటగ్రాఫులు దీయుటకొక యంత్రమును గనిపెట్టెను. ఈనూతనయంత్రమందొక ఫొటగ్రాఫు నుంచి తీవ్రమగు వెలుతురాయంత్రము మీదికి




నిస్తంతిద్వారమున బంపించిన ప్రెసిడెంటు కొల్లిడ్జియొక్క ఫొటగ్రాఫు.


చొప్పింపవలయును. ఆవెలుతురు యంత్రములోనికేగి ప్రథమమున వైద్యుతిక పరివర్తక బలము (impulse) తర్వాత నిస్తంతి పరివర్తకబలముగ మారిపోవును. అటు పిమ్మట నా యంత్ర సహాయ్యమున నాఫొటగ్రాఫుయొక్క ప్రతిబింబమును స్థానాంతరమునకు బంపించ వచ్చును. ఈవిధముగ లండను నుండి న్యూయార్కున కనేక ఫొటోలు బంపించబడుచున్నవి.

**౧౧. క్యామెరా సహాయమున దొంగల పట్టుకొనుట.**


అనేక సందర్భముల యందు దొంగలను, హంతకులను బట్టుకొనుట యసంభవ మగును. ఇందు కొరకులో కార్డుయను వైజ్ఞానికుడొక నూతన మార్గమును గనిపెట్టెను. దొంగ యొక్క దుస్తులు వాని యంగప్రత్యంగములయందలిదుమ్ము మొదలగువానిని గైకొని క్యామెరాద్వారమునగొప్పవానిగ



దొంగను బట్టుకొను క్యామెరా.



దొంగనుబట్టుకొను క్యామెరాద్వారమున తీసిన పొటగ్రాఫు.



దొంగనుబట్టుకొను క్యామెరాద్వారమున తీసిన పొటగ్రాఫు.

నొనర్చును. దానిసహాయమున దొంగయయినది కానిది నిర్ణయించును. ఈధూళిమాలిన్యముల ద్వారమున ఇతరగతి దొంగతనమునుగూడ చెప్పగలరు.

# పౌర పుస్తకభాండాగారము *

—— —·:o:·——

సోదర మహాశయులారా!

పుస్తకభాండాగారమను సిద్ధంబిడ్డను తమరాశీర్వదించుటకు ప్రార్థించుచున్నాను.

ఇయ్యది దేశభక్త కొండ వెంకటప్పయ్య పంతులుగారిచే శీనవతియై, దివాన్ బహద్దర్ పి. సి. యతిరాజులు నాయుడుగారిచే నతి గౌరవమున పెంచబడియిప్పటికొక నామము, గృహము కలది యయ్యె.

మాంటుఫర్డు సంస్కరణలు మన దేశమున ప్రవేశ పెట్టకముందు దేశభక్త వెంకటప్పయ్యగారు శాసన సభలో తామొక గౌరవ సభ్యులుగానుండి పుస్తకభాండాగార యందు ప్రత్యేకముగా నేర్పాటు చేయించగలిగె. దానిననుసరించి దొరతనమువారు సొమ్మును పుస్తకభాండాగారములు నెలకొల్పు స్థానిక పరిపాలనా సంస్థలవినియోగార్థము ఖర్చు బెట్ట నిశ్చయించిరి. తదనుకూలముగా నట్టిసంస్థలకన్నిటికిని తెలియజేసిరి. అప్పటికి దివాన్ బహద్దర్ పి. సి. యతిరాజులునాయుడుగారు మన పురపాలక సంఘమున కధ్యక్షులుగా నుండి నిరంతరప్రజాసేవచేయుచుండిరి. వారు తలపెట్టిన పనులు ప్రజోపకారములై మిన్నుముట్టుచుం



(ఆంధ్ర కేసరి శ్రీయుత టంగుటూరి ప్రకాశంపంతులు గారు)

(గుంటూరు పౌర పుస్తక భాండాగార ప్రారంభోత్సవ సభ కధ్యక్షులు. వీరు భాండాగారమును దెరచిరి.)

ముల సహాయార్థము 20,000 రూపాయలు డెను. పరిశ్రమికాలయము నిర్మించుటకు 1920-21 సంవత్సరపు ఆదాయవ్యయపట్టిక వారుచేసిన కృషి పొగడదగినది. దానితో

---

* గుంటూరు మ్యునిసిపాలిటీవారేర్పరచిన పౌర పుస్తక భాండాగార ప్రారంభోత్సవ సందర్భమున చైయిరుమెన్ గారగు శ్రీ నడింపల్లి వెంకట లక్ష్మీనరసింహారావుపంతులుగారి స్వాగతోపన్యాసము.

కూడవారిరాజభక్తియపారము. మనసున జనించిన యారాజభక్తిని కర్మమూలముగ చూపనెంచి జయస్తంభము నొకదానిని కట్టనమకట్టిరి. ఇట్టియున్నత కార్యములు ధనములేనిది జరుగుటకల్ల. అట్టిధనము పురపాలక సంఘము నుండి సంపాదించుట దుర్ఘటము. ఆసమయ దొరతనమువారు భాండాగారముల కిచ్చెద మన్న సొమ్మునుకూడ వృథాపుచ్చక జయస్తంభముతోపాటు పుస్తకభాండాగారమును గూడ నెలకొల్పెదమని దొరతనమువారికి నచ్చచెప్పి అట్టితీర్మానముల గావించి, సూత్రముల నిర్ణయించి కార్యోన్ముఖులైరి. పరి



[శ్రీమతి ఇందిరాదేవి (శ్రీనడింపల్లి వెంకట లక్ష్మీనరసింహారావుగారి కుమార్తె) వయస్సు 11 వత్సరములు,
(ఈ బాలిక గురువుగారగు మాడభూషి వెంకట రాఘవాచార్యులుగారు,)
గుంటూరు పౌరపుస్తకభాండాగార ప్రారంభోత్సవ సందర్భమునవీణాగానమొనర్చి సభ్యుల నాహ్లాదపరచెను.]

మున ధీశాలురగునాయుడుగారు నిరాశ జెందక వారి సహజవ్యాపార సమర్థత నుపయోగించి యొకసంఘము నేర్పాటుజేసి దానికి మిరపకాయల సంఘమని నామకరణమిడి తద్ద్వారా 10,000 రూపాయలు సులువుగా పోగుజేసిరి. ఆమొత్తమును పరిశ్రామికాలయముజయస్తంభము మొదలగు నుద్యమములమీద భాగించిరి. అట్టతరుణమున శ్రామికాలయమునకు ప్రత్యేకముగా స్థలము కొనబడెను. జయస్తంభమునకు గాను పురపాలక సంఘమువారి వ్యవహారస్థలమున కెదురుగా గ్రామమధ్యముననున్న స్థలమును కూడ దొరతనమువారివదనుండి పుచ్చుకొని శంఖుస్థాపనకూడజేసిరి. ఇంకవారి యుద్యమము లన్నియు నాందోళనములేక సాగునని ప్రతివారును తలంచిరి.

సహాయ నిరాకరణోద్యమమువలన సీపుస్తక భాండాగారమునకు కలిగిన మార్పు.

తానొకటి దలచిన దైవమొకటి తలచును. ప్రపంచమునంత మహా సంక్షోభములోని దించిన ఘోరయుద్ధము సమసినది. దానివలన ప్రజలకు సౌఖ్యము చేకూరగలదని ప్రతివారును తలంచె. దానితో కూడ మాంటుఫర్డు సంస్కరణలు ప్రవేశపెట్టబడి అట్టిపై తలంపునకు బలము తెచ్చె. కాని సౌఖ్యమునకు బదులుగా జనసంక్షోభము ప్రారంభమయ్యె. ప్రజలకు దొరతనమువారియందు నమ్మకము నిర్మూలమయ్యె. మహాత్ముని ఆధ్వర్యముక్రింద మహత్తరమైన సహాయ నిరాకరణోద్యమము ప్రారంభమయ్యె. ప్రజలయం దిదివరకెన్నడులేని స్వరాజ్య కాంక్షజనించి రగుల్కొనజొచ్చె. న్యాయవాదులు వృత్తిమానిరి; బాలురు చదువులకు స్వస్తి చెప్పిరి; శాసనసభలు బహిష్కరింపబడియె. అట్టిస్వరాజ్యాపేక్ష స్థానికసంస్థల పట్టినగాని స్వరాజ్యమునకు సహాయమేర్పడదని ప్రజలు తలంచిరి. దానిననుసరించి మన పురపాలక సంఘమున కసహాయవాదులు బహుసంఖ్యాకులుగా ప్రవేశించిరి. జాతీయభావముల నీపురపాలక సంఘమునందు చొప్పించ ప్రయత్నించి, జాతీయవిద్యను ప్రవేశపెట్టిరి. దొరతనమువారిచ్చు విద్యాశాఖసహాయమును నిరాకరించిరి. ఇట్టిస్థితిగతులు దొరతనమువారికి దుర్భరమయ్యెను. జీవములేని స్థానిక సంస్థలు సజీవములగుట భయకారణమయ్యెను. పూర్వపు స్థితిగతులు పూర్తిగా వశించెను. స్థానిక సంస్థలు తేజోవంతములై విజృంభించెను. దీని ప్రతీకారము జేయదలచి దొరతనమువారు వారిచ్చుచున్న సంభావన లన్నియు రద్దుచేసిరి. దానితోబాటు జయస్తంభమునకు నిర్ణయించిన స్థలమునుకూడ దొరతనమువారు లాగికొని కీర్తిరిమించిరి. వారికి నమ్మకము తగ్గినకొలది సంఘమువారికి విముఖత హెచ్చె. మధ్య జయస్తంభము మరుగుపడియె.

## ఆకాశమునుండి పిడుగు.

అట్టిసమయమున 23-10-1920 తేదీన దొరతనమువారు, తామిచ్చిన 1500 రూపాయలు డిశంబరు మాసాంతములోగా ఖర్చుపెట్టకున్న తమసొమ్ము వాపసుజేయుమని హుకుం జారీచేసిరి. దొరతనమువారు వారుచెప్పినట్లు చేయగల సమర్థులని తెలిసి మాసంఘమువారు పుస్తకములు కొని మిగిలినరు. 300 లకు కొనదలచిన పుస్తకము లమ్మువారివద్ద నిలవయుంచిరి. అందుకు దొరతనమువారు కోపపరవశులై యిట్టి యధర్మచర్య సహింపలేమనియు తక్షణం నిలువయున్న 300 రూపాయలు వాపసుచేయుమని తీవ్రముగా వ్రాసిరి. అందుకు మాసంఘమువారు దాతె కట్టిగుణము సహజనుకాదనియు తమ కోపము నుపసంహరించుకొనుమనియు మనవిచేసిరి. కాని శాంతింపరైరి.

భాండాగారముయొక్క ప్రదేశము.

భాండాగారమునకు నిర్దేశింపబడిన స్థలము దొరతనమువారెట్లు లాగికొనిరో మనవిచేసియుంటిని. ఆస్థలమును వీడి మాసంఘమువారు విహారమునకు నిర్దేశింపబడిన స్థలమునందొకతావు తిరిగి నిర్ణయించబడినది. కాని యాస్థలము దావాలోనున్నందున ప్రస్తుతము భవనము నిర్మించుటకు వీలులేదయ్యె. అట్టి యిబ్బందులు మాసభ్యులు గ్రహించి 5-12-23 తేదిని ప్రత్యేకముగా మాకార్యాలయములోని ఒకగదిని భాండాగారమున కేర్పాటుచేసిరి. ఇంతవరకు దీనిని కారణాంతరములవలన తగుయుపయోగములోనికి తేజాలనందుకు చింతిలుచున్నాను. ఇందు షుమారు 1000 పుస్తకములున్నవి. పౌరులందరు దీని నుపయోగించుకొనవచ్చును. ఇందు ఆంగ్ల, ఆంధ్ర ఉర్దూ పుస్తకములుకలవు. స్త్రీలకుకూడ ప్రత్యేక యేర్పాట్లుకలవు.

ముగింపు.

తాముమాకు యథాశక్తి సాయము చేసి మాయీయుద్యమమును జయప్రదము చేయ ప్రార్థించుచున్నాను. ఈయుద్యమమునకు తోడ్పడి, భూరి విరాళములనిచ్చి యింతవరకు కొనసాగించిన వదాన్యులకు మాకృతజ్ఞతాపూర్వకమైనవందనములర్పించుచున్నాను. శ్రీమయునక యిచ్చటకు దయచేసినందుకు తమ కందరకు వందనశతం బర్పించుచున్నాను.

నడింపల్లి వెంకట లక్ష్మీనరసింహారావు.
(పురపాలకసంఘాధ్యక్షుడు)

# పౌరపుస్తకభాండాగారము—

ప్రారంభోత్సవ సందర్భమున సభలో చదువబడిన పద్యములు.

[ పాటిబండ్ల సూర్యనారాయణరావు పంతులుగారు ]

కం॥ శ్రీవిశ్వపాలన కళా।
ప్రావీణ్యమహాప్రభావ భాసురగాంధీ
దేవసమానుడు కరుణం।
గావుత శ్రీటంగుటూర్ప్ర కాశసుధీంద్రున్.

కం॥ పరదేశమాంధ్రభూమి।
సురలేగ దలంకువేళ జొచ్చితివాంగ్ల
స్థిరకందున్యాయ విద్యం।
గఱచితి శ్రీటంగుటూర్ప్ర కాశసుధీంద్రా!

గీ॥ ఆత్మదేశసేవనొసర్వ స్వార్థపరత
లేశమేనియునీయందు లేకయుండ
వేలొసంగెడి పదమవ లీలనిడచి।
యొనరగాంధిమహాత్మశిష్యుండవైతి॥

గీ॥ స్వీయధన సౌఖ్యములను వెచ్చించుచెప్పుడు।
దేశసంచారములుసేసి తెలిపిప్రజల
కిపు డుపన్యాసములె కాక హితముగూర్చ।
నిజముగస్వరాజ్యమునుదాని నిల్పినావు॥

ఉ॥ భూనుతిగాంధి శిష్యుడవు పూజ్యసుతుండవు దేశమాతకున్।
ఖ్యానిధివాత్మలాభమును ద్రోపిధీరుడవాత్మదేశస
న్మానమెనీకు స్వార్థమని నమ్ముచునీరతరప్రవర్తనం
బూనినటంగుటూరు కులభూష! ప్రకాశము! ఆంధ్రకేసరీ॥

( గుండు అచ్చమాంబగారు. )

మ॥ శ్రీవిఖ్యాత శుభాకరంబు సుగుణశ్రేణీవిధానంబు స।
ద్భావవ్యంగ్య పదార్థతాపలము దివ్యజ్ఞాన దీపంబువా।
ణీవాత్సల్య వరోపదేశము భవానీ దివ్యలాసంబునై।
గావ్యవృద్ధినిబొందుగాక తిరమైగ్రంథాలయం బిత్తరిన్.॥

క. శ్రీపురపాలకసంఘము
నాపాడగస్త్రీలకొఱకు గ్రంథాలయము
దీపితమై ప్రత్యేకము
శ్రీ పతికృపవెలయవిద్య జెలగెడుగాతన్॥

( ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు )

సీ॥ సకలోద్యమవ్యాప్తి కకలంకనిలయమై, శరణిచ్చుపురిము గుంటూరుపురము
తిక్కనాది మదాంధ్ర దిగ్గజేంద్ర విహార, సారభూతలము గుంటూరుపురము
దేశకల్యాణ సందేశ నిర్వహణాఖ్య, ఘోరాధ్వభూమి గుంటూరుభూమి
ఆంధ్రావని స్వరాజ్యాప్తియావేశల, మారాజధానిగుంటూరుసీమ.

తే॥ గీ॥ నాదుప్రాణంపునఖుడు శ్రీనడిమిపల్లి నరవభూవిభుడిందేల నరసలీల।
రాకయుండునె ప్రాణంపుసోకకైన, రామనగరీనరేంద్ర శ్రీరామచంద్ర॥

# ప్రసవ వేదన.

( త్రిపురాన వేంకట సూర్యప్రసాదరావు గారు )

ఎంతకష్టముతల్లి యెంతకష్టమ్మొ
నాయమ్మనీకు నెంతటి కష్టమొదవె!
పుట్టఁబుట్టినయట్టి దిట్టమున్నునువు
పుట్టతేనియతీపు లట్టుకబ్బమ్ముఁ
గడుభక్తినీకిచ్చి గణుతిగన్నట్టి
కవులఁగన్నపుడింతకష్టమ్ము లేదు - ॥ఎంత॥

దీపిఁబుట్టిన మేటిదీపారఁబల్కు
వైదవ్రాఁబల్కు టందంపుఁ గృతిని
నీకునర్పణచేసి నిన్నుఁ గైసేయు
ముమ్మూర్తులంబోలు ముగురుబిడ్డలను
గన్నప్పుడునునింత కష్టమ్ము లేదు - ॥ఎంత॥

శ్రీకృష్ణలీలం జెలగుఁ బొత్తమ్ముఁ
జిత్తమ్ములో బత్తి చిగురొత్తఁ జెప్పి
నినుధన్యఁ జేయు నా సిఱుపేద కొడుకుఁ
గన్నయప్పుడునింత కష్టమ్ము లేదు - ॥ఎంత॥

వగ్భావ కవితారసప్రవాహినులఁ
బలుపిలో కమ్ముఁ జెప్పులఁ దేల్చినట్టి
వివిధప్రబంధ సత్కృతులైన సుతులఁ
గన్ననాఁడును నింత కష్టమ్ము లేదు - ॥ఎంత॥

వంగభాషాకోమలాంగి గన్నట్టి
జగదేకవిఖ్యాతుడగు పట్టిఁ జూచి
యట్టిసంతతిఁ గాంతునని నీవు నేఁడు
పడుచున్న కడలేని ప్రసవ వేదనను
దలచినం గడుపుచుమ్మలు వాఱుఁ గట ॥ఎంత॥

భాషార్థశూన్యంబులై వీనులకును
వెగటైన మూల్గులే విననచ్చుఁ గాని
కానుపే నాటికిం గానరా దయయో
గర్భసంపదలేక కలుగునే కాన్పు
ఇంతకష్టమ్ము నీకేల మాయమ్మ
మునునీవుగన్న యాతన జాతులనదా ॥ఎంత॥

పరమేశ్వరుని కృపాగరిమమ్ము కలిమి
నట్టిసంతతియు నీకబ్బెదుం గాక
యూరకే యిటు బల్మి నుబలాట పడిన
నెంకిఁబోలిన కానుపే కల్గుఁ జూవె ॥ఎంత॥

# స్వరాజ్యము — ప్రజాప్రభుత్వము.

( మామిడిపూడి వెంకటరంగయ్యగారు ఎం. ఎ. )

మనదేశపు ప్రస్తుత కాలమందలి రాజకీయ సమస్యలన్నిటిలో స్వరాజ్య సమస్య ప్రధానమై యున్నది. స్వరాజ్యము సంపాదించుట కర్తవ్యమని నాయకులందరు ప్రబోధించుచున్నారు. స్వరాజ్య సుఖ మనుభవింప నర్హులగునట్లు మనలను తర్ఫీదు చేయుటయే తమయుద్దేశమనియు 1919 లో చేయబడిన సంస్కరణ శాసన మీవిషయమైన ప్రథమశిక్ష యనియు మనపరిపాలకులగు బ్రిటీషువారుకూడ చాటి యున్నారు. సహాయవాదులు సహాయ నిరాకరణ వాదులు, హిందువులు మహమ్మదీయులు బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులు, అగ్రవర్ణులు, నిమ్నజాతులు — దేశములోనివారందరు స్వరాజ్యమే మన పరమావధి యని యంగీకరించి యున్నారు. స్వరాజ్య లాభము పొందినపుడు పరిపాలనక్రమ మెట్లుండునో తెలుపుటకై ఈమధ్య బిసెంటు దొరసానిగారు స్వరాజ్య ప్రణాళిక నొకదానిని తయారుచేసి ప్రకటించిరి. ఎచట చూచినను స్వరాజ్యమనుమాట వినబడుచున్నది. స్వరాజ్యమనగా ప్రజాప్రభుత్వమనియు ఈప్రభుత్వమునకు ముఖ్యమగు లక్షణములు కొన్నిగలవనియు నిరూపించుటకై నేనీచిన్న వ్యాసమును వ్రాయబూనితిని.

మనదేశమునకు సంబంధించిన వ్యవహారముల నన్నిటిని మనమే ఫైసలుచేసుకొనగలిగియుండుటయే స్వరాజ్యము. ఇప్పుడు వీటినన్నిటిని ఇంగ్లండుదేశమందు కాపురముచేయుచుండు ఆంగ్లేయులు వహించుచున్నారు. మనయొక్క క్షేమమునకును ఐశ్వర్యమునకును ఏసాధనములుపయోగింపనో నిర్ణయించు పూచీ వారిదియైయున్నది. మనదేశమును రక్షించుట కెంతసైన్యము కావలెనో దేశశాంతికై పోలీసువారెందరుండవలెనో ప్రజలనుండి పన్నులమూలమున ఎంత ద్రవ్యము వసూలుచేయవలెనో వసూలైన ద్రవ్యమును యెట్లుఖర్చుపెట్టవలెనో తీర్మానించుభారము ఆంగ్లేయులదిగనున్నది. ఈవిషయములలో మనకు స్వతంత్రము లేదు. ఈపైనుదాహరింపబడిన రాజకీయవిషయము లన్నియు మనదేశమునకు సంబంధించినవి, వాటి ఫలితము మంచిదైనను కాకపోయినను అనుభవించవలసిన భారము మనది. కాని వాటిని నిర్ణయించుట యందుమాత్రము సర్వస్వాతంత్ర్యము నింగ్లీషువారి యందున్నది. మనయభిప్రాయమును సలహాలను అనుసరించి ప్రభుత్వకార్యములను జరుపవలసిన పూచీ వారికిలేదు. వారిబుద్ధికి యేది మంచిదనితోచునో దానిని చేయుటయే ఇప్పటి ప్రభుత్వము యొక్క లక్షణము.

కాని మనమిప్పుడు ఈపద్ధతి మారవలయునని కోరుచున్నాము. మనదేశమును గురించియు మన సుఖదుఃఖములను గురించియు మనకు తెలిసినట్లు ఆరువేల మైళ్ళదూరమందు నివసించుచు భిన్నజాతులవారై భిన్న మతముల నవలంబించుచు భిన్నమగు నాచారముల గలిగిన ఆంగ్లేయులకు తెలియజాలదు. ఎట్టిపద్ధతులు మనదేశమున కనుకూలించునో యేవి మన సాంప్రదాయముల ననుసరించి యుండునో మనము చెప్పగలిగియుండునట్లుగా వారు చెప్పగలిగియుండరు. ఇందుచే మన దేశపు వ్యవహారములను మనము నిర్వహించుకొనుట

సబబుగను సందర్భముగను యుక్తియుక్తముగను లాభకరముగను నుండును. ఈ నిర్వాహణమునకే స్వరాజ్యమని పేరు.

పూర్వకాలమున మనకిట్టి నిర్వాహణశక్తియు స్వాతంత్ర్యము నుండెను. అశోకుడు ప్రతాపరుద్రుడు కృష్ణదేవరాయలు అక్బరు శివాజీ మొదలగు చక్రవర్తుల కాలములో మనదేశపు వ్యవహారములను మనమే చక్కబెట్టుకొనుచుంటిమి. నూటయేబది సంవత్సరముల మనమీ యధికారమును తిరిగికోల్పోతిమి ఆ యధికారమును సంపాదించు నుద్దేశముతోడనే స్వరాజ్యోద్యమమును తలపెట్టితిమి. కానియిప్పుడు మనముకోరు స్వరాజ్యమునకును అశోకుడు మున్నగు చక్రవర్తుల నాటికాలమున మనమనుభవించిన స్వరాజ్యమునకును ప్రధానమగు భేదమున్నది. ఇప్పుడుమనము కోరుచుండునది ప్రజాధీనమగు స్వరాజ్యము. పూర్వకాలమందలి స్వరాజ్యము నిరంకుశాధిపతుల యధీనమందుండెను.

అశోకునికాలమున మనదేశపు వ్యవహారములను మనము చక్కబెట్టుకొనుచుంటిమను వాక్యములో మనము అనుమాట సార్థకమైనది కాదు. వ్యవహారములను అశోకుడొక్కడే చక్కబెట్టుచుండెను. అక్బరు శివాజీ మొదలగు చక్రవర్తుల పరిపాలన స్వభావము కూడ యిట్టిదే. చక్రవర్తికే సర్వాధికారము. మంత్రులు సేనాధిపతులు రాష్ట్రపాలురు పరగణాధీశులు మొదలగు ఉద్యోగులందరు చక్రవర్తికిలోబడి అతనియాజ్ఞల శిరసావహించుచు అతని యనుమతిమీద వారివారి కార్యముల చేయుచుండిరి. ప్రజలకువారిపై యెట్టిఅధికారములేకుండెను. అట్టిచక్రవర్తులు మనదేశమందు పుట్టి పెరిగి మనలో నొకరైయుండినందున వారిరాజ్యముకూడ స్వరాజ్యమని చెప్పుటసంభవించుచున్నది గాని నిజముగ అప్పటిస్వరాజ్యము వారిదే. అదియెంతమాత్రము ప్రజలదికాదు. మనమిప్పుడుకోరు స్వరాజ్యమిట్టిది కాదు. ఎవరో మనవారొకరు దేశమునకంతకు చక్రవర్తియగుట మననాయకులు కోరుటలేదు.

ఇదిగాక బ్రిటీషువారితో సంబంధమున్నంత మాత్రమున మనకు స్వరాజ్యముండదని అనుకొనుటకు వీలులేదు. బ్రిటీషు సామ్రాజ్యములోని ఆస్ట్రేలియా కనడా న్యూజీలాండు దక్షిణాఫ్రికాలోనగు వలసరాష్ట్రములు స్వరాజ్య సౌఖ్యమనుభవించుచున్నవిగదా! ఈరాష్ట్రములన్నిటిలో నాంగ్లేయుల అధికారము నామమాత్రమేకదా? అట్లే బ్రిటీషు వారితో సంబంధమునకును స్వరాజ్యమునకును పరస్పర విరోధములేదు. సర్వాధికారము ప్రజల యందుండుట స్వరాజ్యము. చక్రవర్తి యెవరైననేమి?

ప్రజాధీనమగు స్వరాజ్యమును సంపాదించుటకు ఈయుగమందు ప్రపంచములోని దేశములన్నిటియందు ప్రయత్నములు జరుగుచున్నవి. ఈప్రయత్నమును మొట్టమొదట అమెరికా సంయుక్త రాష్ట్రములవారు చేసిరి. తర్వాత ఫ్రాన్సుదేశములోని వారుకూడ అట్టిరాజ్యమును స్థాపించుకొన ప్రయత్నించి ప్రారంభమున పరాజయము గాంచియు తుదకు కాలక్రమమున జయముగాంచిరి. ఇంగ్లండు దేశములోని వారుకూడ ఇట్లే పందొమ్మిదవ శతాబ్దమందు ప్రజా ప్రభుత్వమును స్థాపించుకొనిరి. ఇప్పుడైరోపాఖండమందలి దేశములన్నిటియందు ఉత్తరదక్షిణ అమెరికాలలోను ఆస్ట్రేలియా ఖండమందును ఇట్టిప్రభుత్వమే జరుగుచున్నది. ఏషియాఖండమందు సయితము చైనాటర్కీ పర్షియా దేశములందీ ప్రభుత్వపద్ధతియే నెలకొల్పబడియున్నది. ఇన్నిదేశముల వారి నాకర్షించిన ప్రజాపరిపాలన క్రమమందు సుగుణములుండుట సహజము కదా?

ప్రతిదేశమందు ప్రజలనియు ప్రభుత్వవర్గమనియు రెండు భాగములుండును ప్రభుత్వవర్గములోని వారు శాసనముల గావించి వాటిని అమలులో పెట్టువారు శాసనములకు బద్ధులై నడచుకొనుచుండువారు ప్రజలు. ప్రజాశాఖ ప్రభుత్వశాఖ అను భేదము సర్వకాల సర్వదేశములందును కనబడుచుండును. కాని ప్రజాప్రభుత్వ పద్ధతిలో ఈశాఖలకుగల పరస్పర సంబంధమందు రెండు లక్షణములు

కలబడు చుండును. (1) ప్రభుత్వవర్గములోని వారిని నియామకము చేయుటకును తొలగించుటకును వారుచేయవలసిన పనులను నిర్ణయించుటకును ప్రజల శక్తి కారణముండుట మొదటిలక్షణము. అందుచే ప్రజలకహితమైనట్టియు నష్టకరమైనట్టియు కార్యములను ప్రభుత్వవర్గమునందువారు చేయుటకు వీలుండదు. ఏవైన పొరపాట్లుజరిగిన యెడల అవి బుద్ధిపూర్వకముగ గాకుండును. (2) ఒకప్పుడు ప్రజావర్గములోనున్న వారు మరియొకప్పుడు ప్రభువర్గములో చేరుటయు, నొకప్పుడు ప్రభువర్గములోనున్న వారింకొకప్పుడు ప్రజావర్గములో చేరుటయు సంభవించును ఇదియే ప్రజా ప్రభుత్వముయొక్క రెండవ లక్షణము. నిరంకుశ ప్రభుత్వమందట్టి మార్పులు జరుగుట కవకాశము లేదు. ఒకడు సింహాసనమధిష్ఠించిన యెడల యావజ్జీవము వతడేరాజుగ నుండుటయు, వానియనంతరమతని కుమారుడు ప్రభువగుటయు జరుగుచుండును. అర్హులుమాత్రమే అధికార మందుండుటయు అనర్హులు పదచ్యుతులగుటయు వీలుపడదు. ఇంగ్లండులోని ప్రస్తుత కాలపు పరిపాలనా పద్ధతి తెలిసిన వారికిది స్పష్టమగును. 1924 లో లేబరు పక్షమునకు నాయకుడగు మాక్డనాల్డు ప్రధానమంత్రియై యుండెను; కాని1925లో అతడు అధికారము కోల్పోయి ప్రజలలో నొకడయ్యెను. అతనిస్థానమున బాల్డ్విన్ మంత్రి యయ్యెను. ప్రభువులగు వారీవిధముగ నప్పుడప్పుడు మారుచుండుట చేత ప్రజలనిన కొంత బెదురునుగౌరవమునుగలవారై అధికారులు మెలగుచు తమకార్యములను న్యాయముగను సత్యముగను నిర్వహించుచుందురు.

ప్రజలసమ్మతి గలవారే ప్రభువులుగ నుందురని పైనచెప్పి యుంటిని. కాని ఎట్టి స్వల్పవిషయమందుకూడ ప్రజలందరు ఏకగ్రీవముగ నొకపక్షమే అవలంబింతురని చెప్పుటకు వీలులేదు. అభిప్రాయభేదములు తప్పవు. అందుచే ప్రజలసమ్మతియనగా అందరియొక్క సమ్మతియని అర్థము చేసుకొనకూడదు; దానికి బహుసంఖ్యాకుల సమ్మతి అనియే అర్థము. అధికసంఖ్యాకు లెవరిని నియమింతురో వారు ప్రభువర్గములోనుండుటయు, అధికసంఖ్యాకుల అభిప్రాయము ప్రకారము ప్రభుత్వము జరుగుటయు ప్రజాప్రభుత్వమని అనిపించుకొనును. ఇదియే ఆచరణానుకూలమగు పద్ధతి. ఏపనికైనను ప్రజలందరు సమ్మతింపవలయునని సిద్ధాంతము చేసిన యెడల ఆపని జరుగుట దుస్సాధ్యమగును. ఒకడైనను సరే పట్టుబట్టి దానికి విరోధముగ నడుచుకొనిన యెడల దానిని విడువవలసియుండును. నూర్గురుగల సభలో తొంబదితొమ్మిదిమంది ఒకపక్షమున్న నొకడు మాత్రము వారితో ఏకీభవించని యెడల వారువారి అభిప్రాయముల వదలుకొని అతని మాట ననుసరించి వెళ్లుట యుక్తము కాదు. అతని ననుసరించియే వెళ్లవలసి వచ్చినయెడల ప్రభుత్వము వానిదియగును గాని ప్రజాప్రభుత్వము కాజాలదు. కావున ప్రజాప్రభుత్వమనునపుడు అధికసంఖ్యాకుల ప్రభుత్వమనియే చెప్పదగి యున్నది.

అనగా, అల్ప సంఖ్యాకులు (Minority) అధికసంఖ్యాకుల (Majority) తీర్మానములకు బద్ధులైయుండుటకు సిద్ధపడవలెను. అట్టిసందర్భముననే ప్రజా ప్రభుత్వము సానుకూలముగను సార్థకముగను నుండును. కాని ఇందువిషయమై రెండుమూడంశములు గమనింపవలసియున్నది. (1) అధికసంఖ్యాకుల వలని భయముచేత గాని బెదిరింపులచేత గాని అల్పసంఖ్యాకులు లొంగిపోవుట ప్రజా ప్రభుత్వము కాజాలదు. వారి యభిప్రాయములతో తామంగీకరించకపోయినను అధికసంఖ్యాకుల మతమును శిరసావహించుట ధర్మమనియు న్యాయమనియు అల్పసంఖ్యాకులు మనస్ఫూర్తిగ నమ్మియుండవలెను. లేనియెడల నిరంకుశ ప్రభుత్వమునకును ప్రజాప్రభుత్వమునకును భేదముండజాలదు, నిరంకుశ ప్రభువులు తమసైన్యములచే ప్రజలను భయపెట్టి నిర్బంధముమూలమున వారిని వశపరచుకొను చుందురు. అధికసంఖ్యాకుల ప్రభుత్వమునకు గూడ వారిబలమే

కారణమైన యెడల ప్రజాపరిపాలన క్రమములో న్యాయమెక్కువగ నున్నదని చెప్పుటయెట్లు పొసగును? (2) అధిక సంఖ్యాకుల పక్షము అల్పసంఖ్యాకులపక్షము అప్పుడప్పుడు బలాబలములలో మార్పు జెందుచుండును. ఒకప్పుడల్పముగ నున్న పక్షము మరియొకప్పుడధికమగుటయు అట్లేయొకప్పుడధికముగ నుండునది మరియొకప్పుడల్పమగుటయు కలుగుచుండవచ్చును. ప్రతిపక్షములోనివారును వాదప్రతివాదముల జరిపి జనులలో నెక్కువమందిని తమ పక్షములో చేరునట్లు ప్రేరేపించుచుందురు. సామాన్యప్రజలు ఏపక్షము వారివాదము సమంజసమని తలతురో ఆపక్షములో నధికముగ జేరుదురు. వారివాదమయుక్తమని తోచినప్పుడాపక్షమును వదలి మరియొక పక్షమున చేరుచుందురు. ఒక ఉదాహరణమువలన నిది స్పష్టము కావచ్చును. కాంగ్రెసు సభ్యులందరు స్వాతంత్ర్యమును కోరువారే కదా? కానివారిలో రెండు కక్షలేర్పడెను. కొందరు శాసనసభలను బహిష్కరించినగాని స్వాతంత్రము లభించదనియు మరి కొందరు సభలలో చేరినగాని స్వతంత్రము రాదనియు వాదించసాగిరి. ఒకప్పుడు బహిష్కరణవాదులధిక సంఖ్యాకులుగ నుండిరి. కాని కాలక్రమమున రెండవ పక్షము వారధిక సంఖ్యాకులైరి. కావున ఏపక్షము వారుకూడ నిరాధారులై ఉండవలసిన పనిలేదు. తమవాద మొకప్పుడు చెల్లకపోయినను ఇంకొకప్పుడు చెల్లునను నమ్మకము కలిగి, అట్టి సమయము తటస్థించువరకు అధిక సంఖ్యాకుల సిద్ధాంతముల ననుసరించి వెళ్లసిద్ధులై యుందురు. (3) ఇందుచేతనే ప్రజాప్రభుత్వమునకంతకు వాక్స్వాతంత్ర్యము ప్రాణవాయువు వంటిదని చెప్పుచుందురు. ప్రభువర్గములో చేరగోరువారు ప్రజలసమ్మతిని పొందవలసి యుండును. అనగా ప్రజల క్షేమముకొరకై తామెట్టి పనుల తలపెట్టియున్నారో ఆపనులెంతటి లాభదాయకములో చెప్పుటకు వారికి స్వాతంత్ర్యముండవలెను. వార్తాపత్రికలు ఉపన్యాసములు లోనగువాటి మూలమున తమ అభిప్రాయములను వెల్లడిచేసి తమపక్షమందు అధిక సంఖ్యాకుల కభిమానముండునట్లు చేసుకొన స్వాతంత్ర్యముండవలెను. అట్లుగాక ప్రభువర్గములో నుండు పక్షమువారు తక్కినవారెవరు మాటలాడ కూడదనిగాని సభలచేయకూడదనిగాని పత్రికల ప్రకటించ కూడదనిగాని శాసించినయెడల అల్పసంఖ్యాకుల పక్షము ఎన్నటికైనను అధికసంఖ్యగలది యగుట సంభవించునుగదా? అట్టిస్థితిలో వారు అధిక పక్షమును ధిక్కరించుటకును బలాత్కారముగ వారినుండి అధికారమును సంపాదించుటకును ప్రయత్నింతురు. వాక్స్వాతంత్ర్యము సభల సమావేశపరచుటకు వలయు స్వాతంత్ర్యము ప్రజలకున్నంతవరకే ప్రజాప్రభుత్వము న్యాయముగ జరుగగలదుగాని లేనియెడల నిరంకుశ ప్రభుత్వముండునటె అధికారవర్గమందుండువారు తక్కినవారిని బాధించుట సంభవించును. (4) దీనిని బట్టి రాజకీయ కక్షలు జాతిపైగాని మతముపైగాని ఆధారపడియుండ కూడదని స్పష్టము కాగలదు. రాజకీయ విషయముల గురించిన అభిప్రాయ భేదములను బట్టి కక్షలేర్పడవలయును గాని మతమును బట్టియుండ కూడదు. మనదేశములోని హిందువులందరొక పక్షముగను మహమ్మదీయులందరు మరియొక పక్షముగను ఏర్పడి రాజకీయ విషయములయందు వాదవివాదములుగలవారైరి. తామధిక సంఖ్యాకులగుటచే తాము చెప్పిన ప్రకారము అల్పసంఖ్యాకులగు మహమ్మదీయులు నడుచుకొనవలయునని శాసించుట ప్రజాప్రభుత్వ పద్ధతికి విరుద్ధము. దేశమందు మతవిప్లవముగలిగినగాని మహమ్మదీయు లధిక సంఖ్యాకులెన్నటికిని కాజాలరు. ఎన్నటికిని ప్రభువర్గములో చేరుటకు వారి కవకాశముండదు. ఇట్లే బ్రాహ్మణేతరు లందరొక పక్షముగను బ్రాహ్మణులొక పక్షముగను ఏర్పడిన యెడల తమకెన్నటికిని అధికారము రాజాలదని బ్రాహ్మణులు రాజకీయవిషయము లందు విముఖులై, దేశాభిమానముకన్న కులాభిమాన

హెచ్చువగ గలవారై ప్రవర్తించుట సంభవించును. అట్లుగాక రాజకీయ కక్షలకు రాజకీయ విషయము లందుగల అభిప్రాయ భేదములు కారణములై యుండవలెను. మద్యపానము నిషేధింపదగినదని అందరును అంగీకరించుచున్నారు. కాని కొందరు నిర్బంధముగ ప్రభుత్వమువారి శాసనముల మూలమున దానిని నిషేధింపవలయునని చెప్పటయు, మరికొందరు ప్రజలకు బోధించి విద్యమూలమున దానిని నిషేధింపవలయునని యు చెప్పుచున్నారు. నిర్బంధనిషేధముకొరకు వారందరు ఒక కక్షగ నేర్పడినయెడల అందులో మహమ్మదీయులు క్రైస్తవులు హిందువులు చేరవచ్చును; నిర్బంధ మిష్టపడని కక్షలోకూడ వివిధమతముల వారు నుండవచ్చును. అట్లుండినపుడే ఒక్కొక్క పక్షము వారివాదమునకు బలముకలుగును; లేనియెడల ఏపక్షమువారుగూడ గెలుచుట కష్టసాధ్యమగును.

కావున జాతిమత వర్గవిచక్షణలేక దేశములోని ప్రజలందరు కలిసిమెలిసి తిరుగుచు నిజమైన సోదరభావముతోడను దేశాభిమానముతోడను ప్రవర్తించుచుండునపుడే ప్రజాప్రభుత్వము సార్థకము కాజాలును; అప్పుడే అధికసంఖ్యాకులపై నధికారము చెల్లించుట యుక్తియుక్తముగ నుండును. ప్రజాప్రభుత్వ సూత్రములలో నిదియే మొదటిదియు ముఖ్యమైనదియు. దీనిని గమనించనియెడల దేశమందు పేరునకు ప్రజాప్రభుత్వ ముండునుగాని నిజముగ నిరంకుశ ప్రభుత్వమే జరుగుచుండును.

## II

ప్రజాప్రభుత్వము అధికసంఖ్యాకుల ప్రభుత్వముగ (Representative government) కూడ పరిణమించియున్నది. అనగా దేశములోని ప్రజలందరు ఒకసభలో సమావేశమై మంచిచెడ్డ లాలోచించి శాసనములచేసి వాటిని స్వయముగ నమలులో నుంచుటకు బదులు తమతరఫున ప్రతినిధుల కొందరిని ఎన్నుకొని వారిమూలమున పరిపాలనము జరుపుటయని అర్థము. కోట్లకొలది ప్రజలగలిగినట్టియు అధిక విస్తీర్ణముగలిగినట్టియు ఇప్పటి రాష్ట్రములందు మరియొక విధముగ ప్రజా ప్రభుత్వము ఆచరణయోగ్యము కాజాలదు. కోట్లకొలది ప్రజలొకచోట సమావేశమై నిశ్చలచిత్తముతో రాజకీయ విషయము లాలోచించుట ఎట్లు? వందలకొలది మైళ్లదూరమందు కాపురము చేయుచుండు వారు వారివారి నివాసములవదలుకొని సభలో చేరుట సాధ్యము కాదుగదా? అందుచేతనే వారు వారితరఫున ప్రతినిధుల నెన్నుకొని వారిచే ప్రభుత్వము చేయించుట ఆవశ్యకమగుచున్నది. దేశములోని రాజకీయ సభలన్నియు ఈకాలమున ప్రతినిధులసభలే. మనదేశమందట్టివి యెన్నియో యున్నవి. దేశమున కంతకంతకు సంబంధించిన విషయముల నాలోచించుటకు సామ్రాజ్య శాసనసభయు, రాష్ట్రవిషయముల నాలోచించుటకు రాష్ట్రసభయు (Provincial legislature) జిల్లా తాలూకా గ్రామ పౌరవిషయముల నాలోచించుటకు జిల్లాబోర్డు తాలూకాబోర్డులు గ్రామ పంచాయతిలు మునిసిపల్ సభలు ఉన్నవి. ఇందుండువారిలో చాలభాగము ప్రజలచే నెన్నుకొనబడిన ప్రతినిధులు. ప్రజాభిప్రాయము నెరిగి దానిని వ్యక్తపరచి దానిననుసరించి పరిపాలన కార్యమును జరుపుటకుగాను ఈప్రతినిధులు నియమింపబడి యున్నారు. రాజ్యమంతయు ఇట్టిప్రతినిధుల అధీనమందుండుటచే ప్రజాప్రభుత్వమనగా ప్రాతినిధ్య ప్రభుత్వమని స్పష్టమగుచున్నది. ఈప్రాతినిధ్య ప్రభుత్వము జయప్రదముగను ప్రజాభిప్రాయానుసారముగను జరుగవలయుననిన ప్రజలయందు కొన్ని గుణవిశేషము లుండవలెను. ఏదేశములందా గుణము లధికముగ నుండునో వాటియందు ప్రజాప్రభుత్వము లాభకరముగను, ఏదేశములందవి అల్పములుగ నుండునో వాటియందా ప్రభుత్వము లాభకారి కాకయు నుండును. ఆగుణము లేవియో విమర్శించి తెలుసుకొనుట మనకావశ్యము.

తగిన వారిని ప్రతినిధులుగ నెన్నుకొనుటయు, యెన్నుకొనబడిన ప్రతినిధులు వారి కార్యములను చక్కగ నెరవేర్చుచున్నారా లేదాయని పరీక్షించుటయు ప్రజాప్రభుత్వముగల దేశములోని ప్రతిమనుష్యునికిని విధియైయున్నది. ఈవిధిని ఉత్సాహముతోడను తెలివితేటలతోడను నిష్పక్షపాతముగను

న్యాయముగను నిర్వహించుటకు కావలసిన అర్హత ప్రతి మనుష్యునియందు నుండవలెను. ఇట్టి అర్హత యుండునని యూహించియే ప్రజాపరిపాలనము తక్కిన పరిపాలన విధానములకంటె నుత్తమమైనదని శాస్త్రకారులు సిద్ధాంతము చేసిరి. ఈ అర్హత సామాన్యజను లందరికి యున్నదా లేక ప్రతిదేశమందును కొందరికి మాత్రమే యున్నదా? కొందరికి మాత్రమే కలదని నిశ్చయించిన యెడల ప్రజాప్రభుత్వ ముత్తమమైనదని నిరూపించుట కష్టమగును; అంతేగాక అట్లు నిరూపించు సిద్ధాంతములన్నియు సత్యమునకు దూరములని చెప్పవలసివచ్చును. అనగా జనసామాన్యముయొక్క ప్రకృతి యెట్టిదో దానినిబట్టి ప్రజాపరిపాలనము మంచిదగుటయు కాకపోవుటయు సంభవించును. మనుష్యస్వభావ మెట్టిదో నిర్ణయించుటకు తగిన అవకాశ మిప్పుడు చాలదు. అది చాల గూఢమైనట్టియు కష్టమైనట్టియు విషయము. ప్రస్తుతాంశమునకు సంబంధించిన భాగములను మాత్రమిచట విమర్శించెదను.

రాజ్యాధికారమంతయు పూర్వకాలమున మనదేశమందువలె నొకరాజునందుమాత్రము సంక్రమించియున్నప్పుడు ప్రభుత్వశ్రేష్ఠత అతని తెలివితేటలబట్టి నిర్ణయమగుచుండును. సామాన్య మనుష్యుల అర్హతానర్హతలంత ప్రధానములు కావు. అతడొక్కడు తెలివిగలవాడైన యెడల శక్తి సామర్థ్యములు కలిగినట్టియు నీతికోవిదులైనట్టియు నేర్పరులైనట్టియు మంత్రుల నుద్యోగమందుంచి వారిమూలమున కార్యమును నిర్వహించుచుండును. అప్పుడు దేశము బాగుపడును. అట్లుగాక అతడు తెలివిహీనుడగుటచేతనో మదాంధుడగుటచేతనో యుక్తాయుక్తముల నెరుగక అయోగ్యులను అధికారమందుంచినచో రాజ్యము క్షీణించును. కాని ప్రజాప్రభుత్వవిధానములో రాజుయొక్క స్థానమున ప్రజలుందురు; రాజు చేయుచుండు పనులను ప్రజలే చేయుచుందురు. రాజు మంత్రుల నియమించినవిధమున తామే మంత్రుల నియమించవలసియుండును. ప్రజాప్రభుత్వమనగా బహుసంఖ్యాకుల ప్రభుత్వమని ఇదివరకే చెప్పియుంటిని. దేశము బహుసంఖ్యాకుల గుణాగుణములు ప్రభుత్వశ్రేష్ఠతకు ఆధారమై యుండును. ప్రతిదేశమందును ఎవరో కొందరు విద్యావంతులుగను, బుద్ధిమంతులుగను, న్యాయదృష్టి గలవారుగను నుందురు. అట్టివారి సంఖ్య స్వల్పము. జనసామాన్య మందరిలో కూడ విద్యయు బుద్ధియు న్యాయదృష్టియు నుండినగాని తగిన ప్రతినిధుల నెన్నుకొనుటయు, ప్రతినిధులు చేయు పనిని చక్కగ పరీక్షించుటయు సంభవించదు.

ప్రజాప్రభుత్వము చక్కగ జరుగవలయునన్న దేశములోని ప్రతి సామాన్యజనుని (Average citizen) యందు క్రింద చెప్పబడు గుణములుండవలయును. (1) జ్ఞానము. ప్రతినిధులను ఎన్నుకొనవలసివచ్చినప్పుడు అభ్యర్థులనేకులుందురు. ప్రతి అభ్యర్థియు తానే యోగ్యుడనియు, తన అభిప్రాయముల ననుసరించినపుడే దేశమునకు క్షేమము ఐశ్వర్యము కలుగుననియు అందుచే ప్రజలు తన్ను ఎన్నుకొనవలయుననియు చెప్పుచుండును. ఈ మాటలను విమర్శించుటకు వలయుజ్ఞానము ప్రతిఓటరుకు (voter కుండవలెను. అదిలేనప్పుడు అతడు తనవిధిని నెరవేర్పలేనివాడగును. ఎవరికో ఒక అభ్యర్థికి అతడు వోటుఇచ్చినను అది ఇతరుల ప్రోత్సాహమున ఇచ్చినవాడే అగును గాని స్వయముగ ఇచ్చినవాడు కాజాలడు. వోటుఇచ్చుటకు తగినజ్ఞానము అతనికి లేనప్పుడు ప్రభుత్వములో నతడు పాల్గొనుచున్నాడని చెప్పుట కెట్లు వీలుపడును. అట్టివారికి వోటునిచ్చు అధికారమున్నను లేకపోయినను నొకటే. అట్టిజ్ఞానహీనులు దేశమందలి ప్రజలలో నధిక సంఖ్యాకులైనయెడల నిజముగ ప్రభుత్వము వారిది కాజాలదు. వారిజ్ఞానహీనతను పురస్కరించుకొని తమయిష్టానుసారముగ వారిచే వోట్లను ఇప్పించు పలుకుబడిగలవారే దేశమును పాలించుచున్నారని చెప్పవలసి వచ్చును.

ఇదిగాక రానురాను ప్రభుత్వమువారు చేయవలసిన కార్యము లధికములగుచున్నవి. వాటియొక్క స్వభావమును తెలుసుకొనుటకును వాటికి సంబంధించిన మంచిచెడుగుల నిర్ణయించుటకును పూర్వము

కంటె ఇప్పుడు ఎక్కువజ్ఞానము కావలసి యున్నది. సామాన్యులందరు కూడ ఇట్టి జ్ఞానమును సంపాదించినగాని శాసనసభలలో తమ ప్రతినిధులు చేయు పనులను, వారువ్యక్తపరచు అభిప్రాయములను చక్కగ పరీక్ష చేయగలిగి యుండరు. అందుచే ప్రతిమనుష్యునికి విద్యయు లోకానుభవమును ఉండవలెను. అవియున్నప్పుడే వోటరుగ తాను చేయవలసిన పనులను చక్కగ చేయగలిగి యుండును.

(2) ప్రతివోటరుకు జ్ఞానమేగాక వివేకము కూడనుండవలెను. అనగా, యుక్తములను అయుక్తములనుండియు సత్యమును సత్యముకాని దానినుండియు, మంచిని చెడుగు నుండియు వేరుపరచగల శక్తి సామాన్యజనుని కుండవలయును. గ్రంథపరిచయము కలిగి విశేషజ్ఞానము సంపాదించిన వారికి గూడ ఇట్టివివేకముండుట కష్టము. ఈకాలమున రాజకీయ విషయము లనేకముఖములుగ చర్చించబడుచున్నవి. వార్తాపత్రికల ద్వారా కొందరు తమ అభిప్రాయములను ప్రకటింతురు. ఒక పత్రికలోని అభిప్రాయములకును మరియొక వానిలోని అభిప్రాయములకును పరస్పర విరోధ మగుపడుచుండును. రెండుమూడు పత్రికలను చదివినగాని వ్యవహారము లెట్లు జరుగుచున్నవో తెలుసుకొనుటకు వీలుండదు. అభిప్రాయ భేదములు గల ఈపత్రికలవలలో దేనిని గ్రహించుట దేనిని త్యజించుట? ఇట్లే ఉపన్యాసకు లనేకులు బయలుదేరుచుందురు. ఒకరొక సిద్ధాంతమును ప్రతిపాదింతురు, మరియొకరు దానిని ఖండించుచుందురు; వేరొకరు ఈరెండుకాదని మరియొక సిద్ధాంతమును చెయుదురు. వీటిలోని గుణాగుణములను పరిశీలించుటకును తగినజ్ఞానము వారి కుండవలయును గదా? ఇట్టిదేశమందు రాజకీయ కక్షల నేకములున్నవి. ఒకకక్షలో తమవాదమే క్షేమకరమని చెప్పుచుందురు; మరియొకపక్షమువారు మరియొకదానిని బహూకరించుచుందురు. ఇట్లు నానాముఖముల నుండి- వార్తాపత్రికలో వైపు- సభలలో మాట్లాడువారు మరియొక వైపు అభిప్రాయవర్షము వోటర్లను జనసామాన్యముపై కురియుచుండును, కొందరావర్ష బాధను సహింపలేక విసిగి ఎందులోకూడ మంచిలేదని రాజకీయ విషయములను విముఖులగుదురు; మరికొందరు వాటిలోని గుణాగుణములను తెలియజాలకుందురు. తెలిసికొనదగినవారి సంఖ్యచాల తక్కువకాని, ఈవర్షబాధ కోర్చి, తమవివేకము నుపయోగించి, దేశమున కుపచరించు వాదములను స్వీకరించి తక్కిన వాటిని త్యజించుటకు ఎలయు వివేక మెంతంటి అధిక సంఖ్యాకులలో నుండిన అంత జయప్రదముగ ప్రజాప్రభుత్వము జరుగగలదు. ఇప్పుడు మనదేశములో ఎందరికిట్టి వివేకమున్నది?

(సశేషము)

# ఋషిత్వము – కవిత్వము.

---

(పండిత శివనాథశాస్త్రి గారు.)

"ఋషయో మంత్ర ద్రష్టారః"

మంత్రముల దిలకించిన వారిని ఋషులని మనపూర్వులు నిర్వచించియుండిరి. వేద మంత్రముల గాంచి వారనిన యర్థమేమి? వేదములపౌరుషేయములు; బ్రహ్మముఖ వినిస్సృతములు. బ్రహ్మముఖవినిస్సృతమగు జ్యోతిర్మయ మంత్రములయం దేమంత్రము గాంచిన ఋషిపేర నామంత్రము బరగుచున్నది. కావున ఋషులు వేదమంత్ర రచయితలుగారు; ద్రష్టలు. ఇందలి సూక్ష్మార్థమేమి? వేదమంత్రములయందు సంగర్భితములై యున్న తత్త్వమును ఋషులు దివ్యదృక్కుల దర్శించియుండిరి. కానియది విచారలబ్ధముగాదు; అనుమానప్రసూతమునుగాదు; శ్రుతిప్రాప్తమునుగాదు. సాక్షాత్కారోపలబ్ధి. సాక్షాత్కారమగు సత్యము మహత్తరమైనదిగదా? దీనినే జ్ఞానమని యందురు. సాధారణముగ మనము జ్ఞానమనిదలంచునది జ్ఞానాభాసగాని జ్ఞానముగాదు. సత్యము-మానవుని మనము రెంటియొక్క సాక్షాద్యోగమువలన బుట్టునదియే జ్ఞానము. మానవుడు పరోక్షజ్ఞానము లేక జ్ఞానాభాసతోడ సంసారయాత్రను గడుపుచున్నాడు. మనము జడవిజ్ఞానసంబంధమగు ననేకతత్త్వము లెరుంగుదుము. వానినిగూర్చి నిరంతరము జెప్పుచుందుము. కాని వీనియందెన్నిటిని పరీక్షద్వారమున ప్రత్యక్షమొనర్చుకొని యున్నాము. 'ఫ్యారాడే' 'కెండెల్' యనువారనేకవిషయముల దర్శించియుండిరి. అందువలన వారారాజ్యమందు ఋషులు. మధ్యాకర్షణశక్తియొక్క నియమమెల్లప్పుడున్నది. కాని యీ విషయమును దర్శించినవారెవ్వరు? న్యూటనుదర్శించెను. అందువలన నా విషయమునం దాతడు ఋషి.

ఆధ్యాత్మతత్త్వ విషయములు గూడ నిట్లులనే గ్రహింపవలయును. ఆ కాలమున దేవాంశసంభూతులని విశ్వసించువారి చిత్తరువులు చిత్రించునప్పుడు మస్తకముచుట్టు దివ్యజ్యోతిర్మండలమును రచింపుచుండిరి. దేవాంశ సంభూతులగువారి దేహములనుండి దివ్యజ్యోతిపుంజములు వికీర్ణమగుచుండుటను యోగనేత్రముల దర్శింపుచుండిరి. అవ్యక్తమగు దివ్యజ్యోతి కిరణములవలననే మానవకోటి వారికి వశమగుచుండెను. అట్లులనే ససీమాన్వితమగు జడ జగత్తునందే జ్ఞానము బ్రజ్వలింపుచున్నదో - ఏజ్ఞానము సూత్రరూపమున మనచింతాపటమునం దనుభ

ణము ప్రతిఫలించుచున్నదో-ఏజ్ఞానము జగత్తు దిక్కునుండిచూచిన హద్దులు గలిగియుండునో- ఆ జ్ఞానమునకు నలుదిక్కుల ననంత దివ్యజ్యోతిర్మండలము జుట్టుకొనియున్నది. అందువలననే నది నిరంతరము మనల నాకర్షించుచున్నది.

మనము పరిచ్ఛిన్నమగు భూమండలమును గ్రహించుటకు బ్రయత్నించునప్పుడు అపూర్వమగు అపరిచ్ఛిన్నాభాసము సర్వత్ర మనకు బొడగట్టుచున్నది. కావుననే జ్ఞానము మీదమనకుమిక్కుటమగుప్రీతి. పూర్ణచంద్రుని చూడ నీలాకాశమును దిలకింపుచుందుము. నీలాకాశము చుట్టియుండుటవలననే చంద్రుడపూర్వసౌందర్యమున నలరారుచున్నాడు. నీలాకాశమునుండిపూర్ణచంద్రునిగాని, పూర్ణచంద్రునినుండి నీలాకాశమునుగాని విడదీసి భావించినయెడలనాసౌందర్యముండునా? అతీంద్రియజ్ఞానపదార్థముయొక్క ఛాయ ఇంద్రియగ్రాహ్యమగుజడజగత్తునుజుట్టి యుండుటవలననే మనకపూర్వానందముగలుగుచున్నది. సూర్యోదయ సూర్యాస్తమయ సమయముల యందలి యరుణకాంతియు సంధ్యారాగము మనల పరవశుల జేయుచుండుననుటయం దాశ్చర్యమేమున్నది? సూర్యోదయ సూర్యాస్తమయములయందాక ఛందము- లయ-నియమము- మొదలగునవియున్నవమనప్పుడాయానందము వేయిరెట్లభివృద్ధిగాంచుననుట యతిశయోక్తి కాదు. ద్యులోకమునందు గ్రహచక్రమునకు గతినియమము మొదలగునవియెట్లేర్పడినవను ప్రశ్నగలిగి దార్శనికులు జగత్తత్త్వమును బరిశీలించి యనంతజ్ఞానశక్తి పారావారమందు బ్రహ్మాండములు బుద్బుదప్రాయములుగ భాసిల్లుచున్నవని నుడివియున్నారు. బ్రహ్మాండముల బహిఃరూపమాయనంతశక్తిజ్ఞానముల బహిఃప్రకాశముమాత్రమేను. ఈ విషయమును గూర్చియే భగవద్గీతయం దిట్లున్నది. "పరిచ్ఛిన్నమగు సమస్తపదార్థములు నిత్యమును నశరీరియగు ఆత్మకు దేహస్వరూపములు."

జ్ఞానులు తర్కవిచారముల ద్వారమున నిర్ణయించిన దానిని సాధారణమానవులెల్లరు అజ్ఞాతమగను పరిచ్ఛన్నముగను నంగీకరింపుచున్నారు. దానిని దివ్యచక్షువుల ద్వారమున ఋషులు దర్శించిరి. అందువలననేవారుమంత్రద్రష్టలు. మనయందపరిస్ఫుటముగ నున్న దానిని మనము జూచియు జూడనివారివలెనే యున్నాము. కాని ఋషులు దానిని దివ్యనేత్రముల పరిస్ఫుటముగ గాంచి యున్నారు. అదియే వారి ఋషిత్వము. "చర్మచక్షువు లాకాశమందలి విస్తృతపదార్థములను చూడగలిగినటులనే సూరిగణము విష్ణు (సర్వవ్యాపియగు పూరుషుడు) పదమును గాంచియున్నారు." అని వేదముల యందున్నది. ఇదియే ఋషిత్వమునకు ప్రథానలక్షణము. కాని నిరంతరము మనమజ్ఞాతానుసారముగ గమనింపుచు-ఊహించుచుండుదానిని విప్పిచెప్పుట మహత్తర కార్యమా యనియు, అట్టివారిని సమున్నత పీఠమున గూర్చుండబెట్టి ఋషులని బలువవలయునా యని కొందరు శంకింపవచ్చును. అపరిస్ఫుటమగు దానిని పరిస్ఫుట మొనర్చు కార్యము మహత్తరమనుటకు సందియములేదు. బలువగు వస్తువు నెగురవేసిన యెడల నది క్రింద పడుటను

18

విషయ మెవరికి దెలియుదు? కాని సమస్త మానవుల చింతనము--కార్యములయందిమిడి యున్న నియమముయొక్క విశ్వవ్యాపకత్వమును స్ఫుటను గాంచియుండెను. కావున ఆవిషయమున అతడు ఋషి పదవాచ్యుడు. పరిచ్ఛిన్నమును చుట్టి యుండు అపరిచ్ఛిన్నవిషయము మన కజ్ఞాతసారముగ గోచర మగుచునే యున్నది. జ్ఞానవస్తువును మనము ధారణ జేయ జాలము. కాని ఋషులీ విశ్వవ్యాపియగు జ్ఞానవస్తువును దివ్యచక్షువుల గాంచియున్నారు. అందువలననే వారికి ఋషిపదము లభించినది. సమస్త మానవులకు జడజగత్తు సంబంధమగుజ్ఞానము కొంచెముగనో గొప్ప గనో యున్నది. జడరాజ్యమందలి శక్తియొక్క వివిధక్రీడలను గాంచుచునే యున్నారము. కాని జడముతోడ జడాతీతమును - ఇంద్రియాతీతమగు జ్ఞానవస్తు సాక్షాత్కారము గానియెడల జ్ఞానముసంపూర్ణముగాదు. దీనికొక యుపమాన ముపనిషత్తులయం దిట్లు చెప్పబడినది. వీణానినాదమును, వీణను, వాయించువానిని చూచినప్పుడే జ్ఞానము పూర్ణమగును. నీవు వీణానినాదమును వినుచున్నా వనుకొనుము. ఆధ్వని యెచ్చటనుండి వచ్చుచున్నదనువిషయము దెలియ నప్పుడాజ్ఞానము పూర్ణము గాదు. వీణానినాదముతోడ వీణనుగూడ గాంచినప్పుడు ఆ జ్ఞానము కొంతవరకు పూర్ణమగును. వానితోడ వీణను మీటువానిని గూడ జూచినప్పుడాజ్ఞానము పరిపూర్ణమగును. అటులనే పరిచ్ఛిన్నమగు నీ జగత్తునకు వెనుకనుండు అ పరిచ్ఛిన్నపదార్థమునుగాంచినప్పుడు జ్ఞానము సంపూర్ణమగును. అ పరిచ్ఛిన్నపదార్థమును దర్శించుటవలననే ఋషులకు పరిపూర్ణజ్ఞానము గలిగెను.

మంత్రములు అగ్ని, ఉష, వాయువు, ఇంద్రుడు మొదలగు దేవతాగణము నుద్దేశించిన వగుటవలన ప్రాకృతికశక్తులమహిమను వర్ణించుటయే వేదమంత్రముల యుద్దేశమని పలువు రభిప్రాయపడుచున్నారు. కాని జాగ్రత్తగ విచారించిచూచినయెడల మంత్రము లన్నిటియందునను సర్వజ్ఞత్వము సర్వశక్తిమత్త్వాదిగుణ విశిష్టమగు నొక మహత్తరభావము దేదీప్యమాన మగుచున్నది. పరిచ్ఛిన్నము నతిక్రమించి యపరిచ్ఛిన్నమగు జ్ఞానవస్తువును గాంచువాడు కవి. దృశ్యజగత్తుయొక్క యావరణాంతర్గతమగు మహాశక్తిని దిలకించుచుండువాడు ఋషి. వేదమంత్రములయందంతటనుపరోక్షానుభూతి ప్రస్ఫుటమై విలసిల్లుచున్నది. ఋగ్వేదమందలి యొక మంత్రతాత్పర్యము నిట నుదాహరింపుచున్నాను.

"వరుణు డరణ్యోపరిభాగమునందంతరిక్షమున వ్యాపించియున్నాడు. అశ్వశరీరమునకు బలమును, గోవులదేహమందు దుగ్ధమును, మానవహృదయమందు శుభసంకల్పమును జలమం దగ్నిని అంతరిక్షమందు సూర్యుని గిరిశృంగములయందు సోమలతను గలిగించుచున్నాడు." ఈమంత్రమందు ఋషి వరుణనామమున బిలచు దేవత పరిమితిపదార్థమా? జలస్థలశూన్యములయందనంతశక్తితోడ విరాజిల్లు మహత్తరశక్తి యనుటకు సందియమేమి? జడరాజ్యమందేగాక మానవహృదయమందు శుభసంకల్పములుగలిగించు నియంతయనుటసుస్పష్టము.

ఋగ్వేదమునందలి సప్తమాధ్యాయము ౧౨౧ సూక్తమునందు ప్రజాపతియను నొక దేవతనుస్తుతించు మంత్రతాత్పర్యమిది.

"ఎవడాత్మదానమొసంగునో, బలమును గలిగించుచున్నాడో, ఎల్లరెవని యుపాసించెదరో, ఎవని శాసనమును దేవతలెల్లరు మన్నింతురో, అమృతమెవనిఛాయయో, మృత్యువెవనియాశ్రయించియుండునో అట్టి దేవుని నేనర్చించుచున్నాను."

పై మంత్రద్వయమునందు చెప్పబడిన వరుణ, ప్రజాపతియను దేవతలయందు భేదమేమున్నది? ఆ మంత్రద్వయమును దర్శించిన ఋషులు చూచినపదార్థమొక్కటియేగదా! సాధారణమానవులు ఇంద్రియగ్రాహ్యపదార్థములయందు నిమగ్నులైయుందురు. ఆతీంద్రియ జ్ఞాన సాక్షాత్కారమే ఋషుల ప్రధానలక్షణము.

తన్మయత్వమువలన ఋషులు జడపదార్థముల నతిక్రమింపగలరు. కాని తన్మయత్వమననేమి? చిత్తము విషయానంతరములనుండి విడివడి ఒక్కదానియందు తాదాత్మ్యలాభమునొందుటను తన్మయత్వమందురు. చిత్తమేకాగ్రతయందే మానవుని ప్రతిభయున్నది. జడేంద్రియ గ్రాహ్యమగువానిని మరచి లోపింపజేసికొని యింద్రియాతీతశక్తియందు మనోనివేశమొనర్చుటను తాదాత్మ్యమందురు. కాని యిది యెల్లరకు లభించునదికాదు. ఋషుల ఋషిత్వప్రణాళిక తన్మయత్వము. ఫలముద్దీపనము. ఋషుల హృదయాంతరాళమున ప్రతిఫలించి చిత్తమును దివ్యద్యోతులముంచివైచిన మహాసత్యమును వారు అపరిస్ఫుటమగు భాషతోడ వ్యక్తమొనర్చుటకు ప్రయత్నించిరి. ఫలస్వరూపముగ నది వేలకొలది మానవుల హృదయముల నుండితిరిగి ప్రజ్వలించినప్పుడు దీప్తమగుచుండును. కావున మనయందు ప్రచ్ఛన్నముగ నున్నయాధ్యాత్మిక తత్త్వమును బహిర్గతమొనర్చి ప్రస్ఫుటమొనర్చినవారు ఋషులు. మరియు వారు మనయందలి నున్నతప్రవృత్తిని మేల్కొలిపి, మన స్వరూపమును మనకెరుకపరచి, మర్త్యధామమునందే యమరత్వము నాస్వాదించునటులొనర్చి, భూమండలమునుండి యమరగిరిశృంగమునందు గూర్చుండబెట్టుచుందురు. కావున మానవుని పరిపూర్ణముగ వికసింపజేయుటయే ఋషుల కార్యము.

ఇక కవులనుగురించి యోచింతము. ఈ జగత్తునందలి సమస్త పదార్థములకు పరస్పర సంబంధమున్నది. వృక్షములకు వాయువు, వాయువునకు ఆకాశము, ఆకాశమునకు వెలుతురు, వెలుతురునకు జీవులు సంబంధముండు నటులనే జగత్తునందలి సమస్త పదార్థములకు సంబంధమున్నది. విజ్ఞానవిదులగు పండితులీసంబంధమును గమనించి పరిశీలించి యీ బ్రహ్మాండమంతయు నొక్కయఖండమనియు ఇందంతటను నొక్కనియమము- జ్ఞానము- విరాజిల్లుచున్నదనియు ప్రతివిభాగమును అఖండముయొక్క నొకయంగము లేకయంశమని నుడివియున్నారు. సృష్టియందలి ప్రతిపదార్థమును పరస్పరముపయోగపడుచు తదుచితస్థానమందు నిలచియున్నవి. సృష్టియందలి సమస్త పదార్థముల సంయోగమందే సృష్టియొక్క నిగూఢ సౌందర్యము విరాజిల్లుచున్నది.

ఈ పరస్పర సంబంధము వెనుక నొక ప్రేమాభాస మనకు బొడగట్టుచున్నది. అది యీ సౌందర్యజ్ఞానమును ఘనీభూత మొనర్చుచుండును. ఇంద్రియగ్రాహ్యమగు జగత్తును జుట్టి యతీంద్రియమగు ననంతశక్తియు, జ్ఞానమునుండునటులనే అనంత ప్రేమ చుట్టియున్నది. ఈ మహా ప్రేమే సమస్తమును వక్షస్థలమునదాల్చి యాఖండ బ్రహ్మాండముగ నొనర్చుచున్నది. జగత్తును సౌందర్యనిలయముగ జేయుచున్నది. ఈ నిగూఢ సౌందర్యమును సాక్షాద్భావమున దిలకించువాడు కవి. ఇచ్చటనే యాతనికవిత్వము. సాక్షాద్దర్శనవిషయమున కవియు, ఋషియు సమానులు. మన మనేకవిషయములయందు జగత్తునుదిలకించి యానందమున పరవశుల మగుచుందుము. కాని దానికి సరియగు కారణముమాత్రము మనకు దెలియదు. కాని కవి వాని యన్నిటికి మూలమందొక యైక్యతను ప్రేమక్రీడనుదర్శించితన్మయుడగుచుండును. కాళిదాసు రచించిన శాకుంతలనాటకమందు కణ్వమహర్షి శకుంతల నత్తవారింటికి బాపునప్పుడు ఆశ్రమమందలి తరులతల సంబోధించి యిట్లనును.

శ్లో॥ పాతుంన ప్రథమం వ్యవస్యతిజలం
యుష్మాస్వ పీతేషుయా।
నాదత్తే ప్రియ మణ్డనాపి భవతా
స్నేహేన యాపల్లవమ్ ।
ఆద్యేవః కుసుమప్రసూతి సమయే
యస్యా భవత్యుత్సవః।
సేయంయాతిశకుంతలా పతిగృ
హం సర్వైరనుజ్ఞాయతామ్ ।

చ॥ ఎవతెజలంబు మీకిడక
యెన్నడు ద్రాగదు తాను ముందుగా
నెవరితె ప్రేమచే జిగురు
దీప్తిగ భూషణ మయ్యుమీచి గు
ళ్లవతెకు మీరు తొలుసన
లెత్తుట పండువుగాగనుండు నా
ప్రవిమలగాత్రి యేగుబతి
పజ్జకు వందనుజ్ఞ యీయరే.

ఈ చిత్రమునుగాంచిన హృదయము పులకరింపదా? కానియిందలి సౌందర్య మెచ్చట. శకుంతలకును తపోవన వృక్షముల కుండు ప్రేమసంబంధ మందని సాధారణముగ జెప్పవచ్చును- కాని యీ ప్రేమ సంయోగము మనయాత్మను స్పృశించు చున్నదా? శకుంతల యొక్క కోమల ప్రకృతియు, నిస్వార్థతయు శైశవసులభమగు పవిత్రత మొదలగువానియొక్క ఆభాసమాత్రము గోచరించుచున్నది. మనస్సు సునిర్మలమైనగాని యెవ్వడును ప్రకృతిని గాఢముగ ప్రేమింపజాలడు. శకుంతలను సభ్యజగత్తునకు సంబంధించిన ధూర్తుడు- శఠుడునగు దుష్యంతు డెట్లు వశపరచుకొన గలిగెను? సుకోమల పవిత్రమగు శకుంతల హృదయమే కదా కారణము. దుష్యంతుని శకుంతల పతిభావమున సర్వస్వమర్పించ యుండెను. శకుంతల నత్తవారింటికి బంపు సందర్భముననే కాళిదాసు తనకవితామృతమును బ్రవహింపజేసెను. ఎట్టినిపుణుడగు చిత్రకారుడైనను నాలుగు గీట్లలో కణ్వ ఋషి ఆశ్రమమందలి స్నిగ్ధతను పవిత్రతను మనకు జూపింపగలడా? ఇందువలన మానవప్రకృతియందలి సంబంధము మనకు గోచరించుచున్నది. ఇక మానవులకుండు పరస్పర సంబంధమును జూపించెదను. మహాకవియగుభవభూతి ప్రేమ వర్ణనము నిట్లు వర్ణించియున్నాడు.

అకించదపి కుర్వాణః
సౌఖ్యైర్యస్తు ఖాన్యపోహతి।
తత్తస్యకిమపిద్రవ్యం
యోహియస్య ప్రియోజనః॥

ఈ శ్లోకమువలన మానవుల యందు పరస్పర ముండు సంబంధము గోచరించుట లేదా? దాంపత్య ప్రేమనుబోలిన యత్యద్భుతతర హాస్యమును జగత్తు నందెవ్వడైన సందర్శించెనా? స్థూల మతులు లఘుచిత్తులగు వారు దీనిని తేలికగ గాంచుచుందురు. భావుకుడగు కవి దాంపత్యము నందత్యద్భుతమగు ప్రేమ క్రీడను గాంచి తన్మయుడగుచుండును. ఇంగ్లీషువారిలో షెల్లీయను నాయన సుప్రసిద్ధకవి. ఆయన స్కైలార్కను దానిని రచియించెను. అదిసర్వజన ప్రశంసితము. అందలి పంక్తుల కొన్నియిట నుదహరింపుచున్నాను. స్కైలార్కను పక్షిని సంబోధించియిట్లు నుడివియున్నాడు-

In the golden lightening
Of the sunken sum,
Over which clouds are brightening,
Thou dost float and run
Like an embodied joy wheose race is just begun

ఈచిత్రవు మనోముగ్ధకరముగదా? ఆలోకతరంగములయందు పక్షినిర్గమింపుచుండెను. ఆతరళకాంతులు- ఆరక్త కాంతియుత మేఘరాజి- ఆ సాయంకాల వాయు ప్రవాహము మొదలగు నవన్నియు నా పక్షి కొరకు- దానిసౌఖ్యముకొరకేర్పడినవేగదా? ఆచిన్నపక్షితోడ నెముదయసృష్టికిగల సంబంధమెంత ఘనిష్ఠమైనది? ఆ తరళకాంతులు ఆ రక్తిమరాగరంజిత మేఘములు— వాయుహిల్లోలములతోడ యాచిన్నపక్షి కెట్టి సఖ్యము? పక్షియానందము చెప్పనదేమి? అది యానందమూర్తివలె గోచరింపుచుండుట లేదా? వీనియంకము నందుండి పక్షిబొందు యానందమును తల్లియంకమందుండు శిశువైనను బొందగలుగునా? కావున సృష్టియొక్క సమస్తపదార్థముల మూలమునందొక యపూర్వ పదార్థము విరాజిల్లుచుండుట లేదా? కాబట్టి కవి సృష్టియందలి స్థూలసూక్ష్మపదార్థముల మాత్రమే దిలకింపడు. వానిని చుట్టియుండు మహత్తరప్రేమను సందర్శించును. కాని దానిని విప్పిచెప్పడు. పాఠకుల హృదయములయందు మేల్కొల్పును. మేఘమును గురియొక కవితయిట్లు నుడివియున్నాడు.

I bring fresh showers for the thirsting flowers
From the seas and the streams,
I bear light shade, for the leaves when laid
In their noon-day dreams.

పుష్పములకు పిపాసయున్నది. మేఘము వానికొరకు నదీనదములు- సాగరము నుండి జలమును దీసికొని వచ్చుచున్నది. ఎండవేళల తరుశాఖా పత్రములయందు పుష్పము నిద్రించునప్పుడు మేఘము వానికి ఛత్రముబట్టుచున్నది. ఆహా? సృష్టిపదార్థములయందు పరస్పర సంబంధమెంతటి రామణీయకము? పుష్పముల పిపాస నివారణచేయు వ్యాకులత్వము మేఘముల కుండనియెడల మరిదేనికుండును? ఇది ప్రేమ క్రీడకాదా? ఇందుకవి హృదయముసంగెను. పాఠకులు ప్రత్యుత్తర మీయవలయును. సృష్టియందలి సమస్త పదార్థముల మూలమందున్న రహస్య సంబంధమున నుండు ప్రేమను దర్శించుటయే కవికార్యము. ఆసౌందర్యమును వర్ణించుటయే కవి కవిత్వము.

కేవలము సృష్టిపదార్థములయందు మాత్రమే పరస్పర సంబంధ మున్నదని దలంప జనదు. మానవునకును సృష్టిపదార్థములకును నత్యద్భుతమగు సంబంధమున్నది. మానవుడుగూడ ప్రకృతిని గాఢాలింగనం బొనర్చుకొనుచున్నాడు. మానవ జీవితము గూడ ప్రేమకు లీలారంగము కాదా?

ప్రతిదినమును దుఃఖక్లేశములయందు దగుల్కొని బరితపించుచుండు మనకు గ్రీష్మఋతువునందలి మలయమారుతమును బోలి సుమధుర ప్రేమానందమును గలిగించు మహాకవి మనకు స్నేహితుడు కాడా? జ్ఞానము నభివృద్ధిపరచుకొనుటకు తగిన చింతనమును గలిగించి, యనంత పరిసరోన్ముఖమగు భావముతోడ హృదయమును నింపి, ఉన్మాదకారి యగునట్టి యుత్తేజనమును బ్రాణమునకు గలిగించు కవికంటె మన కాప్తు లెవ్వరు? చిత్తోత్తేజనకరమగు భావమును కలిగించి కవి మనలను ప్రకృతిని గాఢాలింగనం బొనర్చుకొనునట్లు జేసి హృదయమును స్నిగ్ధముగను సరసముగ నొనర్చుచున్నాడు.

ఋషినిబోలి కవి ప్రతిభావికాస ప్రణాళియు తన్మయత్వము. షెల్లీ పక్షిని గాంచినంత నే యతడు పక్షియై యాపక్షితోడ-ఆ తెరళకాంతులయందు బరువిడుచుండె ననవచ్చును. తాదాత్మ్యము గలుగని యెడల నెవ్వడును ప్రకృతి సౌందర్యమునందు బ్రవేసింపజాలడు; కవిత్వము సిద్ధింపదు.

ఋషి కార్యఫలమునుబోలి కవికార్యఫలముగూడ యుద్దీపనము. మనయందు ప్రబుద్ధావస్థయందుండు సౌందర్యజ్ఞాన మాకవి సంస్పర్శమువలన ప్రస్ఫుటమగును. ప్రకృతితోడ అపూర్వమగు సఖ్యభావ మేర్పడును. భ్రాంతియుతమగు ధర్మము-శిక్ష మొదలగునవి మానవుని ప్రకృతినుండి విడదీసి దూరము గొంచు చుండును. అనింద్యమును నిండ నీయముగ జూపించును. కవి యా కల్పితభావములను నపసారితము నర్చి మానవాత్మను ప్రకృతి సాన్నిధ్యమును జేర్చును. హృదయమును మహాద్భావముతోడను నిర్మలానందముతోడను నింపివేయును.

ఇంతవరకు చర్చించిన చర్చవలన కవికార్యమునకును, ఋషికార్యమునకును సామీప్య సంబంధము గల దని దేలినది.' కావున ఋషియొకప్పుడు కవియును కవియొకప్పుడు ఋషియు నగుచున్నాడు. ఋషి పరిచ్ఛిన్నమగు జగదంతరాళమున యపరిచ్ఛిన్నమగు జ్ఞానమును, శక్తిని సందర్శింపుచుండును- బ్రహ్మాండముల యావరణము మధ్యమందొక జ్ఞానవస్తువును చూచును. కవి సృష్టియందంతటను సౌందర్యమును ప్రేమలను దిలకించును. ఈకాలమున లౌకిక పారమార్థికముల మధ్య సుస్పష్టమగు ప్రాచీర మేర్పడినది. కాని పూర్వకాలమున నట్టిది లేదు. అందువలననే యాకాలమున ఋషిత్వకవిత్వము లొక్కచోట నేయుండెను. అందువలన ప్రతిఋషియు కవియైయుండెను. ప్రతికవియు ఋషియై యుండెను.

నిరంతరము మన హృదయమున నానందమును గలిగింపుచుండుటవలన కవిని స్నేహితుడని దలంచుచున్నాము. మన జీవితమందలి స్వల్ప కార్యములు, స్వల్పచింతనములు, స్వల్పాశయముల వలన జగత్తు కొలది దినములలోనే మనకత్యంత పురాతనమైపోవును. అందువలన ప్రకృతిని దిలకించు

టకు మన మొప్పను. మనకు కవి పురాతన సత్వము-విరక్తులయందు నిత్యనూతన సత్వమును గోచరింప జేయు చుండును. వేడిగాలి కొట్టునప్పుడు గృహాభ్యంతరమున శయనించెదము. అప్పుడు పురాతన జగత్తు సహ్యముగ నుండదు. కాని శయనించినప్పుడు కోవెల కూజితము వినసగును. ఆ మృదు మధురకూజితమును వినినంతనే ప్రాణము ప్రఫుల్లమగును. జగత్తు మనోహరమై పొడగట్టును. కోకిల యొక్క మధురా రవములో మనయందు నూతన వసంతమును గలిగింపు చున్నది. ఇటులనే కవి వసంతకాల కోకిల తుల్యుడు. మనము జీవితమందలి తిక్తతామయ కార్యములనుండి మరలి కవుల మృదూక్తులపై మనో నివేశనం బొనర్చిన యెడల కవిపుంగవు డిట్లు చెప్పుచుండ వినగలము, "ఓ మానవుడా? నీవు మిత్రులయం దున్నావు? బంధుబాంధవుల తోడ నివసింపు చున్నావు! ఆహరిద్వర్ణ తరులతలు నీకు పరమబంధువులు. ఆ సునీలాకాశము, ఆ వికసిత పుష్పోద్యాన వనములు ఆశిశిరసిక్తమగు పచ్చిక బైళ్ళు మొదలగు నవన్నియు నీకు బంధుమిత్రులు. అట్టినీవు నీ మనమును కలవర పరచుకొనెద వేలను? నీగృహమందు నీవింత విరక్తితోడ కాపురము చేయు టేల? ఎల్లరతోడ గలసి మెలసి ప్రసన్న చిత్తమున కాలము గడపుము."

జగత్తుతోడ మాత్మీయత గలిగి నప్పుడు మానవునకు నీశ్వరునియందు ప్రేమ సహజముగ గలుగును. అందువలననే ఋషియు కవియు మనకు పరమ మిత్రులని నుడువు చున్నారు.

తెలుగు విశ్వవిద్యాలయ
గ్రంథాలయం
వరుస సంఖ్య 014
తేది 18-10-1984

---:o:---

## ముద్దులకు హద్దులు.

(అధికార్ల సూర్యనారాయణరావు గారు.)

ముద్దులకు నేమిటైనను హద్దుగలదె,
అనుచు పలుమారు జానకీ! అడుగనేల?
చందురునిగాంచి చెలరేగు జలధిలోన
అలలకేమైన హద్దులు గలవె బాల!
తేరిచూచుట కేమైన మేరగలదె?
అనుచు పలుమారు జానకీ అడుగనేల?
ప్రణయ మంత్రాలచే కట్టబడిన కనులు
తేరిచూచుట కేరీతి మేరగల్గు?
మానకే వేళ నెమ్మోము మరుగు సేల
అనుచు పలుమారు జానకీ అడుగనేల?
జ్వలన కుండపు హృదయాన ప్రజ్వరిల్లు
వలపు వేడిమి కేలీల చలువగల్గు?

# కుషనులు

( పాలకోడేటి వెంకట్రామశర్మ గారు. )

పహ్లవులు గాంధార దేశమున చిరకాలము రాజ్యము చేసిరి. ఆంధ్రదేశపు పల్లవరాజులు ఈ జాతికి చెందినవారే యని కొందరి యభిప్రాయము. కాని పల్లవుల నాణెములకును పహ్లవుల నాణెములకును వ్యత్యాసము గలదు. ఈపహ్లవులకు సమకాలీకులుగా నుండిన కుషనులు హిందూదేశపు పడమటి ప్రాంతములను రాజ్యము చేసి యుండిరి. వీరినామములు ఈక్రింద చెప్పబడినవి. (1)కుజుల కాడ్ఫిజెసు,(2)వేమ కాడ్ఫిజెసు, (3)కనిష్క (4)హువిష్క, (5)వాసుదేవ, లేక వాసుష్క. మాల్వ, పంజాబు, గాంధారదేశములందు వీరి నాణెములగుపడుచున్నవి. ఇందులో కొందరి నామములు చెక్కబడకపోయినను బిరుదులు చెక్కబడినవి. రాగినాణెములే కాక వెండినాణెములు కూడ వీరిబిరుదులతో లభించినవి.

రాజతరంగిణియందు కనిష్క, హువిష్క వాసుదేవుల నామములు చెప్పబడెను. కాని వారినిగూర్చి మితముగా తెలుపబడియె. వీరు తురష్క జాతికి జెందిన వారలని అందు చెప్పబడెను. వారిదుస్తులు తురుష్కులను బోలియుండెననుటలో సందేహము లేదు. ఈముగ్గురు మాత్రమే హిందూదేశభూములను స్వాధీనపఱచుకొని రాజ్యము చేసిరని తెలుసుకొనవలసియున్నది. వేమ కాడ్ఫిజెసుయొక్క నాణెములు అలహాబాదు ప్రాంతములవరకు గనపడుచుండుటచేతను అతని నాణెములపై ఒకవైపున గ్రీకుదేవతల యొక్కయు రెండవవైపున హిందూదేవతల యొక్కయు విగ్రహములు చెక్కబడుటచేతను అతడు హిందూమతమును స్వీకరించినటుల తెలిసికొనవలసియున్నది. మహాభాష్యగ్రంధకర్తయగు పతంజలి శకయవనులను శూద్రులని చెప్పుటచే ఈరాజ్యములందలి ప్రజలు క్రీ. పూ. రెండవ శతాబ్దమునుండి హిందువులుగా నుండినటుల తెలిసికొనవలసియున్నది. మఱియు ఈవేముడు మహారాజను, రాజాధిరాజను, సర్వలోక ఈశ్వరను, మహేశ్వరను, హిమకాడ్ఫిజను త్రాదత, నామాంకితుడైయుండుటచే శివభక్తకోటిలో జేరిన మాద్రజాతికి చెందియుండవలయు. పూర్వకాలమున ఇతరులను హిందూమతమందు జేర్చుకొనువలవాటుండుటచే నిట్లు వేముడు హిందూ శూద్రునిగా పరిగణింప బడెను. ఇటులనే గ్రీకు మినాండరు, మిలిండ నామముతో హిందూబౌద్ధునిగా మనవారంగీకరించియుండిరి. బంగారు నాణెము నములలో బెట్టిన చక్రవర్తులలో నితడు ప్రధముడనిపలువురు చెప్పెదరు. ఇటులనే మిగిలిన ముగ్గురును గ్రీకు దేవతలతో పాటు హిందూదేవతలను గూడ తమనాణెములందు చెక్కించిరి. కనిష్కులు బౌద్ధమతమును స్వీకరించి మహాయాన బౌద్ధమతమును విజృంభింప చేసెను.

వీరి కాలము— వీరి కాలపు శాసనములు పెక్కులు మనకు లభించినవి. ఇవిముఖ్యముగా బౌద్ధుల యుపయోగార్థము చెక్కబడెను. అవిఎక్కువగా మథురప్రాంతమున గలవు. సాంచిశాసనమందు వాసుదేవుడు 78 వ సంవత్సరమున రాజ్యపాలనము చేయుచుండె నటుల తెలుపుచున్నది. బ్రాహ్మణులకై శాసనము లేమియు చేయబడలేదు. కనిష్కుని అయిదవసంవత్సరము మొదలు వాసుదేవుని రాజ్యకాలము 98వరకు ఈశాసనములు చెక్కబడియుండెను.

ఇదివరలో కనిష్కుడే శకసంవత్సర మును కనిపెట్టెనని పలువురు చరిత్రకారులు భావించి యుండిరి. ఆ యుద్దేశము రాను రాను మారుటకు ప్రారంభించెను. కాని శక సంవత్సరము కనిపెట్టినది కనిష్కుడు కాడు. కనిష్కుడు కుషనువంశస్థుడు గాని శాకవంశస్థుడు కాడు. అతడు కుషను శకమును స్థాపించెను. ఆశకము ఎప్పుడు ప్రారంభమైనదియు తెలిసికొనుట దుస్తరముగానున్నది. హిందూగాధలనుబట్టి శక స్థాపకుడు శాలివాహనుడు. ఇతడు ఆంధ్ర భృత్యరాజులలో నొకడు. ఇతడు శాకవంశస్థుడో కాడో ఎవరును నిర్ధారణ చేసియుండలేరు. మహాక్షత్రపులును, శకవంశజులను, ఆంధ్రశాతకర్ణులును శకసంవత్సరమును గౌరవించుటచే శాలివాహనుడు శాకవంశజుడై యుండెనని తోచుచున్నది. ఆంధ్ర రాజులతో సంబంధము చేతను బ్రాహ్మణులను గౌరవించుటచేతను అతనిచుట్టు పెక్కుగాధలు పెరిగెనని చెప్పవలసియున్నది. అదియునుగాక శాలివాహనుడు ఆంధ్రరాజుగానుండి మాల్వదేశము నాక్రమించిన పరరాజుల నోడించి శక స్థాపకుడాయెనని కూడ చెప్పవచ్చును. ఈ శకశబ్ద మిదివరలో వాడబడుచుండుటచే శాకవంశములచే స్థాపితమైనదని చెప్పుటకు వీలులేదు. అదియునుగాక ఆంధ్రభృత్యులు వింధ్యకు దక్షిణభూములను పరిపాలించుచు మాళ్వప్రాంతమును స్వాధీనపఱచుకొనుటకు యత్నించుచుండిరి. మఱియు మగధరాజ్య మస్తమించుచుండగా దాని నాక్రమించుకొనిరి. ఆకాలమున మాళ్వదేశము విక్రమార్క బిరుదాంకితుడగు శూద్రకునిచే బరిపాలింపబడుచుండి యుండును. ఈశూద్రకుడే శాకవంశజుల దండయాత్రల నరికట్టి విక్రమార్కశకము లేక మాళ్వశక స్థాపకుడై యుండును. తదనంతరము విక్రమార్కు డస్తమించుటచే శాకవంశజులు మాళ్వప్రాంతము నాక్రమించి స్వాధీనపఱచుకొని యుండిరి. కాని శాలివాహనుడు విజృంభించి మాళ్వదేశము నాక్రమించిన శాకవంశజుల నోడించి శాలివాహన శకము క్రీ. శ. 78లో స్థాపించి సామంతరాజులగు శాకవంశపు రాజులు కూడ దాని నమలులో తెచ్చునటుల శాసించియుండును. అందుచే హిందూ దేశమందంతటను చిరకాలము మాళ్వశకమడుగంటి శాలివాహనశకములు లోనికి వచ్చెను. కుషను వంశజుల కాలమునలన కుషను శకమును గుప్తవంశజుల కాలమున గుప్త శకమును శ్రీహర్షుని కాలమున హర్షశకములును స్థాపింపబడెను. కాని క్రీ. శ. 600లులో మాళ్వదేశమును పాలిన విక్రమార్క బిరుదాంకితుడగు యశోవర్మ తిర్గి విక్రమార్కశకము లేక మాళ్వశకము నాచరణలోనికి దెచ్చెను. శాసనమందలి అక్షరములను బట్టిపరీక్షించుచో కుషనులు గుప్తరాజులకు దాపుగానుండిన వారలని తేలుచున్నది. భండారుకరుగారు ఈ విషయమై చాల పరిశ్రమ గావించి వీరు క్రీ. శ. 288—376 లోనుండినటుల నిర్ధారణ చేసియున్నారు. శాలివాహన శకమునకు రెండువందల సంవత్సరముల యనంతరము కనిష్కుడు రాజ్యమునకు వచ్చియుండునని వీరూహించియుండిరి. కాని యిదసిద్ధమని చెప్పుటకు వీలులేక పోయినను శాలివాహన శకస్థాపకుడు కనిష్కుడు కాడని మాత్రము నేను చెప్పగలను.

అదియునుగాక స్మిత్తు మొదలగువారు శకస్థాపకుడు కనిష్కుడని చాటించుచుండ భండార్కరు మొదలగువారు వేమకాడ్ఫైజిసు కాలమునుబట్టి తరువాతివాడని నిశ్చయించిరి. రాజ తరంగిణియందు కనిష్కునికి నూటయేబది సంవత్సరములకు పూర్వము బుద్ధుడుండెనని చెప్పుటచేతను బుద్ధునికాలము క్రీ. పూ. 560 ప్రాంతమునని నిర్ధారణచేసి యుండుటచేతను యీకనిష్కుడు క్రీ. పూ. 400 ప్రాంతమునయుండినటుల తేలుచున్నది. ఇది సత్యముకాదు. రాజతరంగిణియందు చెప్పబడిన యీవిషయము నమ్మతగినదికాదు.

ఈ కుషనులలో ప్రథముడును ద్వితీయుడును శివమతస్థులు దేవాలయమును కట్టించి బ్రాహ్మణులు పూజించిరి. కనిష్కుడు బౌద్ధ సాంప్రదాయమును తేనమును బలపరచెను. మిగిలనవారు దేవాలయములను విహారములనుగూడ నిర్మించి బౌద్ధులను బ్రాహ్మణులను సమానముగా గౌరవించిరి. వీరందరు కాబూలు కాశ్మీరము పంజాబు రాజ్యములపై రాజ్యముచేసి యుండిరి. హిందూ దేవతల కందఱు గౌరవస్థానము నుగలుగ జేసిరి. కాని పేరు తురుష్కభాషను మాట్లాడుచు గ్రీకు అక్షరములతో తమనాణెములను చెక్కించిరి. ఒక ప్రక్కను నాణెములపై బ్రాహ్మీఅక్షరములనుగూడ వాడిరి. ఆకాలమున హిందూమతము పెక్కుజాతులను కలుపుకొనెననుటకు వీరి వంశచరిత్రమే తార్కాణము.

# అలీబియా.

(చిల్లరిగె శ్రీనివాసరావు పంతులుగారు.)

పరిషియాదేశమును అబ్బాసుశాహ అను రాజు పాలించుచుండెను. ఆతడొక దినమున తన ప్రజలయొక్క వృత్తాంశము లనుగను గొనుటకు మారువేషము వేసికొని బయలుదేరెను. ఆయనతో బాగానమ్మకస్థుడైన ఒకమంత్రి మాత్రముండెను.

రాజు మంత్రితో నిట్లనెను. "ప్రజల యొక్క యదార్థ వృత్తాంతము నాకు తెలియదు. నా దగ్గరకు వచ్చునప్పటి కంతయు మారురూపము దాల్చివచ్చును. నేనుచూచున దంతయు కపటము. ఎక్కడ గోచరించినను మాయగాని, సత్యము గానరాదు. నేను స్వయముగా నాకండ్లతో దేశమును జూడవలెను. పల్లెలలోని ప్రజలనుగాంచవలెను. వారెంతో హీనముగా జూడబడు చున్నారు. కాని వారే సంఘముయొక్క ప్రాపు. ఈడంబాచారులను సభికులను జూడ జూడ నాముఖము మొత్తిపోయినది. వారెప్పుడు నామనసుకనిష్టట్టి స్తోత్రపాఠములతో నన్ను మాయ జేయుచుందురు. నన్నెరుగని కాపులను గొల్లలను నేను సమీపించి కనుగొనవలెను."

వారనేక గ్రామములను తిరిగిరి. అనాయకులగు గ్రామ ప్రజల ఆటపాటలను జూచి యాతడు సంతోషించెను. ప్రజలు ధనవ్యయములేక పూర్ణసుఖము ననుభవించుటగాంచి యాతడు ధన్యుడనని తలంచెను. ఒక పూరింటిలో నాతడు బసచేసెను. ప్రయాణము చేత నలసి యున్న రాజక్కడ దొరికిన సామాన్య భోజనమును దిని స్వమందిరములో భుజించు పంచభక్ష్య పరమాన్నములకంటె రుచికరముగా నుండెనని తృప్తి నొందెను.

సాయంకాలము విహారమునకు పొలములోనికి బయలుదేరెను. అక్కడనున్న పువ్వులు, చెట్లు, చేమలు అతిమనోహరముగ నుండెను. కొలది దూరములో నొక్క చిన్న యేరున్నది. దాని యొడ్డున నుంచి నీడనిచ్చు చెట్లున్నవి. ఆచెట్లప్రక్క గొర్రెల మంద యుండెను. గొర్రెల కాపరి పిల్లన గ్రోవి నూదుచు పరవశుడగుచుండెను. పిల్లవాని కడకేగిరి. ఆపిల్లవాడు ఆనందముగ నుండెను. వానియందొక విధమైనయుదాత్త లక్షణములు చక్కగగాన్పించెను.

వాడు కట్టిన గుడ్డలు చింపిరి గుడ్డలే కాని, వాని యందమున కేమియు లోటురాలేదు. ఏడెవడో గొప్ప యింటిబిడ్డ. మారు వేషముతో నున్నాడని రాజనుకొనెను. కాని వాని తలిదండ్రులు ప్రక్క గ్రామములో నున్నారు. అందుకు సందేహములేదు. వానిపేరు అలీబియా !

రాజు వానితో మాట్లాడెను. వానికి మంచి తెలివి తేటలున్నట్లును దిట్టమైనమనో నిబ్బరమున్నట్లును కనుగొనెను. వానికన్నులు తళుకు తళుకు మనుచున్నవి. కానియందె

క్కడను ఆగ్రహము కనుపడదు. మొగము నందెక్కడను మోటుతనము గాన్పింపదు. స్త్రీసులభమగు కోమలత్వమును గానరాదు. ఆగోపబాలునకు పదియారేండ్ల ప్రాయముండెను. కాని తన లక్షణము లితరుల కెంతయింపుగానున్న వోయను విషయమాత డెరుంగడు. ఆగ్రామములోని తోటి పిల్లవాండ్రవలెనే యాతడు నాటపాటల యందుండెను. కాని గురువు లేకుండినను మహాగురువులకడ నేర్వదగినవిద్య నాతడు సహజముగ నేర్వగలిగెను.

రాజు కొంచెము సేపు వానితో మాటలాడెను. ఆ పిల్లవానిని జూచిన కొలందిని వాతని కెక్కడలేనిముచ్చట కల్గెను. ప్రజల వృత్తాంత మాబాలు నడిగి రాజు తెలసికొనెను. ఇదివర కెన్నడును ఆయన నాశ్రయించుకొనియున్న స్తోత్రపాఠకులు నీతడు చెప్పినదానిలో నొక్క ముక్కయైనను చెప్పియుండ లేదు. ఆ పిల్లవాని మాటలలో నెక్కడను మర్మము లేదు. పిల్లవాని తెలివికి రాజు మధ్యమధ్య నవ్వుచుండెను. అట్టి సహజసరళ సంభాషణ వినినపుడొక గొప్ప వినోదముగ తోచెను. తానెవరో చెప్పవద్దని రాజు మంత్రికి సైగచేసెను. ఆసంగతి తెలిసిన యెడల అలీబియా మనసు చెదరి రసాభాసము చేయునని భయపడెను.

రాజు ఇట్లు వితర్కించెను. ప్రకృతి శ్రీమంతులలో నెంత ప్రకాశించునో దరిద్రులలోను అంతే ప్రకాశించునని నాకు బోధపడినది. ఈ గొర్రెల కాపరి రాజ కుమారునికంటె యేమి తక్కువ ఇంతయందమైనవాడును బుద్ధిగలవాడును ప్రేమార్హుడు నా బిడ్డయైనయెడల నే నెంత సంతోషించెడివాడను! వీనికి జాగ్రత్తగా విద్య నేర్పిన యెడల ఏయుద్యోగమునకైన పనికి వచ్చును. వీని నొసలు గొప్పవాడగునని చెప్పకయె చెప్పుచున్నవి. వీనిని నాసమ్ముఖమున పెంచి పెదవానిని చేసెదను.

ఆలీబియాను దర్బారునకు హాజరుకమ్మని సెలవయ్యెను. తానుముచ్చట లాడినది రాజని తెలిసి వాడు ఆశ్చర్యపడెను. వానికి చదువను వ్రాయను గానముచేయను నేర్పిరి. తరువాత కళలు శాస్త్రములు నేర్పుటకు పండితులను నియోగించిరి. దర్బారు చూచినప్పుడు వాని కన్నులు మిరుమిట్లు పొందెను. హఠాత్తుగా భాగ్యమువచ్చినప్పటికి వాని భావములు తబ్బిబ్బులైనవి వాని వయస్సును వాని వైఖరియు వాని తెలివి-నిదానమున కాటంకము లాయెను. ఇదివరకున్న గొల్లవాండ్రకొంకె కర్రకు బదులు చేతిలో ఖడ్గము లభించినది. గుడ్డలకు బదులు జరీగుడ్డలు, ముఖమల్ కోటు, విలువగల మాణిక్యములమర్చినపాగా లభించెను. వానిసౌందర్యమును గూర్చి చెప్పవలెనదేమి? సభలోనివారు దీపముక్రింది దివ్వెలై పోయిరి. గొప్ప వ్యవహారములు చేపట్టనారంభించెను. రాజుకు మంచి నమ్మకస్థుడయ్యెను. రాజభవనములోని అలంకారములు మొదలగువానిని ఘనముచేయుట యందీతనికున్నరుచి మరియొకరికి లేదను పేరువచ్చెను. అందుచేత గొప్పయుద్యోగము లభించెను. రాజుగారి నగలు గొప్పవిలువగల సరుకులు ఆయన పరామరిక క్రిందనుండవలెనని యేర్పాటైనది.

ఎంతకన్నులు తిరిగి పోవలసిన స్థితి వచ్చినను అలీబియా తన చిన్ననాటి వృత్తాంతమును మరువలేదు. తనగ్రామమున కొకసారి

పోవలెనని దలచెను. చిన్ననాడు తన చెలికాండ్రతో గలిసి యాటలాడి పాటలబాడి వేణువు ప్రయోగించిన మారుమూలలనెల్ల నుల్లాసముతో తిరిగి చూచెను. బంధువులను స్నేహితులను కుశలమడిగి పల్లెల పాడు పెట్టి పట్టణపు రచ్చపట్టులకు వచ్చి సుఖమునకు నీళ్ళువదలుకొన వలదని హెచ్చరించెను.

రచ్చపట్టుల రవ్వలాతనికియనుభవమే. అతని యభిమానియగు రాజు అబ్బాసుశాహా చనిపోయెను. కుమారుడు సోఫిశాహా సింహాసన మెక్కెను. ఆలీబియామీద గిట్టని సభికులు కొందఱుండిరి. వారుచాలకృత్రిములు. కొత్త రాజునకు ఆలీబియా మీద పితూరీల చెప్ప నారంభించిరి.

వారు—"మీతండ్రి యాయనను నమ్మినాడు. అందు కాతడు స్వామి ద్రోహముచేసినాడు. ఆయన కప్పగించిన విలువగల సామానులను చాల అపహరించినాడు. అందువలన నాతడు గొప్పయాస్తిపరుడైనాడు.

సోఫిశాహా వయసున చిన్నవాడు. అధికారమున నిరంకుశుడు. ఆయనకు శ్రద్ధ తక్కువ; చెప్పుడుమాటల యెడల నమ్మిక యెక్కువ. జాగరూకతయానున్న. తండ్రి చేసిన వ్యవహారములన్నియు దిద్దుబాటుచేసి ప్రపంచమునకు గొప్పసంస్కర్తగా పొడగట్టవలయునని దలంచెను. ఆలీబియాను పదవిలోనుండితగ్గించవలెననిదలచివంకకొఱకు వెదకుచుండెను. ఈర్ష్యాపరులైన సభికులు సలహాచెప్పిరి. వాని తాతగారు యుద్ధములోనికి వెడలునప్పుడు ధరించు ముఖ్యమైన ఖడ్గమును రవ్వలు పొదిగినదానిని తెమ్మని యాజ్ఞాపించెను.

అబ్బాసుశాహాయాతని కాఖడ్గమును నొప్పగించకపూర్వమే దానిమీది రవ్వలను దీసుకొన్నాడు. ఈ సంగతి ఆలీబియా తగిన సాక్షులచేత రుజువుచేయించెను. ఈవంక వలన నితనికి పరాభవము కాలేదని సభికులు చూచి మఱియొక పన్నాగమును పన్నిరి. ఒక్క పక్షము దినములలో నతనికి యొప్పగించిన యావత్తు విలువగల వస్తువుల యొక్కయు జాచి తాను తయారుచేసి యిమ్మని యాజ్ఞాపింపుడని రాజునకు సలహాయిచ్చిరి. పక్షము దినములైన తరువాత రాజుగారు వస్తువుల నన్నిటిని స్వయముగా జూడగోరిరి. ఆలీబియా తలుపులన్నిటిని తెరచితనయాధీనములో నున్నవి చూపించెను. అన్నియు సరిగా నున్నవి. ఒక్కవస్తువును బీరుపోలేదు. భద్రముగా నుండెను. అంతజాగరూకతకు రాజు ఆశ్చర్య పోయెను. ఆలీబియా మీద యనుగ్రహముగలిగెను. ఇంతలో దివ్యమైనవస్తువులున్న మందిరమునంతను తిరిగిచూచుచుండ కొట్టకొనను ఒక ఇనుప తలుపు వేసి యున్న యొక యఱగాన్పించెను. దానికి మూడు దిట్టమైన తాళములు వేసియున్నవి.

'అదిగో అందులోనే అలీబియా అపహరించిన విలువగల వస్తువులున్నవి' అని సభికులు ఆయనతో నెమ్మదిగ చెప్పిరి.

శాహావెంటనే ఆగ్రహముతో 'ఈతలుపు వెనుక నేమియున్నదో నేను చూడవలెను. ఇక్కడేమి దాచితివి, చూపించు' అనెను.

ఆలీబియా ఆయనపాదములమీదపడి తన కీప్రపంచమున నమూల్యమగు ధనమచ్చట నున్నది. దానిని మాత్రము గైకొనవద్దని దైవముపేరెత్తివేడుకొనెను.

అలీబియా యిట్లు పలికెను. 'మహాప్రభూ! న్యాయముకాదు. మీతండ్రిగారి యొద్ద ఇన్నాళ్లు సేవచేసినాను. నాకీధన మొక్కటియే శరణ్యము. ఇదియొక్కటియు ఒక్కక్షణములో పోయినయెడల నా వేదనకంతు ఉండదు. మీకిష్టమున్న తక్కిన సమస్తముగొనుడు. ఇదివస్త్రము వదలిపెట్టుడు.''

షాహా కిక సందేహము లేదు. అలీబియా ద్రోహముచేసి యార్జించిన ధన మదియే యనినిశ్చయించెను. షాహా ఇంకను నిశ్చయవాక్కుతో నుడివెను. తలుపు బ్రద్దలుగొట్టుమని యాజ్ఞాపించెను. బ్రద్దలుగొట్టు నవసరము లేదు. అలీబియా చేతిలో తాళపుచెవు లున్నవి. ఆయనయే తట్టతుదకు తలుపు తెరచెను. ఆయారలోపలకు వెళ్ళిచూడగా అలీబియా చిన్ననాటిగొర్రె కాపరికఱ్ఱ, చింపిరి దుస్తులు, పిల్లనగ్రోవి యుండెను. తన యైశ్వర్యమువలన పూర్వ వృత్తాంతమును మరతునేమోయని అలీబియా యెప్పుడప్పుడు వాని దర్శనముచేసికొనుచుండెడివాడు.

'అలీ—' ఓమహాప్రభూ! చూడండి నా చిన్ననాటి యానంద చిహ్నములివిగో? దైవిక రాజికములవలన నాస్వంతధనమును నింతవరకు హరించినవారు లేరు. మీరు పేదవానిగా జేసిన యెడల నాకైశ్వర్యమియ్యగల నిక్షేపము లివిగో! నా యావత్తు ధనమును గొనుడు. నాబాల్యమునాటి సంపదను మాత్రము హరింపకుడు. నాకీసంపద లున్న నెట్టి కొఱంత యుండదు. భోగములకై పెనుగులాడక అవసరములతో తృప్తినొందు వారికి మట్టులేని మానవానందకరమైన చిన్నవస్తువులు మహైశ్వర్యములయందుకూడ క్రీడింపు... ఉంగపుడతిందియగోచ పండ్లు శాంతిము స్వాతంత్ర్యసౌఖ్యమందిరి ఈ భాగ్యములవలన నాకే చింత చివుకులును లేవు. ఆనంద పూర్ణము గాంచి ...కటి అమాయకి పూర్ణమగునో సాధునములారా! నేను మిమ్మెన్నటికిని మరువను. మీతోడ నేనాజీవము. మీతోడనే నా ముఖ్యము పై మెరపు మెరయు కపటవస్తు సంచయమ్ము నన్ను భ్రమపెట్టి నా శాంతమును హరింపజాలునా? నొసంగుదునా? మహారాజా! నా సంపద భాగ్యమును దీసుకొనుడు. మీయౌదార్యముచే నాకు లభించిన సమస్తమును గైకొనుడు. మీతండ్రిగారు నామీదకరుణించి నా యానందమును భంగము చేయక పూర్ణము నాకున్నది నాకుండనిచ్చిరి.

ఈమాటలవిని సోకిశాహ అలీబియా యొక్క సాధుత్వమును గ్రహించెను. తన సభికుల యెడల నాగ్రహించి వారిని దర్బారు నుంచి తరిమివైచెను. అలీబియాను ప్రధానామాత్యుని జేసెను. విశేషరహస్య వ్యవహారముల నాతని కొప్పగించెను. కాని అలీబియా మాత్రము తన చిన్ననాటి స్నేహితులను మరువలేదు. చంచలలక్ష్మి తీవ్రనేత్రములతో చూచినతోడనే తనపూర్వమిత్రులతో బసులు వెడలుటకు వానిని గదియందు సిద్ధముగానుంచుకొనెను. వాడు పెద్దవయస్సు వఱకు జీవించెను గాని శత్రువులపైపగదీర్చుకొనుటకుగాని ధనమార్జించుటకు గాని యత్నింపలేదు. తనబంధువులకు పశుపాలక జీవనము చేయుటకు సరిపోవునంతయే యిచ్చి పరలోక యాత్ర సాగెను. ఆజీవనమే క్షేమకరము! ఆజీవనమే సుఖదాయకమని అయ్యది నమ్మెను!

# శిల్పము - ధర్మము.

;o:

( యస్. రంగనాధ సూరి గారు. )

శిల్పమునకును ధార్మిక జీవితమునకును స్వాభావిద్ధమగు విరోధము గలదాయను విషయము ప్రస్తుతము విచారణీయము. నీతి వాదులు కావ్య సంగీతములను మతుల్యముగ దలచిపరిత్యజించి యున్నారను విషయము పిల్లలెరింగినదేగదా? మానవుని యొక్కగాని, దేవతల యొక్కగాని ప్రతిమూర్తుల నంకితము చేయరాదని మహమ్మదీయుల ధర్మశాస్త్రములు నుడువుచున్నవి. ప్లేటో యనునాతడు తనయాదర్శమానవమండలియందు కవికి స్థానమీయకుండెను. ఆధునిక కాలమందు కూడ సంగీత చిత్ర భాస్కర్యములు మొదలగునవి ధర్మభావోద్దీపకముగ నుండవలయునని వాదించువారు పలువురున్నారు. దీనిభావమేమి? భూమండల మంతయు మహాశిల్ప మందిరము గాదా? భగవానుని లీలానికేతనము గాదా? అయినను నీతివాదులందు కొంత విడనాడి మరికొంత నైనను జూచుచున్నారు. భగవానుని బొందగును శిల్పమే శిల్పమనుచున్నారు. అట్టిదానినే వాంఛింపుచున్నారు. మానవుని యధోముఖ సంబంధమగు ప్రవృత్తుల శిల్పమూర్తుల జిలకింపజేనదని నేత్రములుమూసికొని మహాత్తరమును విశుద్ధమగు ప్రేరణమును గలిగించువానిని మాత్రమే దర్శింపనెంచుచున్నారు.

కారణమేమి? "ఆధ్యాత్మిక విద్య పరా విద్య. లౌకికములైన వన్నియు అపరా విద్యలు. ధర్మమైన మానవుడుకోరదగిన సర్వోత్తమ స్థాన"మని స్మృతి గాదులు నుడువుచుందురు. ఈ యభిప్రాయ తోడ సంపూర్ణముగ నేకీభవించినయెడల ధర్మానుగుణ్యమగు దానిని మాత్రమే గైకొని మిగిలిన వానిని బరిత్యజింపవలసి వచ్చును. అపరా విద్యలన్నియు పరావిద్యకు సోపాన ప్రాయములు గావలసి వచ్చును. ఏలయన జగత్తు నందలి సౌందర్యము మహిమ మొదలగునవి యొక్క భగవానునకు మాత్రమే సంబంధించిన వగుటవలన పరావిద్యకు సోపానమైనప్పుడే యపరావిద్యకు సార్థకత గలదని నుడువుచున్నారు. కాని యీ సూత్రమెంతవరకు యదార్థమని విచారింపవలయును.

రసస్పృష్టియే శిల్పకళా రహస్యమను విషయము సర్వజనాంగీకారమేగదా? భగవదుపలబ్ధియందు బొందు రసము వేరు. మానవలీలయందు లభించు రసము వేరు. అందువలన శిల్పి యీ ద్వివిషయముల యందు దేనినైగాని రసస్పృష్టి యొనర్పవలయును? మానవలీలల సంబంధమగు రసస్పృష్టిధర్మ జీవితమునకు హానికరము గావచ్చును. కానిరసస్పృష్టి దిక్కునుండి చూచినయెడల దానిమూల్య మణుమాత్రమైనను తరుగుటకువీలులేదు. అట్లయినచో భగవానుడొక్కడే పూర్ణ రసాధారుడని నీతివాదులు నుడువుదురు. భగవానుడనిన నేమి? భగవానుని రసమూర్తి యన నేమి? అనువిషయములన్ని యొ...యగు ధర్మ. భగవానుడనగా దానిని మాత్రము గైకొనపరాదు. దైవముపేర త్రివేణుగానేను. కావున

నాయన యింతకుంది యెన్ని విధముల దర్శించిరో వారి సంఖ్యను నిర్ణయించగలమా? సాధుపుంగవులకు ప్రత్యక్షమగు భగవానునకును, శిల్పిదర్శించు భగవానునకును భేదమేమున్నది? సాధు పుంగవుడు భగవానునిదర్శించు విధమున శిల్పిభగవానుని దర్శింపలేకపోవచ్చును. కాని భగవానుని సాధు పుంగవుడు గాంచినటులనే శిల్పిగూడ భగవానుని రసరూపమును ప్రత్యక్ష మొనర్చుకొను చున్నాడు.

సాధుపూరుషుడగు ధార్మికుడు జగత్సంబంధమగు ప్రేరణలచే కళంకితముగాని విశుద్ధభగవద్రూపమును దిలకించును. అనగా మానవుని మలినత్వము, ఇంద్రియవిక్షోభము, స్థూలత్వము మొదలగునవియణు మాత్రమైనను లేనిభగవానుడే సాధుపుంగవులకు ప్రత్యక్షము. జగత్తునందు సాధారణముగ జరుగుచుండు నిత్యనైమిత్తిక లీలల యందుండు మంగళమయుడగు భగవానుని శిల్పిదర్శింపు చుండును. సాధుపురుషుల భగవానుడు సదాచారి ముక్తపురుషుడై యుండును. శిల్పుల భగవానుడు లీలావినోదుడు; అనంతరూపుడు. శిల్పి భగవానుని శరీర- ప్రాణ- మనములకు దాసుడనిగూడ నెరుంగును. సాధుపురుషుడు త్యాగమందు-శుచియందానందమును బొందు చుండును. శిల్పి శరీర భోగములయందు భగవానుని రసరూపమును గాంచి పరవశుడగు చుండును. దానినే వెల్లడింపు చుండును. అట్లు ప్రకటింప గలిగినవాడే యదార్థమగు శిల్పపదవార్హుడు. అదియే శిల్పము. మనము సాధారణముగ అవిశుద్ధ భోగములని దలంచువాని యందుండు ఆనందము భగవానుని యానందము గాదా? అందువలనదానిని హీనముగ దలంపరాదు. శాంతమును-విశుద్ధమునగు ఆనందమునందు సాధుపూరుషుడు నిరంతరము మునిగి యుండును. మర్త్యజీవిత మందలి యుద్వేలిత స్రోతమందు మునిగి శిల్పియమృత రసపానము చేయు చుండును. మానవుని మహాత్త్వము-ఉదారత-అతీంద్రియములయందు భగవానుడు క్రీడింపు చుండు నటులనే మానవుని క్షుద్రత- సంకీర్ణత-ఇంద్రియపరత్వములయందుగూడ క్రీడింపు చున్నాడు. సాధు పుంగవుడతీంద్రియగోచరుడగు భగవానుని మాత్రమే లక్ష్యమందుంచుకొనును. శిల్పి యింద్రియములు అతీంద్రియములయందు క్రీడించు భగవానునిరసమూర్తిని గాంచి చరితార్థుడగును. ఇందొకటి యుత్తమమని మరియొకటి యధమమని దలంపడు.

సాధుపూరుషుని లక్ష్యమును శిల్పి లక్ష్యమును నొక్కటిగాదు. సాధుపూరుషుడును, సంస్కారియు మానవుల నొక్కవిశేషాదర్శముతోడ పునర్నిర్మాణమునకు ప్రయత్నింతురు. స్త్రీలెల్లరు పతివ్రతల్లులుగను, పూరుషులెల్లరు సత్యవాదులుగ నుండవలయునని దలంతురు. అందువలన కళంకయుతులగు స్త్రీపురుషుల చిత్తవృత్తులదిలకించుట కిష్టగింపరు; చూడరు. చూచినయెడల సన్మార్గమును బోధింప హించిన వారమగుదుమని వారి తలంపు.

కానిశిల్పి యట్లూరకుండడు. దర్శింపగూడదని నీతివాదు లనుచున్నను దానియందుగూడ భగవానుని లీలయున్నదని వానియందు విరాజిల్లుచున్న భగవానుని యనంత మూర్తుల యందొకమూర్తిని దిలకించును. అసత్యవస్తువును మానవ నేత్రములకు గన్పట్ట జేయును. పాపకార్యము లెవ్వరు చేయగూడదు. ప్రోత్సాహ పరచ గూడదు. కానివానియందంధ దృష్టియేల నుండవలయును? మనము సన్మార్గులము కావచ్చును. సత్పథమునే నడచు చుండవచ్చును. కానిపాపశీలను అందలి తత్త్వమును హృదయంగమము చేసికొనక యేలయూరకుండ వలయుగు? వృద్ధత్వము నెవ్వడును వాంఛింపడు. చిరయవ్వనుడుగ నుండుటయే ప్రతివాని లక్ష్యము. దేవతలు చిరయౌవ్వనులు. అందువలన వృద్ధత్వమునందు సత్యము లేదందురా? సౌందర్యము శూన్యమందురా? లేకవృద్ధుని చిత్రించు నప్పుడు దానినిచూచి నంతనే మానవుల కసహ్యము- ఘృణగలిగిమానవులకు యవ్వనముమీదనే యాకర్షణ గలుగు నటుల చిత్రింపవలయునందురా?

జగత్తునం దాదర్శములను స్థాపించుటకు శిల్పి తనశిల్పము నుపయోగపరుపడు. ఆదర్శము నిత్యపరి

వర్తనశీలము. ఒక్కొక యాదర్శమొక్కొక యుగమున వికసించి మానవమండలి హృదయము నాకర్షించుచుండును. ఇటుల శిల్పి తనప్రతిభను వినియోగపరచుట కెప్పుడును బ్రయత్నింపడు. దేశకాలాతీతమైనది శిల్పము. శిల్పియెప్పుడును చిరంతన సత్యమును గాంచుచుండును. ఉదాసీన భావమున పాపపుణ్యముల ధ్యానింపుచుండును. గొద్దిగొప్పలయందును, ఉత్తమనీచములయందును, మొదలుతుదలయందును, భగవానుని విచిత్రసత్తానుదిలకించి వెల్లడింపుచుండును. శిల్పియొక్క శిల్పము జగత్తుయొక్క కళ్యాణమునకు దోడ్పడిన దోడ్పడవచ్చును. కానియదియే శిల్పియొక్క గంతవ్యస్థానము గాదు. శిల్పియేదియో యొక బంధమునందు తనను తాను బంధించుకొనడు. అట్లు బంధించుకొనినయెడల మానవుని జ్ఞానము సీమాబద్ధమై యుండవలసినదే. జగత్తునందలి యనేకరహస్యములు రహస్యముగ నుండవలసినదే గాని బహిర్గత మయ్యెడివి కావు. భగవానుని వైచిత్ర్యపూర్ణమగు సౌందర్యలీలావిలాసముల సంబంధమగు రసాస్వాదనము మానవమండలికి లభించెడిదిగాదు.

శిల్పమునుగూర్చి విచారించునప్పుడు భగవానుని యనంతరస లీలావిలాసమునుగూర్చి మరచుచుందుము. మరియు సాధుపుంగవునిబోలి భగవానునకొక విశేషరూపమునొసంగి, ధార్మికునిబోలి నైతికమానదండము ద్వారమున శిల్పమూల్యమును నిర్ణయించుటకు బ్రయత్నింతుము. సాంఘిక రాజకీయములచే గూడ శిల్పమును బంధింప జూచుచుందుము. మానవకోటి యున్నతికొరకు దేశకాలపాత్రముల ననుసరించి భగవానునివిచిత్రలీలల యందొకమూర్తిని యారాధించుట ముఖ్య ప్రయోజన మగును. కాని యవి యన్నియు శిల్పముయొక్క యాంతరంగిక విషయమునకు సంబంధించవు.

చిరంతన సత్యమును వెల్లడించుటయే శిల్పముయొక్క ముఖ్యోద్దేశ్యము. అందువలన శిల్పము మహా[illegible]మైనది. అదిసర్వత్రవ్యాపించి యుండును. మనకుబోధగట్టు మంచిచెడుగుల యందును, సంస్కారులు దలచు ప్రియాప్రియములు మొదలగువాని యందంతటను చిరంతన సత్యము నిగూఢమై యున్నది. ప్రతిపదార్థమునకు విశిష్టత గలదు. అదినిజగుణాము సారము విశ్వరంగము నందభినయింపుచున్నది. ఇదియే యావస్తువు యొక్క సత్యము. ఈ సత్యము నిత్యము; రసపూర్ణము. దీనినే శిల్పి చూపించును. కావున నిదియే శిల్పము. జగత్తునందున్న దంతయు ధార్మికులకుగాని సంస్కారులకుకాని ప్రియముగాక పోవచ్చును. అందువలననది యసత్యము కాజాలదు. సత్యము నాశ్రయించియే ప్రతివస్తువును బ్రకాశింపుచున్నది. ఈ సత్యమే భగవానుని యానందఘనస్వరూపము. ఇందే సౌందర్యము విరాజిల్లుచున్నది. ఇందే లీలావినోదుడగుభగవానుడు క్రీడింపుచున్నాడు. భగవద్విలాస మిచ్చటనే గోచరించును. కావున శిల్పిలక్ష్యము భగవానుడు. శిల్పిమహత్తర వైరాగ్యమును వెల్లడించి సాధుపుంగవుల కృతజ్ఞతకు బాత్రుడగు విధమునవనే కర్మపిపాసను వికసింపజేసి వారి కృతజ్ఞతకు బాత్రుడగుచున్నాడు. ఇచ్చటనే యాతనికృతిత్వము. కాముకుల కామోన్మత్తతను వెల్లడించుటవలన శిల్పికిగాని శిల్పమునకుగాని మర్యాదహాని గలుగునని దలంచగాదు.

ఆధ్యాత్మిక జ్ఞానమునకు శిల్పమునకట్టి విరోధము లేదు. మీదుమిక్కిలి యాధ్యాత్మిక జ్ఞానమే శిల్పమునకు జీవము. ఆధ్యాత్మిక జ్ఞానమననేమి? ఆత్మసంబంధమగు జ్ఞానమనియే గదా యర్థము. యోగులయాత్మ యోగమందును, భోగుల యాత్మభోగమందునుండును. యోగుల యోగత్వము భోగులభోగత్వము దేవతలదేవత్వము పశువుల పశుత్వమును వెల్లడించుటయే శిల్పియొక్క శిల్పపరాకాష్ఠ. ఇందువలన శిల్పిశ్రేష్ఠుడు ఆధ్యాత్మికవాదియని గోచరించుటలేదా? శిల్పిదయామయుడగు బుద్ధభగవానుని రూపమును చిత్రించుటవలన రుద్రమూర్తియగు నాదరుషా చిత్తరువును శిల్పిజగత్తునుండి లోపింపజేయవలయునా? మహాకవియగు కాళిదాసు సకలరస శిరో

మణియగు శృంగారరసమునందలి యాధ్యాత్మికచిత్రరువును చిత్రించి యున్నాడు. అందువలన పాఠకుల యందు శృంగారరస ముప్పొంగ వచ్చును. ఇందు కాళిదాసు దోషమేమున్నది? శృంగార రసమును దెలియపరచుటయే కాళిదాసు అభిప్రాయము కొన్ని వేళలమానవుని ధర్మసాధనకిది యాటంకము కావచ్చును. అందువలన దానిని యసత్యము హేయమని యెట్లు నుడువగలము?

నగ్ననారీచిత్రరువు మన నేత్రములకు బాధకరముగ నుండును. నీతిజ్ఞానము వలననే గాదు. సౌందర్యజ్ఞానమువలన గూడ అసహ్యముగ నుండును. కాని మనము సాధారణముగ జూచుచిత్రరువులన్నియు శిల్పమునకు సంబంధించినవి కావు. పొటోగ్రాపులు. ప్రకృతి యొక్క నకళ్లు. సౌందర్యరహితమని దేనినందుము? వస్తువుయొక్క బాహ్యరూపమును మాత్రమే చూపించి దానియాంతరంగిక సత్యమును వెల్లడించని దానిని సౌందర్య రహితమందురు. పొటోగ్రాపుతో తీసిననగ్న స్త్రీబొమ్మగాని, సాధుపురుషునిబొమ్మగాని కుత్సితము. ఏలయన పొటోగ్రాపు నగ్ననారి నెరుంగును. కాని నగ్ననారీత్వము నెరుంగదు. సాధు పురుషుని బాహ్య రూపమును గాంచునుగాని సాధుత్వమును దెలిసికొన జాలదు. ఆర్టు దిక్కునుండి విచారించి చూచినయెడల రవివర్మచిత్రరువులు కుత్సితములు. శరీరము మాత్రమే గోచరించును. దాని వెనుక నుండు గభీరతరసత్యమునందు శరీరము భాసిల్లనిచో యది కుత్సితము గాక మరే మగును? సాధుపుంగవులు, నీతివాదుల దృక్కుల గూడనది సౌందర్య రహితము గాదా?

నగ్ననారీ చిత్రరువును చిత్రించుశిల్పి స్త్రీని లంపటదృష్టినిచూడడు. సాధుపుంగవుని దృష్టినిగూడ తిలకింపడు. ఋషిదృష్టిని దర్శించును. అరమణి యొక్కయాత్మ విషయమును వ్యక్తపరచును. సాధారణముగ మనమితరుల మనోక్రీడకు దాసులమై యిది పుణ్యము అదిపాపము, ఇదిశుద్ధము అదియశుద్ధమని నుడువుచుందుము. ఋషితుల్యుడగు శిల్పి దర్శించు విషయమందు సత్యమేమి- ఇం దిమిడియున్న నిగూఢ సమస్యయెట్టిది- రసధారయెచ్చటనని పరిశీలించును.

సిద్ధావస్థయందు కవిభావోద్రేకమున కావ్యమును రచించును. అదిమంచి చెడుగులు శుభాశుభములకతీతమైనది. సిద్ధపురుషుని సంపూర్ణ సత్యానుభూతి అపరిణత సాధకుల కవలంబనీయము గాకపోవచ్చును. అందువలన నదివిసర్జనీయమా? సిద్ధుని యనుభూతియే యదార్థమగుసత్యము సాధకునిసంబంధమగు సత్యము క్షణికము. తాత్కాలికము; అది సర్వజనీనమేయైనను చిరంతనము గాదు. సిద్ధపురుషుని వాక్కునకును కవికావ్యమునకును నణుమాత్రమైనను భేదములేదు. ఆట్టివానివి సాధనావస్థయందలి మానదండములతోడ విచారించుట పాడిగాదు. ఇట్లనుటవలనవీనిని సాధకునకెరుకపడకుండునట్లురహస్యముగగాని, దూరముగగాని, యుంచవలయుననుట యాదావశ్యకత కానరాదు. నగ్ననారీ చిత్రరువు మనల విచలితులుగ జేయ వచ్చును. అందువలన నాచిత్రరువునందు ప్రస్ఫుటితమైయుండు సౌందర్యము నేల యుపభోగింపరాదు. ఇంద్రియ దమనమునకు ప్రయత్నించి, యింద్రియ సంబంధమగు యదార్థభోగము నేల వశింపజేయవలయును? ఇంద్రియములబాహ్య విక్షోభకు భయపడి యింద్రియజీవతను స్వీకరింపకుండుట సత్యానుభూతి కంతరాయము కాదా?

సాధన దిక్కునుండి చూచినను శిల్పమునకు నుత్తమస్థానమే గలదు. శిల్పియొక్కయు ధార్మికునియొక్కయు మార్గ మొక్కటిగాదు. సాధుపురుషుని మార్గము 'ఇదికాదు. ఇదికాదు,' అనునది. శిల్పియొక్కమార్గము 'ఇదియే, ఇదియే,' యనునది. ఇంద్రియముల దమనమొనర్చుకొని విశుద్ధమగు అతీంద్రియములందు ప్రవేశించుటకు సాధుపుంగవుడు ప్రయత్నించును. లేక యింద్రియములనొక నిర్దిష్టమగు పరికరమున బంధింప జూచును. ఇంద్రియముల విశ్వవిభూతి యందే యతీంద్రియజ్ఞానమును బొందుటకు శిల్పిప్రయత్నింపుచుండును. ఆచార నియమముల ద్వారమున ధర్మజీవితమును నిర్మించుకొనుటకు సాధుపురుషుడు సాధనచేయుచుండును. శిల్పికి

యాచార నియమములు లేవు. అతడెప్పుడును ముక్తుడననియే భావించుచుండును. సాధుపురుషుడు తన సాధుత్వమునకును ధార్మికుడు ధర్మశీలతకును పనికివచ్చు వానిని మాత్రమే యేరుకొనుచుండును. శిల్పి వస్తుపరిశీలనంబొనర్చును. అతనికేవస్తువైనను సమానమే. విషయముల యందణుమాత్రమైనను దోషమున్నదని దలంపడు. సహజసత్య ప్రేరణానుసారము విషయములగైకొని యందు సత్యసుందరుని దృష్టిగోచరమొనర్చును. ఆచరణ— ఉదాహరణములు— శిక్షాదీక్షలు— వ్యాఖ్యల సహాయ్యమున సాధుపురుషుడు ఆధ్యాత్మముతోడ సంబంధమును గుదుర్చుకొనుచుండును. శిల్పికి వీనితోపని లేదు. ఒక్క భావమును మాత్రమే యాశ్రయించును. యశోదాదేవి చిత్రమయినను, వారాంగన చిత్రము వైనను చిత్రింపవచ్చును. కాని విషయమునందు మాత్రము ప్రకృతి గతమగు భేదము లేదు. వానియందలి సత్యమును వెలువరించ గలిగినా లేదా యనునదియే ప్రశ్న.

శిల్పప్రభావము— ప్రసారము— సూక్ష్మము. స్థూల ప్రకృతులు సాధారణముగ దానిననుభవింపజాలరు. వారికిస్థూలప్రభావము కావలయును. స్పష్టముగనుండనియెడల వారు దేనిని గ్రహింపజాలరు. ధర్మశాస్త్రములు నీతిశాస్త్రములందు కొరకే సృష్టింపబడినవి. శిల్పమందు గూడ నీతివాదము మొదలగు వానిని జొప్పింపుచుందురు. నీతి మానవుని స్థూలభోగ పరివర్తనముకు మిక్కుటముగ దోడ్పడును. నీతివలన మానవుని సూక్ష్మప్రకృతి యెప్పుడును మార్పునొందదు. శిల్పదృష్టి యత్యంత తీవ్రమైనది. కాని నేమియు నడ్డగింపజాలదు. అందువలననది వస్తువుల యందంతరతమరహస్యమును సాక్షాద్భావమున గాంచగలుగును. ఒక్కొక్కప్పుడప్రయత్నముగను, అజ్ఞాతముగ గూడ శిల్పసహాయమున వస్తువుయొక్క ప్రాణముతోడ మిళితమైపోవుచుందుము. ఇదియే రససంబంధము. దీనినే ధార్మికు లుపయోగించు సాంకేతిక భాషానుసారము భగవత్ప్రసాద మందురు! భగవత్ప్రసాదము లభించిన వానికి శాస్త్రములు— ఆచారములు— శిష్టనియమముల తోడ పనియేమున్నది? ఈ భగవత్ప్రసాదము వలన శిల్పి సహజముగ కృత్రిమసాధన కతీతుడై భోగమందు ఇంద్రియలీలల సత్య సౌందర్యముల ననుభవింపుచు విశుద్ధచిత్తుడై యాధ్యాత్మిక భావమందు మైమరచుచుండును.

బాగుగ పరికించి చూచినయెడల శిల్పమునకును ధర్మమునకును నేవిధమగు భేదమును గానరాదు. ధర్మమన నైతిక కాచారముతో గూడిన సాధు జీవితము కాదు. ఆధ్యాత్మిక జ్ఞాన దృష్టి గోచరమగుట యనికదా? ఆత్మతోడ పరిచయమొనర్చుకొనుటయే ధర్మముయొక్క లక్ష్యమైనటుల శిల్పముయొక్క లక్ష్యముగూడ నాత్మపరిచయమే గదా!

# సంతుష్టి – శాంతి.

( గరిమెళ్ల సత్యనారాయణగారు )

క

హద్దుమీఱు విలాసమం ♦ దన పరతము
కొట్టుకొనుచును మదిచెడ ♦ గొట్టుకొకు;
ఘోరతరదుఃఖ పర్వత ♦ ప్రాంతమందు,
హృదయమును శకలములు కాగ ♦ విరువబోకు;
పరవరోచిత మధ్యమా ♦ వస్థదాటి
ఉన్నతంబుగఁ దేల్చెడి ♦ యుత్సుకంబు,
అడుగునకు ముంచెడివిచార ♦ మవనియందు
లేదు లేదయ్య నిజముగా ♦ లేదు లేదు.

చ

అదిగొ గనుము విలాసిని ♦ యాలయంబు
అతిసమీపంబు నందునే ♦ యలరుచుండు,
రంగు లెక్కించినది కుడ్య ♦ రంగములను
అరుగువారికి కనువాంఛ ♦ లతిశయిల్ల,
అరుగు మీదను సంతోష ♦ మంకురింపఁ
గూరుచున్నది సొగసుగా ♦ కులుకులాడి,
సంతతము సుదేశికము ♦ సంతసంబు
సూచనము చేయునాకముల్ ♦ జూచియేని
తెలియగవచ్చును నీపది ♦ యెవరిగృహమొ!

ఉ

పూలుసిగనిండ విరివిగా ♦ ముడుచుకొనియు
వేలుకుచ్చెళ్ల చీరధ ♦ రించుకొనియు
మావల యొడాణమున కొక్క ♦ ముంచుకొనుచు
పైటవిసు వారగా కొంగు ♦ బట్టుకొనుచు
ముంగురులు నెత్తి మీదికి ♦ ముడుచుకొనుచు
నిలచు వాగ్గృహరాణియా ♦ తలుపుచెంత,
మృదుల రవమునఁ బాడుసం ♦ గీత మెప్పుడు.
దరహాసమునకు నొకతూరి ♦ తెరిపినిడు.
చప్పట్లుగొట్టి కేకలు ♦ సలుపుచుండు
దారిపోయెడి వారిని ♦ నేరబిలుచు
గొంతుగను బిగ్గరగ నెత్తి ♦ కోమలాంగి,
బాటసారులఁ దివురుక ♦ వాటమందు
గాక లేవను నెచట సౌ ♦ ఖ్యముల నెల్ల
అరుగబోకుము అగ్రహం ♦ బరయ నెప్పుడు
తరచుగా నామె స్నేహంబు ♦ జరుపుచుండు
జనులతో చేయకుము పరి ♦ చయము నెప్పుడు.

త

చుట్టలను ద్రావుచుందురు ♦ షోకుకొరకు
కళ్లజోళ్లుంచుచుందురు ముఖ ♦ కాంతికొఱకు
విలువదుస్తులు ధరియించి ♦ వీథులందు
నడచుచుందురు పనిగల్గి ♦ నట్టులెపుడు
సానికొంపలె నూనివా ♦ సములు వారి,
కాపె కులుకులె వారికా ♦ హార, మామె
మాయలే వారు పఠియించు ♦ మంత్రతతులు
ముంతకల్లె యుసమ్మ్రియా ♦ మెగుడకిచ్చి
బిచ్చమెత్తుచు నుందురు ♦ వీథివీథి
మదములో బుట్టితిమటంచు ♦ మురియుచుందు
నవ్వుచుందురు పరితృప్తి ♦ నజనములను
నెత్తికెక్కును మూఢత ♦ విద్యశూన్య

పర్వతముగాక సౌఖ్యమా♦ వారిపనులు?
పెంకితనముకు వారికి♦ లంకెయెపుడు
నాశనపథంబునకు వారి♦ నడపుచుండు
నిలచినడచెడి యడుగుల♦ న్నియును హితుడ?
ఆపదలువారి చుట్టును♦ నెనసిరించు.
పాదముల క్రింద సతతంబు♦ వాయితెరచి
వేచి వలె వేచు నాశన♦ కూపమదియు

౫

తిప్పదృష్టులు రెండవ♦ దిక్కునకును
లోపయొక్కటి తోచునా♦ త్రోవమీద
దట్టముగ నీడలన్ గ్రమ్మె♦ చెట్లు లెల్ల
తరచుగానట్లు పోయెడి♦ నరులు దక్క
యొంటిగ రెవ్వరు వచ్చుట నెసగువనుచు
దుఃఖకామిని గుడిశయా♦ త్రోవయందు
కట్టుకొను చుండు నా మెకు♦ గుండెలెపుడు
తోగుచుండు నిట్టూర్పుల♦ దుఃఖమెపుడు
నోటినిండను నెప్పులా♦ బోటికెపుడు
"స్వార్థమీ మానవత్వంబు ♦ వ్యసనములకు
పాపములకును దృఢమైన♦ పట్టుకొమ్మ"
అనుచుబోధించు బ్రీతియా♦ యంగనకును
జన్మ సాధారణం ప్రక♦ ష్టముల కెల్ల
జట్టువిరబోసు కొని మొఱల్♦ పెట్టుచుండు
త్రోవయంత ప్రతిధ్వనుల్ ♦ తోడనించ.
ఎంతమంచైన తనయొద్ద♦ కేగుదెంచి
బోధపరచుచునుండి నన్ ♦ బోధపడదు.

౬

ప్రకృతి యందా మెరయే కీడు♦ పట్టుకుమ్మ
ఆపెకను గొనదే వస్తు♦ వైనగాని
చమరకుండగ దుఃఖబా♦ ష్పములతోడ
ఏదియో యొక దానికై♦ యేడ్చు మొఱలె
రాత్రిపవలును నయ్యింట♦ రాజుచుండు
అగృహసమీపమునకు నీ♦ వరుగకయ్య
అంటురోగంబు వంటిది♦ ఆమెయూర్పు
ఆవలునోద్యాన మునకును♦ చేష్టలాడగు
పత్రపల్లవములు వాడు ♦ఫలము లెల్ల
మ్రగ్గిపోవునా యమదృష్టి♦ మార్గమునంగ
అవిలాసిని యలుకీడ♦ యరుగునెడల
దుఃఖనిలయంబునకునిన్ను ♦ తోడుకొనును
పాదయుగ్మంబు, జాగ్రత్త♦ పడగదయ్య.

౭

రెండిటికి సమదూరమం దుండునదిగొ
శాంతిదేవత గేహమా♦ చాయబొమ్మ
పత్రఫలపుష్ప భూషిత♦ పథమొకండు
జనెడి నప్పుడు మోదంబు ♦ జరుపుచుండు
ఆమెం గనుగొనమది యొప్ప♦ దాత్రమొందు
అధికపరితృప్తియు నపాయ♦హారిణ శక్తి
ఆనుగు చెలికత్తెలై యామె♦ కలరుచుంద్రు
మోదయుతయైన సుఖములో♦ నిదుకొనను
సముచితా లోచనంబులు♦ సలుపునైన
రాణగోల్పోదు దుర్వ్యవహా♦ రమున మునిగి
దుఃఖమప్పుడు కన్నుల♦ దోయమిడక
సౌఖ్యమప్పుడు పెదవుల♦ సలుపక బోక
అరయు సమదృష్టినిశ్చల♦ మైనమతిని.

౮


అచటనిల బడి నిచుట్టు♦ వరసెదేని
కొండమీదనుండి వెలెగ♦ న్గొనగగలవు
జనులవహాధ్యతి లెల్లనో♦ శాంతమూర్తి!
హృదయ సంతృప్తి కరసౌఖ్య♦ మెల్లగోల
తమ్మబోలెడి మిత్రబృం♦ దమ్ము లెల్ల
వెంటవేసుక కొందఱు♦ వెడలుచుంద్రు
అవ్విలాసిని మోసంబు♦ లాశ్రయింప
మద్దుమీరు విలాసమం♦ దణగిపోవ.
చటులదుఃఖంబు మదిని చీ♦ కటులు గ్రమ్మ
శాంతి వసియింపనమితవి ♦ చారమందు
జీవన ముపద్రవములకు♦ చిక్కులకును
నెలవటంచును గొందఱు నేడ్చియేడ్చి
చాటుచుంద్రఖిల ప్రపం♦ చంబులందు.
అరయుమయ్య విచారమా♦ ర్యతులు వారి
అధికమగు జాలిమదిలోన♦ నమనయింప
వారితప్పులు కనికను♦ లారనీవు
త్వరగ దిద్దుమ / మవ ♦ ర్తనమునందు.

———:o:———

# పోలయవేముని కొండపల్లి తామ్రశాసనము

(కానూరు వీరభద్రేశ్వరరావుగారు బి. యే. యల్. టి.)

ఈతామ్రశాసనము కొండపల్లిలోనొక విష్ణ్వాలయమునందుండగా, ఆమునిసిపల్ కరణముగారి కొడుకగు బుద్ధిరాజు హనుమంతరావను బాలకవి చూచి ప్రకటనార్థము నాయొద్దకుఁ బంపెను. ఈశాసనము కొండపల్లిలో దొరకుటవలనను, పోలయవేముని వేమవరపు



మొదటిరేకు. మొదటిప్రక్క

శాసనమింకొకటి యుండుటవలనను, దీనికి కొండపల్లి శాసనమని పేరిడితిని. కొన్నిదినముల క్రితము రెడ్లశాసనముల విషయమై పరిశ్రమఁజేయుచు, చెన్నపట్టణమందలి మాన్యుస్క్రిప్టు లైబ్రరీలోని లోకల్ రికార్డులను పరిశీలించుచుండ నీశాసనపు ప్రతియందు గానవచ్చెను. ఈశాసనపు రేకులను ఇలియటు దొర నూరేండ్లక్రిందట నాయాలయము నందే చూచి, వానియాకారాదికములను వర్ణించి, సరియైన ప్రతి వ్రాసికొనెను. కాని యాప్రతిలో శకసంఖ్యాదులనేక విధములుగ దిద్దఁబడి, ఏకాలపు రాజు శాసనమైనదియుఁ దెలియరాకుండెను. సరిస్తుతపు రేకులవలన నట్టిసంశయములు నివారింపఁబడెను.

ఈశాసనము రెండు రాగిరేకులపై రెండుప్రక్కలను వ్రాయఁబడెను. ఒక్కొక్కరేకు 6. 8 అంగుళముల పొడవుగను, 4. 7 అంగుళముల వెడల్పుగను, కొంచెము దళసరిగను ఉన్నది. ఈరెండు రేకులును ఒక గుండ్రని కడియములోఁ గ్రుచ్చబడినవి. ఈకడియపు వ్యాసము 2. 6 అం. ఈరాగికడియమునకొక చిన్న రాజముద్ర దీర్ఘవృత్తాకారముగ నతికించి


యున్నది. ఈ రాజముద్రమీద ముద్దులు మూటగట్టుకొనవలసిన విగ్రహముకలదు. అక్షరములు లేవు.

శాసనమందలి భాష తెలుగు. ఒక సంస్కృత శ్లోకమును, చివరనూ మూలు శ్లోకములు మూడును కలవు. వ్రాయసకాడు కొంచెము శ్రద్ధతో నక్షరములు వ్రాసినట్లు కనబడుచున్నది. కొన్నిచోట్ల అక్షరములు లోపించినవి; కొన్నియెడల ననవసరముగ చేర్చబడినవి. చూడుడు. మండ్డలేశ్వర,కు మడ్డలేశ్వర, (పంక్తి. 2) జగనొబ్బగండ్డకు, జగనొబ్బగడ్డ, (పం. 11), పొరగులుంమ్నా అగు,కు పొరిగులుంమ్నగు, (పం. 14) బహులి,కు బహాళి, (పం.20) (చేన్తూమ్నా,కు చేనూన్నాన్నా (పం. 24) కొండ్డపల్లి,కి కొండ్డడపల్లి(పం24, 25), ప్రాగ్భాగ మండ్డు,కు, ప్రాగ్భాగముండ్డు(పం 36,) నిరుతులు,కు నిరుదులు,(పం 38) వ్రాసెను. మరియు నిందు గొన్ని వ్యాకరణ విశేషములు గూడకాన వచ్చుచున్నవి:— పశ్చమాన, ఈశ్వరలకు, గనక, తూరుపుకు, యనపై. శాసన్రకమ ఇందుకోడు అనుకొత్త మాటకలదు. ఈ పదమున కర్థములు చెఱువు, జలాశయము ఏరు. ఇచ్చటుబడ కేటికి కోడని ఉపయోగింపబడి నట్లూహ్యము.

ఆగ్రామపు లెక్కలలో నిప్పటికిని అవైపుపొలములకు కోటి, పొలములని పేళ్లున్నట్లు తెలియుచున్నది.

## అక్షరాముల స్వరూపము

ఈశాసనపులిపి ప్రోలయ వేముని వేమవరము మొదలగు శాసనములలిపిని పోలియున్నది. గుండ్రనికత్తు.ఈలిపికిని వర్తమాన కాలమందలి తెలుగులిపికిని భేదము స్వల్పముగనున్నది. ద యను నక్షరము కుడివైపుగీత బాగుగా కలియకకొంచె మెడమున్నది. క యనుఅక్షరము డ యొక్క క్రిందిభాగములో గొంత నిలువుగ బొడిగింపబడెడిది. ట యనునక్షరము ఇప్పటి




మొదటిరేకు రెండవప్రక్క

ఉ కారములోని మధ్యగీతతీసివేసిన నెట్లుండునో అట్లున్నది. హల్లులతో గలసియున్న ఈ,ఏ, ఓ, ల దీర్ఘమును దెలుపు గుర్తులేదు. ఆ, ఊ లకుమాత్రము దీర్ఘపు గుర్తులున్నవి. ర వర్ణమునకు బదులు శకటరేఫ యుక్తాక్షరము లందు వెలపలగిలక కొన్ని యెడలనుపయోగింపఁబడినది.

## శాసనమందలి విషయములు.

మొదటనిందు కొండవీటి రెడ్డిరాజుల మామూలు బిరుదము లీయబడినవి. మొదటి కొండవీటి రెడ్డిరాజగు ప్రోలయ (దేసటి) వేమారెడ్డి కి). క

(1324–1350) వేమవరమను గ్రామమును సూర్యోపరాగపర్వణి పుణ్యకాలమందు కృష్ణాగర్భములో అమరేశ్వర సన్నిధానమందు దానమిచ్చెను. ప్రతిగ్రహీతలు యజనాది షట్కర్మనిరతులును, ఆగమశైవశాస్త్రధర్మ కర్మపారగులునగు దుగ్గిరాల రామలింగము, మూలస్థానం సోమలింగము ఈయఁబడినది కొండపల్లి దండుబాటకు దూర్పుభాగము నందున్న వేమవరమను అగ్రహారము. దీనిహద్దులు:— తూర్పున గిరి; దక్షిణమునపుట్ట; జమ్మిచెట్టు. పడమటకోడు, కోటికి పడమటిభాగము; వాయవ్యంమూల 384 అడుగులకుని, ఉత్తరమున ప్రోగులు, పెయిద్దరిభాగసులకేగాక, ఈయగ్రహారమందు ముగ్గురు రుద్రాభిషేకబ్రాహ్మణులకుగూడ ఎసతులీయబడెను. ఈబ్రాహ్మణులలో నొక్కొక్కరికి 2 వృత్తులచొప్పున నీయబడెను. వృత్తియనఁగా అమ్ద్రోణముల ధాన్యము. వీరికి గ్రామమునకు దక్షిణభాగమును, పశ్చిమమునందు కోటిసమీపమున తొమ్మందుము ధాన్యము పొలమును ఈయఁబడినవి.


రెండవ ప్రక్క, మూఁడవ ప్రక్క

శాసనకాలము శా. శ 1272 బహుధాన్య సంవత్సర మాఘ బహుళ అమావాస్య ఆదివారము. ఇది క్రీ. శ. 1350 నకు సరిపోవుచున్నది.

స్థలనిర్దేశము.

దానమీయఁబడిన వేమవర గ్రామ మిప్పుడు లేదు: వేచిరాకగుట వలన, కృష్ణాజిల్లా బెజవాడ తాలూకా తాడేపల్లిలోఁ (కొత్తూరుదగ్గిర) గలసియున్నది. లెక్కలలో నీగ్రామము రెడ్డివారి వేమవరమను పేరనున్నది. పూర్వమచ్చట యూరుండినట్లుగూడ నిదర్శనము లనేకములున్నవి. శాసనమందుదాహరింపబడిన దేవాలయములు జీర్ణావస్థలో నున్నవి. ప్రాయశః వేమభూపాలుడు తాడేపల్లిలోని కొన్ని భూములను విడదీసి యొకగ్రామమేర్పఱచి, దానికితన పేరు పెట్టి శైవశాస్త్రపండితులకుఁ దానమిచ్చియుండును.


## చరిత్రాంశ విమర్శనము.

ఈశాసనము మూలమున మనకు గ్రొత్తగదెలియవచ్చు చారిత్రాంశములు విశేషించిలేవు. ప్రోలయవేమారెడ్డి శాసనములలో వేమవరము శాసనము (క్రీ. శ. 1344) కట్టకడపటిదిగ నిదివఱకు గానవచ్చె. ఇప్పుడీశాసనమువలన ప్రోలయవేమారెడ్డి 1350 వ సంవత్సరమునందుగూడ రాజ్యవైభవముగ నేలుచున్నట్లును అగ్రహారములు విద్యాతపోవృద్ధ విప్రులకిచ్చి యజ్ఞ

కర్తలుగనునుచు చున్నట్లును స్పష్టమగుచున్నది. ఇత డు క్రీ. శ. 1860 సంవత్సరాంతిమునను లేక మరు సటి వత్సరమునను మరణించి యుండును.

పోలయవేముని కనేక పేళ్ళలవు. ఎఱ్ఱా ప్రెగ్గడవారివంశము నందితని (వేమా, కోమటివేమా, పోలయవేమా, అన్నయవేమా, గేటిదేవా, యని వివిధనామములతో సంబోధించి యున్నాడు. ఈ శాసనము నందితనిపేరు (అనవేమారెడ్డి) గారు, అని యున్నది.

ఇతనికీశాసనమున (రాంజీమలచూరాకార, అను విశేషణ ముపయోగింపఁ బడెను. చంజీ యనునది దక్షిణార్కాడుజిల్లాలోని సుప్రసిద్ధగిరిదుర్గము. వేమ భూపాలుడీ కోటను కాకతీయుల కొలువున నున్న ప్పుడు పట్టుకొని యుండవచ్చునని నా యభిప్రా యము.



ఇంగ కొండపల్లి సందుబాట యుదాహరింపఁ బడియున్నది. ఇప్పటికిని ఈబాటకు దండుబాట యనుపేరు గలదు. ఈ బాటసర్వత్ర ప్రసిద్ధము. ఇప్పటికిని నీబాట హైదరాబాదు వఱకున్నది. పూర్వమీబాట మీదనున్నగ్రామములు విథివిరామము లేక సాగుచుండెనుట దీనివలనను తెలియుచున్నదు.

## కొండపల్లి శాసనము — మూలము.

మొదటివైపు మొదటిప్రక్క

......ఖ బసవశంక్కర శ్రీమదమరేశ్వర
ఇష్టదేవతా శ్రీమన్మహామ (o) డ్లేశ్వరచం
జీమలచూరకారవిశ్వ విశ్వంభరావహనవ
తుదక్షిణభుజాదండ్డ జగనొబ్బగంఅడ్డయామం
డ్డలి కరగండ్డరాయచేకోలుగండ్డఅర్థిజప్రత్యర్థిజ
హేమాద్రిదావనీతఅపరిమితభూదావప
రశురామ సద్గుణాలంక్కార నిఖిల రా
జకిరీట కోటిమణి నిరాజితాంఘ్రి
ద్వయవైరి హృదయ విభింన్నభీకరాటో
పకపిధ్వజవాసటవమభోగభాగ్యధు
రంధరబసవశంక్కర గజనొబ్బగండ్డ
బిరు దాంకుగు శ్రీమదన వేమారెడ్డిజకారు
యజనాదిషట్కర్మనిరుతులున్న అగమ
శైవశాస్త్రమర్మజ కర్మపారగు లున్న
గగ్గిరాల రామలిఙ్గం మూలసానం సో
మలింగ్గం ముజార్కి దగ్గ్రంచేశిన సర్వా
గ్రహార ధర్మశాసవక్రమ యట్లంన్నమకా
వివాహాన శకవషంబులుగా౧౨౭

### మొదటిరేకు రెండవప్రక్క

అగునేటి బహుధాన్య సంవత్సరమాఘ బ
హుళఅమావాస్యా ఆదివారమందు అ
మరేశ్వర। సూర్యోప రాగపర్వణిపుణ్య
కాలమందుకృష్ణా గభఙ్గాంలోను
గిరివీరేశ్వరరామలింగేశ్వర సోమే
శ్వరలను పూజలుచేస్తూన్నకొండ
డపల్లిదండ్ల పాటకఁ గ్రామాగ్నగ మండ్డు
స్వామగ్రిమం వేమవరం బసవశంక్క
రాపఙ్ణంగాదభాఙ్కృతహిరణ్యోద
కదానధానపూర్వాకంగానుధారపోశ
శిఇమిగవక మీ స్తపుత్రిపౌత్రపారం
పర్యంతంగాను అనుభవించ్చిసుఖాన
ప్రతిశేది గ్రామవిస్తారః తూరుపుకు
గిరిదక్షిణావకువల్మీకంశమీ వృక్షం అజ్ఞే
యవిరుతులుసమం పశ్చిమానకుకొండు కొ
టికిపడమటిభాగం మున్నూటయనభైనాలు
గుఅడుగులు యవ్యంమూలకుని
త్తరానకు ప్రాదుగులుఈశాన్యంసమంగిరి

### రెండవరేకు మొదటిప్రక్క

అత్రభాగినః కౌండిన్యసగోత్రః దుగ్గి
రాలరామాశిగ్లుః ద్విభాగినః కాశ్య
పసగోత్రిః మూలస్థానం సోమాత్రిలుః
ఈశ్వరలకు రుద్రాభిషేకకాల ప్రాంహ్మ
లనివఙ్యాలు అత్రిభాగిః వాదూ
లసగోత్రః దేవరకొండ విశ్వనాధభ
ట్టారకాః వృత్తిద్వఙ్గ ం ద్విభాగినఃభా
రద్వాజసగోత్రి గుడిపళ్ళసర్వా
భట్టారకాః వృత్తిద్వయం త్రిభాగినః
లోహితగోత్రఃకావురి రామలింగ
భట్టారకాః త్తివ్వకిధాన్యసంఖ్యద్రోణ
షట్కంపుష్కలచతుష్కం యీమహాజ
నాంలకు గ్రిమానకు దక్షిభాగమున్నా
శ్చమాన తోమ్మంద్దుము ధాన్యముపాలము
శాకాబ్దే నేత్రశైలాగ్ని భూయుతేబహుధా
న్యకే సూర్యరాగోప వేళాయాంమాఖేమా
తాఙ్ండ్డవాసరే స్వనామరచితం గ్రామం
వేమభూపాల సత్తమగిరీంద్రోపరి

### రెండవరేకు రెండవప్రక్క

వీరేశం రామలింగాఖ్య శంక్కరంసోమే
సోమేశ్వరంచ యోదద్యా త్పూజితోపూర్వ
భక్తితః సోమ ర్యరామలింగ్గాభ్యాందదా
వాచంద్రితారకం॥ మద్వంజజాఃప్ర
మహీపతివంజ జావారయేభూమిపా
స్సతతముజ్వల ధర్మచిత్తా మ
ద్ధర్మ మేవసంతి పరిపాల యంత్తిత్వ
త్పాగ్రకద్వయపకాంశిరసావహా॥
మివ్రక్షైభగరిలోకే సన్వపామేమ భూ
భుజాం నభోద్యానకరగ్రాహ్యంవిప్ర
తాపహరం॥ స్వదత్తాద్విగుణంపుణ్య
పరదత్తానుపాలనం పరదపత్తాపహారేణ
స్వదత్తంనిష్ఫలంభవేత్॥ శ్రీరస్తుజబనశ
ంక్కరా॥ శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ



# హిమబిందు

—— ——:o:————

(అడివి బాపిరాజుగారు.)

---

## ప్రథమ భాగము

### సారాంశము

హిమబిందు— [illegible]
కోటీశ్వరుడగు

చారుగుప్తునికి ఒక్కతే కుమార్తె. అత్యంత సౌందర్యవతియగు బాలిక. ఆమెను చారుగుప్తుడు మహారాణిని చేయుతలంపుతో ఆంధ్రమహారాజగు

శ్రీముఖ - సాతవాహనునకు కోడలుగా యువరాజగు

శ్రీకృష్ణ- నకీయఅనేకములగు ప్రయత్నములు చేయుచుండును. ఆఖరికి మగధ చక్రవర్తియగు కాణ్వాయనవంశజుడగు

సుశర్మ - నిజముగుచక్రవర్తి కాప్రయత్నముచేయుచు బౌద్ధమతము నశింపఁజేసి ఆర్యమతము పునరుద్ధరింప సమకట్టెను.

స్థౌలతిష్యులు:- మహాయోగి. సుశర్మ యొక్క అనుచరుల తీసికొని తన ప్రభావముతో ముద్దులమనుమరాలగు

చంద్రబాల -ను విషకన్యకగా చేసెను. ఆ విషకన్యను ప్రయోగించి శ్రీకృష్ణసాతవాహనుని విగతజీవుని జేసి ఆరాజ్యమున శాతవాహన వంశపు బాలకుని హిందువునినుంప ప్రయత్నించును.

రాజశిల్పియగు

సమరకుమారుని - కుమారుడు,

ప్రహారకుమారుడు—అద్భుతమగు శిల్ప చాతుర్యముగల బాలకుడు వ్యాయామక్రీడల నుత్తముడై బండిపందెమున నెగ్గెను. ఆతడు హిమబిందును మోహించును. చారుగుప్తుడు తన్న మిత్రముగ ప్రేమించుతనయతో నీవు యువరాజును ప్రేమింపసిద్ధపడుమని చెప్పును. కాని హిమబిందు ప్రహారుని ప్రేమించియు తమ యిరువురకు సంయోగము కానేరదని తెలియజేయును. విషకన్య శ్రీకృష్ణ సాతవాహనుని బూదిసేయ ననుమతింపని కారణమున స్థూల తిష్యుఁడు కోపించి ఆమెను భయంకరాట వినివదలి వేయును.

## ద్వితీయ భాగము.

### మొదటి ప్రకరణము.

సమవర్తి యుద్ధమున ఆరితేరినబంటు కాని వినీతమునకు సర్వవిధములతో దగుటయే గాక, ఆతను పరిపాలించు నప్పుడు తానే ఆధిపత్యమువహించి లగ్గలకెగు శాత్రవ వరోసుల తోలివేయుచుండెను.

ఒకనాఁడు సమవర్తి దుర్గముపైనుండి వసించికోట గోడలకు బురుజులకు ద్వారములకు బోవు రాస్వంపు బాటలున్నయు గలియు మూలప్రదేశమున నిలిచి తనకడనున్న చారులతో మాట్లాడుచు ఆలోచించుకొనుచుండెను.

ఒకడు:— స్వామీ మనకడనున్న భోజనసామగ్రులు కొంచె మెచ్చుతగ్గుగా అయిపోయినవి. శత్రువులు మనము త్రాగు నీళ్లలో రెండుసారులు విషము కలిపినారు. ప్రయత్నము విఫలమైనను నెప్పటికప్పుడు భయముగా నున్నది.

ఇంకొకడు:— ఆర్యా ఉన్ననాలుగు సర్వతోభద్రములు (రాళ్లవిసురునవి) చూర్ణములైనవి, పదునాలుగు జామదగ్న్యములు (వివిధభాణముల పరపు యంత్రములు) పాడై, ఒక్క యంత్రము ఉత్తరద్వారముకడ పనిచేయుచున్నది. ఆరుదేవ దండములు (అనేకములగు పెద్దమేకులతో వాడిగానున్న ఒకదూలము) పదునొకండు విశ్వాసఘాతములు (బరువుగలిగి విరోధుల పిప్పి చేయు యంత్రములు) శతఘ్నులు, వరాహకర్ణములు, కనాయము, కర్పణములు మొదలగు ఉపకరణములు అయిపోయినవో అయిపోవుచున్నవో.

మూఁడవ యతడు:— ఇంతవరకు ఒకపదిరోజులనుండి మన వేగుల వారుపైనుండి లోనికి వచ్చుటగాని లోనినుండిపైకి పోవుటగాని జరుగుట లేదు. ఈమూఁడు రోజులలో పదునాలుగురు చారులను పంపినాము. కాని విరోధులు వారిని గ్రహించి కారాగృహముల నుంచి నిజముల నరయుటకు వారిని బాధించుచున్నారని తెలియుచున్నది. ఎంతమందివెళ్ళినారో అందరిపేరులు తెలియఁజేసినారు.

నాల్గవ దళవాయి:— వీరోత్తమా, శత్రుసైన్యముల మూఁకలైపోయినవి. గాయములు తగిలినవారు అదృష్టవంతులైనచో జీవించవలయును. లేనిచో దివంగతులు కావలయును.

సమవర్తికన్నులు మిరుమిట్లు గొలిపినవి. ఆతనికిభయ మనునది లేదు. శత్రువులు తన్నుపెట్టు బాధలు ఆతనికి మఱింత ఉత్సా

హము కలుగచేయును. విమానములు మెలిపెట్టుచు "ఆంధ్రసైన్యముల నన్నింటిని నురుమాడినను వారిఅస్త్రములునుగ్గయిపోయినను, వారిఆత్మలువిజయమొందును. మనకేమియు భయము లేదు. చక్రవర్తి నన్ను పంపిన వెనుక శుభదినమునబయలుదేరియుండును. ఒక వారములోగా ననుకొనుడు. వారు అడవుల వెంటరారు. సైన్యములు అనేకములగుటకళింగమునుండివచ్చెదరు కానఅక్కడనుండివచ్చుటకుమూవ్వా అయిదుదివారాత్రములుపట్టును. నేనువచ్చి యిగాదియేడుఅహస్సులయినది. కావుననింక నొక ఏడు దినంబులుమనము మహారణంబుసలిపి చక్రవర్తికై యెదురు చూడవలయును. శాలివాహనశకాకరబగు 'సింహము' ఉజ్జయినీకోటగోడలనుండివారిపోవునా! కొన యూపిరితో సార్వభౌమునికై యెదురుచూడనా. ఇక్కడనుండెనాయాజ్ఞగా తెలుపుడు. ఒక్కవారుడు నుజ్జయినీకోట విడనలదు. నరిలెవుడు గంజికాచి ప్రతివారును మధ్యాహ్నము త్రాగవలయును. యవధాన్యము ముద్దఒకపూటను- బియ్యముముద్ద రెండవ పూటను ఉపయోగింపవలయును .విరోధుల ఆయుధములు కర్చుకానిందు. ముఖ్యావసరముగునప్పుడే మనయస్త్రముల నుపయోగించెదముగాక. కోటబురుజులో కొలదిమందిమాత్రమే యుద్ధము చేయుచుండునది. ఒకనికి కొలదిగాగాయము తగిలినవెంటనే వేరొకడాస్థలము నాక్రమింపవలయును. ముఖ్యావసరములైనప్పుడు మాత్రిముసగము బలముతో యుద్ధము సలిపెదము." అని మేఘగర్జనముల నాతడాజ్ఞాపనల నెరుకజేసెను. అందరును మహోత్సాహముతో 'విజయ! సమవర్తివిజయ సమవర్తి' అని జయజయ వాక్యములబలికిరి. శంఖములనొత్తిరి. భేరీనినాదములు బయల్వెడలెను.

విరోధులీజయ ధ్వానములువిని నివ్వెరగందిరి. చక్రవర్తి వచ్చుచున్నాడేమోయని భయంపడిరి. అప్పుడు మాళ్వాధిపతియు శివస్వాతియు తదితరులు నొకసభ కావించుకొనిరి. వారికేమియు తోచుటలేదు. ఏవార్తలు తెలియుటలేదు. ఒకవేళ చక్రవర్తి వచ్చుచున్నాడేమో! ఏది యెట్లయినను రెండు రోజులలోపల ఆంధ్రులనుగ్గుచేసి కోట జొరబడి స్వాధీనముచేసికొనకున్న వారిగతి తలంప నవసరములేదు.

శర్మ సోదరులు.



వీరు విజయనగర వాస్తవ్యులు. బాల గాయకులు.

# చిత్రకారుని హృదయము.

(వెల్లటూరి సోమనాథము గారు)

ఉదయ మెనిమిది గంటలయ్యెను. వేసగియగుటచే సూర్యుడతి తీక్ష్ణముగా ప్రకాశించు చుండెను. కలకత్తా నగరపు బజారుల వెంట నలుగు రైదుగురు బాలురు "స్టేట్సుమన్ పత్రిక" "స్టేట్సుమన్ పత్రిక" యని యఱచుచు బరుగెత్తుచుండిరి. ఇరువదియైదు వత్సరముల వయస్సుగల యువకుడొకడందొక బాలునాపి రెండణాలిచ్చి యొకపత్రికను గొనెను. ఆ కనబడు సందు చివరనున్న శిథిలగృహమే యాతడుండు యిల్లు. అత డింటికివచ్చి పత్రిక చదువుదమని విప్పగనే యీ క్రింది వాక్యములు కనబడెను.

"ఇద్దరు విద్యార్థినులకు నేర్పుటకై యొక చిత్రకళాచార్యుడు కావలయును.

C% మానేజరు, స్టేట్సు మనుపత్రిక

మదన మోహనుడు చిత్రవిద్యయందు చాలా ప్రవీణుడు. అతని చిత్తరువులనేక ప్రదర్శనములందు బహుమతులు పొంది గొప్పవిమర్శకుల ప్రశంసకు పాత్రములయ్యెను.

పత్రికను చూచి మదనుడొక చిరునవ్వు నవ్వెను.

౨

వంగరాష్ట్రము చాలా యందమైన దేశము. ప్రకృతి సౌందర్యమే వంగీయులను గొప్పకళోపాసకులనుగా జేసెను. ఆదేశములో పల్లెటూళ్ళు చాల యందముగ నుండును.

మిద్నపురముకడ రాత్రిపదకొండు గంటలకు రైలు ఆగెను. ఒక్క ప్రయాణికుడు మాత్రమే అస్టేషను వద్దదిగెను. అతని కొరకు వేచియున్న బండివాడు సామానును బండియం దుంచెను. ప్రయాణీకుడు బండినెక్కెను. గుఱ్ఱమతివేగముగా పరుగెత్తుచుండెను. అయంధకారమునగూడ అప్రయాణికునకు తనచుట్టునున్న ప్రకృతి సౌందర్యము కనబడుచునే యుండెను.

ఒక రెండంతస్తుల భవనముకడ నాబండియాగెను. ప్రయాణికుడుదిగెను. ఇంటిలోని వారందరు నిద్రించుచున్న యటులుండెను. వంటబ్రాహ్మణుడు వడ్డించగా యాతడొక్కడే భోజనముచేసెను. అనంతర మాతనికొక గదిని చూపిరి. ఆగది కిటికీలోనుండి అతడు చూడగా ఆకాశమున తారకలు మిణుకు మిణుకు మనుచు వెలుగుచుండెను.

నేటిరాత్రి నేనెట్టి బంగరు స్వప్నముల గాంచెదనో యనుచు అతడు పరుండెను.

౩

నలినకాంత బాబు ఇంగ్లండునందు ఐ. సి. యస్. పరీక్ష ప్యాసయి ముప్పది యేండ్లుద్యోగము చేసి రెవెన్యూ బోర్డు మెంబరు పదవిలో పింఛను పుచ్చుకొనెను. అతని కిప్పటికి వయస్సు అరువదివత్సరములు. అతని భార్యాసరళాదేవి నాలుగేండ్ల క్రిందనే యీలోకమును వీడెను. అతని కొక్కతే కూతురు. తల్లిదండ్రులులేని తమ్ముని కూతు రగు లలితను గూడ యాతడే పెంచుచుండెను.

నేటి యుదయమున నాతఁడెవ్వఁడో యొక నూతన పురుషునితో సంభాషించుచుండెను. కొంతసేపటి కతఁడు "సేవకా లలితను మాలినిని పిలుచుకొనిరమ్ము" యని సేవకుని కాజ్ఞాపించెను. వారలు వచ్చులోపల నలినకాంతుఁ డా నూతన పురుషునితో నీ విధముగ సంభాషించుచుండెను. "మిద్నపురము అందమైన ప్రదేశముకాదా! వసంతభవనము మీకు బాగుగనుండెనా!"

"చిత్తము"

"మీకొరకేర్పరచిన గదిమీకు సౌఖ్యకరముగ నుండెనా!"

"చిత్త" మనియానూతన పురుషు నెడను "మీకిక్కడగు ఖర్చులు భరించి.

అని యేమో చెప్పబోవుచుండగా తలుపు తెరచిన చప్పుడు వినబడెను. మాలినియు లలితయు వచ్చిరి. "వీరే మీయాచార్యులు, వీరు కలకత్తా పట్టణమునందు చాలా ప్రఖ్యాతిగాంచిన చిత్రకారులు" అని మన నలినకాంతుఁడు అతని వారల కెరుకపరచెను. వారిద్దరు భక్తిపూర్వకముగా మదనునకు నమస్కరించిరి. నలినకాంతుఁడు, మదనమోహనునితో మరికొన్ని విషయములగురించి మాట్లాడి భోజనపు వేళయైనదని వంటవాఁడు చెప్పగా మదనునితోఁగూడ భోజనమునకు లేచెను.

౪

మూఁడు నెలలు గడచెను. మదన మోహనునకు మిద్నపురమునందు చాలా సౌఖ్యముగ నుండెను. అతఁడు తన శిష్యురాండ్రిద్దరితో ప్రతి సాయంతనము నలినబాబు బండియందు షికారునకు వెళ్ళును. భోజనానంతరము ప్రతిదినము మాలిని అతనికొరకు సంగీతము పాడుచుండును.

లలితమందమతి; అందకత్తెయు కాదు. ఆమెకు వంట చేయుటయందు ఇతర గృహకృత్యములందు నెక్కుడు ప్రేమ. మాలినికి మాత్రము సంగీతమన్నను చిత్రకళయన్నను చాలప్రీతి. లలితకొలది దినములైనతరువాత ఆచార్యుల వద్దకుపోవుట మానివేసెను. మాలినిమాత్రము దినమునకు కనీస మొకగంటయైనను అతనితో గడుపుచుండును.

అతనికి దిలాన్ బల్లవద్ద కూర్చొని ఆమె పటముల గీయుచుండును. మదనుఁడు ఆమె ప్రక్కనే కూర్చొని ఆమె వ్రాయుచున్న వాటిని దిద్దుచుండును. అతఁడామె మీదకు వంగి అమ్మాయి హస్తమును తన చేతితో పట్టుకొని దిద్దుచుండును. అట్టి సమయమునందామె ముంగురులు గాలికెగిరి అతని చెక్కిలిదాకి యతని మోహపరవశుని చేయుచుండును. ఆమె హస్తస్పర్శన మాతని తన్మయునిగ చేయుచుండును. అతనిమనస్సు అక్కడలేదు.

ఆవేళ బొమ్మ "సముద్రపుటొడ్డు." మాలిని యలలను యెర్రరంగుతో గీయుచుండెను. మాలిని మనస్సెక్కడో! మదనుకును దిద్దడయ్యె. కొంతసేపటికి "ఇదేమి యుపాధ్యాయా! నీరెక్కడనైన నెర్రగానుండునా? నేనుతప్పు వ్రాసిన మీరలైన దిద్దరేరి." అని మాలినియనెను "పొరపాటు మాలిని క్షమింపుము." అనుచు నతఁడు చెంగున లేచిపోయెను.

మాలిని నేత్రములనుండి యొక వేడియశ్రువు రాలెను "అసంభవము అసంభవము" అనుచు యామెయు వెడలిపోయెను.

౫

ఒక సంవత్సరము గడచెను. మిద్నపురమునకు నాలుగు మైళ్ళదూరమున నున్న ఆనంద పురపు జమీందారునకు మాలినినిచ్చి వివాహము చేయుటకు నలినబాబు నిశ్చయించెను. జమీందారునకు వలువది యేండ్లుండును. లలిత కీసంబంధ మిష్టములేదు. మాలినియేమో మాటాడలేదు.

మదనుని పనిపూర్తియయ్యెను. మాలిని చిత్రకళయందు కొంత ప్రావీణ్యత పొందెను. ఇంకొక వారముదినములకామెకు వివాహము కానున్నది. నేటి సాయంకాలము మదనుఁడు కలకత్తాకు పయనమగును. ఆదినమున నలినకాంతుఁడూరలేఁడు. లలిత గృహ.

కృత్యముల యందు మునిగి యుండెను. భోజనానంతరము మాలినిని చూడవలెనని అతనికి కోర్కె గలిగెను. నాలుగుదినముల నుండియు జ్వరముగుటం జేసి మాలిని యాతని కగుపడుటయే లేదు. అతడామె గదియొద్దకేగి మెల్లగ తలుపు తెఱచెను. మాలిని "యెవ" రనెను. "మాలినీ నేనే," యనెను మదనుడు. "రమ్ము ఉపాధ్యాయా, రమ్ము," యనుచు మాలిని తన పడకమీద కూర్చొనుట కాతనికి నాజ్ఞచేసెను. మదనుడామె హస్తమును తన చేత యందిడుకొని "మాలినీ! నీ సెలవు గైకొనుటకై వచ్చితిని మిమ్ము పురమును వీడవలసిన రోజు వచ్చినది. సెలవిమ్ము. నేటితో మన స్నేహ మంత మొందవలెను. నీవొక గొప్ప జమీందారిణివి కాగలవు. ఎప్పుడైనను నీ చిన్ననాటి చిత్రకళాచార్యుల స్మరించుచుందువా" యనెను. "మదనా," యని మాలిని రుద్ధకంఠమున బల్కెను. మదనుని కది స్వప్నముగ దోచెను. అతని శరీరము పులకరించెను. మాలిని "తలగడక్రింద నున్న పుస్తకము తీయుము," మని యతడా పుస్తకమందించగా నామె తీసుకుని మరల నతని చేతియందిడి "మాలిని హృదయమిదిగో, మదనా భద్రము సుమా." యనెను. ఆ పుస్తకమునందు మదనుని యొద్ద యామె వ్రాసిన బొమ్మలన్నియును, కచ్చుగా కట్టియున్న యామె నల్లని కుంతలములు కొన్నియు నుండెను. మదనుడా పుస్తకమును కంపితహస్తముతో నందుకొని "మాలినీ నేనిది నా ప్రాణముకంటె నెక్కుడు శ్రద్ధతో గాపాడుకొనెద" ననెను. అతని నయనములు సజలములయ్యెను. దేహము వివశమయ్యెను. మాలిని యాతని కపోలములు ముద్దిడుకొని "పొమ్ము. మదనా, పొమ్ము నీకు శుభమగుగాక! యిది యే మన యంత్య సమాగమ" మనెను. ఆమె హస్తముల ముద్దిడుకొని, మదనుడా గదినుండి వెడలెను. తలుపవతలనుండి యాతఁడీవాక్యము వినెను.

"అహా మదనా! యీముద్దుతో నా ప్రపంచ యాత్రముగియుగాక!"

౬

దినములు గడచెను. మదనుడు బొమ్మలు వేయుచునేయుండెను. కాని విమర్శకులు వాటిని యీసడించిరి. పత్రికలు మదనమోహను నందీ మార్పునకు కారణమేమని వితర్కించెను.

అతడిప్పుడు తన కలకత్తా గృహమునందుండెను. గడ్డము పెరిగెను. రూపుమారెను. మదను డొకపిచ్చివానివలె నుండెను. టపాలవాడు వచ్చి యతనికొక కవరు నిచ్చెను. దానిమీద ఆనందపురపు ముద్రయుండెను. అందులో ఆరాధన యను నొక యపూర్వమైన బొమ్మయు, నీక్రింది యుత్తరము నుండెను.

"ఉపాధ్యాయా,

మీరు మృత్యువును చిత్తరువు నందు వ్రాయగలరా?

మాలిని,"

మదనుడు "మాలినీ! మాలినీ! నీ నామ మెంత మధురము" యనెను.

మఱునాడు పత్రికల యందీవార్త కనబడెను.

"ఆనందపురపు జమీందారుని సహధర్మచారిణి యగు మాలినీదేవి, నిన్నరాత్రి పదునొకండు గంటలకు తన భవనమునకు సమీపమందున్న బావియందుపడి స్వర్గస్థురాలయ్యెను."

౭

మదన మోహనుడు మృత్యువనుపటమును వ్రాసెను. విమర్శకులు దాని నెంతో పొగడిరి. పత్రికలా బొమ్మను చాలా మెచ్చుకొనెను. మదనువంటి చిత్రకారుడు వంగదేశమున లేడనిరి. ఆ బొమ్మ చాలా బాగుగ నుండెను-

"అంధకారము, ఆకసమున తారకలు మబ్బుల చాటున డాగి యుండెను. ఒక రాజ మందిరము ప్రాకారపు గోడవద్ద యొక పెద్దబావి. తెల్లనిచీర గట్టుకొని, పుష్పాలంకృతయై యొవనియందు తన భావమునుంచెనో యొవని పొందనేరక మృతిజెందుచుండెనో, వానిని భావిజన్మముల యందైనను తననాథు చేయుమని

ఈశ్వరుని వేడుకొను భావము ముఖమునందు కనబరచుచు, నొక స్త్రీ, ఆభాగిలో పడుచుండెను."

వేలరూప్యముల నిచ్చెదమన్నను మదనుడా బొమ్మ యెవ్వరికిని యమ్మడయ్యె.

౭

ప్రపంచయాత్ర యంతరించినది. చిత్రకారుని జీవితమంత అంధకారమయము. దానినిశ్యామలీ పుష్పమునకు బోల్పవచ్చునా?

మదనుడు తనవద్దకూర్చుండిన ముసలి జననితో "తల్లీ! యీపుస్తకము మాత్రము నాశరీరముతో పాటగ్ని కాహుతి కావలయును. మఱచిపోయెదవుసుమా" అనెను. ఎగదిగోడకొక పటము గట్టబడి యుండెను. మదనుడు దానిని జూపి అమ్మా ఆపట మిటు తెమ్మనెను.

ఆపటమందికొని మదనుడు "మాలినీ నీయారాధన యింకనుముగియలేదా— ప్రియతమా! ఆయొద్దున నాకొరకు వేచియుంటివా—వచ్చుచుంటిని. వచ్చుచుంటిని వచ్చుచుంటిని—

"తల్లీ! యెక్కడదీ వెలుగు! యెక్కడదీ వెలుగు"

* * * * *

అతని మరణానంతరము పేదరాలగు మదనుని తల్లి, కొడుకువ్రాసిన మృత్యువనుపటము నమ్మకమునకుజూపెను.

ఆనందపురపు జమీందారు ఐదువేల రూప్యములొసంగి ఆపటముకొనెను.

# భ్రమ.

(పెమ్మరాజు వేంకటపతిరాజుగారు)

ఆదియొక చిన్నపక్షి. అనంత నీలాకాశమును చూచిన కొలదిని దాని శరీరము గగుర్పొడుచుచుండెను. హృదయమునుండి యానంద తరంగములు పొంగి పొరలుచుండెను. ఉదయము మొదలు సాయంతనము వరకు పాడినను దాని గానమున కంతము లేకుండెను. అనంత గగనమున నెంతదూర మెగిరినను దానికి బడలిక దోచదాయెను. ఒకశాఖనుండి మరియొక శాఖకు, ఒకవృక్షమునుండి వేరొకవృక్షమునకు, ఒక లతాకుంజమునుండి మరియొక లతాకుంజమున కేగి యాడుచు పాడుచుండెను. కాని దానికి యలసట యనునది దోచుటెట్లు? ఆ పక్షిపేరు కోకిల.

ఒకదినమున నది దినమంతయు నృత్యగీతములొనర్చి యనంత సునీలగగనమండలము నంతయు గనుగొన ప్రయత్నించి తిరిగితన కులాయమునకువచ్చుచుండ మార్గమునందొక గృధ్రము గన్పడెను. అది కడు ముదుసలి. జీవితమందు పదునాలుగువీసములు గడచెను. గృధ్రము కోకిలను చూచి యిట్లనియె. "ఓకోకిలా? రా! నాకడకూర్చో" కోవెల యావృద్ధగృధ్రముమాట నతిక్రమించక వినమ్రభావమున గృధ్రముకడకు వచ్చి కూర్చుండెను. అప్పుడు గృధ్రమిట్లనియె. "నీవు పనిదానవు; చపలచిత్తవు. అకారణముగ శాశనము జెందుచున్నావు. ఏలయనుకులవిచ్చలవిడిగ దిరుగుచున్నావు. ఇందువలన ప్రయోజనమేమి? ఎండమావులయందుదక ముండునా?"

గృధ్రముయొక్క కఠినమును—కఠోరమగు వాక్యముల వినుచు కోకిలరెక్కలు ముడుచుకొని గడగడ వణకుచు కూర్చుండెను. దాని జీవితమందలి యానంద మంతయు అంతర్థానమాయెను. అప్పుడది భయముతోడ గృధ్రమును తదేకనిష్ఠతో చూచుచు "ప్రభో" అని యనెను. కాని దాని తర్వాతదాని నోటమాట రాకుండెను. గడగడ వణక సాగెను.

గృధ్రము:— ఓరీ మూఢుడా? నామాటల సావధానముగ వినుము. నేడు నీకు ధర్మోపదేశ మొనర్తును. నీ పూర్వజన్మ పుణ్యము మంచిది. అందువలననే నీవు నాకంటబడితివి. లేకున్న ధ్వంసమై పోయి యుందువు. విను— నామాటల జాగ్రత్తగవిను. నీవుచేయు నృత్యమువలన నిన్ను పాపము చుట్టుకొనుచున్నది. నీవు మహాపాపివగుచున్నావు. నీవు పాడు సంగీతమునకంటె జఘన్యకార్యము మరియొకటి లేదు. నీయంతరిక్ష సంచారముకంటె భ్రమ వేరయొక్కటియున్నదా? మూర్ఖా?

కోకిల:— చిత్తము, ప్రభో? చిత్తము.

గృ:— భ్రమ. అత్యంత భ్రమయందు వసులొక్కని యున్నావు. ఇంతకు మించిన భ్రమ భూమండలమందు మరియొకటి కానరాదు.

గృధ్రవాక్యములు కోకిలకు నచ్చలేదు. దాని జీవితమునకు ధర్మోపదేశములకును సంబంధముగనుపడలేదు. అందువలన గృధ్రము వాక్యములు దానికర్థముగాకుండెను. అయినను వృద్ధగృధ్ర మనుభవమువలన చెప్పుచున్నదని యనుకొనుచు యదిచెప్పుదాని

యర్థమునుగ్రహింప యత్నించుచున్నను దానికి ప్రశ్న మీద ప్రశ్న యుదయించుచుండెను. అందువలన నది యిట్లనియె. ప్రభో! సునిర్మలాకాశమున విహరించు నప్పుడు నా కమితానందము గలుగును గృధ్రరాజా?

గృ:— ఈయానందమే భగవానుని మార్గమునకంతరాయము; విఘ్నము. బోధయైనదా? మందమతివలెనున్నావు. మూర్ఖా?

కో:— (విస్మయమున) భగవానుఁ డెట్టివాడు?

గృ:— వత్సా? అవహితచిత్తమున వినుము. భగవానుడు ఆనంద మయుడు. అతడు చరాచరజంతుజాలముతో గూడిన యీభూమండలమును సృష్టించెను.

ఈవాక్యములు వినినంతనే కోకిల తెప్పరిల్లినట్లాయెను. దాని ప్రాణము సంతుష్టిఁబొందె. యేదియో చెప్పబోవుచుండ నడ్డగించి గృధ్రమిట్లనియె. "వత్సా! ఇంకను చెప్పవలసియున్నది. ఆయొక్క భగవానుడు మాత్రమే సత్యము. మిగిలినదంతయు మాయ."

ఈమాటలు వినగనే పక్షిప్రాణవేగము కట్టుబడెను.

గృ:— వత్సా? ఈవిషయమునుగూడ గట్టిగ మనమునం దుంచుకొనుము. భగవానుడు నిరాకారుడు అనిరా సత్యము. సాకారుడగుట మాయ. భ్రమ. భగవానుడు నిరాకారమున నానంద మయుడు. సాకారమున దుఃఖమయుడు. ఇహ జీవితమందే కొంచమైన యానందముండిన యెడల నదియంతయు పైశాచిక లీలయని యెరుంగుము. మనజీవితమందలి సరసమును సరళమునగు దానిని భగవానుని మార్గమునకంతరాయమని దృఢముగ నమ్ముము. జీవితమందు ప్రియముగ దోచుదానిని విషతుల్యముగ బరిత్యజించుము. భగవానుడు శ్రేయముగాని ప్రేయముగాడు.

కోకిలకా వృద్ధగృధ్రము చెప్పినవిషయము బోధపడలేదు. మరియు నాయుపన్యాసము దానికి తలనొప్పిగనుండెను,

కో:— ప్రభో, అయితే నేనేమి చేయవలయును?

గృధ్రము:— వత్సా, నీవు తప్పు దోవనఁ బ్రోక్క వలదు; ఎగురరాదు.

కో:— ప్రభో? మీరెప్పుడును నెగురలేదా!

గృ:— ఎగిరినాను. ప్రయోజనమేమి? నాకప్పుడుపదేశములు చేయువారు లేరైరి. నీసౌభాగ్యమువలన బాల్యముననే నీకు సదుపదేశము ప్రాప్తించినది.

కో:— నా రెక్కలెగుర నుంకించుచుండును. ఏమి చేయుదును.

గృ:— దానికొక యుపాయము చెప్పెదను వినుము. నీయింటి కేగుము. అరటిపీచును సంపాదించి దానితో రెండు రెక్కలను బంధించుకొనుము. అప్పుడు రెక్కలు తిక్కకుదురును. గృహమున కేగుము. భగవానుడు నీకు మంగళము నర్చుగాత.

కోకిల యుత్సాహశూన్యమై తన కులాలయమునకు బయలుదేరెను. కాని హృదయ మందా యానందము— నేత్రముల యందాకాంతి మొదలగునవి లోపించెను. జీవితము దుర్భరముగ దోచుచుండ తన కులాయమునకువచ్చి రెక్కలరెండింటిని యరటిపీచు తోడ బంధించుకొనెను. "భ్రమ— జీవితము భ్రమ— జగత్తంతయు భ్రమ; భ్రమ. భ్రమ." అనిజపము చేయసాగెను.

ఆదినపురాత్రి దానికి నిద్దురరాలేదు. కన్ను మూయలేదు. రెక్కల బంధించుట వలన గలిగిన బాధ వలనను దుశ్చింత దుర్భావనవలన దాని మనముతల్లక్రిందులుగా జొచ్చెను. శరీరమనో బాధల తలక్రిందులగుచుండ తెల్లవారవచ్చెను. ఒకింత నేత్రములు మూతబడెను. పూర్వాకాశము అరుణరాగ రంజితమాయెను. ఉషః కాంతుల స్పర్శనలన కాననమందలి పలువిధ పుష్పములు వికసింప జొచ్చెను. తుమ్మెదల మృదుమధుర రవము మిన్నుముట్టుచుండ విహంగములు కులాయములనుండి వెల్వడియానంద ముగ పల్కులుబల్కుచు బాడుచు నయరుణకాంతుల

నభోమండలమున నెగయుచుండెను. ఆయుషఃకాంతుల కులికిపడి కోకిల నేత్రములు దెరచెను. మహార్త్రకాలము శరీరమునో బాధలమరచి నభోమండలమును దిలకింప ఆ సునీలాకాశమండలి యానందజ్యోతులు, ఆప్రాతఃకాలమందలి మలయమారుత సుగంధము— అకుసుమిత పుష్పముల చిరునగవులు, లతలకొలది పక్షుల మృదుమధుర కూజితములు మొదలగునవన్నియు మనోముగ్ధకరములై జీవుల పరవశ మొనర్చుచుండెను. కాని యప్రయత్నముగ కోకిల నేత్రములు వారిపూరితములాయెను. నేటికిగదా సద్గురుని కృపవలన భ్రమజాలమునుండి దప్పించుకొనగలిగితిని; ధర్మమున చరింపగలిగితి ననుకొనెను.

౨

ఇటులనే కోకిల కాలము గడుపుచుండెను. ప్రతిదిన ప్రాతఃకాలమునను సుందరమగు ప్రకృతిని దిలకింపుచుండెను. జీవరాసుల క్రీడావినోదముల గాంచునప్పుడు దానిరెక్కలల్లాడుచుండెను. కాని యదియేమి చేయగలదు! రెక్కలు బంధింపబడియుండెను. కాని యప్రయత్నముగ కన్నుల నీరుగ్రమ్ముచుండెను.

అది మనమునందిట్లు తలపోయ జొచ్చెను. "భగవానుడా! నీవింత కఠినుడవా? నీయనంతాకాశమున నానందముగ విహరింపుచు నిన్ను ధ్యానించుటెంత సుకరము. ఆనందముగ నీనామమును గానము చేయుట కీమలయమారుత మెంతగ తోడ్పడును. ప్రభో! ఏలనాకిట్టి దుఃఖమును కలిగించితివి? దేనిని నామనము కోరుచున్నదో యవియన్నియు నీమార్గమున కంతరాయము లేల గావలయును? నేప్రేమించిన దంతయు భ్రమయగుటకు కారణమేమి? భగవానుడా? ఆర్తజనావనా! నీ వింతటి కఠిన చిత్తుడవా."

అభ్యాసమువలన నేది యలవడదు? క్రమక్రమముగ దాని రెక్కల చలనము కట్టుబడెను. దాని హృదయ ద్వారము దట్టమగు నీలిగుడ్డవలన కప్పబడెను. ప్రాణస్పందనము మందగించెను. అత్యంతమగు అతృప్తివలన జీవితము దుర్భరమై యశక్తత— అలసత— యేర్పడెను.

వసంతకాలము తర్వాత వసంతకాలము గడుచుచుండెను. ఒకఫాల్గునమాసప్రభాతమున నాపక్షియొక్క హృదయకవాట మప్రయత్నముగ విడి పడెను. అచ్చట నొక పద్మ పత్రము వికసించి సుగంధము వెదజల్లుచుండెను. అది యాతని జీవితమునంతను క్రమ్ముకొనెను. దాని నేత్రములకు నూతన తేజముగలిగెను. అప్పుడు దానికి జగత్తు దుఃఖమయముగ దోచలేదు. ఆనంద నిలయముగ బొడగట్టెను. ప్రకృతియందెటు దిలకించినను సౌందర్య మాధుర్యములు ఆనందము బొడగట్ట సాగెను. దానికి ఆడుకోకిలకంటె సుందరమగునది మరియొకటి కనుపడలేదు. అందువలన శాంతింపవల్ల స్త్రీకోకిలమును గూర్చి యోచింపజొచ్చెను. ఆకర్షింపబడెను. ఒక దినమున "తగిన స్త్రీ లభించిన యెడల దానితోడ హృదయమును గలుపవచ్చును." అని యనుకొని గృధ్రమును సమీపించి యిట్లనియె. "ప్రభో! నేను వివాహమాడుదును?"

గృ:— వివాహమా? ఆ? వివాహమా? ఏమనుచున్నావు?

కో:— నాకు వివాహ మాడవలయునను కోరిక గలిగినది.

గృ:— నీవిన్నిదినములుగ నభ్యసించిన ధర్మమిదియేనా? మతిభ్రమగలిగినదా యేమి? స్త్రీకంటె మహాపాతకి భూమండలమందు మరియొకటిలేదు. భగవానుని బొందుటకింతకంటె విఘ్నము వేరొండు కానరాదు. వివాహమాడి నరకమున బడిపోయెదవు సుమా.

కో:— ప్రభో? ఒక్కమాట. క్షమింపుడు. మీరు వివాహమాడలేదా?

గృ:— చేసుకొన్నాను. నాకప్పుడు సదుపదేశమిచ్చువారు లేరైరి. నీవదృష్టవంతుడవు. వత్సా? మారుపలుకక కులాయమున కేగుము. కలయుండైనను వివాహవిషయమును రానీయకుము. సాధన చేయుము. భగవానుడు నీకు సుమతిని గలిగించును.

కోకిల యీ వాక్యములవిని హృదయానందము కట్టుబడ శూన్యచిత్తమున తిరిగి కులాలయమునకువచ్చి యిట్లుదలంప జొచ్చెను. "ఏమిచేయుదును! స్త్రీని గూర్చి తలచగూడదని యనుకొనిన కొలదిని స్త్రీల కమనీయ చిత్తరువు మానస పటమున నలంకరించుచున్నదిగదా? ప్రేమ-ప్రేమ-ప్రేమ, యని జపముచేసిన కొలదిని నా హృదయాంతర్గతము నుండి "నేనున్నాను- నేనున్నాను" అను సుమధురనినాదము బయల్వెడలుచున్నది? ఏమిచేయుదును? ఈసమస్యాసాగరమును దాటుటెట్లు! స్త్రీ భగవానుని కంతరాయమైన యెడల స్త్రీ నేల సృష్టించును? స్త్రీపురుష సంబంధము వలననేగదా జీవకోటి యభివృద్ధిగాంచుచున్నది? స్త్రీలయెడ పురుషులకు పురుషులయెడ స్త్రీల కింతటి యాకర్షణం బేలయుండవలయును?

దినములుగడచుచుండెను. దానియందు మహాసంగ్రామము ప్రారంభమాయెను. కాని దానికంత మెచ్చట? దానిచుట్టు మహాశూన్యము తాండవింప బాడజొచ్చెను. అందువలన వది తాళజాలకుండెను! దాని నేత్రముల కంధకారము క్రమ్ముచుండెను. జీవితము క్లేశరహితమై మరణమే శరణ్యమాయెను. కోకిలగృధ్రమును సమీపించి యిట్లనియె "ప్రభో నాకు ముక్తి యొసంగుము."

గృ:— వివాహ మొనర్చుకొనుము. కాని జాగ్రత్త. స్త్రీతోడ జాగ్రత్తగ మెలంగవలయును సుమా? స్త్రీ యందు మోహమునుంచుకొన గూడదు. స్త్రీసంభోగమువలన నానందమును బొందకుము. నామాటల ప్రకారము నడుచుచు భగవానుని గొల్చుచుండుము. జాగ్రత్త. సంసార మరణ్యము. నరక కూపము.

కోకిల యింటికి తిరిగివచ్చెను. మరుభూమిగ మారిపోయిన దాని హృదయమందు నీటిబిందువులు బొడగట్టెను. ప్రాణము కలకలలాడుచు నిత్యనూతన రూపమును దాల్చుచుండెను,

క్లాంతి- అలస-శూన్యత మొదలగునవన్నియు నశించెను. ఆ కోకిల యాకోకిలగాదు. దానికి నూతన జన్మకలిగెను. ఒక వివాహ మొనర్చుకొనెను. కాని దాని సమస్యల కంత మెచ్చట. కాని కోకిల వివాహమాడి యానందముగ కాలము గడుపుచుండెను. భగవానని యాస్తిత్వమిప్పుడు సుస్పష్టముగ గోచరింపజొచ్చె

3

కాలక్రమమున కోకిలకు సంతానము కలిగెను. సకాలమున వానికి వివాహమొనర్చెను. వానికిగూడ సంతానము గలిగెను. కాని యవియున్నియు నెగురలేవు. వానికన్నిటికి రెక్కలున్నవి. కాని ప్రయోజనమేమి? అవికదలవు. పక్షియగుటకు సహాయపడవు. కాని వానిని చూచినప్పుడు మాత్రము పక్షి యనుగ్రహింపనచ్చును. అవి కోవిలలే కాని యెగురలేవు. నృత్యము చేయజాలవు. వానికానందమే లేదు. దొరకినంత వరకు దినికులాలయముల యందుండి ప్రాతఃకాలమున పృథ్వి నవజీవితమును గాంచునప్పుడు- సుస్నిగ్ధమలయమారుతము వీచునప్పుడు- లక్షలకొలది శుకపికముల పల్కులవలనను కోకిల కూజితములవలనను కాననములు ప్రతిధ్వనించునప్పుడు- పుష్పములు వికసించి యానందమును వెదజిమ్మునప్పుడు- అంతరిక్షము పక్షులు చక్రములు గట్టియు బారులు తీరియు విహరించునప్పుడు, వానినిజూచి మనకోకిలయు, కోకిల వంశజాతియు పరస్పరము శుష్కవేదాంతములు- నవ్వులు- ఎక్కిరింపులు- హేళనతోడ యిట్లనుకొనుచుండును "పాప మివియున్నియు తప్పుదారి ద్రొక్కుచున్నవి సుమా! ధ్వంసోన్ముఖ మగుచున్నవి"

# వివిధ ధర్మముల ప్రకృతి.

( క. రాజేశ్వర రాయుడుగారు )

ప్రేయసీ ?

నీయుత్తర మాలస్యముగఁ జేరినది. సాంగముగఁ జదివితిని. హృదయంగమ మొనర్చుకొంటిని. వివిధ ధర్మముల ప్రకృతి తెలియకుండుట వలన నీకుసమస్వయముకుదురలేదు. అందు వలన వివిధధర్మముల ప్రకృతినిగూర్చి వివరముగ వ్రాయుచున్నాను. ఈయుత్తరముఁ జదువుకొనిన తర్వాత నీకు గలుగు శంకలను వెల్లడించుము.

మానవు లనేకధర్మములకు జెందియున్నారు. సమస్తధర్మములు- మతముల ముఖ్యోద్దేశము గూర్చి విచారించిచూచిన సాంఘికరక్షణము, మానవసేవయని తెలుసు. మనదేశమునందు ధర్మము ద్వివిధములు. ఒకటి వ్యావహారికము. రెండవది పారమార్థికము. కాని యివిపరస్పర సంబంధము గలిగియున్నవి. ఇందొక దానిని వీడి మరియొకటియుండుటకు వీలులేదు. వ్యావహారిక ధర్మమందు మానవుడు కర్మద్వారమున సాంఘిక సేవచేయుచు, ఆత్మోన్నతికి సాధనను చేయుచుండును. ద్వితీయము కేవలము బుద్ధిగతము. జగద్రహస్యము యొక్క కారణానుసంధానమే దీనియుద్దేశ్యము. కావున నీప్రయత్న మందార్యులు సమస్తపదార్థముల మూలమందొక మహాశక్తి పనిచేయుచున్నదని నుడివి యున్నారు. ఆ శక్తినే బ్రహ్మ మొదలగు నామముల బిలచుచున్నారు. భగవానుడు తనయానందము కొరకు తాను జగత్తును రచించుకొని జీవరూపమునను భూతసమూహ రూపమున సృష్టియై క్రీడింపుచున్నాడు. కావున యీజగత్తంతయు భగవద్రచన; భగవానుని లీలానికేతనము. జగత్తునందున్న దంతయు నాయన విభూతి. కావున నీబ్రహ్మాండమునందు జరుగు సమస్తకార్యములు భగవానుని విభిన్నలీల లైనప్పుడు ఆత్మపర భేదమును గమనించుట మోహముగాదా? ఆర్యులు దార్శనిక భావమున గనుగొనిన దానిని వ్యవహార క్షేత్రమందు వెల్లడింప బ్రయత్నించిరి. ఈ ప్రయత్న ఫలములు నిస్స్వార్థత, నిష్కామకర్మ, సాంఘికాభివృద్ధికి సర్వార్పణము, మానవసేవ మొదలగునవి. ఇవి యన్నియు సాంఘిక రక్షణకును, ఆత్మాభివృద్ధికిని దోడ్పడుచున్న వనుట యందాశ్చర్యమే మున్నది? ఆ మహాపురుషుల బ్రయత్నము వలననే సాంఘికుల యందలి ప్రతియొక్కని మనము నావరించియుండు స్వార్థాంధత పటాపంచ లాయెను. "మన విముక్తి మనయందే యున్నది. నేను దాసుడ గాను. పరులకరుణమీద యాధారపడు వాడను గాను." అనువిషయమును ప్రాచీన ఋషులు బాగుగ హృదయంగమ మొనర్చుకొనిరి. వేలకొలది వత్సరములకు బూర్వమే మహత్తర సభ్యతను సృష్టించియుండిరి. మనమెంత యధోగతి యందున్నను వారి సద్గుణములు- మానవసేవ- మొదలగునవి మన కార్యకలాపములనుండి దొలంగలేదు.

ప్రాచీన పారసీకుల ధర్మము గూడ సుందర మగు సత్యముమీదనే స్థాపింపబడినది, జండవస్తు

యనువారి ఋషియభిప్రాయమిది. "జగత్కర్త యొక్కడు. కేవలము మానవమనమందొక్క భావమునకు సంబంధించిన లీలయే జరుగుట లేదు. మంచిచెడుగులను దేవాసురయుద్ధమన నరతము జరుగు చున్నది. పుణ్యపాపముల సంఘర్షణము జరుగుచున్నంత కాలము ఆత్మరక్షణకుపాయము లోకహితకర కార్యములయందు నిమగ్నుడవై లోభమునకు దూరముండుటకు సర్వ విధముల బ్రయత్నింపవలయును. ఇదియే ముఖ్య ధర్మము."

మానవ సేవయే సర్వోత్కృష్టమగు పుణ్యకార్యమని చీనావారి ధర్మోద్దేశము. అందువలననే మానవుల స్థానము దేవతల స్థానముకంటె నూర్ధ్వమందుండును. కుంగ్ ఫుజ్ అను మహాపురుషుడు కేవలము లోక సేవద్వారముననే ముక్తిలభించునని విశ్వసించుచుండెను. మానవసంఘమును వీడి నిర్జన కాననముల భగవదారాధన యందునిమగ్నుడై యుండవలయునను విషయము వాయన యెరుంగడు. మానవుడు మానవునకు ఋణపడి యున్నాడు. దీనికిని భగవానునకు ఋణపడుటకును నెట్టిభేదమును లేదు. మానవ ఋణమును దీర్చుకొనుటవలన కర్తవ్య పరిపాలనం బొనర్చినటుల సంతసించుచుందుము. కర్తవ్యపరిపాలన పిర్యత్వము భగవదారాధనకు నామాంతరము మాత్రము. అందువలన నాతడిట్లు చెప్పియున్నాడు. మానవఋణమునుదీర్చుకొనుటయే భగవదాదేశానుసారము వర్తించుట యగును. మానవసేవ జేయుటవలననే మానవుడు ఋణవిముక్తుడగుచున్నాడు. ఈ భావమునకును మనఋషులభావమునకు భేదమేమి? ఈయుభయ దేశముల యందును చింతాధారదాదాపుగ నొకవిధముననే ప్రవహించునటులదోచుచున్నది. ఏలయన అత్యంత ప్రాచీనకాలమున చీనాదేశమునకును భారతవర్షమునకును అత్యంతఘనిష్ఠ సంబంధముండియుండెను. ప్రతివిషయమునను పరస్పర సహాయ్యమును బొందుచుండిరి. ఏవదేవిషయము నందెవరికి ఋణపడి యున్నారను విషయమింత వరకును సరిగ నిర్ణయము కాలేదు. ఒకాకురాయను జపానుశిల్ప విమర్శకు డిట్లు నుడివి యున్నాడు. భారతవర్షమునుండి యొకచిరంతన ధార బయలుదేరి సమస్త ప్రాచ్యఖండమును ముంచి వైచెను. ఆమహా ప్రవాహమున మునుంగుట వలననే చీనా పరిషియా దేశములందలి శిల్పము సౌందర్యధ్యాన నిమగ్నమాయెను.

యూరపు సభ్యతకు జనని యగురోము సభ్యత భారతీయ సభ్యతకును మిశరు సభ్యతకును ఋణపడియున్న దనియు మిశరుసభ్యతగూడ భారతీయ సభ్యతనుండి యనేకవిషయముల గైకొనియుండెననియు అనేకమంది దలంచుచున్నారు. ఈవిషయమింకను చారిత్రిక విషయముల వలన బాగుగ దృఢపడక బోయినను భారతీయ సభ్యతను పైయిరుదేశముల వారాదరించి యుండిరనియు, వీరిననుసరించియే జీవితగతి నడిపించుకొను చుండిరనియు చెప్పవచ్చును. మానవసేవ కాదేశముల రెంటియందును మిక్కుటమగు ఆదరణగలదు. స్వతంత్రచింతనము భారత వర్షమందభివృద్ధిగాంచి నటులనే యాదేశములురెంటియందును వికాసమును బొందియుండెను.

యూదుల సభ్యతకొంతవరకు మిశరుల వలన గైకొనబడినను దీనికి ప్రత్యేక ధారకలదని దోచుచున్నది. యూదులొక్క భగవానునే యారాధించుచుందురు. కాని యాదేవుని వారాత్మీయునిగ జూడ జాలరు. అతడెప్పుడును వారికడ ప్రభువుగ విరాజిల్లుచుండును. అందువలన స్వతంత్ర స్పృహ వారి యందంతగా వికసింపలేదు. అంతయధః పతితమైన సంఘము మరి యొకటి కానరాదు. యూదుల సంఘమిప్పుడున్నది. కానివారికి దేశము లేదు. నిలుచుండుటకు స్థానములేదు. వారుబిచ్చగాండ్రబోలి పరులగృహద్వారముల కాలముగడుపుచున్నారు. వారుభగవానుని స్వేచ్ఛాచారి గదలంతురు. ఆయనకరుణమీదనే స్వర్గనరకములువిర్భరపడియున్నవి. వారిసంఘమందు పాపపుణ్యముల విషయమై స్పష్టమగు ధారణ కానరాదు. ఆచార నియమముల నత్యంతా దరణను చూపు చుందురు. ధర్మాధర్మములు, పాపపుణ్యముల భావము

స్పష్టముగ లేదు. అజ్ఞానమే వారి సమస్త కష్టములకు మూలమని నిస్సంశయముగ నుడువ వచ్చును. కాని వీరియందు కొనియాడదగిన దొకవస్తువున్నది. అదియేమి భగవానుని వలన చిహ్నితమగు జాతివారమను విశ్వాసము. ఈ విశ్వాసము వలననే వారు క్రైస్తవ సంఘముల వారు కలిగించిన అమానుషిక యత్యాచారముల సంహింపగలిగిరి. మరియు నెన్ని బాధలు పడినను వారి సాంఘిక వ్యక్తిత్వమును లోపించి చేయక కాపాడియున్నది. భగవానుని మీద శ్రద్ధాభక్తులు గలిగి సంపూర్ణముగ నిర్భరపడియుండుట మహోత్తరగుణ మనుటకు సందియము లేదు. కాని యానిర్భరత్వమునకు కారణమెరుంగక గుడ్డితనముగ నిర్భరపడుట తమోగుణము అందువలన యూదులకు తామసిక పూజాఫలము కరతలామలకమైనది.

యూదుల సభ్యతవలన గలిగిన క్రైస్తవధర్మము ప్రేమధర్మము. మానవసేవయే క్రీస్తుయొక్క జీవితసారము. ఆయనయుపదేశములిట్లున్నవి. మున్ముందు బంధువులతో నుండు విరోధమును తొలగించుకొనుము. తర్వాత భగవత్ప్రార్థనకొరకు చర్చికిరమ్ము. నీదేహము భగవానునకు మందిరము. కావున భగవానునిమందిరమును కళంకిత మొనర్పకుము. ఇట్టి మహత్తర ప్రేమధర్మము ఖడ్గసహాయమున పాశ్చాత్య జగత్తునందు వ్యాపించి వికృతినొందినది. అచ్చట క్రీస్తునామమున సైతానుపూజ జరుగుచున్నదాయను శంకగలుగుచుండును. క్రైస్తవధర్మమును నక్షుణ్ణముగ గాపాడ వలయుననెడి నెపమున నిర్దోషులగు స్వతంత్రముగ చింతించు వ్యక్తుల హత్యలవలన యూరపు ఘోర నరక సదృశమాయెను. క్రైస్తవ ధర్మప్రచారము వలన యూరపు ఖండమున కణమాత్రమైనను లాభము కలుగలేదు. కాని యిప్పుడచ్చట జరుగుచుండు మానవసేవ దానిసంబంధముల ప్రతిష్ఠాపనములు మొదలగునవన్నియు క్రైస్తవ ధర్మఫలములుగావు. అవి యూఖండ వాసుల స్వతంత్ర చింతనా ఫలములు.

యూరపుఖండము క్రైస్తవ ధర్మమును బాగుగ జీర్ణము చేసికొనలేదు. దీనికి ముఖ్యకారణము క్రీస్తు ధర్మము గృహస్థధర్మముకాదు. సన్యాసధర్మము. వ్యవహార జగత్తునందుండవలెనని యెప్పుడు కేవలము ప్రేమను బూజించుచుండిన లాభము లేదు. ఆయా సమయములయందవసరమునుబట్టి కఠోరతనుగూడ నారాధించుట గూడ ధర్మమగును. ఒక చెంప కొట్టిన వానికి రెండవచెంపను జూపుమనునది గృహస్థులకు సంబంధించిన ధర్మముగాదు. అట్లు నడచుచుండిన యెడల సంసారమెగాక సంఘము గూడనిలచుటకు వీలులేదు. ఇందు వలన క్రైస్తవ ధర్మము సాంఘిక స్థితికనుకూలమైనదికాదు. అందు వలననే యూరపు నందనేక సాంప్రదాయము లేర్పడినవి. వీనిలో పరస్పరము సామంజస్యమత్యల్పముగ గానవగును. యూరపునందు మతసంబంధమగు కలహములు బుట్టియుండెను. పేరునకందరు క్రైస్తవులే. కాని యందనేక శాఖలవారున్నారు.

క్రైస్తవ యూదుల ధర్మములద్వారము ప్రాణ వికాసమునొందిన ఇసలాం ధర్మము ప్రేమధర్మమని నుడువుటకు వీలులేదు. భగవానుని యస్తిత్వము నియంతృత్వములమీద నత్యంత విశ్వాసమే యీధర్మమునకు మూలము. మహాపురుషుడగు మహమ్మదు ఇసలాంధార్మికులకేక దేవతోపాసనము నేర్పరచెను. ఇసలాం ధార్మికుల భగవానుడు దురంత ప్రతాపాన్వితుడగు స్వేచ్ఛాచారి. జీవుల ముక్తి యాయనకృపాధీనమైయుండును. క్రైస్తవుల విశ్వాసముకూడ నిదియే. కాని యేకాంత చిత్తమున భగవన్నామమును స్మరించుచు మానవసేవ యొనర్చుచు సదనుష్ఠానముల యందుకాలము గడుపుచుండిన యెడల భగవానుడు దయనుచూపించి స్వర్గసుఖముల ననుభవింప జేయునని యుభయమతముల వారు విశ్వసింతురు. నిష్కామ కర్మసంబంధమగు సుస్పష్ట ధారణ రెండుసంఘముల వారికిని లేదు. స్రష్టయగు భగవానుడే తిరిగిజీవరూపమున లీలా వినోదియై విహరించుచుండు నను విషయము వారికి తెలియదు. అందువలన వారెండుసంఘములయందు మానవులెల్లరు సమానులు— సమస్త

జీవులు సమానమను భావ మింతవరకు వికసింపలేదు. అందువలననే వారింతవరకును పరధర్మముల ననాదరణ బుద్ధితోడ గాంచుచున్నారు. ఇతరుల ధర్మవిశ్వాసమున కంతరాయమును గలిగించుటకు వెనుదీయరు.

భారత వర్షమందు మహమ్మదీయులు క్రైస్తవులుకూడ మిక్కుటముగ నున్నారు. వీరార్యమతావలంబుల స్పర్శవలన అజ్ఞాతానుసారముగ వారికి యొకింత పరమత సహిష్ణుతయేర్పడినది. మతాచరణముల యందనేక విధముల మార్పుచెందియున్నారు. హిందువుల బోలి మహమ్మదీయులు గూడ సంయమ పక్షపాతులు. స్వేచ్ఛాచారమునకు విరోధులు. కాని క్రైస్తవులు మాత్రము హిందువులతో కలియుటకు బ్రయత్నించుటలేదు. అయినను దేశీయ క్రైస్తవులుమాత్రము భారతీయులుగనే యున్నారని వారియాచార వ్యవహారముల వలన గ్రహింపవచ్చును.

మహమ్మదీయ ధర్మము ప్రేమధర్మము గాకున్నను భక్తిధర్మము; సేవాధర్మము. వారు దేశసేవను అవశ్యకర్తవ్యముగ భావింతురు. ప్రాణము బోయినను ధనమునిచ్చి వడ్డిగైకొనుటకు బ్రయత్నింపరు. పరులకు సహాయమొనర్చుట వారి శాస్త్రవిధి. వీరియందనేకమంది భక్తులు జ్ఞానులు బుట్టి మతవ్యాఖ్యలొనర్చియున్నారు. అందువలన నది యార్యధర్మమునకత్యంత సామీప్యమని నుడువవచ్చును.

ఆర్య ధర్మమునకు మిగిలిన ధర్మముల వారికిని కొన్నిచో మిక్కుటమగు భేదముగలదు. "శరీరము నాశనము బొందినపిమ్మట జీవుడు నశింపడు. మరణానంతరము జీవుడు నూతనదేహమును ధరించి కర్మమొనర్చును. నిష్కామత్వము గలుగనంతవరకు జీవుడు జన్మమృత్యువులయందు దగుల్కొని పరితపింపు చుండును. నిష్కామత్వమే సమస్త బంధనముల భేదించును. నిష్కామ భావమున కర్మానుష్ఠానమే ముక్తిమార్గము." అనునది భారతీయుల విశ్వాసము. ముక్తి యన సుఖ దుఃఖముల కతీతావస్థయని గ్రహింపవలయును. ఇది సంపూర్ణముగ మనోరాజ్యమునకు సంబంధించినది. క్రైస్తవులు మహమ్మదీయులు కోరు ముక్తికిని భారతీయులు కోరు ముక్తికిని భేదముగలదు. సకామముతో గూడిన సాధనాజనిత స్వర్గభోగమే మహమ్మదీయ క్రైస్తవుల ముక్తి. భారతీయులు స్వర్గభోగమును క్షణికముగ భావింతురు. ప్రాచీనకాలమున ఆర్యులు నరకమను విషయము నంగీకరించెడి వారుకారు. కాని యాధునికకాలమున నరకమునెడల పరిపూర్ణ విశ్వాసముగలదు. ఈ విషయమున క్రైస్తవ మహమ్మదీయులకు గూడ మిక్కుటమగు నమ్మకము. కాని మనవలె వారు జన్మాంతర వాదము నంగీకరింపరు. వారి విశ్వాసమిది. మరణానంతరము జీవులు గోరీ యందే నిద్రించు చుండును. ప్రళయ దినమున నవియన్నియు భగవానుని సమీపించును. అప్పుడు భగవానుడు విచారణసల్పి కొందరికి నరకమును మరికొందరకు స్వర్గమును గలిగించును. కొన్ని క్రైస్తవ ధర్మ సాంప్రదాయముల విశ్వాసమిది. "ఆర్యులకు ప్రేతలోకముండినటులనే వారికి నొక ప్రేతలోకమున్నది. జీవాత్మ శరీరమును విసర్జించిన తర్వాత కొంతకాలము ప్రాయశ్చిత్తరూపమున ప్రేతలోకము నందుండవలయును. ఈ ప్రాయశ్చిత్త ఫలమువలన జీవుడు పాపరహితుడై స్వర్గమును బ్రవేశించుట కర్హుడగును. భారతీయుల నరకము వారి స్వర్గమును బోలి క్షణికము. స్వర్గభోగము లేక నరకభోగానంతరము జీవుడు తిరిగి బుట్టి కర్మ యొనర్పవలయును.

జన్మాంతర వాదమునకును ముక్తి వాదమునకు నందు భేదమిది. ఇది సమ్మేళనమునకంతగా యంతరాయముగాదు. క్రైస్తవసంఘమందలి పండిత మండలి యీ జన్మాంతరవాదమును క్రమక్రమముగ విశ్వసింపుచున్నారు. దివ్యజ్ఞాన సంప్రదాయము వారు జన్మాంతరవాదమందు విశ్వాసము బుట్టుటకు మానవకోటియందంతటను దృఢప్రయత్నమొనర్చు చున్నారు. నేడు జన్మాంతర వాదమును గూర్చియే ప్రతిదేశమందలి పండితమండలియు యోచింపుచున్న దనుట

యతిశయోక్తిగాదు. ఈవిషయమందలి యదార్థము నుగనుకొనుటకు బ్రయత్నించుచున్నారు. హక్స్లీ వంటి వైజ్ఞానికుడు కూడకొంతవరకు జన్మాంతరవాద మందువిశ్వాసముగల వాడాయెను. క్రమ వివర్తనము—చరిత్ర-నీతి. యనుగ్రంథము నందొకచోట స్పష్టమునిట్లువ్రాసియున్నాడు. "క్రమ వివర్తన వాదము సత్యముమీద ప్రతిష్ఠింపబడి నటులనే జన్మాంతర వాదముగూడ సత్యముమీద బ్రతిష్ఠింపబడినది. ఇందే దియు యుక్తి విరుద్ధము గాదు." విజ్ఞానచర్చ యభివృద్ధినిగాంచిన కొలదిని జన్మాంతరవాదముసర్వత్రగ్రాహ్యమగుచున్నది. ఇందువలన దీనిని క్రైస్తవులు మహమ్మదీయులు క్రమక్రమముగ నంగీకరించుచున్నారు. వారుజన్మాంతర వాదముతోడ ముక్తి వాదమునుగై కొనుటకు వీలుంబన ముండదు. జన్మాంతర వాదమును గ్రహించినంతనే స్వర్గనరకభోగము లనంత కాలవ్యాప్తమగుటకు వీలులేదు. అవి క్షణికమగును.

నీవు సర్వదా భగవానుని మనమునందుంచు కొనిమానవసేవ జేయుచుండుమని నమ్ముచున్నాను.

# ప్రేమ గీతము.

(కె. రాఘవాచార్యులుగారు.)

౧

గీ॥ సొగసు గుల్కెడి తరు వాటి • సములబోలి
విమల చంద్రిక లాకసం • బున వెలుగ
జేరుసనుబోల్చు మాలతీ • విరులవీడి
సౌరభంబులు దిశలెల్ల • బర్వుచుండ!
వెలయు మధుమాస యామినీ • వేళలందు
సగముగూర్చిన పుష్పమా • లికనుగూడి
యువని బడియుండె నాదు మో • హంపుమురళి:
కరమూ కరమును గీలించె • కాంత యపుడు
చూడ్కు లొండొంటి దాకుచు • జెలువుమీర
ప్రణయ వారాశి దేలుచు • లీనమయ్యె
కవుల హృదయంబు వెడలెడి • గీతములుల
ప్రేమవాహిని నిర్మలం బగుచు దనరు.

౨

మేలి ఎర్రెంపు ముసుగుతో • మేలమాడు
స్నిగ్ధ దరహాసదీప్తుల • నాదు మనము
మోహపూరితమగుచు నై • హరచియుండ
సగము గూర్చిన కుందప్ర • సూనదామ
మబల హృదయంబు హొంగారు • తమిని దెల్ప
కించి దుత్ఫుల్ల కాక్షస • మంచితంబు
ఈషదుత్పన్న వ్రీడా మ • నోహరంబు
ఈషదస్ఫుట పరుషత్వ • మాక్షరంబు
నగుచు నీను పిసాళిచె • తలనుగూడి
కవుల హృదయంబు వెడలెడి • గీతములుల
ప్రేమవాహిని నిర్మలం • బగుచు దనరు

౩

సంతసంబును జలరాశి • శోధ దబుగ
కాలకూట విషంబును • గాంచబోము
అందరానట్టి వాంఛల • గుందబోక
భావికాలంపు చింతను • బాపియుందు
మతిని సుకవిగీతంబు నా • దనరుచుండు
ప్రేమవాహిని నిర్మలం • బగుచు నెపుడు.

(రవీంద్రుని గీతము.)

# ప్రత్యర్పణము.

క

కృష్ణవేణి తన నిజకలకలనిస్వనముతో నాటి రేయియు పొంగిపొర్లుచు ప్రవహించుచుండెను. లోకబాంధవుడీజగమును బాసినను, కృష్ణవేణి అహోరాత్రములును మానవ హృదయమునకు, సాంత్వనమునొసంగుచున్నదా యనునట్లు మృదుమధుర గానమునుసల్పుచు, ప్రవహించుచుండెను. పట్టణములందేమి, పల్లెలందేమి, పురులందేమి, గిరులందేమి, తా బ్రవహించు సకల ప్రదేశములందును జీవించు మానవాళి యొక్క దుఃఖమును బాపుచు నా నదీమతల్లి కాపాడుచుండెను. మహారణ్యములందే కాంత నివాసులపైన కూడ తన అభయ హస్తమును జాపుట కృష్ణవేణి మఱవదు.

చ

అదియొక అరణ్యమధ్యమము. భీకర దృశ్యమునుజూపు నా ప్రదేశమున కృష్ణానదీ స్వరముతప్ప వేరొకశబ్దమెన్నడును వినబడదు. నాడు రాత్రి పదిగంటలగువరికి మానవ శబ్దమొకటి ఈ నిస్వనముతో మేళవించి ఒక నూతన గానముగ పరిణమించి ఆ మహారణ్యమున ప్రతిధ్వనించుచుండెను.

పద్మావతి చెంతనున్న మందారసుమములను, పారిజాతములను, తదితర పుష్పములను చేబూని నిమీలితనేత్రయై మహామంత్రములపఠించి, దుర్గాష్టకమును తదుపరిచదివి వానిని నావిగ్రహము పైనుంచి తిరిగి పుష్పములగైకొని "మహాశక్తీ! నీ ప్రసాదమైన ఈ ఖడ్గమును నే పవిత్రవంతముగ జూచెద" అని పుష్పములదుర్గకు సమీపముననున్న ఖడ్గముపైనుంచి బూజించెను. కొంతదవ్వేగి సాష్టాంగ ప్రణామము లాచరించి, తిరిగి విగ్రహమును సమీపించి కుంకుమముతో దుర్గనుబూజించి, కట్టకడకు ఖడ్గపూజ నొనర్పసాగెను. చేత కుంకుమమును మరింత బూని పూజించెను. కొంత సేపటికా ఖడ్గము పూర్తిగ కుంకుమము మధ్యనుండెను. పిడిమాత్రము పైకగపడుచుండెను. అంతనామె ఖడ్గరాజమునుజూచి ఈ విధమున సంబోధింపదొడగెను.

"ఓ ఖడ్గరాజమా! నీ పవిత్రజీవితమును నే నెఱుంగుదును. సత్యసంస్థాపనార్థమై దుష్టశిక్షణమొనర్చిన నీ యనేకచర్యలనే గనగొంటిని. రావణాది దుష్టప్రభృతుల సంహరించినది నీవయేకదా! త్రిపురాసురుని ఖండించి జగచ్ఛాంతి నెలకొల్పినదిఎవరు? అట్టి నీ యశేషశక్తిని నేను నే కోరుచున్నదాన. కేవలము రుద్రరూపిణివైనను నీయందు శాంతముకలదు. నా

పూజయొనర్చిన కుంకుమము రక్తిమచ్ఛాయల నీపై ఇప్పుడు క్రమ్ముచున్నది. అట్లే రణరంగమునను నీవు పాటలవర్ణమును గాల్పెదవు. ఓ శక్తిస్వరూపిణీ! నీయందలి ఆ సత్యశక్తిని మాకు ప్రసాదింపుము. తొల్లింటి మహర్షులకు నీవెట్లు సహాయురాలవై అరిషడ్వర్గమునుగూడ అణచియుంటివో అట్లే మా హృదయములందలి కళంకముల భస్మమొనర్చి నూతనజీవులుగ నొనర్పుము. ఇదియే నా ప్రార్థనము." అని యేదియో భక్తిమార్గమున అరణ్య మధ్యముననున్న దుర్గాలయమున పద్మావతిపూజ చేయుచుండెను.

ఇంతలో విజయుడాస్థలమున కేగి, "అమ్మా! నీ యాజ్ఞానుసారము నేనీ స్థలమున కేతెంచినాను. వైరులు సమీపించుచున్నారు. కాలము మించిపోవుచున్నది. సెలవు గైకొనుటకై నీయొద్దకు వచ్చియున్నవాడను."

పద్మావతి పూజాసమగ్నయై యుండుటచే ప్రప్రథమమున ఆతనిమాటల నాలకించలేదు. కాని కొంతసేపటికి కన్నుల దెరచి తన కుమారుని నమస్కార భంగిమమున నుండుటచూచి, "తండ్రీ విజయా! ఇదియే దుర్గచే ప్రసాదింపబడినఖడ్గము." అని కుంకుమము మధ్యనున్న నిశితఖడ్గమునుదీసి ఆతనిహస్తమున నుంచుచు, ఇట్లు కుమారుని హెచ్చరించెను.

''పుత్రకా! ఈ పవిత్రాస్త్రము నేను నీకేలనుంచుటకై దుర్గాంబయొక్క ఆజ్ఞను గైకొంటిని. ఇది శక్తిస్వరూపిణి. కావున నే దీనిని నీవు జాగరూకతతో జూచుకొనుచుండవలయు. ఎట్టి ప్రళయసంఘటనమునందునైనను ఈ ఖడ్గరాజమున కపఖ్యాతి దీసికొని రాకుము. భద్రము! తెలసినదా! నేడు నీ మాతృదేశదైన్యమును బాపుటకు గాను ఈ అస్త్రమును నీకేల నుంచుచుంటిని. చిన్ననాటనుండియు ముద్దుతో బెంచి నాజీవిత ప్రతిబింబముగ జూచుకొనుచుంటిని. ఎట్టియిక్కట్టులు వాటిల్లినను వానినన్నిటిని బాపజేయు వీరుడవై చెంతగలవనియు నీయందాశ పెట్టుకొనియుంటిని. నేడీధర్మయుద్ధమున విజయుడవగుదువుగాతమని దుర్గను బ్రార్థించితిని. తండ్రీ! పోయి వత్తువుకదా! మరియొక హెచ్చరిక: ఇది నీవు హృదయపూర్వకముగ బాటించవలసియున్నది. ఇది ధర్మసమరము, కావున ప్రాణమునకై విచారింపకుము. జన్మమును సార్థకపరచుకొనుటకై - సత్యమునకై — అగ్నియందైనను దుముకుటకు సంసిద్ధుడవుకమ్ము. ఈ సమయమున నీవు నీరాజును కలసికొనినచో నీబుద్ధి చలించవచ్చును. ఉద్రేకమున ద్రోహముచేయకుము. ఆతడు నీకెట్టి విధి విధించినను సరే దానికి లోనగుము. ఈవాగ్దానము నొడసే పవిత్రఖడ్గమును నీహస్తమున నుంచవలచితిని. పొమ్ము, వీరమాతయొక్క దీవనలు నీపై కలవు. శీఘ్రముగ రణరంగమున కేగుము'' అని కుమారునియొద్ద వాగ్దానమును గైకొని ఆమె విజయుని యుద్ధమునకు బంపెను.

౮

తెల్లవారు కావచ్చెను. సకలజీవకోటియు తిరిగి జీవన సంగ్రామమున కుగడంగుచుండెను. ఈజీవాళియొక్కరవము కృష్ణవే

యొక్క కళకల నినాదములో మిళితమాయెను. విజయుడు తన తల్లి నుండి దీవనలగైకొని పోవుచు మార్గమధ్యమున తన మిత్రుడగు కృష్ణసేనుని కలసికొనెను. కృష్ణసేనుడు తన మిత్రుని జూచిన వెంటనే, "విజయా! చిన్ననాటినుండియు మనమొక ఆత్మగను శరీరములుగను జీవించుచుంటిమి. నేడు నీభీకరాకారమును జూచిన నామనస్సు చెదరిపోవుచున్నది. నీహస్తమున నున్నది మహాఖడ్గము. ముఖమున వీరత్వము తాండవమాడుచున్నది. కాని, నీ హృదయమునందు ఏతేజము జ్వలించుచున్నదో నేనెఱుగుదును. మిత్రభావమున నీ సంకల్పమును గూర్చిన నా అభిప్రాయమును జెప్పెదను. నీవద్దాని నంగీకరించిన నంగీకరింపుము. లేకున్న అంగీకరింపక పోదువుగాక! నాధర్మము నేనీస్థలమున నెరవేర్చెద. ఈ ఇరువదివత్సరములనుండియు నాకట్టిసమయము సమకూరలేదు. నేడు లభించుటచే నీకు నిజవృత్తాంతమును నే దెలియజేసెదను. అవధరింపుము. నీ వెవరితో గూడ అరిసైన్యముల దాక జూచుచుంటివో ఎఱుంగుదువా? అట్టి చక్రవర్తి నీతండ్రియే! ఇన్ని వత్సరముల నుండియు ఆవిషయమజ్ఞేయమై యుండుట కడువిచారకరము. నీతండ్రియగు ఈరాజు ద్వితీయభార్యపైగల మోహావేశమున ఆపెయొక్క కృత్రిమవాక్యములకు లోనై నీతల్లిని చంద్రగిరియను యూరిలో ఏకాంతవాసమున నుంచెను.

సీతా విషయమును జెప్పుటకు కాలమాసన్నము కాకపోవుటచే నే మిన్నకుంటిని. నేటితో నీబంధవిముక్తి కాగలదు. అరిసైన్యములవిగో! శిబిరములలో నున్నవి. చూచితివా! వారి పతాకము లెట్లు వాయుతరంగ డోలికలలో నాడుచున్నవో! చిన్నరాజ్యమైనను మనసైన్యము లతిధైర్యమున బోరాడి విజయ ధ్వజమును స్థాపింపవలెను. మిత్రశేఖరా! ఆఖడ్గమును నాకొకమారు చూపకోరెద. అరిశిరములనుంచి ప్రవహించు ఉష్ణ రక్తమునకై తుత్తుగొనిన ఆనీ సహచరినిటిమ్ము!"

అంతటతన తల్లి యాజ్ఞను జ్ఞప్తికి దెచ్చుకొని, "మిత్రమా! ఈఖడ్గరాజము యొక్క మహాత్మ్యమును నీవెఱుంగవు. చూడుము. ఇది దుర్గాప్రసాదితమైన మహాయుధము. శక్తిస్వరూపిణి యగుటచేత నే బాహుశక్తిని నడంచి సత్యశక్తిని స్థాపింప జూచును. అట్టి ఈశక్తికి ఎట్టి అపకీర్తిని దేకూడదని నాతల్లి ఆజ్ఞాపించి నాకేల నుంచినది. దీనిని వాయువునందు ఊరకనుంచ కూడదు. అది బలికోరును. కావున మిత్రమా! నీకోర్కె నీసమయమున ఈడేర్పలేక పోయినందులకు క్షమార్పణ వేడుచున్నాను. కాని, నిన్నొక మాట అడిగెదను. ముమ్మాటికిని నిజమని వాగ్దానముచేయగల్గుదువా?" అన కృష్ణసేనుడందులకు సంతసించి మిత్రునకు వాగ్దానమిచ్చెను.

అంతట విజయుడు "మిత్రమా! ఏమి, పులికేశుడు నాతండ్రియా? నాతల్లిని నేనెన్నిమారులో అడిగియుంటిని. కాని, ఆమె యావిషయమును మార్చి మరి వేరుమాటల జెప్పి నాకా విషయము దెలియ జెప్పదాయెను. మిత్రుఁ నెవరి నడిగినను వారు చెప్పరైరి. అనుదినపూజావిధులను సల్పుచు నిజభక్తిని ప్రదా

దైవధ్యానమొనర్చు నాతల్లికీవిధియేల సంభవించెను. నాకీవిషయమును సవిస్తరముగ జెప్పవేడెద. నీవేటికి సందేహించెదవు? అదివరలో చెప్పక నేడే యేటికి నాకీవిషయమును బహిర్గతము చేసితివి? నాకొరకు కాకున్నను, నా మాతృ రక్షణార్థమైనను, ఆమెయొనర్చిన తపోఫలితమునకైనను నీవు సెలవీయవా?

అంత కృష్ణసేనుడు తనమిత్రుని ఆవేదనమునుగాంచి విచారించి ఇట్లు చెప్పదొడగెను.

"మిత్రమా! ఇన్ని దినంబులనుండియు నా హృత్తలమున నీవిషయమును అణచి ఉంచుకొంటిని. నేను నీవు రణరంగమునకు వెడలుటగాంచి, విజయుడు తన్నుదా రక్షించుకొని ఒక రాజ్యమునుగూడ రక్షింప బయల్వెడలుచున్న వార్తనువిని-సరి, నేటి విషయమును బయలుపరచుట భావ్యమనితలచి చెప్పుచున్నాడను. గ్రహించితివా? ఈరాజ్య చక్రవర్తియే నీతండ్రి. నీతల్లినివదలి చంద్రావతి అను ద్వితీయభార్యపైగల మోహముచే ఆమెకు జనించిన బిడ్డలకు రాజ్యభాగము నిచ్చియున్నాడు. నీతల్లి పతివ్రతయగుటచే ఆమె నీకావిచారవిషయమును జెప్పక ఐహిక రాజ్య విషయములకై నిన్ను పురిగొల్పలేదు. సత్య జీవితమునకై హెచ్చరించు చుండును. ఈ రణరంగమున ఒకవేళ నీవు మృతుడవు కావచ్చునను ఉద్దేశమున నీ కీవిషయమును దెలియ జెప్పితిని. ఇక నేనిందుండజాలను. సెలవు గైకొనెదను. మిత్రమా!" అని కృష్ణసేనుడు తన నిజమధురస్మిత వాక్యములతో తన మిత్రునకు నాతని జీవిత రహస్యముల తెలియజేసి వెడలెను.

విజయుడా రణ క్షేత్రమునకుపోబోవు సమయమున హృదయ మొకించుక చలించెను. తన మాతృరూపము కండ్లముందు కట్టినట్లుండెను. "కుమారా! రణమునకు గడంగుము! ధృతి బూనుము." అను మాట లాతని చెవిని నెవరో ఊదుచున్నట్లుండెను. కొంత ఆలోచించిచూడగా తన తల్లిని వీడు నప్పుడామెపల్కినపల్కులు తిరిగి రింగు రింగున ప్రతిధ్వనింప దొడగెను, కృష్ణసేనుని అంత్యవాక్యములుమరల ఆతని హృదయమును కలతపరుప జొచ్చెను. ఇట్లు విజయుడు వికలహృదయుడై తిరిగి ఇంటికిపోవ బయలు దేరెను.

౩

సత్యవతి యమునాకేంద్రబాలిక. సంసారపంకము నంటని సరోజమూబాల. విజయునివివాహమాడిన వత్సరముననే ఆతడు రణమున కేగవలసి వచ్చినది. విజయుడు శాలిశాలయందున ఖడ్గమును గైకొని ఆజికేగిన వెంటనేఆతని తల్లి గృహమునకేగి లోకమెరుగని తన చిన్నికోడలగు సత్యవతినిజూచివిచారింప దొడగెను. ప్రపథమమున మేఘావృత చంద్రునివలెఆమెయొక్క మోముదుఃఖావృతమాయెను. కాని తన సంకల్పబలము చేతను, తాననుదినము నొనర్చు దైవపూజల యందు తనకు గల విశ్వాసముచేతను దైవము తన కుమారుని కట్టి అపకార మొనర్చడని విశ్వసించెను. సత్యవతిని తన తొడపై కూర్చుండబెట్టుకొని లలాటభాగమున మఱ్ఱు ఆ కస్తూరీతిలకమును,నేత్రాంచలములందు

కాటుకను చక్కగ దిద్ది ముంగురుల నంద ముగ నొనర్చి ముఖమున నెట్టి కళంకము లేకుండ జూచుకొనుచుండును. ముకురములో ప్రతిబింబమును జూచుకొను నట్లు పద్మావతి తనకోడలి మోములో తన కుమారుని ఆకృతిని జూచి తనమనోఫలకమున ముద్రించుకొని వెంటనే తనపతి యొక్కమూర్తిని దర్శింప జూచెను. ఇట్లామె తన కాలము గడపును దుఃఖము నొంతి మాత్రమును తనమనమున జొరనీయక శాంతముగ నుండెను.

ఒకనాటి సాయంత్రమామె ఏకాంతముగ వనవిహారము సల్పుచు ఒకానొక మందార వృక్షసమీపమునకు వచ్చి అచ్చోటి మందారపుష్పము చుట్టును ఒక భృంగముతిరిగి తిరిగ తానద్దానిని స్వంతముచేసికొని నట్లుగా గిరిగీసి, వెడలి పోయెను. కానిపుష్పగర్భమున గల మధువును మాత్రము గ్రోలనే లేదు. సాయంత్రమగు సరికి ఆపుష్పము వాడి భూమిపై పడిపోయెను. ఈవిచిత్ర సంఘటనమును జూచి ఆమె ప్రపంచ రహస్య మింతియే కదా అని మరింత దృఢపరచుకొనెను.

ఆమె యేదియో గానము చేయుచు ఆవనమధ్యమున నున్న తటాకతటమున కూర్చుండగా విజయుడేతెంచి "అమ్మా" అని కేకవైచెను. విజయుని మాటకు వనము తిర్గి ప్రతిధ్వనించెనే కాని తల్లియగు పద్మావతినుంచి ప్రత్యుత్తరము రాలేదు. అంతట ఆతడు తిర్గి "తల్లీ! నామొరాలించవా?" అని బిగ్గరగ కేకవైచెను. అందులకు తల్లి ఆతనివంక జూడక "యుద్ధమున నీవేల బీరుడవైతివి? నేనిచ్చిన ఖడ్గమున కపకీర్తిని తెత్తువా? నావ్రత ఫలమును భంగపరతువా? నీవునాకు ముద్దు బిడ్డవా? తిర్గి క్షేత్రమున విజయుడవు కమ్ము. పొమ్ము. ఇటనుండి పొమ్ము."

విజయుడు తల్లియొక్క ఉద్బోధనలకు జ్వలితుడై రణమునకేగి ఆసమరక్షేత్రమున వీరపుంగవులజూచి తనదేశపు సైన్యమును తెలిసికొని వారిలోగలసి అరిదళము నెదుర్కొనెను. యుద్ధము మూడుదినములు తీవ్రముగ జరిగెను. కృష్ణసేనుడందు మృతి జెందెను. కడకు మూడవనాటి సాయంసమయమున వైరులు కాందిసీకులైరి.

౫

పులికేశుడు తనసేనల విజయధ్వానముల వినిసంతసించితిర్గి ముఖ్యపట్టణమగు విజయపురమునకేగెను. ఆదినమున జనులెల్లరు నానందకోలాహలమును సల్పుచుండిరి. పులికేశుని ద్వితీయభార్యయు తన కుమారులు చెప్పు విజయగర్వ వాక్యముల విని, తనలోదా "పద్మావతియొక్క కుమారుడు బీరుడయ్యెను. నాకుమారులీ యుద్ధమున గెల్చియుండిరి." అని మురియుచుండెను. ఇంతలో రాజామె చెంతకువచ్చి, "ప్రేయసీ! చూచితివా! మొన్నటి యుద్ధమున విజయుడు, ఆపద్మావతియొక్క కుమారుడువచ్చి, అరివర్గవిచ్ఛేదనమునర్చెననియు, ఆతనిరాక లేకున్న మన సైన్యములు తప్పకతిర్గిపోయెడివనియునాతో ననేక చారులు తెల్పియుండిరి." అంతట చంద్రావతి వికలహృదయయై "మీరు పొరబడుచున్నారు. పద్మావతియు విజయుడును చెరనున్నారు. ఆతడెట్లు యుద్ధమునకు వచ్చి పోరాడును. ఒకవేళ అతని బోలినమనుజు

ఁడెవఁడైనను వచ్చియుండఁగూడదా? అదియిా భ్రమ, చూచితిరా! మీరాజ్యమునకర్హులైన ఈబాలవీరు లెట్లు యుద్ధాయాసమున నున్నారో? వారి సాహసమిా యుద్ధమున మీకు తెలిసియే యున్నది." అని యేదియో చంద్రావతి చెప్పుచుండగా ఆస్థలమునకు విజయుఁడేతెంచి రాజభటులఁ దీసికొని రాజభవనమునందలి గదుల నన్నిటి వెదకుచు కడకు రాజమందిరమునకు వచ్చి "రాజా! నా తండ్రివైన నీ విట్టి దుష్కార్యము లొనర్తువని నేనెరుంగను. నాతల్లిని నాపిన్నతనముననే చెరవైచితివను విషయము నాకీ యుద్ధారంభమున దెలిసెను. కాని, నేనప్పుడు నీ యొద్దకు న్యాయభిక్షకై రాలేదు. నాజననకారకుఁడవగు నీకును నీరాజ్యమునకును, ఆపద సంభవించిన సమయమున నిన్నాశ్రయము నడుగుటకంటె నీరాజ్యరక్షణార్థమై పోట్లాడుట ముఖ్యమని భావించి యుద్ధమున కేగితిని. యుద్ధమున మరణించిన నీకై మరణింతునను కొంటిని. ఒకవేళ సజీవుడనై జయమును సంపాదించ గలిగినచో తిరిగి నాతల్లిని రక్షింప మిమ్ముల వేఁడుకొనవచ్చునని ఆశించి యుంటిని. కావున ఇప్పుడు మీచెంతకువచ్చి యుంటిని. ఏది ప్రసాదము?"

అంతట పుళికేశుఁడు ఒకతీక్ష్ణదృక్కును విజయునిపై సారించి చంద్రావతిని జూచితిరిగి విజయునిజూచి, "నీవెవరవు? ఈరాజభవనమునకు ఎవరిఆజ్ఞపై వచ్చియుంటివి.?" అనితన కుమారులకు సైగచేసి భటులపలువురనచ్చోటకు బిలిపించి విజయుని బంధితుని జేసెను. అంతటవిజయుఁడుగ్రుడై, "సత్యవ్రతదీక్షను పాలించు నాతల్లియగు పద్మావతిని వదలి కేవలము మోహాంధకారమున బడియున్నను నీవు నాతండ్రివనికదా నేను నీప్రాణమును రాజ్యమును రక్షించితిని. కాని నీవునాకు జూపుదయ ఇదియా!" అని తనబరలోని ఖడ్గమునుదీయుటకై తనచేతిని తొడపైకిసాచెను. ఇంతలో పద్మావతి తనకుమారుడు యుద్ధము ముగిసిన పిమ్మట రాజభవనమునకేగి నట్లెఱింగి ఒకవేళ తండ్రిని గనుగొని ఆతని బాధించునేమోఅనుఅనుమానమున ఆస్థలమునకువచ్చెను. రాజభవనమున్ప్రవేశించి తనకుమారుని ఉగ్రరూపమును జూచి, "విజయా! ఏమి చేయుచుంటివి? ఖడ్గముపై చేయిని దీయుము. నాయెదుట నేమిప్రమాణము చేసితివో జ్ఞప్తి లేదా? ఈకోపము నీతండ్రిమీదనా? చాలును! ఆతఁడు నిన్నుబాధించినను కడకుచంపినను నీవూరకుండుము సృజించిన ఆయనకు లయ మొనర్చుటకును శక్తిగలదు. హక్కును గలదు. ఆతనిని ఎదుర్కొనుటకు నీవెవరవు? తండ్రిని ఎదిరించి ఆతని రాజ్యమును గైకొని నీవనుభవించునదేమి? నీవును ఒకానొక కాలమునకు మృతిజెందవలసినదే? సృజించినవాడు తిరిగి తనలో నైక్య మొనర్చుకొనునను విషయ మెరుంగవా? ఇకనీ చెంత ఆఖడ్గముండ గూడదు. దానిపని ముగిసినది. తిరిగిదుర్గకు నర్పించెదలెమ్ము!" అని ఆతని దట్టికి కట్టి యున్న ఖడ్గమును దీసికొని "విజయా! నీప్రాణమును నీతండ్రి కప్పగించి విజయుడవుకమ్ము!" అనిబిగ్గరగా హెచ్చరించి ఆప్రాసాదమునుంచి వెడలిపోబోవుచుండుసమయమున పుళికేశుడు పద్మావతియొద్ద కేగి పాదములపైబడి "నా తప్పును మన్నింపుము. మోహావేశమున చంద్రావతిని ఎక్కువగజూచి నిన్నుత్యజించి నందుకు క్షమింప వేడుచున్నాను. ఇకచ

ద్రావతి నా చెంతవలదు. అని ఏదియో చెప్ప బోవు సమయమున పద్మావతి. "నన్ను నెడల గొట్టితిరని నాకు విచారములేదు. దైవము నాకీ పదునైదు వత్సరములును దారిద్ర్యము నంపలి ఆనందమును రుచిజూపించెను. అతని యందు నాబుద్ధిని ప్రసరింప జేసెను. తిర్గి ఈమహాసౌధముల ప్రవేసించిన నాకునో నేత్ర పటము వ్రాలును. అజ్ఞానాంధకారమున బడి యుందును. నాకు నన్నుతరమినట్లు ఈదిన మున చంద్రావతిని తరమెద నచుచుంటిరి. ఇది మీసిజమైన పశ్చాత్తాపముకాదు. మీ కుమారుడగు విజయుని గైకొనుడు. మీరెట్లు సృజించితిరో అట్లే తిరిగి లయమొనర్చుడు. నేదుఃఖించను." అని భర్తకు ఉద్బోధన జేసినెడలబోవు సమయమున విజయుడు, 'తల్లీ! నీఆజ్ఞయైనచో ఈరాజును త్రుటికాల ములో ధ్వంసమొనర్చి శాంతిస్థాపన మొన ర్చెద! సెలవిమ్ము!" అని తల్లిని వేడుకొనెను. రాజుతీవ్రదృక్కుల విజయునిపై సారించి, "ఓరీదురాత్మా! నీవు నాకుమారుడవురా? నిన్నురికంబముపైకి ఎక్కింతును." అనిబిగ్గర కేకవైచి, "భటులారా! ఈతని గొంపోయి ఉరిదీయుడు" అనిపల్కెను. అంతటపద్మావతి " కుమారా! నీ విలోకమునకు వచ్చుట నామూలమున కావున, తిరిగి కర్తయగు నీ తండ్రికి నాహస్తమునసే అప్పగింతును." అని తన కేలనున్న ఖడ్గముతో కుమారుని శిరము ఖండించి తండ్రికర్పించి, ఆనందముగ "నాథా! నీవట్టి మనస్సుడవైనను నీలో సగము భాగము దానను గావున ఇదిగో నీలో నేనైక్యమొందు చున్నాను." అని ఆఖడ్గముతోడనే కంఠము నరకికొని పతిపాదములయొద్ద బడెను.

(వ సం తు డు)

# భారతీయుల రాజనీతి*

[ వి. వెంకట రంగనాధరావుగారు ]

## చరనియోగము.

కర్మచారుల కార్యకలాపముల గమనించుటకు గూఢచారులను నియమింపు చుండిరని యిదివరకు చెప్పియున్నాను. ఈసంబంధమున మనువిట్లు జెప్పి యున్నాడు— "ప్రణిధానాంశ్చ చేష్టితమ్" చరుల కార్యముల గూడ బరిశీలింపు చుండ వలయును. ఈ విషయమున రాజు మిక్కిలి జాగరూకుడై యుండుట విధాయకము. వారు చెప్పుమాటల సత్యాసత్యముల గమనించి కార్యములొనర్పు చుండవలయును. అనేకసమయముల యందు అబద్ధపు వార్తలను దీసికొనివచ్చు చుందురు. కావున వారి వాక్యముల బాగుగ బరిసీలింప వలసిన భారము రాజాయందున్నది. సాధారణముగ చరిత్ర విహీనులగు వారలీ కార్యమునకు నియోగింప బడుట గలదు. అట్టి వారు స్వార్థసిద్ధి కొరకు పరులను ధ్వంసము చేయుటకు అణుమాత్రమైనను వెనుదీయరు. కావున వారి సంబంధమున బహుమెలకువగ రాజు వర్తింపుచుండ వలయును,

## మానవ హితకర కార్యములు.

అన్నదానమును ఔషధదానమును చేయుట రాజునకు పరమధర్మము. పాంథశాలలు, అతిథిశాలలు, మానవులకు పశువులకు వైద్యశాలలు, దేవాలయములు, స్తూపములు మొదలగు వానిరక్షణము మొదలగునవి రాజధర్మములు. ప్రజల స్వాస్థ్య రక్షణము గూర్చిరాజు మిక్కుటముగ పాటు పడు చుండ వలయును. శంఖ లిఖితుడిట్లు చెప్పు చున్నాడు. "దుర్బలులు— వ్యాధిగ్రస్తులు— అనాథలు— అంగహీనులు— విధవలు వృద్ధులు మొదలగు వారికి మందులను, వాసస్థానములను శయ్య మొదలగు వానినిచ్చి యన్నముబెట్టి రక్షింపుచుండుట రాజధర్మము." "వశిష్టుడిట్లు చెప్పెను. "క్లీబోన్మత్తాన్ రాజా బిభృయాత్" క్లీబులు, ఉన్మత్తులు మొదలగు వారికి యన్నమిడి కాపాడు చుండవలయును. ఆపస్తంభుడు అతిథిశాలయందలి యతిథులను సత్కారపూర్వకముగ నుంచవలయు ననియు, గురువు, అమాత్యవర్గముయొక్క ఆహారాదుల వ్యవస్థ నేర్పాటు చేసినతర్వాత తాను జీవించుటకు తగిన యేర్పాటు చేసికొన వలయునని నుడివియున్నాడు. వేదపారాయణులగు బ్రాహ్మణులు, వ్యాధితులు, ఆర్తులు, బాలకులు, వృద్ధులు మొదలగు వారికి గ్రాసాచ్ఛాదనం బొసంగ వలయునని విధించెను. శంఖలిఖితుడిట్లు నుడివియున్నాడు. "స్వవృత్తి ద్వారమున జీవించుట కసమర్థులైన క్షత్రియవైశ్యులు మొదలగువారిని బోషించుట రాజధర్మము. యూరపునందు సాంఘికతంత్ర వాదులు శ్రమజీవులకు తగిన యేర్పాట్లు చేయుటకు తలక్రిందు లగుచున్నారు. కాని భారతీయవిధాన మందు శ్రమజీవులు శాసన తంత్రమందు సమానాధికారులు. వేదపారాయణుని యెడల నెటుల బ్రవర్తింప వలయునో వీరి విషయమున గూడ

* ౨, వ. సంవత్సరము ౨. వ. సంపుటము 4 సంఖ్యలోని భారతీయుల రాజనీతియను వ్యాసము తర్వాత దీనిని చదువ వలయును.

నట్లు ప్రవర్తింప వలయుననుటయే భారతీయ విధానము నందలి విశేషత్వము.

## మానవుల యెడల నెట్లు వర్తింపవలయును?

మానవులతోడ వ్యవహరించు నప్పుడు సౌజన్యమును చూపుట యత్యంత ప్రయోజనము. ప్రజలతోడ సౌజన్యముగ ప్రవర్తింపుచు రాజు లోకప్రియుడగుట కర్తవ్యము. ప్రజల స్వభావము ద్వివిధములు. ఇందొకటి బ్రాహ్మణ స్వభావము. రెండవది క్షత్రియస్వభావము. వాక్యముల యందు తీక్ష్ణతయు, కోమల హృదయము కలిగియుండుట బ్రాహ్మణ స్వభావము. మాటల యందు మృదుత్వమును హృదయము కఠినముగ నుండుట క్షత్రియ స్వభావము. బ్రాహ్మణుడు తపోక్లేశముల ననాయాసముగ భరింపగలడు. ద్వంద సహిష్ణుతయే బ్రాహ్మణ స్వభావముగల మానవుల ధర్మము. కాని శరీరమునకు సంబంధించిన కష్టము మొదలగు వానిని బ్రాహ్మణుడు సహింపజాలడు. అస్త్రఘాతాదిజనితమగు దుఃఖమును సహించగలవాడు క్షత్రియస్వభావుడు. కాని వాడు తపస్సు మొదలగు వాని క్లేశమును సహింపజాలడు. కావున రాజు క్షత్రియస్వభావి. అందువలన వాక్య వ్యవహారముల యందు మృదుత్వమును గనబరచుచుండుట వానికి నైజము. శాస్త్రము లిట్లు చెప్పుచున్నవి. "సమస్త మానవుల తోడ వినయపూర్వకముగ సంభాషింప వలయును. మరణాన దండనకు పాత్రుడైన వానిని చూచి గూడ మోము చిట్లింప గూడదు" అని విష్ణుసంహిత యందు చెప్పబడినది. మార్కండేయ పురాణ మందలి మదాలసచరిత్ర యందు రాజు కోకిలను బోలి సుమధుర భాషిగా నుండవలయునని యున్నది, "కాక కోకిల భృంగాణాం... శిక్షితం చరితం నృపః" రాజు కాకివలె చతురుడును, కోకిలబోలి మధురభాషియు, భృంగమును బోలి యర్థ సంగ్రహ మొనర్చువాడుగ నుండవలయును. మధురభాషి యగు వానిని మానవులు ప్రేమింతురు. పరుషభాషి యెప్పుడును జనప్రియుడు కాజాలడు. ఎవనికిని హృదయ వేదన గలుగు సంభాషణము చేయరాదు. మృత్యు దండాదేశమును గూడ మధురభావమున బ్రయోగించుట కర్తవ్యము.

## దండనము.

అపరాధ మొనర్చిన వారిని దండించుట రాజ ధర్మము. నిర్దోషుల దండించుట యధర్మము. స్వల్పాపరాధమునకు గొప్పదండనమును విధించుట యన్యాయము; గర్హితము. సాంఘిక రక్షణకును వ్యక్తిని సన్మార్గమున ద్రిప్పుటకును దండన మేర్పడినది. వ్యక్తి యొక్క జీవన వికాసము ప్రాకృతిక నియమము. అపరాధ మొనర్చినవాడు తప్పుద్రోవను వీడుట కనుగుణ్యముగ దండన ముండ వలయును. కఠోరదండన విధానమువలన సంఘము– రాష్ట్రము నాశనము నొందును. క్రియకు ప్రతిక్రియ స్వభావసిద్ధమగుటవలననే కఠోర దండనకు గూడ ప్రతిక్రియ బుట్టుట స్వభావము. ఘోరముగ శిక్షించుటవలన వ్యక్తిత్వమునకు హానిగలుగును; సంఘమును సుశృంఖలముగ నుంచుటకు కూడ నసాధ్యమగును; దండనోద్దేశమునకు విపరీతఫలము గలుగును. "పదిమంది యపరాధులు తప్పించుకొన వచ్చును గాని నిర్దోషియగు వాడొక్కడును గూడ దండిప బడరాదు." అను భావము మిక్కిలి పొగడదగినది. దండింప గూడని వారిమీద దండవిధాన మెప్పుడును పనికిరాదను విషయమును బాగుగ గమనించుచుండ వలయును. అప్పుడప్పుడు మర్యాద రక్షణ కొరకు శాసనములు ప్రయోగింప బడుచుండును. శాసనముల బలమును తెలియ పరచుటకు గూడ కఠోర దండనము విధింప బడుచుండును. ఇంత కంటె న్యాయ విహీన కార్యము మరియొకటి యుండబోదు. ఇందువలన దుర్బుద్ధి వెల్లడియగుచుండును. యుహూదీ దేశమందు హిరద్ భావికాలమున ప్రమాదము గలుగు ననుదలం ప్రజా బాలుని వధించి యుండెను. రోము సామ్రాట్టు

నీరోయను వాడమానుషిక బర్బరతను ప్రదర్శించియుండెను. ఇంగ్లండురాణి మేరియును నాటి ఘోరదండనలను విధించియుండెను. ఈవిధమగు వన్నియు అధర్మములు. భారతవర్షమందు దుర్మార్గుడగు కంసుడు, జరాసంధుడు వధింపబడిరి.

అధర్మ దండనంలోకే ।
యశోఘ్నం కీర్తినాశనమ్ ।
అస్వర్గంచ పరత్రాపి
తస్మాత్తత్పరివర్జయేత్ ॥ (మనువు.)

అధర్మముగ దండించువానికి యిహలోకమున యశోకీర్తులు నశించును. స్వర్గభ్రష్టుడగును. కావున దీనిని బరిత్యజింప వలయును.

అదండ్యాన్ దండయన్ రాజా ।
దండ్యాంశ్చైవాప్యదండయన్ ।
అయశో మహదాప్నోతి
నరకం చైవ గచ్ఛతి ॥ (మనువు.)

దండింప దగని వానిని దండించి అపరాధ మొనర్చినవానిని దండింపక విడచినయెడల అపకీర్తి గలుగును. నరకము సంభవించును. "అధర్మ దండనం" అనువాక్యార్థ మేమన ధర్మ శాస్త్రము సారముగాక కేవలము స్వేచ్ఛగా గాని రాజద్వేషమువలనగాని దండించుట యని గ్రహింప వలయును.

భారత వర్షమందు రాజుకు శాసనము చేయు అధికారము లేదు. సనాతన విధానమును ఋషులు విధిబద్ధ మొనర్చిరి. ప్రజకు ప్రతినిధులగు బ్రాహ్మణులు ఆ వివిధ విధానములకు మీమాంస యొనర్చుచుండిరి. కేవలము వానిని ప్రయోగించు భారము మాత్రమే రాజు హస్తమందున్నది. కాని వానిని అక్రమముగ ప్రయోగించినయెడ రాజు అధర్మ డగుచున్నాడు. ఇట్టి విధానముండుటవలన రాజుగూడ ధర్మము (చట్టము) నకధీనుడై యున్నాడు. సనాతన విధానమునకు రాజుతలయొగ్గితీరవలయును. బ్రాహ్మణ గణముయొక్క మీమాంసనుగూడ రాజు గ్రహించి తీరవలయును. ఇట్టి ధర్మవిధాన ముండుటవలననే రాజు పక్షపాతశూన్యుడై యుండెడివాడు. అన్యాయమునకు భయపడుచుండెను. మర్యాద రక్షణకొరకు ప్రజను దండించుట ఘోరకార్యము. పక్షపాతత్వమంతకంటెను దోషము. శాసన యంత్రముండుట మహత్తర దోష మేమన రక్షణకొరకు వినియోగింప బడినవారు శాసనార్థమునుసరిగ గ్రహింపజాలకుండుట వలన విచారణలు పరిహాసములుగ మారుచుండును.

అనుబంధం పరిజ్ఞాయ
దేశకాలౌచతత్త్వతః ।
సారాపరాధౌ చాలోక్యదండం
దండ్యేషు పాతయేత్ ॥ (మనువు.)

అనుబంధమును— దేశకాలతత్త్వమును గ్రహించి దోష మొనర్చినవాని చిత్త సామర్థ్యమును, దోషము యొక్క గురుత్వ లఘుత్వముల గమనించి శిక్షింప వలయును.

దండన సంబంధమందు ఇది చాల ముఖ్యమగు శ్లోకము. దీనిమీదనే దండనవిధాన మాధారపడి యున్నది. "అనుబంధము." అను శబ్దమునకు వ్యాఖ్యాన మవసరము. అనుబంధమన అపరాధము చేయు ప్రవృత్తి, దానికి కారణమని. ఏయుద్దేశమున దోషి దోష కార్య మొనర్చనని విచారింపవలయును. భార్యా పుత్రాదులక్షుధ నివారణకొరకా? లేక ధర్మమునకా? స్వసంఘమునకా? జూదమునందోడి దానికొరకా? ప్రమాదవశమా? బుద్ధి పూర్వకమా? ఇతరులవలన నియమింపబడి చేసెనా? స్వబుద్ధివలన నొనర్చెనా? అను విషయముల యోచింప వలయును. అనుబంధమును గ్రహించుట కష్టము, కాని యనుబంధ వ్యతీతముగ దోషిని విచారించుట యసంభవము. దేశ సంబంధమైనచో ఏస్థానమున నిట్టి కార్య మొనర్చినాడని విచారింప వలయును. అప్పుడు దుర్భిక్షమా? దోషి బాలుడా? యువ్వనుడా యని కాల


గమనింపవలయును. ప్రసార, అనుశబ్దభావము దోషి యొక్క శరీరమానసికయార్థిక యవస్థయని గ్రహించ వలయును. దీనినైన సాధారణముగ దెలిసికొనుటకును దాని తత్వమును గ్రహించుటకును మిక్కుట మగుభేదముగలదు. కావున శిక్షించునప్పుడు సర్వ విధముల బరిశీలించి దార్శనిక దృష్టితోడ దండించ వలయును. సాధారణముగ శిక్షకఠినముగ నుండ రాదు. వ్యక్తిత్వమును నశింపచేయు దండనను అధర్మ మందురు. మృత్యు దండనమును విధించునప్పుడు గూడ వ్యక్తిత్వపరిపారమున కనుగుణ్యముగ నుండవల యును. కాని సంకోశము కాగూడదు. ఆవ్యక్తి తనపాప జీవితమునకు బరితపించుచు నవజీవితమునకు నవీనభావము కొరకెదురుచూచు చుండ వలయును. జీవులకు ప్రాణ మత్యంతప్రియము. అందువలన పాప జీవితమునువీడి యుత్తమజీవితము కొరకువాడు మృత్యువును వరింపవలయును. అట్టి యాపలేనివాని ప్రాణము నుదీయుట వలన దండనోద్దేశము సఫలము గాదు. వ్యక్తిత్వసంస్కారియే దండప్రదానముయొక్క ముఖ్యోద్దేశమని గమనింపవలయును.

మనువిట్లు జెప్పియున్నాడు.

"ప్రథమమున కేవలము తిరస్కారముల తోడనే దోషిని విడచి యిట్టి కార్యములెప్పుడు చేయ గూడదని చెప్పవలయును. వాడుతిరిగి దోషమొనర్చిన యెడల లోకులయెదుట పరుష వాక్యముల దూషించి పంపించ వలయును. వానికి బుద్ధిరాక తిరిగి దుష్కార్యమొనర్చిన యెడల ధనదండనము (జరిమానా)ను విధించవలయును. అందువలనగూడవాడు విశుద్ధచరితుడు గానియెడల శరీరసంబంధమగు దండనను విధింపవలయును. దానివలనవాడు బాగుపడనిచో వానిమీదసమస్తవిధములగు దండనలను ప్రయోగింపవచ్చును."

ఈ ధర్మాను శాసనమందు దోషివిశుద్ధుడగుటకు ప్రయత్నము గాన్పించు చున్నది. మానవజీవిత మూల్యము స్వీకరింపబడినది. వ్యక్తిత్వము పరిసరించుటకు ప్రయత్నమున్నది. అంతరదృష్టితోడ మనోవిజ్ఞానసంబంధమగు సత్యము ప్రతిఫలించు చున్నది. లోకస్థితి గన్పట్టు చున్నది. వీనిని మించి కరుణ, న్యాయము, ధర్మముల కలయిక మనోముగ్ధకరముగ భాసిల్లుచున్నది. రాజు ఆత్మజ్ఞాన సంపన్నుడుగనుండ వలయునని ప్లేటోయను గ్రీకు దార్శనికుడు నుడివి యున్నాడు. ఆత్మ జ్ఞానములేనివాడు రాష్ట్రమును న్యాయశాసనమున బరిపాలింపజాలడు. నిష్కామ కర్మయోగము నందు రాజుండ వలయును. భారత వర్షమందలి రాజులు రాజర్షులు. ఆత్మజ్ఞానులు. అందు వలన సుశాసకులైయుండిరి. జ్ఞానుల మనోనయనములకు సమస్తము ప్రతిఫలించు చుండును. అందు వలన దోషమును సరిగ గ్రహించి దానికి తగిన దండనము మాత్రమే విధింపగలుగు చుండిరి.

# వివిధ విషయములు



## తేనీటీగ.

మన మేదిని పూల తోటలోనికిబో యి పూల మీద వ్రాలుచుండెడి తేనెటీగలను చూచినచో మనకువాని చరిత్రయందలి విచిత్రము లనేకములు కన్పడగలవు— ఆ తోటయందే ఒక భాగమునందే తేనెటీగలయొక్క పెద్ద గూడును చూచినచో వాని సాంఘిక జీవితము సుబోధము కాగలదు— మన మానవ సంఘమువలెనే ఈ తేనెటీగల సంఘము కూడ అనేకములైన వ్యవహారములతో కూడియున్నట్లు గోచరము కాగలదు. తేనెతుట్టెయొకటియే ఒక మహా పట్టణమును బోలియుండును. ఒకదిశను శత్రుజాతి నుంచి పౌరుల గాపాడుటకై సైన్యము నియమితమై యుండును— మరియొక దిశను భోజన పదార్థముల తమ పట్టణమునకు జేర్చుటకై కొన్ని తేనెటీగలుండును. వేరొక భాగమున పదార్థములను ఆహారయోగ్యము లుగ మార్చుటకై కొన్నిపని చేయుచుండును. ఇట్లనేక కార్యములకై వేనవేలు ఈగలు నియమింపబడినట్లు పనిచేయుచుండును. వేసంగి ప్రారంభించు దినములలో తేనెటీగల పట్టణ మతి మనోహరముగ నుండును. ఆసమయమందు దన్నియును, తమయజమానియొక్క అజ్ఞను శిరసావహించి పనులకేయు భటులరీతి, చురుకుగ పనిచేయుచుండును— వీరికి అధిపతి ఒక రాణిగారు. తమ పీఠమునుంచి ఎప్పుడును కదలదు. తవసేవకా బలగము కంటె ఆమెచాల పెద్దది. ఆమె ఎప్పుడును తవసింహాసనము వీడి బైటకు వెళ్లదు. ఏదో ఒకటిరెండు సమయములలో (ఉత్సవములలో) తక్క తినితర సమయములలో భవనములోనే కూర్చుని యుండును. ఆమెయే ఆతుట్టెకోటను ఏలుచుండినను ఆమెకు సౌఖ్యమేమియూ తెలియదు. ఆమెకుచుట్టు దాసదాసీలు రాజసేవను చేయు చుందురు — వీరే ఆమెకు తిండిని తీసికొనివచ్చి పెట్టుచుందురు.

తేనెటీగల రాజ్యమునందు ప్రతి పౌరునకును ఏదియో ఒకయుద్యోగ ముండును. బద్ధక మనునది ఆరాజ్యమునం దెచ్చటను లేదు— కొన్ని తమ రాజ్యము కొరకు ఇతర ప్రదేశములకు బోయి అచ్చటి నదీప్రవాహముల చెంతనున్న ఏరాతిమీదనో లేక వంగిన వృక్షశాఖ పైననో నిల్చి ఆనదీజలమును తమ పొట్టలో నింపుకొని తెచ్చుచుండును. మరికొన్ని పుష్ప గర్భమున నున్న మకరందమును పుష్పరజమును తీసికొనివచ్చి తమ కు గ్రాణములలో నింపుచుండును ఇక యా తేనెటీగల తుట్టెకోటలో వనేకులు భవనముల నిర్మించు చుందురు. ఏ భాగమైన శిథిలమైన అచ్చట బాగొనర్చు చుందురు. కొన్ని భవనములలో నిర్మింపబడిన చిన్నమైనవు తూగుటూయల పిల్ల తేనెటీగల నోలలాడించుటకై కొందరు దాయిలుండును. ఈపిల్లలందరును రాణిగారియొక్క సంతతే. ఇంక నగరద్వారముల యొద్ద యుద్ధ భటులెప్పుడును శత్రువులనుంచి తమకోటను కాపాడు చుందురు. మానకండ్లకన్ని తేనెటీగలును ఒకటే రూపమున కన్పడునుకాని అభటసమూహములు శత్రుసమూహము నెట్లు కన్గొనునో మనకు తెలియదు. ఇంకకొన్ని తేనెటీగలు ఆతుట్టెయొక్క శీతోష్ణస్థితిని సరిగనుంచుచుండును.

ఆ తేనెటీగ రాజ్యములో ఎవరు ఎప్పుడు ఎట్లు ఆజ్ఞలనిచ్చుచుందురో మన మెఱుగము. కాని యొక రాజ్యాంగము వంటి విధానమురీతి తేనెటీగలు పనుల చేసికొనుచుండును. యుద్ధభటులుగ నియమింపబడిన తేనెటీగ బలశాలులై యుండును. ఏదేని శత్రుమధుపము తమకోటలో ప్రవేశించుటకై యత్నించినచో ఈ భటుడు తీవ్రముగ పోట్లాడి కడకు నేలమీదకు వచ్చికూడ యుద్ధము చేయును. శత్రువుని హతమార్చిన తర్వాత వానిని ఏగడ్డిపరకల మధ్యనో లేక నేలయందలి ఏరంధ్రము లోనికో త్రోసివైచి విజయధ్వానముల సల్పుచు తనకోటకువచ్చును.

ఈ తేనెటీగలో నింకొక కులముకలదు. ఇవి పాకీపని నిర్వర్తించును. అనగా ఆతుట్టెయందలి మాలిన్యమును తుడచివైచి పరిశుభ్రముగ నుంచును. తమపట్టణమునందు మరణించిన పౌరుల నీడ్చి పారవేయుచుండును. శీతకాలములో ప్రతిదినమును వందలకు వందలు ఆబట్టణమున చచ్చిపోవుచుందురు. ద్వారపాలకులీ సమయమున శవములలో నేదైన పైశాచిక మధుపము లున్నవా యనిపరీక్షింపుచుండును. పైశాచిక మధుపములయొక్క రెక్కలు రాలిపోయి యుండును దేహము తెల్లగనుండును. ఇట్టివిపుట్టుకలో నేచని పోయినవని అర్థము. ఈశవముల నన్నియు దూరప్రదేశమున నున్న ఒకస్మశాన భూమికి గొంపోవుదురు. తన్మూలమున కోట పరిశుభ్రమగును.

దూరదేశమునుండి కొన్ని తేనెటీగలు వచ్చి అదివరకునుంచి తేనెటీగలు లేని తుట్టె యందు ప్రవేశించుటయు కలదు. ఆసమయమున ప్రథమమున కొన్ని తేనెటీగ లాగృహముల యొక్కకప్పుల పైకి ఎక్కి ఏది యోగ్యమైనదో అని చూచుకొనును. ఇంతలోననే వందలా ప్రదేశమునకు చేరును. కాని, యొకదాని కాళ్లను మరియొకటి పట్టుకొనుచు ఒకపెద్ద తోరణమురీతిని నిలచి యుండును. ఈవిధముగ తేనెటీగలన్నియు సేదతీర్చుకొనుచుండగా, పాకీయీగలు లోపలికి జనిగృహములనుశుభ్రపరచును. అటుపిమ్మట మైనమును అప్రదేశమును పెట్టి గృహములను నివాసయోగ్యముగ చేసికొనును.

కార్మికమధుపముయొక్క పొట్టక్రింద మైనపుసంచులుండును. ఆసంచులునిండిన వెంటనే ముందుకాళ్లతో కొంచెము కొంచెముగ మైనమునుదీసి నోటినుంచి యూరునట్టి యొకవిధమైన ద్రవమునందు కలపి ఆపదార్థమును ఎటుపట్టిన అటువంగు నటుల మెత్తపరచి చిన్నచిన్న గూడులను నిర్మించును. ఆమైనముతో షట్భుజములుగల గూళ్లను అతినైపుణ్యముతో నవి కట్టును, అట్లుకట్టుటలో తమపిల్లల నుంచుటకు, ఇత్యాది వివిధకార్యములకు తగిన కొలతలుండును. క్రొత్తగానిర్మింపబడిన గూళ్లు తెల్లగను శుభ్రముగ నుండును. కానికొంత కాలముగడచిన పిమ్మట అవి నల్లబడి పోవును.

## పురుగులదిను మొక్కలు.

మనము సాధారణముగ మృగములు పశువులను వృక్షములను భోజన పదార్థములగ జేసికొనుట చూచుచున్నారము. కానివృక్షములు సచలజీవుల చంపిభుజించుట వినికనిరెఱుంగము. ఇట్టివి బ్రిటిషు దీవులలో గన్పడగలవు. అమెరికాలోని కాలిఫార్నియాలో (డార్లింగోనియా) మరియొక మొక్కలు కలవు. వానియాకులు గుండ్రముగను పొడుగుగను నుండును. వానిపైన ఈనెలువలయాకారముగ నుండును. వానిమూలముననే పురుగులు పట్టుకొనబడును. ఈయాకులోపలి రంగుకొంచెము ఊదాకలసిన ఎఱ్ఱయైయున్నది, వీనికి సమీపముననే ఒకటోపీ మాదిరిది యొకటియుండును. దానిక్రిందిభాగమున తేనెవంటి తీయనిపదార్థ మెప్పుడును ఊరుచుండును. దీనిని త్రాగుటకై ఈగలుదానిపై వ్రాలును. వాలినంతటనే నున్నగానున్న ప్రదేశమగుటచే జారిఆటోపీ వంటి భాగములో పడును. టోపీకి క్రిందనొక చిన్న గిన్నెవంటి స్థలముండును. దానిలో నెప్పుడును నొకవిధమైన విషపదార్థ మూరుచుండును. ఈపురుగులా ద్రవములో పడి మరణించును, కొంతకాలమున కా

పురుగులయొక్క సారము ద్రవములో కలసి మొక్కకు తిండిపదార్థ మగును.

కాని బూరా మొక్క (Trumpet Plant) అనునది రెక్కలుగల పురుగులను భక్షించలేను. ఇది చీమలనుమట్టుకుతినును.

సింహళద్వీపములో మరియొకరకపు మొక్కలు గలవు. వానిఆకులు చిన్నకుండలను బోలియుండును. వానిపైభాగమును కప్పుటకు ఆకుమూకుడు వుండును. ఈ కుండవంటిది ఆకులోపల నొకవిధమైనమధురరసముండును. దీనికి తోడుగ వర్షజలము లేకపంచుజలముండును. ఈమధురపదార్థమునుగ్రోలుటకై పురుగుల నేకము లచ్చటకు వచ్చి లోపలప్రవేశించును. అంతలో మూతపడును. కొంతసేపటికి ఆపురుగులు ద్రవములో మునిగి చనిపోవును. ఆపురుగుల మాంసమువందలి సారమును గ్రోలి కడకా పిప్పిని పారవేయును

తూర్పు అమెరికాలో నింకొకరకపు చెట్లు కలవు. అవి నేలమీదనే ప్రాకుచుండును. వాని ఆకులు నేలమీద పరచుకొని యుండును. ఆయాకులు రెండు ఖండములుగ చీల్చబడి యుండును. ప్రతియొక ఖండము యొక్కచివరలను పళ్ళమాదిరి మొనలుండును. ఈరెండు భాగములు నుకలసి కొనునప్పుడొక భాగమున నున్న పళ్ళమధ్యనున్న సందులలో మరియొక భాగముయొక్క పళ్లు అమర్చుకొనును. ఈఆకు సాధారణముగ తెరవబడియే యుండును. చిలైన చీమలు పురుగులు వానిపైవాలినంతనే ఈరెండు భాగములును చటుక్కున కలసికొని పురుగును నొక్కివైచును. ఈసమయముననే ఆకులోనుంచి యొకవిధమైన ద్రవము ఈపురుగును చంపిదానిసారము నుగ్రోలును. ఒకటి రెండు దినములైన పిమ్మట తిరిగి ఆకుయొక్క రెండుభాగములును విడిపడును.

ఇంగ్లాండు దేశములో మరియొకరకపు ఆకులు కలవు. అవి యెప్పుడును జిగట పదార్థమును ఊరించుచుండును. ఏవైన పురుగులు వానిపైన పడినంతనే ఆకులు లోనవుంచి చుట్టుకొని పురుగునుచంపి దానిసారమును గ్రహించుచుండును. ఇట్లనేక రకములగు వృక్షములు ప్రపంచమున పురుగులపై తమజీవితము నాధారము చేసికొని యున్నవి.

## పెన్గ్విను పక్షులు

పెన్గ్విను పక్షులు పక్షికోటిలో నతి విచిత్రమైనవగుటచే శాస్త్రజ్ఞులు వానిని గూర్చియెక్కువగ చెప్పుచున్నారు. జంతు ప్రదర్శన శాలలో వానిగమనము నుజూచి అనేకమంది పాశ్చాత్య యాత్రికులు వీనిస్వస్థానమునందలి స్వేచ్ఛావిహారముల జూచుటకై కుతూహలముతో దక్షిణాఫ్రికాకును దక్షిణ మెరికాకును పోవుచుందురు.

పెన్గ్వినుపక్షు లనాది నుండియు నున్నట్లు దృష్టాంతములు కన్పించుచున్నవి. ఇవి సముద్రమునందు జలక్రీడలు సలుపుచుండును. తమకాలము నధికముగ నెక్కువసేపు వినియోగించుటచేతనే కాబోలు వానిరెక్కలు పక్షిరెక్కలవలె పెద్దవిగ నుండవు. దూరమునుంచి వాని గమనమును చూచినచో అవియున్నియు బారులుతీరి సిపాయిలవలె కన్పించును. వీపునల్లగనువక్షస్థలము తెల్లగను కాళ్లు నల్లగనుండుటచే దూరమున కవిసావికుల రీతినిల్చినట్లు గోచరము కాగలదు. దక్షిణ భూభాగములందలి సముద్ర ద్వీపములందవి వేనవేలు పెరుగుచుండును. ఇవి బారులుతీర్చి నిల్చియుండగ మనము చూచినచో వానిపంక్తులమధ్యనువీథులేర్పడియుండును. ఒక్కొక్కద్వీపములో సుమారుపదియిరువది లక్షలుండును. ఎవరైనను మనుష్యుడా ద్వీపములలో కాలిడినచో ప్రథమము నందుమాత్ర మెట్టిభీతిని జెందక ఆశ్చర్యముగ చూచుచుండును. ఒక్కొక్క సమయములందవి మనుజుల చెంతకు వచ్చియేమో మాటాడుచున్నట్లు తమతలలను వీరల వైపునకు త్రిప్పి చూచుచుండును. వీని కాళ్లునల్లగను పొట్టిగనుండును. మనుష్యునికంటె నతివేగముగ నడచును. పరుగెత్తును. ఆపెన్గ్వినుపక్షులలో రాజపక్షి సుమారు మూడుఅడుగుల [illegible]

అంగుళము లెత్తును యెనబదిపౌనుల బరువును గల్గి యుండును. ఫాక్లాండుదీవులలోని పెన్గ్వీనుపక్షులకు జలక్రీడ యందత్యంతా నందము. రాత్రిలందవి రోదనధ్వనుల చేయుచుండును. సెప్టెంబరు నెలలోనివి సాధారణముగ గుడ్లను బెట్టుచుండును. ఇవిసముద్రములోపల నీదుచు చటుక్కున పైకివచ్చి మరల మునుగుచుండును. వీనిలో మరుగుజ్జుపిట్టలు కలవు. ఇవి పదునేడు అంగుళములకు లోపలనే యెత్తుండును. ఎట్టిమహా తరంగముసైన నివియెదుర్కొనగలవు. ఈపెన్గ్వీను పక్షులయొక్క జీవితము నందలివైచిత్ర్యము వాని బారులదీర్చి నిల్చుండుపద్ధతి యందే కలదు. వీని కూటము మానవకూటమువలెనే కలదు. కావుననే మానవుడుకూడ పరిణామనిదర్శన ప్రకారమె కానొక యుగమందు పెన్గ్వీనుజాతివంటి పక్షిజాతినుంచి యే యుద్భవించి యుండునని శాస్త్రజ్ఞులుఅభిప్రాయపడుచున్నారు.

## జపానీయ లఘువృక్షము.

అమెరికాయందలి కాలిఫోర్నియాలో నెట్టు 340 అడుగులయెత్తును 105 అడుగుల వలయమునుగల చెట్లువృక్షజాతిలో తమ భీకర స్వరూపముల జూపుచున్నవో అట్లే లఘుత్వము నందుకూడ తమప్రాముఖ్యమును జాటుటకు జపానీయ లఘువృక్షములు కలవు. వీనినే పిల్లచెట్లనికూడ పిలుచుచుందురు. సాధారణముగ నితరప్రదేశములలో వంద లేక రెండు వందల అడుగుల ఎత్తుపెరుగు టేకు, ఓకు, మాపులు, పెనుచెటు జపానీయుల ఉద్యానవనములో ఒక కుంపటిలో పెరుగువట్టి స్వల్పవృక్షములరీతి పెరుగును. దీనికి కారణము వారా మొక్కలను పెంచువిధానము నందు కలదు. ఒకగింజను కాని, అంటును కాని పాతిపెట్టి ఆమొక్క మొలచి వేళ్లుపారుకొనుట మొదలు పెట్టుట గ్రహించవలెను. వేళ్ళుపారుట ప్రారంభించిన తోడనే వానిని ఎక్కువపొడుగుగ ప్రాకకుండ కొంతవరకు కోసివేయుచుండవలెను. అట్లే కొమ్మలనుకూడ కోయుచుండవలెను. కొన్ని సంవత్సరములైన పిమ్మట (సుమారొక శతాబ్దమైనను బట్టును.) ఆచెట్టుయొక్క విత్తనములదీని మొలకలకుగాను పాతిపెట్టిన ఆమొక్క చిన్న మొక్కగ పెరుగును. ఈవిధాన ప్రకారము చేయుటచే వంద అడుగుల పెరుగు చెట్టుకూడ జపానీయులచే ఒక్క అడుగు లేక రెండుఅడుగుల ఎత్తుగల వృక్షములుగ మార్చివేయబడెను.

## గొల్లభామ పురుగు

ఈపురుగుల సాధారణముగ ఉష్ణప్రదేశములలో జీవించును. దీనిననేకులు పవిత్రవంతముగ జూచుకొందురు. ఏలనన దీనిముందు కాళ్లెప్పుడును కలపబడి దండములు పెట్టుభంగిమున నుండును. ఆఫ్రికాదేశస్థులును, దక్షిణమెరికా వాస్తవ్యులును కూడదీనిని దైవ్యముతో సమానమని పల్కుచుందురు. కాని, పాశ్చాత్య శాస్త్రజ్ఞులు దానిని దయ్యముతో సమానముగ జూతురు. పురుగులను క్రూరమార్గమునచంపుటచే దీనిని క్రూరజంతువుగ జూతురు. ఇదిపచ్చగా నుండుటచే ఆకులుమధ్య జేరి వెనుక కాళ్లపైన నిలబడిముందు కాళ్లతో తిండిని పెట్టుమో భగవంతుడా అనునట్టు దణ్ణము పెట్టుచు జపించుచుండును. ఏదేని పురుగు సమీపములోనుండి నచో నెమ్మదిగా అదికకు జవితన ముందుకాళ్లతో అకస్మాత్తుగ పట్టుకొనును, ఆపురుగు పూర్తిగ చావకమునుపే భక్షించుట ఆరంభించును. గొల్లభామలు ఆకలి కాకపోయినను వినోదార్థము పురుగులను చంపివారవైచుచుండును.

ఆడు గొల్లభామ సాధారణముగ మొగదానికంటె యెక్కువ బలిష్ఠముగ నుండును. ఆడగొల్లభామ మగదానిని ప్రేమించినపరిరే లేకున్న మొగగొల్లభామత్వరలో ఆప్రదేశమునుంచి పారిపోక పోయినచో దానిని చంపి తిని వేయును.

చైనాదేశములో కొందరుఆడగొల్లభామలను కొంటివి బాగుగ పెంచి వెదురు పుల్లలతో చేయబడిన పంజరములో పెట్టుదురు. కొంత నేపటివర

కీటంబులు పోట్లాడుకొనును. వానిలో జయమొందినది రెండవ దానిని చంపి తినును.

## చెట్లయొక్క జ్ఞానశక్తి

సన్‌ట్యూ యనునొక మొక్క కలదు. ఈచెట్టుయొక్క ఆకుల కొంచెము దూరమునందు మాంస ఖండమును వ్రేలాడగట్టినచో ఈయాకులు వంగి మాంసమునంటుకొని అందలి సారమును గ్రహించును.

## సూర్యబింబము నందలి మచ్చలు

మన నేత్రములకు సూర్యుడు నిర్మలమైన బింబముగ కన్పడును. కాని దూరదర్శనియందు మనకా ప్రదేశమునందలి సకలవిషయములును గోచరము కాగలవు. సూర్యునియందుద్భవించు అగ్ని జ్వాలలు కొన్ని యైదులక్షల మైళ్లకంటె గూడ నెత్తునకెగయుచుండును. దూరదర్శనియందు మన కగపడు నల్లని మచ్చలు కొన్ని వేల చదరపు మైళ్ళుండును.

## చెదలుపుట్ట

దక్షిణాఫ్రికాలో చెదలుపుట్టల పరిమితముగా నుండును. కొన్ని పుట్టలు ఇరువది అడుగుల కంటె నెక్కువ ఎత్తువరకు నుండును. వీని పైభాగమునందు పొదలుకూడ మొలచుచుండును.

## శీతోష్ణముల కూడిక

ఉత్తరమెరికా యందలి కనడా దేశములో నున్న బాన్ఫు అను ప్రదేశమున వేడినీటి యూటలూరును. అచ్చటి వాతావరణము శీతాకాలములో మంచు గడ్డ కంటె చల్లగనుండును. కాని ఒక చిన్న గుంటలో నీరు చాల వేడిగ నుండును. సృష్టిలో విచిత్రము లెన్ని కలవు!

## మంచుగడ్డ మీద నీళ్లు కాచుట

జలరూపమును దాల్చినగాలి మంచుగడ్డకంటె చాలచల్లగ నుండుట చేగిన్నెలో నున్న నీరు కాగు నట్టిస్థితిలోనికి వచ్చును. ఆవిరి పైకెగయును.

## ఉల్కలు

ఇవి ఆకాశమునుంచి అప్పుడప్పుడు పడునట్టి రాళ్లు. మనభూమివంటి గోళములు వాయురూపమున నుండి లక్షల మైళ్ల వేగమున తిరుగుచుండు సమయమున ఆవాయువు క్రమగతిని తప్పి అనంతాకాశమున స్వేచ్ఛగా పోవుచుండును. అట్లు చరించు వానిలో కొన్ని ఖండములు భూమండలమును గూడ తాకుట తటస్థించుచుండును. ఈవిధముగ పడునప్పుడు ఆవాయువు ద్రవరూపమును ద్రవరూపమునుంచి ఘనరూపమును దాల్చి నేలపైబడుచుండును. ప్రపంచములో పడిన యుల్కలన్నిటిలోనికిని పెద్దదైనది యునైటెడ్ స్టేట్సునందున్న విలియమెట్టి ఓరిగాను లోపలనున్నది.

ఇది 10 అడుగులు పొడవును, 5 1/2 అడుగులు వెడల్పును, 15 టన్నుల బరువును కల్గియున్నది, ఇది యినుమును బోలియుండును. ఈ పెద్దరాయిలో కొన్ని గుంటలు కలవు. కొన్నిచోట్ల సన్నని మొన తేలిన అగ్రములు కూడ దానిలో కలవు. గత వాయు పదార్థమెట్లు ఈ సృష్టిలో ఘనీభవించి యరాయిరూపమును దాల్చినదో చూచితిరా!

## జలపాతములు

ప్రపంచములోని జలపాతములలో నయాగరా జలపాతము చాల ప్రశస్తముగాంచినది. కానియంత మాత్రమున దానికంటె గొప్పవి లేవని చెప్పుటకు వీలులేదు. నయాగరా ఉత్తరమెరికాలో నున్నది. ఈరీసరస్సులోని జలోపరిభాగము జలపాతమునుంచి 570 అడుగుల ఎత్తులోనున్నది కాని బంటారియా సరస్సులోని జలమును జలపాతమునకు క్రిందుగాను 5 అడుగులున్నది. కావున, నయాగరాజలపాతము మూర్తు 300 అడుగులకంటె హెచ్చులేదు. ఈజలపాతమునుంచి జలము ఎక్కువగా పారుట చేదీనికి ప్రాఖ్యము వచ్చినది. వెన్నెల రాత్రియందీ ప్రదేశము మనోహరముగా కన్పించును. హేమంత ఋతువులో నానైసర్గిక దృశ్యమును చూచినచో మంచులోగట్టబడిన మహాభవనము వలె కన్పించగలదు.

నయాగరా జలపాతముతరువాత న్యూజిలాండులోని సదర్లాండు జలపాతమును బ్రిటిషుగయానాలోని కాయిటూర్ జలపాతమును యెక్కువగా చెప్పఁబడుచున్నవి. ఈరెండవది ఇటీవలనే కన్గొనబడినది. ఇది 740 అడుగుల యెత్తునుండి జలము పడుచుండును. పగలంతయు ఆజలపాతముచే చిమ్మబడిన నీటితుంపరలలో సూర్యకిరణములు ప్రతిఫలించి ఇంద్రధనస్సును చూపించుచుండును.

దక్షిణ అమెరికాలోని బ్రెజిలు దేశములోని "ఇగువాసు" జలపాతము అరణ్యగర్భమున నుండుటచే దాని ప్రాశస్త్యము మొన్న మొన్నటి వరకు ప్రపంచమునకు తెలియలేదు. సుమారు రెండు శతాబ్దములక్రింద క్రైస్తవమత ప్రచారకులీ ప్రదేశమును చూచియుండిరి. కానివారి నాదేశ నివాసులు తరిమివేయుటచే నయ్యది అజ్ఞాతముగనే యున్నవి. కొన్ని సంవత్సరములక్రింద బ్రెజిలు, అర్జంటైను దేశములకు మధ్యజరిగిన యుద్ధములో నాదేశమును భూగోళశాస్త్రజ్ఞులు కన్గొనిరి. ఇగువాసు జలపాతముయొక్క యిరుప్రక్కలను మహోన్నత వృక్షములు కలవు. వానిని భేదించుకొనుచు ఆజలము ప్రవహించుచున్నది.

న్యూజిలాండు నందున్న రోటా మహానాలోని "పింక్ మేడ మెట్లు" అనుజలపాతము పూర్వము గొప్పజలపాతమని తెలియుచున్నది. కాని నలుబది సంవత్సరముల క్రింద అచ్చట కల్గిన భూకంపముచే అగ్నిపర్వత భేదము చేతను ఆజలపాతము చెదరి మెట్లవలె నేర్పడెను. అచ్చటనుద్భవించు నీరు వేడిగ నుండును. కొంతదూరము వరకు పోయిన పిమ్మట చల్లబడి యొకవిధమైన ఇసుక వలకలను నేలపైన పేర్చుకొనుచు నీజలము ప్రవహించును.

అమెరికాలోని నయాగ్రా విక్టోరియాజలపాతములవలన కల్గుచున్న అనంతప్రవాహములను అచటి దేశములవారనేక కార్యములకుపయోగపరచుకొనుచున్నారు. జలము మహోన్నత ప్రదేశము నుంచి పడుటచే ఆజలముకడ్డముగ పెద్దఆకులుగల చక్రముల బెట్టి జలపాతమూలమున వానిని త్రిప్పించి తిరిగీచక్రగమనముచే విద్యుచ్ఛక్తిని జనింపజేయు యంత్రము (Dynamo)ను త్రిప్పునట్లు చేయుచున్నారు. ఇవ్విధముగ వచ్చుచున్న విద్యుచ్ఛక్తిని తమపట్టణములందు దీపముల వెల్గించుటకును మహాయంత్రాలయముల నడుపుటకు నుపయోగించుచున్నారు.

ఈవిధముగానే మనహిందూదేశములో కావేరి జలపాతము (శివసముద్రము) విద్యుచ్ఛక్తిని జనింపజేసి తన్మూలమున బెంగుళూరు మైసూరు పట్నములను విద్యుద్దీపకములతో ప్రకాశింపజేసి ఆపట్టణము నందలి యంత్రాలయములకూడ నిపుణముగ నడుపుచున్నారు. బంగారపుగనుల మట్టిలోని బంగారమును శుద్ధపరచునట్టి యంత్రములను నడపుటయందును నుపయోగించబడుచున్నది.

## లేడి కన్ను.

ఏదేని లేడితలకాయను గనుక తెచ్చి శస్త్రపరీక్ష జేసినచో దానికన్నుక్రిందనున్న రంధ్రములనుంచి సన్నని నాళములు నాసికద్వారములనుంచి వచ్చునాళములలో కలియును. లేడినీరు త్రాగునప్పుడు గనుక మనము పరీక్షించినచో అది నీటిలో మూతిని లోతుగ ముంచును. ముక్కుకూడ అందుచే నీటిలోపలనే యుండును. నీరు త్రాగినంతసేపును దానికండ్లక్రిందనున్న రంధ్రములు తెరచుకొని యుండును. కావున అవి గూడ నాసికా సమానములని శాస్త్రజ్ఞులు కొందరనుచున్నారు. వన్యమృగమేదేని దీనిని తరుముకొనుచు వచ్చుచుండిన నచ్చో శ్వాసనిశ్వాసములను సాధారణనాసికమూలమున జరుపవు. ఆసమయమున ఈ ద్వితీయనాసికమూలమున అనాయాసముగ వాయువును పీల్చుచు వదలుచుండును. వొక శాస్త్రజ్ఞుడు నారింజపండును దాని కండ్లయొద్ద చూపగా ఆద్వితీయనాసిక తెరవబడి ఫలముయొక్క వాసనచూడ దొడగెనని వ్రాసి యుండెను.

## ఆకు పచ్చ బల్లి.

ఇంగ్లాండులోని డైవన్ షైరులో నాకుపచ్చనిబల్లులున్నవి.

## అమెరికాలోని జంతువులు.

పూర్వకాలకాల యుగమునందు అమెరికాయును ఆఫ్రికాయు నొక పెద్దభూసంధిచే కలిసియుండెడి ననుటకు దృష్టాంతరములు కలవు. ఆఫ్రికాఖండపశ్చిమోత్తర భాగము నుంచి పనామా కాలువవరకును సముద్రములలో, నొక వారధిఏర్పరచినట్లు లంకల నేకము కలవు అదియునుగాక ఆఫ్రికాలోనున్న జంతువు లన్నియు కొంచెము రూపుమారినను అమెరికాలో కన్పడగలవు.

## ధృవమండల కాంతులు.
## (అరోరా బోరిలిస్.)

ప్రత్యుదయమునను మనము సూర్య భగవానుని దర్శించుచున్న విషయము సర్వజనానుభవమే కదా? కాని యొక విచిత్రమును చూతుము. ఒక రోజున గనుక సూర్యుడుదయించకుండినచో ప్రపంచ మెట్లుండునో యోచింతుము. సర్వము నంధకారమయమైనచో, అనగా 24 గంటలు చీకటియేయైనచో యెట్లుండునో మనమూహింప గలమా? మనము అనగా ఈ సూర్య సమీపగోళములోని ( Tropies. ) వారమట్టి స్థితిని సహించలేము. కాని యుత్తరధృవదేశములలో సూర్యుడు సంవత్సరమునకు ఆరునెలలు తన కిరణములచ్చట ప్రసరింపజేయనే జేయడు. అక్టోబరునుంచి మార్చినెలవరకు నొకదీర్ఘరాత్రి. అట్టి యా ప్రదేశమునందలి జనులును తదితర జీవకోటియు నెట్లు బ్రతుకుచున్నారని ప్రశ్నవచ్చును. తాను స్వయముగా ధృవరాజ్యమునకు తన కాంతి నీయలేక పోయినను తన అంశమును బోలు విచిత్ర కాంతి పుంజమును శీతలవాయువులపై ప్రసరింపజేసి తద్దేశముల కాపాడుచుండును, ఆ కాంతులనె శాస్త్రపరిశోధకులు ‘‘యొంక్ట్రొస,, అని పిల్చుచున్నారు ఈ విద్యుత్ ప్రపంచములోని విచిత్రదృశ్యములలో నొకటియైయున్నది. వీనినె ధృవమండల కాంతు(అరోరాబోరిలిస్) అనియు పిలుచుచున్నారు.

ఈధృవకాంతులు సాధారణముగ ఇంద్రధనుస్సు వలెఅర్ధవలయాకారముగ నుండును. ఈకాంతులు నిముసనిముసమునకు వర్ణములమార్చుచుండును. ఎలదూరపరిభాగమునుంచి కాంతులు ఆకాశములోనికి చాల దూరమువరకును ప్రసరించుచుండును. పలువర్ణములు గల ఈ కాంతులను జూచినప్పుడు ఆకాశమున రంగురంగుల బుట్టలగుండ్రముగ కట్టినారా అను నట్లగపడుచుండును. ధృవమండల యాత్రికుడు అరోరాబోరిలిసును గూర్చి ఈ విధముగ వర్ణించియున్నాడు.

‘‘మావోడపైన నొక విచిత్ర కాంతి పడెను. అంతట నేను గదిలోపలనుంచి బైటకువచ్చి చూడగా ఆకాశమునుంచియొక సుందరమైన కాంతి ప్రకాశించుచుండెను. ఆకాంతి మంచుకొండల మీదనుంచి ప్రతిఫలింపబడి ఆ వెల్తురు మాయోడపైన బడినట్లు గ్రహించితిని. ఆ వెల్తురుయొక్క వర్ణములను గూర్చి వర్ణించుటకు నావాక్కు చాలదు. ఒక క్షణములో నొక భాగమున గులాబిరంగు తిరిగి తరువాత క్షణములో ఆస్థానము రెండవ భాగమున తెలుపు పసుపురంగు ఇట్లు దీపికలతివిచిత్రవర్ణముల దాల్చుచు మనోహర దృశ్యమును పొడమూపెను. ఆకాశపటమున అనంత వర్ణములగల్గిన ఈ ధృవకాంతి పుంజము నాట్యమాడుచుండ నదిభగవానుని లీలయో అని చూపరి అనుకొనక మానరు

# గ్రంథపరిచయము.

## బ్రహ్మోత్తర ఖండము.

ఇది శ్రీపట్టమెట్ట సోమనాథసోమయాజి ప్రణీతమైనమహాపురాణము. కవిత్వము మధురముగనున్నది. కొన్నిపట్టులయందు [illegible] కవిత్వము [illegible] రచనము [illegible] పుట్టించును.

మచ్చునకు క్రిందిపద్యము నరయుడు.

సీ॥ అళివేణియొక తె మం(జు)ళాంగపసరణితో
దివుట దియ్యని పువ్వుదేనెలానె.
హరిణాక్షియొక తె వాహ్యాళిగా బోలెంచి
చంగుచంగున నికుంజములు దాటె.
కలకంఠియొక తె చొక్కంపు గొంజిగురాకు
జవిజూచి పంచమ స్వరముబర్వె.
శుకవాణియొక్కతె చుంబన మూపంగ
జక్కనిఫల శాఖయొక్క మొక్కె.
గీ॥ రాజబింబాస్య యొకతు కరప్రణాళి
గలితహిమవారి బయిగొల్లగలయజల్లె
గజగమన యొకర్తు నిజహస్తకాండముగని
మెట్టదామరతూడుమని ముచ్చటిడెగ.

శివధర్మోత్తరము.

ఇదియు దోమకొండ సంస్థానాధీశ కామినేని వంశసంభూత రాజామల్లారెడ్డికవి ప్రణీతంబగుపూర్వ పద్య కావ్యము ముద్రితయునగ్గలమై ప్రకాశించును. చూడుడు గ్రీష్మర్తు వర్ణనము.

సీ॥ దావపావక శిఖాదండదహ్యమానప్ర
కాండంబులై గిరుల్ మండుచుండ.
కాండముల్ చండమార్తాండ తీవ్రకరాత
పోద్వృత్తి కళవళి నుడుకుచుండ
నెట్టగా కాగిన నిమ్నపల్వలంబు చ
ద్భవధాత్రి యసూర్యాస్పశ్య నెనయుచుండ
చారుశీతల తరుచ్ఛాయలు తనవీడ
బడరుచుండ విస్ఫురితలోష్మ.
గీ॥ క్షుత్పిపాసార్తజంతునికాయములకు
నుదకవిశ్రాంతి మృగతృష్ణలొదవ జేయు
నహహ గ్రీష్మమహాత్మ్యమేమనగవచ్చు
నిట్టిదినముల ప్రాణులకేదిసుఖము.

ఉమాపత్యభ్యుదయము.

ఇది యాధునికులను సుప్రసిద్ధులునగు శ్రీయాదిపూడి ప్రభాకరకవి గారిచే రచింపబడిన యేకాశ్వాసమగు పద్యకావ్యము. ఇందు సత్యకళానిలయము నగు శ్రీదోమకొండ సంస్థాన పరిభూత్వభూషితమునగు శ్రీకామినేని వంశచరిత్రమును తత్సంస్థానాధీశ్వరులగు శ్రీరాజా ఉమాపతిరావు మహాబలవంత బహద్దూర్ వారి యభ్యుదయమును వర్ణింపబడినది. శ్రీతిరుపతి వెంకటేశ్వర్లు పీఠికలో "నూటికిపదిమంది చొప్పున పూర్వకవులతో సాటియగు కవులున్నారము లేక పోలేదు. అపదిమందిలో నీకవియు నొక్కడు. ఈకవిరచించినచో నితని కభినవ తిక్కన యనుబిరుద మెవ్వరొసంగరు." అని వ్రాసిన వాక్యము లేమాత్ర మతిశయోక్తులుగావు. శ్రోత్రయొత్తుబడి పదముల పొందిక కథనానైపుణ్యము భావానుగత వృత్తగమనిక వారి కృతులను సాంతముగ పఠించిన వారికి దోపక పోవు.

—శైలికి.—

సీ. పున్నమ జాబిల్లి • బురిణించు మోమున
జిగునగ నల్లలు • జిన్నరుల్కొత్త
చేటిముత్తెముల వం • దించునల్లనినను
తురుమున దొంగ మొగ్గ • విరియుచుండ
గవికరంబులకు జెక్కుటం బ్రొమ్ము నొప్పు
వింతకన్నెరగని • నికలుకదల
నానందమున నిబ్బ • రందంపు జనుదోయి
నలరారి చెరగులా • స్యంబు సేయ
తే. జేఁ జలుకఁ బావురాయాటఁ • జిందులాడ
నలుగ ముద్దాడు నెచ్చెలు • నెలమి చూడ
సొలపు గుమిగూడి గానంబు • సలుపు ప్రౌఢ
వాక్ప్రతిభ నానుమతి చేరి • వరంబులొసఁగ.

శారదాంబాష్టకము.

ఇది శ్రీసత్తెనపల్లి హనుమంతరావు గారిచే రచియింపబడినది. మచ్చునకొకపద్యము.

సీ॥ పగ్గెవన్నెంబింట • పెట్టకేరనివాడు
దాతృత్వ మెట్టులు • దానెరుంగు
విరిగిన వేరికి • స్వప్నసియునియాత
డుపకారమేరీతి • నొనరజేయు
నొరుల వైభవములు • నోర్వనేరనియాత
డైకమత్యము నెట్టు • లాదరించు
కాకికి గబళంబు • కడకొసంగనివాడు
సర్వసమత్వమే • చాయనెరుగు
గీ॥ తల్లిదండ్రుల బోషింప • నొల్లకుండు
తనయుడెటుగసె? ధర్మప • ద్ధతుల నవని
నెట్లుతలియింతు రీదోష • మెరుగ నమ్మ?
సద్గుణాకదంబ! జగదంబ! • శారదాంబ!

భజగోవిందము.(శ్లోకసహితాంధ్రవృత్తములు)

ఇది శ్రీమున్నంగి లక్ష్మీనరసింహ శర్మగారిచే రచియింపబడినది. శైలిమృదుమధురముగ నున్నది.

తే॥ నిత్యానిత్యవివేక విచారము
నియమధారణము ప్రాణాయామమును
ప్రత్యాహారము జపసమాధులన్
జరపి యుండుమానంద ధామమున్.

# విషయసూచిక

ఎఱ్ఱగన్నేరు. (ఏకాంకనాటకము.)
అబ్బూరి రామకృష్ణారావుగారు ౧౨౯

స్వార్థపరునితో (పద్యము)
తెలికచర్ల కృష్ణమూర్తిగారు. బి. ఎ. ౧౩౫

అవ్వా దేనమ్మ (జల్లగా నవుడరయుక.
కవికొండల వెంకటరావుగారు. బి. ఏ బి. యల్ ౧౩౯

మతపిచ్చి. (కథ)
కె. రామచంద్రారెడ్డిగారు. ౧౪౦

కోకిలా శోకము. (పద్యకథ)
చిరావూరి కామేశ్వరరావుగారు.
బి. ఏ. యల్. టి. ౧౪౬

జానకి చూపు (పద్యము)
అధికార్ల సూర్యనారాయణరావుగారు,
బి. ఏ. బి. యల్. ౧౫౦

శ్రీకృష్ణుడు.
గొల్లపూడి శ్రీరామశాస్త్రిగారు, ౧౫౧

కుంగదమాల్ల (నాటకము)
తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారు, ౧౫౩

[illegible]
.కె. [illegible]గారు. ౧౫౩

వసంతకోకిలము.
అనంతపంతుల రామలింగస్వామిగారు. ౧౬౪

భద్రాచలయాత్ర.
పెద్దిభొట్ల వీరయ్యగారు. బి. ఏ. బి. యల్. ౧౭౦

ఆంధ్ర ప్రబంధములు.
జి. జోగిసోమయాజిగారు. బి. ఏ. ఎల్. టి.

నా బాధిర్యము. (పద్యము)
ఈశ్వర. ౧౭౪

ఆస్ట్రియా (సచిత్రవ్యాసము)
ఆర్. రంగనాథశాస్త్రిగారు. ౧౮౯

ప్రణయప్రకటనము.
నరసారిశెట్టి వెంకటరత్నంగారు. ౧౯౭

భిన్నప్రకృతులకు మైత్రి. (కథ) ౨౦౧

ద్వితీయాంధ్రనటసభ.

అధ్యక్షోపన్యాసము. ౨౦౦

మరణాధికమైన ప్రణయ[illegible]. (కథ)
చిల్లరిగె శ్రీనివాసరావుగారు. ౨౦౯

పతిత (కథ)
[illegible] శాస్త్ర్యులుగారు, ౨౧౨

వేశ్య.
[illegible]గారు ౨౧౫

కావ్యము — కవిత్వము.
పండిత శివనాథశాస్త్రిగారు. ౨౨౮

హేమబిందు. (నవల)
అడవి బాపిరాజుగారు. ౨౩౮

దైవప్రార్థన.
శ్రీరాజామంత్రిప్రగడ భుజంగరావుగారు. ౨౩౯

విజ్ఞాన విషయములు. ౨౪౧

వివిధ విషయములు. ౨౪౯

## చిత్రపటములు

1. తన్మయత్వము.
శిల్పి:— క. అనంతమోహనశాస్త్రి.
శ్రీ హనుమంతరావు శిల్పమందిరము.

2. రాధ.
శిల్పి:— రణదా ఉకీలు.